www.manatelangana.news

Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 7 | సంచిక: 194 | గురువారం | 3 జనవరి, 2019

Published from: **Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad**

పేజీలు: 16 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00



అన్నారం బ్యారేజీ పనులను పరిశీలిస్తూ అధికారులకు సూచనలు చేస్తున్న ముఖ్యమంత్రి కెసిఆర్

పనులా, నత్తలా?

అన్నారం మందగమనంపై సిఎం ఆగ్రహం, నాణ్యతపై రాజీపడొద్దని ఆదేశం

- ప్రతీ ఎకరాకు నీళ్లందాలి • ప్రతీ చెరువూ నిండాలి
- మార్చి 31 లోగా పనులు పూర్తి కావాలి
- జూన్‌లో సాగునీరు రావాలి • మూడు షిఫ్టుల్లో ప్రాజెక్టు పంప్‌హౌజ్ పనులు జరగాలి • అలసత్వం వహిస్తే అధికారులపై చర్యలు తప్పవు
- కాళేశ్వరం ప్రాజెక్టును రెండో రోజూ పరిశీలించిన సిఎం కెసిఆర్

మన తెలంగాణ/కాళేశ్వరం, పెద్దపల్లి/ గోదావరిఖని/మంథని రూరల్

తెలంగాణలో కోటి ఎకరాలను సాగులోకి తీసుకొచ్చే సంకల్పంతో ప్రభుత్వం వేల కోట్ల రూపాయలను ఖర్చు చేస్తోందని, దానికి అనుగుణంగా అధికారులు, వర్క్ ఏజెన్సీలు ఏ మాత్రం నిర్లక్ష్యానికి తావు లేకుండా పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు ఆదేశించారు. మూడు షిఫ్టుల్లో పనులు జరగాలని, నాలుగు రెట్లు లేబర్‌ని, మెషినరీని పెంచుకోవాలని, ప్రాజెక్టు పనులను వేగంగా పూర్తి చేయడమే లక్ష్యంగా ఉండాలని స్పష్టం చేశారు. రెండు రోజుల పరిశీలనలో భాగంగా ముఖ్యమంత్రి బుధవారం ఉదయం కన్నేపల్లి పంప్ హౌజ్, అన్నారం, సుందిళ్ళ బ్యారేజీలు, వరదకాల్వ పనులు తదితరాలను పరిశీలించారు. సుందిళ్ల బ్యారేజి, అన్నారం పంపుహౌజ్‌ల పనులను మార్చి 31లోగా పూర్తి చేయాలని సాగునీటిపారుదల శాఖ అధికారులను ముఖ్యమంత్రి కెసిఆర్ ఆదేశించారు. ప్రతీ చెరువుని నింపి పొలాలన్నింటికీ సాగునీరు అందించేలా మార్చి

తరువాయి 3లో



విలీనం

దేనా, విజయ, బ్యాంక్ ఆఫ్ బరోడాల విలీనానికి కేంద్ర కేబినెట్ ఆమోదం

13



ప్రవేశం

పోలీసు రక్షణలో అయ్యప్ప గుడిలోకి విజయవంతంగా ప్రవేశించిన మహిళలు

14



చలి దాడి

నిరాశ్రయులు, యాచకుల దయనీయస్థితి హైదరాబాద్‌లో దుప్పట్ల పంపిణీ

2

ఇఎన్‌టి

చెవి, ముక్కు, గొంతు పరీక్షలు

6న రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల్లో ప్రయోగాత్మక అమలు

ఫిబ్రవరిలో పూర్తి స్థాయి



మన తెలంగాణ/హైదరాబాద్

ప్రజలందరికీ చెవి ముక్కు గొంతు (ఇఎన్‌టి) తో పాటు దంత పరీక్షలను నిర్వహించేందుకు ముహూర్తం దాదాపుగా ఖరారైంది. ఈనెల ఆరో తేదీ నుంచి పైలెట్ ప్రాజక్టు కింద మూడు జిల్లాల్లో శ్రీకారం చుట్టాలని అధికారులు భావిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పూర్తిస్థాయిలో ఈ ప్రాజెక్టును ప్రారంభించే ముందు ప్రయోగాత్మకంగా రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాలలో అమలుచేసి చూసేలా అధికారులు ఎంపికచేశారు. అందుకోసం ఈఎన్‌టి విభాగానికి చెందిన మూడు ప్రత్యేక బృందాలు, దంత విభాగం నుంచి మరో మూడు ప్రత్యేక బృందాలను గుర్తించారు. ఒక్కో బృందంలో

తరువాయి 6లో



దేశానికి దిక్సూచి

మనమే

- కేంద్రాన్ని శాసించే స్థాయికి టిఆర్ఎస్ ఎదగాలి • ఓటర్ల గుద్దుడుకు నేలమట్టమైన ప్రజాకూటమి • నాయకుల చుట్టూ తిరిగితే పదవులు రావు
- ఉద్యమ స్ఫూర్తితో ఓటరు నమోదులో పాల్గొనాలి • పార్లమెంట్ ఎన్నికల్లో 16 స్థానాల్లో విజయం సాధిస్తాం • చరిత్ర సృష్టించడం కెసిఆర్‌కు తెలుసు

– టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

మన తెలంగాణ/హైదరాబాద్

నేడు సిరిసిల్లకు కెటిఆర్ 3

దేశ రాజకీయాలను ప్రభావితం చేస్తున్న టిఆర్ఎస్ ఇకపైన కేంద్ర ప్రభుత్వాన్ని శాసించే స్థాయికి ఎదగాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటాలని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు పార్టీ శ్రేణులకు పిలునిచ్చారు. పార్లమెంట్ ఎన్నికల్లో 16 స్థానాల్లో విజయం సాధించేందుకు ప్రతీ కార్యకార్త సైనికులుగా ముందుకు దూకాలని చెప్పారు. పార్లమెంట్‌లో టిఆర్ఎస్ సభ్యులు ఉంటే కేంద్రప్రభుత్వం మెడలు ఎలా వంచాలో, రాష్ట్రాభివృద్ధికి నిధులు, పథకాలు ఎలా సాధించాలో ముఖ్యమంత్రి కెసిఆర్‌కు తెలుసన్నారు. తెలంగాణ ఆలోచనలను దేశం ఆమోదిస్తూ ఆలోచిస్తోందన్నారు. తెలంగాణలో అమలవుతున్న రైతుబంధు, రైతు బీమా తదితర పథకాలను ఇప్పటికే మూడు రాష్ట్రాల్లో అమలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తుండగా కేంద్రంలో మోడీ ఈ పథకాలకు రంగులు మార్చి అమలుచేసేందుకు ఆలోచిస్తున్నారని చెప్పారు. బుధవారం నెక్లెస్ రోడ్డులోని జలవిహార్‌లో సనత్‌నగర్ నియోజకవర్గం కార్యకర్తల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కెటిఆర్ మాట్లాడుతూ కేంద్ర రాజకీయాలను ప్రభావితం చేసే స్థాయికి తెలంగాణ రాష్ట్రం ఎదగాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో 16 స్థానాల్లోనూ భారీ మెజారిటీతో గెలిచి తీరాలన్నారు. శాసనసభ ఎన్నికల్లో ఓటర్ల తీరు గమనిస్తే పార్లమెంట్ ఎన్నికల్లో 16 స్థానాలు ఖచ్చితంగా సాధిస్తామనే నమ్మకం ఉందన్నారు. అయితే మెజారిటీని పెంచేందుకు కార్యకర్తలు మరింత కృషి చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. శాసనసభ ఎన్నికల్లో తెలంగాణ ఓటర్ల గుద్దుడుకు ప్రజాకూటమి నేలమట్టమై ందన్నారు. ప్రజా

తరువాయి 6లో

కుంచెపోటు



ఓటర్లని పంచాయతీ ఎన్నికల ముగ్గులోకి లాగే ప్రయత్నం మొదలైపోయిందప్పుడే!

బేఫికర్ ఆటో

- హైదరాబాద్ నగరంలో 'మై ఆటో ఇన్ సేఫ్' (సేఫ్‌గాడి.కామ్) కింద ఆటోలకు రిజిస్ట్రేషన్
- మహిళలకు, ప్రయాణీకులకు అభయం
- విలువైన వస్తువులు భద్రం

మన తెలంగాణ/మన్సూరాబాద్



మహిళలకు, విద్యార్థినులకు (సేఫ్ గాఢి.కామ్) మైఆటో ఇన్ సేఫ్ కార్యక్రమం ఎంతో ఉపయోగ పడుతుందని రాచకొండ కమిషనర్ మహేష్ భగవత్ అన్నారు. ఎల్బీనగర్ క్యాంప్ కార్యాలయంలో మొట్ట మొదటి సారిగా (సేఫ్ గాడి.కామ్) మైఆటో ఇన్ సెఫ్ ఆటో రిజిస్ట్రేషన్ అనే నూతన కార్యక్రమాన్ని కమిషనర్ కార్యాలయంలో బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కమిషన్‌రేట్ పరిధిలో

తరువాయి 6లో

ప్రారంభంలో

సమస్యలు కామన్

హైకోర్టులు పని మొదలుపెట్టాక జోక్యం చేసుకోలేం

ఎపి న్యాయవాదుల పిటిషన్ కొట్టివేసిన సుప్రీం

మన తెలంగాణ /న్యూఢిల్లీ, హైదరాబాద్



ఉమ్మడి హైకోర్టు విభజన ప్రక్రియపై స్టే ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ న్యాయవాదుల సంఘం దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు బుధవారం కొట్టివేసింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం హైకోర్టు అవసరాలకు అనుగుణమైన తీరులో మౌలిక వసతుల కల్పనను పూర్తిచేసేంత వరకు ఉమ్మడి హైకోర్టు

తరువాయి 6లో

పారికర్ బెడ్‌రూమ్‌లో

రాఫెల్ ఫైళ్లు?

ఆడియో క్లిప్ విడుదల చేసిన కాంగ్రెస్ రాజ్యసభలో జైట్లీ, రాహుల్ వాగ్యుద్ధం సుప్రీంలో రివ్యూ పిటిషన్

16

రేపు సెట్‌ల షెడ్యూల్

నాలుగు ప్రవేశ పరీక్షలకు కొత్త కన్వీనర్లు

7

శ్రేష్ఠ చిట్ నిర్వాహకుడు క్రాంతి అరెస్టు

7

2వ విడత ఎన్నికల షెడ్యూల్ సవరణకు విజ్ఞప్తి

మనతెలంగాణ/హైదరాబాద్ : ప్రభుత్వ పాఠశాలల్లో గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఆటంకం కలుగకుండా ఈ నెల 25న నిర్వహించనున్న రెండవ విడత పంచాయతీ ఎన్నికల షెడ్యూల్‌లో మార్పులు చేయాలని కోరుబతూ ఉపాధ్యాయ సంఘాలు ఎన్నికల కమిషన్‌ను విజ్ఞప్తి చేస్తున్నాయి.ఈ మేరకు ఎన్నికల కమిషన్ కార్యదర్శి ఎం.అశోక్‌కుమార్‌కు బుధవారం ఎస్‌టియు నాయకులు భుజంగరావు,సందానందంగౌడ్, కరుణాకర్‌రెడ్డిలు వినతిపత్రం అందజేశారు. పోలింగ్ తేదీకి మరుసటి రోజే పాఠశాలల్లో రిపబ్లిక్ దినోత్సవం నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు చేసుకునేందుకు ఉపాధ్యాయులు ఇబ్బంది పడే అవకాశం ఉందని, కావున, జనవరి 25 పోలింగ్ తేదీని సవరించి మరో తేదీని నిర్ణయించి కొత్త షెడ్యూల్ విడుదల చేయాలని పలు టీచర్ సంఘాల నాయకులు కోరారు.

వేసవికి సిద్ధమవుతున్న విద్యుత్ డిస్కంలు

మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్రంలో గతేడాది జనవరి 1వ తేదీ నుంచి నిరంతరాయ విద్యుత్‌ను అందిస్తూ చరిత్ర సృష్టించిన రాష్ట్ర విద్యుత్ శాఖ రానున్న వేసవిలో ఎలాంటి అసౌకర్యానికి తావులేకుండా అందించడంపై దృష్టి పెట్టింది. రాష్ట్రంలో 24 గంటల విద్యుత్ సరఫరా సౌకర్యానికి ఏడాది పూర్తయిన సందర్భంగా దక్షిణ మండల డిస్కం సిఎండి రఘుమారెడ్డి బుధవారం ఇంజనీర్లు, సిబ్బందితో మాట్లాడుతూ, రానున్న వేసవి కాలంలో విద్యుత్ వినియోగం గణనీయంగా ఉంటున్నందున ఎలాంటి కోతలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నూతన సంవత్సరం సందర్భంగా సంస్థ డైరెక్టర్‌లు టి.శ్రీనివాస్, జె.శ్రీనివాస రెడ్డి, జి.పర్వతం, ఎస్. స్వామిరెడ్డి, పి.నరసింహరావు రఘుమారెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి రఘుమారెడ్డి మాట్లాడుతూ, వ్యవసాయరంగానికి 24 గంటల విద్యుత్ సరఫరా విషయంలో ఒక ఏడాది కాలాన్ని విజయవంతంగా పూర్తి చేశామన్నారు. సమైక్య రాష్ట్రంలో సైతం ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది సెప్టెంబరు 11న రాష్ట్రంలో 10,818 మెగావాట్ల గరిష్ట డిమాండ్ వచ్చిందని, మళ్ళీ అక్టోబర్ 9వ తేదీన 6961 మెగావాట్ల గురిష్ట డిమాండ్‌ని ఎదుర్కొన్నామని, అయినా గ్రిడ్‌లో ఎలాంటి సాంకేతిక ఇబ్బందులకు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఆ రెండు రోజుల్లో 233.44 మిలియన్ యూనిట్ల కంటే ఎక్కువ విద్యుత్‌ను సరఫరా చేశామన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో గత వేసవిలో గరిష్టంగా 2958 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ వచ్చినా ఎలాంటి అంతరాయం లేకుండా సరఫరా చేశామని, ఈ ఏడాది మే 25న 62.83 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను సరఫరా చేశామని, రాబోయే వేసవిలో సైతం ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని స్పష్టం చేశారు.



రాష్ట్ర గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసిన టిఆర్ఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కెటిఆర్. ఆయనతో పాటు ఎంఎల్ఎ బాల్క సుమన్, ఎంఎల్‌సి శంభీపూర్ రాజులు ఉన్నారు.

గోవిందా... ఒక మంత్రం

చిన జీయర్ స్వామీజి



మనతెలంగాణ/ సిటీబ్యూరో : గోవిందా అనేది ఒక మంత్రమని, గో.. వింద్, గాం విందతి ఇతి గోవింద ; అని అర్థం అంటే గోవులను కాపాడేవాడని, గో అంటే వాక్కు అని, వాక్కులకు ఆధారమైనవాడనే అర్థమని ప్రముఖ ఆధ్యాత్మిక గురువు చిన జీయర్ స్వామీజి తెలిపారు. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా నగరంలోని నందగిరిహిల్స్‌లో మైహోం గ్రూపుల అధినేత జూపల్లి రామేశ్వర్‌రావు నివాస ప్రాంగణంలో ఆయన ప్రవచనాలతో నారాయణ మంత్రంపై సమగ్రంగా వివరించారు. మంత్రాలు రెండు రకాలుగా ఉంటాయని, అవి వ్యాపకమంత్రాలు, అవ్యాపక మంత్రాలని ఆయన వెల్లడించారు. వ్యాపకములంటే భగవంతుడు అంతటా ఉంటాడని స్పష్టం చేసేవని, భగవంతుడి గుణగణాలను తెలిపేవి అవ్యాపకాలు అని జీయర్ స్వామీజి తెలిపారు. కృష్ణా ఇది కూడా ఒక మంత్రమని, ఈ మంత్రానికి అర్థమని, కృష్ అంటే చాలా.. ణా అంటే ఆనందమని, గొప్ప ఆనందంను కలవాడు, గొప్ప ఆనందం ఇచ్చువాడు అనేది కృష్ణా తెలుపుతుందని ఆయన విశదీకరించారు. ఈ పదాలను శబ్ధం నుంచి గ్రహించవచ్చునని, కృష్ణా అనేది అవ్యాపకం అని, శివ మంగళము, మంగళం కలిగించువాడని, ఇంద్ర అంటే సంపద అని అర్థం ఉన్నదని, మంచి సంపద ఇచ్చువాడని ఆయన తెలిపారు. మంత్ర ఒక అర్థాన్ని మాత్రమే చెప్పుతుందని, ఏ మంత్రం తీసుకున్నా ఇలాగే వెల్లడిస్తున్నదని ఆయన పేర్కొన్నారు. కేశవ... అందమైన కేశములు కలవాడని. క అంటే బ్రహ్మ, ఈష్ అంటే రుద్రుడని, వా అంటే వారిద్దరినీ కలవాడని, క అనే పదానికి చతుర్ముఖుడు అని అర్థమని ఆయన స్పష్టంచేశారు. 'ఈషోం సర్వదేహింనాం' అంటే ఈషుడు అంటాడని, మేమిద్దరం కూడా నీదేహంలోనే ఉంటున్నామనేది అర్థమని, కేశవ అంటే నీటిమీద పవలించువాడు అని అర్థమని జీయర్ స్వామీజి తెలిపారు. ఇవన్నీ అవ్యాపక మంత్రంకు సంబంధించినవని, వ్యాపకములు మూడు అందులో ఒకటి విష్ణు, వాసుదేవ, నారాయణ యని, 'ఓం నారాయణాయన విద్మహే.. వాసుదేవాయ ధీమహీ... తన్నో విష్ణు ప్రచోదయాత్' అనేది మూడు వ్యాపకాలున్న మంత్రమని జీయర్ స్వామీజి తెలిపారు. విష్ణు అంటే... వ్యాపించుట. వ్యాపించినవాడు అని అర్థమని, వాసుదేవ అంటే వాస్ అంటే ఉంటాడని, దివ్ అంటే ప్రకాశిస్తుంటాడని, దివ్ అంటే శ్రమలేకుండా చేయువాడని, అంతటా వ్యాపించి ఉండి క్రియలు చేయువాడే వాసుదేవా అని మంత్రం వెల్లడిస్తుందని తెలిపారు. మంత్ర శాస్త్రాల్లో రెండుగా విభజిస్తే అవి వ్యాపకాలు, అవ్యాపకాలుగా ఉన్నాయని ఆయన వెల్లడించారు. ఏ మంత్రం భగవంతుడి వ్యాపకత్వాన్ని చెప్పుతుందని, విష్ణు, వాసుదేవా అనే మంత్రాల్లో చిన్న చిన్న లోపాలున్నాయని చెప్పారు. ఈ రెండు మంత్రాలను ఎవ్వరూ కూడా ఉపాసన చేయదగిన మంత్రాలుగా తీసుకోలేదన్నారు. నారాయణ మంత్రంలోనే అన్ని రకాల శక్తిసామర్థ్యాలున్నాయని, మనల్ని తరింపజేయగలిగినది, సమగ్రమైనది ఒక్క నారాయణ మంత్రం మాత్రమేనని ఆయన తెలిపారు. ఈ విషయాన్ని రుషులు చెప్పారని, రుషులకు నాయకుడు వేదవ్యాస మహర్షియని ఆయన తెలిపారు. వేదవ్యాసుడు బ్రహ్మసూత్రాలను రచన చేసి ఇచ్చారన్నారు. ఈ సంప్రదాయం, ఆ సంప్రదాయమనే తేడా లేకుండా బ్రహ్మసూత్రాలను వ్యాసుడు అందించాడని



తెలిపారు. మంత్రములలో అష్టాక్షరీ మహామంత్రాని కంటే ప్రభావం కలిగిన మరో మంత్రంలేదన్నారు. మంత్రం చెప్పేటువంటి స్వరూపాలలో నారాయణుని కంటే మించిన పరదైవం లేనేలేదని, మధ్యాహ్నం వేళ సూర్యుడి క్రింద నీటిలో నిలబడి, చేతిలెత్తి ప్రతిజ్ఞ వేద వ్యాసుడు చేసినట్టు అతడి వాక్కు తెలుపుతుందని చెప్పారు. సంప్రదాయాలు వేరైనా అద్వైత సిద్ధాంతాన్ని లోకానికి అందించిన శంకరుడు కూడా నారాయణ మంత్రాన్ని స్వీకరించారని తెలిపారు. రామానుజల వారు గోపురమెక్కి నారాయణ మంత్రాన్ని లోకానికి చాటారని, వైదికుడెవరైనా నారాయణ మంత్రాన్ని కాదు అనేవారుండరని, వేదాన్ని విశ్వసించినవాడైతే హే నారాయణ నిన్నువాడు తప్పనిసరిగా విశ్వసించుతీరునని, సకలచరాచర జగతిని కూడా నారాయణ మంత్రం నడిపించునని వేదాలు చెప్పాయని జీయర్ స్వామీజి తెలిపారు. వేదాలన్నీ తెలిపేది నారాయణ అనేది మాత్రమేనని ఆయన తన ప్రవచనాల్లో వెల్లడించారు.



నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ

జీహెచ్ఎంసీ కమిషనర్ దానకిషోర్

మన తెలంగాణ/హైదరాబాద్ సిటీబ్యూరో : నగరంలో రహదారులు, ఫుట్‌పాత్‌లపై నిరాశ్రయులు లేకుండా వారిని జీహెచ్ఎంసీ ఏర్పాటు చేసిన షెల్టర్లకు తరలిస్తున్నట్టు జీహెచ్ఎంసీ కమిషనర్ ఎం.దానకిషోర్ తెలిపారు. తీవ్రమైన చలి ఉండడంతో నగరంలో ఆస్పత్రులు, బస్టాండ్‌లు, ఇతర జంక్షన్లలో నిద్రిస్తున్న నిరాశ్రయులకు జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఉచితంగా బ్లాంకెట్లు, దుప్పట్లను పంపిణీ చేశారు. బంజారాహిల్స్ బసవ తారకం క్యాన్సర్ ఆస్పత్రి సమీపంలో ఫుట్‌పాత్‌పై నిద్రించే వారికి జీహెచ్ఎంసీ కమిషనర్ దానకిషోర్ బ్లాంకెట్లను పంపిణీ చేశారు. అడిషనల్ కమిషనర్ హరిచందన, జోనల్ కమిషనర్ ముషారఫ్ అలీ పాల్గొన్న ఈ కార్యక్రమంలో దానకిషోర్ మాట్లాడుతూ నగరంలో నిరాశ్రయులు ఆశ్రమం కల్పించేందుకు 15 నైట్ షెల్టర్లను జీహెచ్ఎంసీ ఏర్పాటు చేయడమైందని, వీటిలో దాదాపు 700 మందికి ఆశ్రమం కల్పించామన్నారు. జిల్లాల నుం చి రోజూ లక్షలాది మంది వివిధ పనుల నిమిత్తం నగ రానికి వస్తారని, వీరిలో అధికశాతం రహదారులు, జం క్షన్‌ల వద్ద తాత్కాలికంగా బస చేస్తున్నారని అన్నారు. వీరిని గుర్తించి నైట్ షెల్టర్లలో బస కల్పించనున్నట్టు తెలిపారు. మహిళలకు, పురుషులకు వేర్వేరుగా నైట్ షెల్టర్లు ఉన్నాయని పేర్కొన్నారు. నగరంలో ఇటీవల రూ.9.71 కోట్ల వ్యయంతో ఏడు నైట్ షెల్టర్ల నిర్మాణం చేపట్టగా మూడింటిని పూర్తి చేశామన్నారు. కింగ్‌కోఠిలోని మెటర్నటీ ఆస్పత్రి, మహావీర్ ఆస్ప త్రి, నీలోఫర్ ఆస్పత్రిలలో నైట్ షెల్టర్లను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ముఖ్యంగా నిరుపేదల నిరాశ్రయుల కోసం రూ. 5 భోజనం, నైట్ షెల్టర్ల ఏర్పాటు తదితర సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నట్టు దానకిషోర్ తెలిపారు.

చలి దాడి



- ఆదిలాబాద్‌లో కనిష్ట ఉష్ణోగ్రత 4డిగ్రీలు
- రంగారెడ్డిలో 4.9
- ఆదిలాబాద్‌లో పాఠశాలల సమయాల కుదింపు

మనతెలంగాణ /న్యూస్‌నెట్‌వర్క్: రోజురోజుకు పెరుగుతున్న చలి మూలంగా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ప్రజలు నానా యాతనలు పడుతున్నారు. రాజధాని హైదరాబాద్ నగరంతో సహా రంగారెడ్డి, ఖమ్మం, ఆదిలాబాద్, వరంగల్ ఉమ్మడి జిల్లాల్లో ఉష్ణోగ్రతలు కనిష్ట స్థాయికి పడిపోయాయి. రంగారెడ్డి జిల్లా తాండూర్‌లో బుధవారం 4.9 డిగ్రీల కనిష్ట స్థాయికి ఉష్ణోగ్రతలు పడిపోయాయి. 30 ఏళ్ల తర్వాత ఇలా కనిష్ట స్థాయికి చేరుకోవడం వారంలో ఇది రెండోసారి అని తాండూర్ వ్యవసాయ పరిశోధనా సంస్థ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ సుధాకర్ తెలిపారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో 15 డిగ్రీలకు పడిపోయింది. ఉదయం 11గంటలు దాటితేగాని ప్రజలుఇళ్లనుంచి బయటకు రావడంలేదు. చలి తీవ్రతకు ఉభయ జిల్లాల్లో జలుబు, దగ్గు, చర్మ వ్యాధులు సంక్రమించడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో మంగళవారం 2.5 డిగ్రీల అత్యల్ప కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. సోమవారం 3.7 డిగ్రీలుగా ఉన్న కనిష్ట ఉష్ణోగ్రత మంగళవారం మరింత పడిపోయి 3.2డిగ్రీలుగా నమోదైంది. బుధవారం 4.0 డిగ్రీలు నమోదైంది. ఉత్తరాదినుంచి వీస్తున్న చలిగాలులు జనాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. జిల్లాలోని ఏజెన్సీ అటవీ ప్రాంతాల్లో 3డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మిట్టమధ్యాహ్నం ఎండలో చలి ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. చలి తీవ్రత మూలంగా జిల్లాలో పది మంది వరకు మరణించారు. చలి తీవ్రత మూలంగా జిల్లాలో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పాఠశాలలు పనిచేయాలని ఉత్తర్వులు జారీచేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా భూపాలపల్లిలో 13 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పడిపోయాయి. రాత్రిపూట ఉష్ణోగ్రతలు మరింత కనిష్ట స్థాయికి పడిపోతున్నాయి. అటవీ గ్రామాల్లో గిరిజనులు చలికి తాళలేక చలి మంటలవద్దే కాలం వెళ్లదీస్తున్నారు.



పనులా, నత్తలా?


అన్నారం బ్యారేజ్ కాలువ పనులు

(మొదటిపేజీ తరువాయి)

నెలకల్లా పనులు పూర్తయ్యేలా మూడు షిఫ్టుల్లో పంప్‌హౌజ్ పనులు జరగాలని ఆదేశించారు. బుధవారం ఉదయం కన్నెపల్లి పంప్‌హౌజ్‌కు చేరుకుని అక్కడి నుంచి డెలివరీ కెనాల్ దగ్గర జరుగుతున్న పనులను పరిశీలించారు. గ్రావిటీ కెనాల్ కాంక్రీట్ పనులు, లైనింగ్ పనులు పూర్తికాకపోవడంతో అధికారులపై అసంతృప్తి వ్యక్తంచేశారు. పనులను వేగవంతం చేసి తొందరగా పూర్తిచేయాలని స్పష్టం చేశారు. 13 కిలోమీటర్ల గ్రావిటీ కెనాల్ మీదుగా అన్నారం వరకు ప్రయాణిస్తున్న సమయంలో మూడు చోట్ల కెనాల్ పనులను పరిశీలించారు. అనంతరం గ్రావిటీ కెనాల్ అండర్ గ్రౌండ్ పనులను పరిశీలించారు. ఏ పని ఏ స్టేజీలో ఉంది, ఏ మేరకు పూర్తయ్యింది, ఇంకా ఎంత పని కావాల్సి ఉంది తదితర వివరాలను అధికారులను, వర్క్ ఏజెన్సీ ప్రతినిధులను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అంటూ వారిని ఆరా తీశారు. కొన్ని చోట్ల కాలువ సైడ్ స్లోప్స్ కూలిపోతున్నాయని, అటువంటి రీచేస్‌లో కాంక్రీట్ గైడ్ వాల్స్ కడితే క్షేమంగా ఉంటుందని అధికారులు సూచించారు. ముఖ్యమంత్రి వాటిని చూసి వెంటనే గైడ్ వాల్స్ నిర్మించడానికి తగిన ఏర్పాట్లు చేసుకోవాలని ఇంజనీర్ ఇన్ చీఫ్‌ని ఆదేశించారు. వర్క్ ఏజెన్సీలకు బిల్లులు చెల్లించే విషయంలో జాప్యం జరగొద్దని ఇప్పటికే ఆదేశాలు జారీసినట్లు స్పష్టం చేసిన కెసిఆర్ ఎక్కడైనా చిన్నచిన్న సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని సిఎంకో కార్యదర్శి స్మితా సబర్వాల్‌ను సిఎం ఆదేశించారు. అన్నారం బ్యారేజీ నుండి పంప్‌హౌజ్ వరకు ఉన్న కాలువ లైనింగ్ పనులు ఇంకా నాలుగు రెట్లు పెరగాలని, లేబర్ ను కూడా అవసరానికి అనుగుణంగా పెంచుకోవాలని సూచించారు. పనుల నాణ్యత విషయంలో రాజీ పడవద్దని అన్నారు. మార్చి నెలాఖరుకు కాలువ పనులు పూర్తి అయ్యేలాగా ప్లాన్ చేసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. అనంతరం అన్నారం బ్యారేజి వద్ద పనులని పరిశీలించి 'ఆఫ్‌స్కాన్' కంపెనీ ప్రతినిధులతో, ఇంజనీర్లతో పనులను సమీక్షించారు. అన్నారం బ్యారేజీ పనులు మొత్తం ఫిబ్రవరి నెలాఖరుకు పూర్తి చేస్తామని కంపెనీ ప్రతినిధులు హామీ ఇచ్చారు. అన్నారం బ్యారేజి పనులపై సంతృప్తిని వ్యక్తం చేసిన సిఎం అనంతరం సుందిళ్ళ బ్యారేజి, అన్నారం పంప్‌హౌజ్, సుందిళ్ళ పంప్ హౌజ్ పనులని కూడా పరిశీలించారు. సుందిళ్ళ బ్యారేజి పనులు మందకొడిగా సాగుతున్నాయని, ఎట్టిపరిస్థితుల్లో బ్యారేజి పనులు, ఫ్లడ్ బ్యాంక్ పనులు, రివెట్ మెంట్ పనులు మార్చ్ నెలాఖరుకు పూర్తి కావాలని ఆదేశించారు. పంపులు, మోటార్ల బిగింపు పనులు కూడా మార్చి నెలాఖరుకు పూర్తీ చేసి ఏప్రిల్‌లో 'వెట్ రన్'కు సిద్ధం చేయాలని ఆదేశించారు. పంప్‌హౌజ్‌ల దగ్గర ట్రాన్స్‌కో నిర్మించిన విద్యుత్ సబ్ స్టేషన్ల లో వర్షపు నీటి నుంచి రక్షించుకోడానికి తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

కాళేశ్వర అర్చకుల ఆశీర్వాదం

కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానం తరపున అర్చకులు ముఖ్యమంత్రిని కన్నెపల్లి పంప్‌హౌజ్ దగ్గర కలిసి ఆశీర్వచనాలు అందజేశారు. స్వామివారి పట్టువస్త్రాలు, ప్రసాదం అందజేసి వేదమంత్రాలతో ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు కృష్ణమూర్తి, లక్ష్మీ నారాయణ శర్మ, ప్రశాంత్‌శర్మ, రామకృష్ణ, వేదపండితులు బైకుంటా పాండా, ఈఓ మారుతి, చైర్మన్ బొమ్మెర వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.



శ్రీరాంసాగర్ పునరుజ్జీవ పనులు మార్చికి పూర్తికావాలి

అనంతరం శ్రీరాంసాగర్ పునరుజ్జీవన పథకంలో భాగుంగా రాజేశ్వర్‌రావుపేట దగ్గర నిర్మాణమవుతున్న రెండవ పంప్ హౌజ్ నిర్మాణ పనులను ముఖ్యమంత్రి పరిశీలించారు. మొదటి రెండు పంప్‌హౌజ్‌లలో మొత్తం 18 పంపులు, మోటార్ల బిగింపు ప్రక్రియని వేగువంతం చేయాలని, మూడవ పంప్‌హౌజ్ పనులను ఆపివేసి అక్కడ నుంచి లేబార్, యంత్రాలను మొదటి పంపుహౌజ్ దగ్గరకు తరలించి మార్చి నెలాఖరుకు పూర్తిచేయాలని ఆదేశించారు. ఆ తర్వాత జూన్ నాటికి మూడవ పంపు హాజ్ పనులు పూర్తి చేసుకోవాలని సూచించారు. ప్రాజెక్టు పూర్తయి సాగు నీరు అందించే ప్రక్రియ పూర్తయిన తర్వాత ఈ ప్రాంతం టూరిజంలో బాగా అభివృద్ధి చెందుతుందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. కాళేశ్వరం దేవాలయం, ఫారెస్ట్ ఉన్న ఈ ప్రాంతంలో కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తయితే టూరిస్టుల సంఖ్య ఇంకా పెరుగుతుందని, 5 నుండి 10 ఎకరాల్లో హోటళ్ళ నిర్మాణం జరిగేలా ప్రోత్సహిస్తామని తెలిపారు. బహుళజాతి సంస్థలను టూరిజం అభివృద్ధిలో భాగస్వాములను చేయాలనే ఆలోచన చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రాజెక్టు పనులు చేసే క్రమంలో రోడ్లు నిర్మించడం సహా ఎలక్ట్రిక్ బోటింగ్ వంటి అంశాలను కూడా దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు. రామగుండం నుండి రైల్వే మార్గం కూడా పొడిగిస్తామని, భవిష్యత్తులో ఈ ప్రాంతం బాగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఇక నుండి ఎప్పటికప్పుడు తాను కూడా ప్రాజెక్టు పనులను సమీక్షిస్తానని తెలిపారు. జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం రాజేశ్వర్‌రావుపేట సమీపంలోని ఎస్‌ఆర్‌ఎస్‌పి పునరుజ్జీవం పనుల్లో భాగంగా రూ॥ 1080 కోట్లతో చేపడుతున్న రివర్స్ పంపింగ్ పనులను ముఖ్యమంత్రి పరిశీలించారు. ఇంజనీర్లు పంప్‌హౌజ్ పనుల పురోగతిని ఫోటో ఎగ్జిబిషన్ ద్వారా అధికారులు వివరించారు.

అలసత్వం వద్దు

మంథని మండలంలో నిర్మిస్తున్న సుందిళ్ల బ్యారేజి, అన్నారం పంపుహౌజ్ పనులను కెసిఆర్ ఛాయాచిత్రాల ద్వారా పరిశీలించి ప్రాజెక్టు పనుల పురోగతిపై అధికారులతో సమీక్షించారు. ప్రాజెక్టుకు సంబంధించిన పనుల్లో అలసత్వం వద్దని, వేగంగా జరగాలని, మార్చి నెలలోగా పూర్తిచేయాలని స్పష్టం చేశారు. సుందిళ్ల బ్యారేజి వ్యూ పాయింట్ వద్ద ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించి అధికారుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. సుందిళ్ల బ్యారేజి 74 గేట్లు బిగించే పని పూర్తయిందని, ఫ్లడ్ బ్యాంకు పనులు వేగవంతంగా సాగుతున్నాయని, ఇప్పటివరకు 89.64 శాతం తవ్వకం పనులు, 76.39 శాతం ఎర్త్ పనులు జరిగాయని, మిగిలిన పనులను ఈ నెల చివరికల్లా పూర్తిచేస్తామని అధికారులు వివరించారు. ఫ్లడ్ బ్యాంకు రివిట్‌మెంట్ పనులు 46 శాతం మాత్రమే జరగడం పట్ల కెసిఆర్ అసంతృప్తి వ్యక్తంచేశారు. ఈ పనులను వేగవంతం చేయాలని, అన్నారం పంపుహౌజ్‌లో 8 మోటారు పంపులను బిగించే ప్రక్రియను వెంటనే చేపట్టాలని స్పష్టం చేశారు. రెండు మోటర్లు ఇప్పటికే చెన్నైకి చేరుకున్నాయని, వాటిని బిగించటానికి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. పంపుహౌజ్ నుంచి రెండు టిఎంసిల నీరు ఎత్తిపోసే దిశగా పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పంపుల ద్వారా ట్రయల్ రన్‌ను వీలైనంత త్వరగా పూర్తిచేసి రానున్న ఖరీఫ్ సీజన్‌లో రైతులకు సాగునీరు అందించేందుకు అన్ని పనులనూ మార్చిలోగా పూర్తి చేయాలని సిఎం ఆదేశించారు. ప్రాజెక్టు పనుల పట్ల నిర్లక్ష్యం తగదని, రోజుకు మూడు షిఫ్టుల్లో పనులు జరగాలని స్పష్టం చేశారు. సుందిళ్ల బ్యారేజి, అన్నారం పంపుహౌజ్ పనులనూ పరిశీలించారు. ముఖ్యమంత్రి కెసిఆర్‌తో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె జోషి, సిఎంఓ కార్యదర్శి స్మితా సబర్వాల్, డిజిపి మహేందర్ రెడ్డి, ప్రభుత్వ ముఖ్య సలహదారు వివేక్, నీటిపారుదలశాఖ ఇంజనీర్ ఇన్ ఛీఫ్ మురళీధర్‌రావు, ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్ దేవసేన, శాసనసభ్యులు వేముల ప్రశాంత్‌రెడ్డి, దాసరి మనోహర్‌రెడ్డి, కోరుకంటి చందర్, దివాకర్‌రావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎంఎల్‌సి పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ, నవయుగ కంపెనీ ఛైర్మన్ విశ్వేశ్వర్ రావు, ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ నల్ల వెంకటేశ్వర్లు, ఈఈ విష్ణు ప్రసాద్, టిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఉపేందర్ రెడ్డి, పెంట రాజేష్, పవన్, పిటి స్వామి, రాష్ట్ర మార్క్‌ఫెడ్ ఛైర్మన్ లోక బాపురెడ్డి, జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ తుల ఉమ, మాజీ స్పీకర్ కెఆర్ సురేష్‌రెడ్డి, సిఎంఓ ఓఎస్‌డి శ్రీధర్‌రావు దేశ్ పాండే, లిఫ్ట్ సలహాదారు పెంటారెడ్డి, మెగా ఎండి కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.


అన్నారం బ్యారేజ్ కాలువ పనుల పరిశీలన


కన్నెపల్లి పంపుహౌజ్ వద్ద సిఎం


గోలివాడలో భారీ మోటార్లు


సుందిళ్ల వద్ద అధికారులతో చర్చలు

నేడు సిరిసిల్లలో కెటిఆర్ పర్యటన



మన తెలంగాణ/హైదరాబాద్: టిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటి రామారావు సిరిసిల్ల పర్యటన ఖరారైంది. నియోజకవర్గంలోని పలు పార్టీ కార్యక్రమాల్లో గురువారం పాల్గొననున్నారు. ఆ నియోజకవర్గ పార్టీ నాయకులకు ఇప్పటికే సమాచారం అందింది. సిరిసిల్ల నియోజకవర్గంలోని పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన మండల స్థాయి ముఖ్యనాయకుల సమావేశంలో కెటిఆర్ పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 12.30 గంటలకు ఎల్లారెడ్డి పేట మండలం,1.30కు గంటలకు గంభీరావు పేట మండలం, 2.30కు ముస్తాబాద్, 3.30కు సిరిసిల్ల మండలం, 4.30 గంటలకు సిరిసిల్ల టౌన్ నాయకులతో కెటిఆర్ సమావేశం కానున్నారు. నియోజకవర్గ నాయకులతో సమావేశాలు నిర్వహించి అభివృద్ధి కార్యక్రమాలను సమీక్షించనున్నట్లు సమాచారం.

ఈసారి మధ్య వేలుకు సిరా



మన తెలంగాణ/హైదరాబాద్ : పంచాయతీ ఎన్నికలో సిరా చుక్క పెట్టే విధానంలో రాష్ట్ర ఎన్నికల సంఘం మార్పులు తీసుకొచ్చింది. సాధారణంగా అయితే ప్రతి ఎన్నికల్లో ఎడమ చేతి చూపుడు వేలుకు సిరా చుక్క పెట్టి పోలింగ్ ప్రక్రియను నిర్వహిస్తారు. కానీ పంచాయతీ ఎన్నికల్లో ఈ సారి చూపుడు వేలుకు బదులుగా మధ్యస్త వేలుకు సిరా ఇంక్ పెట్టనున్నారు. రాష్ట్రంలో ఇటీవల ముగిసిన శాసనసభ ఎన్నికల్లో ఓటర్ల ఎడమ చేతి చూపుడు వేలుకు సిరా చుక్క పెట్టి పోలింగ్ ముగించిన విషయం తెలిసిందే. ఈ ఎన్నికలు ముగిసిన నెల రోజుల వ్యవధిలోనే మన రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో అసెంబ్లీ ఎన్నికల్లో పాల్గొన్న ఓటర్ల వేలికి ఇంకా సిరా గుర్తులు చెరిగిపోలేదు. పైగా పంచాయతీ ఎన్నికల ముగిసిన రెండు, మూడు నెలల్లో పార్లమెంట్ ఎన్నికలు జరగనున్నాయి. దీనిని దృష్టిలో పెట్టుకునే రాష్ట్ర ఎన్నికల సంఘం పంచాయతీ ఎన్నికల్లో ఎడమ చేతి మధ్య వేలికి సిరా చుక్క పెట్టాలని నిర్ణయం తీసుకుంది. పార్లమెంట్ ఎన్నికల్లో ఎడమ చేతి చూపుడు వేలుకు సిరాపెట్టాల్సి ఉన్న నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం సిరా వేలి మార్పుపై ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రిటర్నింగ్, ప్రిసైడింగ్, అసిస్టెంట్స్ ప్రిసైడింగ్ అధికారులకు, ఇతర ఎన్నికల నిర్వహణ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

కొలువుదీరిన కొత్త హైకోర్టు

విచారణలు ప్రారంభం



మన తెలంగాణ/ హైదరాబాద్ : ఎట్టకేలకు తెలంగాణ కల సాకారం అయ్యింది.తెలంగాణ రాష్ట్రం వచ్చినా ప్రత్యేకంగా హైకోర్టు కూడా కావాలనే తెలంగాణవాదుల కల కార్యరూపం దాల్చింది. మంగళవారం హైకోర్టు అధికారికంగా ఏర్పాటైన నేపథ్యంలో బుధవారం తెలంగాణ హైకోర్టు కేసుల విచారణ ప్రారంభమైంది. ఈ సందర్భంగా మొదటి కోర్టు హాల్లో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్ అధ్యక్షతన న్యాయమూర్తులతో ఫుల్ కోర్టు సమావేశం అయ్యింది. తెలంగాణ అడ్వకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్, బార్ కౌన్సిల్ చైర్మన్ నర్సింహా రెడ్డి, తెలంగాణ హైకోర్టు న్యాయవాదుల సంఘం సభ్యులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది ఈ సమావేశానికి హాజరయ్యారు.



తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 1.87 లక్షల పెండింగ్ కేసులతో హైకోర్టు ఏర్పడిందని, వీటి పరిష్కారం కోసం న్యాయవాదులు, న్యాయమూర్తులు (బెంచ్ అండ్ బార్) సమిష్టిగా పనిచేయాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాధాకృష్ణన్ అన్నారు. సమావేశాన్ని ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తూ.. ప్రమాణాలతో కూడిన న్యాయం సకాలంలో అందించేందుకు పాటుపడాలన్నారు. గుణాత్మకంగా, శాస్త్రీయంగా, సకాలంలో న్యాయం అందించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. సత్వర న్యాయం అందించాలంటే బెంచ్ అండ్ బార్ సమిష్టిగా పనిచేయాలని, నాణానికి చెరో వైపు కాకుండా రెండు రథచక్రాల్లా ఉంటూ న్యాయాన్ని ముందుకు నడిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇందుకు అందరూ అప్రమత్తంగా, సమర్థంగా పనిచేయాలని కోరారు. 1.87 లక్షల పెండింగ్ కేసులతో తెలంగాణ హైకోర్టు ప్రారంభం అయిందని, వీటిని క్రమంగా తగ్గించే ప్రయత్నం చేయాలన్నారు. ప్రజల ఆశీస్సులతో రాజ్యాంగానికి లోబడి న్యాయమూర్తులు ప్రమాణం చేసిన విషయాన్ని జస్టిస్ రాధాకృష్ణన్ గుర్తు చేశారు. చారిత్రక మార్పును మనమంతా నిన్నటి వరకూ చూశామని, ప్రస్తుత హైకోర్టు కొత్త ఏడాదికి స్వాగతం చెప్పడంతో ఏర్పాటు అయ్యిందన్నారు. మనమంతా సమర్థంగా పనిచేస్తామని ఇక్కడ బార్ అండ్ బెంచ్ ప్రమాణం చేశామని, అందుకు అనుగుణంగా అందరూ చేతిలో చేయి వేసి ప్రమాణం చేయాలని విజ్ఞప్తి చేశారు.

మూడు ధర్మాసనాలు ఏర్పాటు

రాష్ట్ర హైకోర్టు ఏర్పడిన నేపథ్యంలో కొత్తగా న్యాయమూర్తులవారీగా వివిధ అంశాలను కేటాయించారు. మూడు ద్విసభ్య ధర్మాసనాలు ఏర్పాటు అయ్యాయి. మొదటి ధర్మాసనంలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాధాకృష్ణన్, జస్టిస్ ఏ రాజశేఖర్‌రెడ్డిలతో ఏర్పాటు అయ్యింది. రెండో డివిజన్ బెంచ్‌లో రాఘవేంద్ర ఎస్ చౌహాన్, టీ అమర్‌నాథ్‌గౌడ్, మూడో డివిజన్ బెంచ్‌లో వీ రామ సుబ్రమణియన్, పీ కేశవరావులు ఏర్పాటు చేశారు.. మొదటి ధర్మాసనం ప్రజాప్రయోజన వ్యాజ్యాలు (పిల్), రిట్ అప్పీళ్లు, ధిక్కరణ అప్పీళ్లు, క్రిమినల్ ధిక్కరణ అప్పీళ్లు, హెబియస్‌కార్పస్ కేసులు, సుమోటో రిట్ పిటిషన్లు, హైకోర్టు, జుడిషియల్ సర్వీసెస్, జిల్లా కోర్టులకు సంబంధించిన కేసులు విచారిస్తాయి. రెండో ధర్మాసనం క్రిమినల్ అప్పీళ్లు, భూసేకరణ, సిటీ సివిల్ కోర్టు అప్పీళ్లు, సివిల్ రివిజన్ పిటిషన్లు తదితర అంశాలను విచారిస్తుంది. మూడో ధర్మాసనం ఆదాయం పన్ను ట్రిబ్యునల్ అప్పీళ్లు, సెంట్రల్ ఎక్సైజ్, ఆదాయపు పన్ను, మనీలాండరింగ్ అప్పీళ్లు తదితర కేసుల్ని విచారిస్తుంది.

ఢిల్లీలో దొరికిన తెంపుడుగాళ్లు

- వరుస శ్నాచింగ్ కేసులో పురోగతి
- నగరానికి తరలించిన సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్
- కీలక నిందితుడు స్థానికుడే



మనతెలంగాణ/ సిటీబ్యూరోః హైదరాబాద్ శివారుల్లో సంచలనం సృష్టించిన వరుస స్నాచింగ్‌లకు పాల్పడిన దొంగలను ఢిల్లీలో అదుపులోకి తీసుకున్నారు. వారం రోజుల పాటు చర్చనీయాంశంగా మారిన చైన్ స్నాచింగ్ కేసులో ఎట్టకేలకు హైదరాబాద్ సౌత్‌జోన్ పోలీసులు పురోగతి సాధించారు. నిందితులలో ఒకరు స్థానికుడని పోలీసులు వివరిస్తున్నారు. ఈ కేసులో మరో ఇద్దరిని సౌత్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఢిల్లీలో అదుపులోకి తీసుకుని విచారణ నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. సరిగ్గా వారం రోజుల క్రితం ఎల్బీనగర్ పరిధిలో దొంగలు తొమ్మిది చోట్ల వరుస చోరీలకు పాల్పడి పోలీసులకు సవాల్ విసిరిన విషయం తెలిసిందే. రాచకొండ పోలీసులు ప్రతిష్టాత్మకంగా తీసుకుని రాత్రంతా తనిఖీలు నిర్వహించినా వారిని ఏ మాత్రం పట్టుకోలేకపోయారు. తెల్లవారిన తర్వాత చివరిసారిగా ఎక్కడైతే దొంగతనం చేశారో తిరిగి అక్కడి నుంచే చోరీలు చేయడం ప్రారంభించారు. ఇలా నగరంలో కూడా దొంగతనాలకు పాల్పడ్డారు. రంగంలోకి దిగిన పోలీసులు ముందుగా దొంగలు వాడిన బైక్ నంబర్ ఆధారంగా వారి అడ్రస్ తెలుసుకుని వెళ్లగా తాను బైక్‌ను రెండేళ్ల క్రితం విక్రయించానని వాహన దారుడు తెలిపాడు. ఈ నేపథ్యంలోనే అదే వాహనంపై ఇద్దరు విధ్యార్థులు వస్తుండగా అదుపులోకి తీసుకుని విచారించారు. తాము బైక్‌ను అద్దెకు తీసుకున్నామని తెలిపడంతో అద్దెకు ఇస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని పోలీసులు తమదైన శైలిలో విచారించారు. తాను స్థానిక వ్యక్తి చెప్పడంతో ఐడి ప్రూఫ్‌లు లేకుండానే బైక్‌ను అద్దెకు ఇచ్చానని తెలిపాడు. అతడికి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ రావడంతో విచారణ ముమ్మరం చేశారు. స్థానికుడిని పట్టుకుని విచారించడంతో ఉత్తరప్రదేశ్‌కు చెందిన దొంగల వివరాలు బయటపడ్డాయి. వారిని పట్టుకునేందుకు వెళ్లిన సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్ సిబ్బందిని అక్కడి స్థానికులు ఇబ్బందులు పెట్టినట్లు తెలిసింది. తర్వాత అక్కడి స్థానిక పోలీసుల సాయంతో చైన్ స్నాచర్లను పట్టుకున్నట్లు తెలిసింది. పోలీసులు ఎంతో శ్రమపడి వారిని అదుపులోకి తీసుకుని నగరానికి తీసుకువచ్చినట్లు తెలిసింది.

స్థానిక దొంగ సహాయం చేశాడు

నగరంలోని పాతబస్తీకి చెందిన ఓ వ్యక్తి ఉత్తరప్రదేశ్‌లో నేరం చేయడంతో అక్కడి పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపించారు. ఇతడిపై రాష్ట్రంలో 29 కేసులు నమోదయ్యాయన్నది సమాచారం. జైలులో పరిచయమైన ఉత్తర ప్రదేశ్‌కు చెందిన ఇద్దరితో కలిసి నగరంలో చైన్‌స్నాచింగ్‌కు పథకం రచించారు. ఈక్రమంలో దొంగలను ఇక్కడికి రప్పించి నగరంలో బైక్‌ను అద్దెకు తీసుకుని ముగ్గురు కలిసి దొంగతనాలకు పాల్పడ్డారు. జైలులో సహవాసం ఇక్కడ నేరానికి పాల్పడేలా చేసింది. నగర శివారులో పోలీసుల నిఘా తక్కువగా ఉండడంతో చైన్ స్నాచింగ్‌కు ఆయా ప్రాంతాలను దొంగలు చోరీలకు ఎంచుకున్నారు. స్థానికుడు వారికి ఎటువైపు నుంచి పారిపోవాలో చెప్పడంతో పోలీసుల నుంచి తప్పించుకుని సులభంగా పారిపోయారు. దర్జాగా విమానంలో ఢిల్లీకి వెళ్లారు.

ప్రజలకు మోడీ వివరణ

సంపాదకీయం


లోక్‌సభ ఎన్నికలు దగ్గర పడిన కీలక సమయంలో ప్రధాని నరేంద్ర మోడీ ఇచ్చిన సుదీర్ఘ ఇంటర్వ్యూ తనపట్ల దేశ ప్రజలలో ఏర్పడిన అసంతృప్తిని తొలగించడానికి ఉద్దేశించినదేనని స్పష్టపడుతున్నది. ఇందులో ఆయన వెలిబుచ్చిన అభిప్రాయాల హేతుబద్ధత ఎలా ఉన్నప్పటికీ ప్రజలకు సమాధానం చెప్పుకోవలసిన తరుణం వచ్చిందని ఆయన గ్రహించినట్టు బోధపడుతున్నది. అత్యంత వివాదాస్పదమైన పెద్ద నోట్ల రద్దు, వస్తు, సేవల పన్ను అమలు తీరు దేశ ప్రజలను నానాకష్టాలపాలు చేసిన చేదు వాస్తవం సందేహాతీతంగా రుజువై దాని ప్రభావం ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలలో బిజెపిని చావు దెబ్బ తీసిన నేపథ్యంలో వివరణ ఇచ్చుకోకతప్పని స్థితి తల ఎత్తిందని ప్రధాని మోడీ గుర్తించారు. అయితే ఈ రెండు విషయాల్లో ప్రధాని సమాధానాలు సంతృప్తికరంగా లేవని చెప్పక తప్పదు. ఈ చర్యల వల్ల ప్రజలుపడిన బాధలను వారు మరిచిపోయేలా చేయగల శక్తి ఆయన వివరణలో గల్లంతయింది.

పెద్ద నోట్లను ఆకస్మికంగా రాత్రికి రాత్రే రద్దు చేసినందువల్ల ఉన్నపళంగా చేతిలో చిల్లిగవ్వలేని దుస్థితిని ఎదుర్కొన్న దేశ ప్రజలు అనేక బాధలుపడ్డారు. ఆత్మహత్యలు, ఆకస్మిక మరణాలు కూడా గణనీయంగా సంభవించాయి. గుట్టల గుట్టల గుప్త ధనాన్ని నిర్మూలించి ఆర్థిక వ్యవస్థకు స్వస్థత తెస్తామన్న మాట బూటకమయింది. పెద్ద నోట్ల రద్దుతో అవినీతి అంతమవుతుందని, టెర్రరిస్టుల దగ్గరున్న డబ్బు విలువలేనిదయిపోయి ఉగ్రవాదం తగ్గుముఖంపడుతుందని అన్నారు. ఈ రెండూ నెరవేరలేదు. సంపన్నుల ఇళ్లల్లోని గుప్తధనమంతా దొడ్డిదారుల్లో తిరిగి బ్యాంకుల్లో చేరి చెలామణిలోకి వచ్చేసింది. ఆదాయపు పన్ను కట్టేవారి సంఖ్య పెరిగినట్టు మోడీ చెప్పుకున్నది పెద్ద నోట్ల రద్దు వల్ల ప్రజలెదుర్కొన్న కష్టాలతో పోలిస్తే అతి స్వల్పం. పాత నల్ల ధనం తెలుపయిపోయి కొత్తగా గుప్త కరెన్సీ గుట్టలుపడుతున్నది. హద్దూ ఆపూ లేకుండా పెరిగిపోతున్న రియల్‌ఎస్టేట్ భూముల ధరలే ఇందుకు తార్కాణం.

జిఎస్‌టి పై శ్లాబును 28 శాతంగా నిర్ణయించి అందులో అనేక వస్తువులను చేర్చి అమ్మకాల కంప్యూటరైజేషన్‌ను తప్పని సరి చేయడం వల్ల వినియోగదారులు, చిన్న వ్యాపారులు ఊహించని కష్టాలు, నష్టాలు చవిచూశారు. జిఎస్‌టి కౌన్సిల్ ఈ ఎన్నికల వేళ ఇటీవలే సమావేశమై 28 శాతం శ్లాబు నుంచి అనేక వస్తువులను తొలగిస్తూ తీసుకున్న నిర్ణయం ఈ విషయంలో మోడీ ప్రభుత్వం తన తప్పును ఒప్పుకున్నట్టు చాటింది. ప్రజల ముక్కు పిండి వసూలు చేసి ఆదాయం పెరిగిందని జబ్బలు చరుచుకోడం జన హితం కోరే ఏ ప్రభుత్వమూ చేయకూడని పని.

కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ రైతు రుణ విమోచనను ఎన్నికల ప్రచార ప్రధానాంశం చేసుకున్న తర్వాత అది ఇటీవలి ఎన్నికల్లో ఆ పార్టీకి సత్ఫలితాలను ఇచ్చిన నేపథ్యంలో దాని వల్ల వ్యవసాయదారులకు ఏమాత్రం మేలు జరగదని, బ్యాంకులు దివాళా తీస్తాయనే ప్రచారం ఊపందుకున్నది. రుణ మాఫీ వల్ల రైతులు బాగుపడేదిలేదని మోడీ కూడా తన ఇంటర్వ్యూలో బల్లగుద్ది చెప్పారు. అయితే బడా పారిశ్రామిక వేత్తలు భారీ ఎత్తున రుణాలను ఎగవేస్తున్నందున బ్యాంకులు చెడిపోయేది లేనప్పుడు రైతులకు మాఫీ చేస్తే ఏంపోయింది అనే ప్రశ్నకు ఆయన నుంచి సమాధానం లేదు. తెలంగాణలో ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రభుత్వం అమలు చేసిన రైతు బంధు, రైతు బంధు బీమా పథకాల తరహాలో కేంద్రం కూడా అటువంటి నిర్ణయాన్ని తీసుకోగలదని వినిపిస్తున్నది. అది చేసేంతవరకు మోడీ ప్రభుత్వానికి రైతుల పట్ల గల చిత్తశుద్ధి బోనులో నిలబడే ఉంటుంది. బాబ్రీ మసీదు స్థలంలో రామాలయ నిర్మాణానికి వీలు కల్పించే ఆర్డినెన్స్‌ను ఆ కేసులో సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన తర్వాతనే తీసుకొస్తామని ప్రధాని ప్రకటించారు. తీర్పు తమ పార్టీ వైఖరికి వ్యతిరేకంగా వచ్చినా గుడి కట్టడానికి ఆర్డినెన్స్ ద్వారా వీలు కల్పిస్తామని ఆయన చెప్పకనే చెప్పారు. ఆ మేరకు హిందుత్వ ఓటు బ్యాంకును సంతృప్తి పరచే ప్రయత్నం చేశారు. తాను విరివిగా చేసిన విదేశీ పర్యటనలు ఎందుకు అవసరమయ్యాయో గట్టిగా సమర్థించుకోలేకపోయారు. వాటివల్ల దేశానికి ఏయే మేళ్లు జరిగాయో వివరించలేకపోయారు. చివరగా ప్రజలు తమవెంటే ఉన్నారని తెలంగాణలో జరిగినట్టే జాతీయ స్థాయిలోనూ కూటమి ఓటమి తప్పదని ప్రధాని మోడీ ప్రకటించిన అమిత విశ్వాసం రుజువవుతుందో, విఫలం కానుందో లోక్‌సభ ఎన్నికల ఫలితాల తెర మీద చూడవలసి ఉంది.

బంగ్లా ఎన్నికల్లో హింస



బంగ్లాదేశ్‌లో ఎన్నికల హింసాను పాశ్చాత్య దేశాలు ఖండించాయి. అక్కడ మొన్న జరిగిన ఎన్నికల్లో ప్రధాని షేక్ హసీనా పార్టీ 96 శాతం పార్లమెంటు సీట్లు గెలుచుకుంది. కాని ఈ ఎన్నికలపై అనేక ఆరోపణలు వస్తున్నాయి. భారీ ఎత్తున అవకతవకలు, అక్రమాల వార్తలు గుప్పుమన్నాయి.బ్రిటన్, యూరోపియన్ యూనియన్, అమెరికా దేశాలు అత్యంత తీవ్రమైన స్వరంతో ఈ ఎన్నికలను ఖండించాయి. అంతర్జాతీయంగా బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా ప్రతిష్ఠ అడుగంటే పరిణామాలివి. మొన్న ఆదివారం జరిగిన ఎన్నికల్లో బంగ్లాదేశ్ ప్రధాని వరుసగా మూడోసారి రికార్డు గెలుపు సాధించారు.

ప్రతిపక్షాలు ఈ ఎన్నికలను తిరస్కరిస్తున్నాయి. ఓటర్లను భయపెట్టడం, బెదిరించడం, ఒత్తిడికి గురిచేయడం వంటి చర్యలు చోటు చేసుకున్నాయని, పెద్దస్థాయిలో రిగ్గింగ్ జరిగిందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. కాని షేక్ హసీనా ఎలాంటి అవకతవకలు జరగలేదంటున్నారు. బంగ్లాదేశ్‌లో చాలా శాంతియుతంగా ఎన్నికలు జరిగాయని, ప్రజలు ఎంతో ఉత్సాహంతో తమ పార్టీకి ఓటేశారని ఆమె అంటున్నారు. కాని 300 స్థానాల సభలో 288 స్థానాలు అవామీలీగ్ సంకీర్ణానికే లభించాయంటే ఎన్నికలు ఎంత నిష్పక్షపాతంగా జరిగాయో తెలుస్తోందని విమర్శకులు అంటున్నారు. ఉత్తర కొరియా వంటి దేశాల్లో తప్ప ప్రజాస్వామిక దేశాల్లో ఇలా 96 శాతం గెలుపు ఒకే పార్టీ సాధించడం ప్రజాస్వామిక దేశాల్లో ఉండదంటున్నారు.

బంగ్లాదేశ్ రాజధాని ఢాకా నగరంలో చెదురుమదురు సంఘటనలు మాత్రమే జరిగాయి. కాని ఇతర ప్రాంతాల్లో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పక్షం దౌర్జన్యాలకు దిగిందని, బలవంతంగా ఓట్లు వేయించారని బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ ఆరోపించింది. అధికార పక్షం అవామీలీగ్ కార్యకర్తలు ప్రతిపక్షాలపై భయంకరమైన దాడులకు దిగారన్న ఆరోపణలు కూడా వస్తున్నాయి.

చూపు

ఎన్నికల్లో హింసాకాండ పెద్ద ఎత్తున జరిగిందని, ఈ ఎన్నికలు నిష్పక్షపాతంగా జరగలేదని యూరోపియన్ యూనియన్ కఠిన పదాలతో వ్యాఖ్యానించింది. ఎన్నికల్లో జరిగిన అవకతవకలు, అక్రమాలు, హింసాకాండపై విచారణ జరగాలని చెప్పింది.

బంగ్లాదేశ్‌లో అత్యధికంగా విదేశీ పెట్టుబడులు పెడుతున్న దేశం అమెరికా. అది కూడా బంగ్లాదేశ్ ఎన్నికలపై విమర్శలు జారీ చేసింది. వేధింపులు, బెదిరింపులు, హింసాకాండ ఎన్నికలకు ముందు పెద్దఎత్తున జరిగినట్లు విశ్వసనీయమైన సమాచారం తమ వద్ద ఉందని అమెరికా పేర్కొంది. ప్రతిపక్షఅభ్యర్థులు ప్రచారం చేయడం కూడా కష్టమైన పరిస్థితులు సృష్టించారని, సభలు సమావేశాలు నిర్వహించే స్వేచ్ఛ లేకుండా చేశారని అమెరికా వ్యాఖ్యానించింది. చాలా మంది ఓటు వేయకుండా అడ్డుకోవడం కూడా జరిగింది. ఎన్నికల వ్యవస్థ పట్ల ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసేలా ఈ ఎన్నికలు జరిగాయని అమెరికా విమర్శించింది.

బ్రిటన్‌కు చెందిన ఆసియా పసిఫిక్ మంత్రి మార్క్ ఫీల్ తీవ్రమైన పదాలతో బంగ్లాదేశ్ ఎన్నికలను ఖండించారు. ఎన్నికల దౌర్జన్యాలకు సంబంధించి తన వద్ద విశ్వసనీయమైన సమాచారం ఉందన్నారు. అక్రమ నిర్బంధాలు, అరెస్టులతో ప్రతిపక్షాలు ఎన్నికల ప్రచారం చేయకుండా అధికారపక్షం అడ్డుకున్న అనేక సంఘటనలున్నాయన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి వచ్చిన అన్ని ఫిర్యాదులపై తగిన విచారణ జరగాలని ఆయన డిమాండ్ చేశారు.

ఎన్నికల రోజు జరిగిన హింసాకాండలో 17 మంది మరణించారని పోలీసులు అంటున్నారు. ఈ హింసాకాండకు ప్రతిపక్షాలే కారణమని అవామీలీగ్ ఆరోపిస్తుంటే, ప్రభుత్వ పక్షం దౌర్జన్యాలకు పాల్పడిందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ప్రతిపక్ష పార్టీ బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ ప్రధాన కార్యదర్శి మీర్జా ఫక్రుల్ ఇస్లాం రిగ్గింగ్‌కు సంబంధించిన అనేక సంఘటనల నివేదికలు సేకరించి ఎన్నికల కమిషన్‌కు సమర్పిస్తామని అంటున్నారు. ఎన్నికలు మళ్ళీ నిర్వహించాలన్న డిమాండ్ బలం పుంజుకుంటోంది. మళ్ళీ ఎన్నికలు నిర్వహించాలన్న డిమాండ్‌ను కమిషన్ ఇంతకు ముందు తిరస్కరించింది.

ఎన్నికల సందర్భంగా అనేకమంది జర్నలిస్టులకు అరెస్టులు, అక్రమ నిర్బంధాలు తప్పలేదు. ఎన్నికల అవకతవకలపై అబద్ధపు వార్తలు ప్రచురిస్తున్నారంటూ జర్నలిస్టులపై అధికారులు కేసులు పెట్టి వేధిస్తున్నారు. అసమ్మతి గొంతు నులిమే కొత్త చట్టాలను ప్రభుత్వం ఇంతకు ముందే చేసి పెట్టింది. ఖుల్నా ప్రాంతంలో రిజిస్టరైన ఓటర్ల సంఖ్య కన్నా చాలా ఎక్కువ సంఖ్యలో ఓట్లు పోలయ్యాయని హిదాయత్ హుస్సేన్, రషీదుల్ ఇస్లామ్ అనే జర్నలిస్టులు బయటపెట్టారు. వారిద్దరిపై డిజిటల్ సెక్యూరిటీ చట్టం క్రింద కేసు పెట్టారు. ఈ చట్టం మొన్న సెప్టెంబరులో వచ్చింది. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని తీసుకువచ్చిన అమానుష చట్టమిది. హిదాయత్ హుస్సేన్ ఇప్పుడు నిర్బంధంలో ఉన్నాడు. రషీదుల్ ఇస్లామ్ తప్పించుకుని రహస్యంగా బతుకుతున్నాడు. ఈ జర్నలిస్టులు అబద్ధపు వార్తలతో ఎన్నికల విశ్వసనీయతను ప్రశ్నిస్తున్నారంటూ పోలీసులు వారిపై విరుచుకుపడుతున్నారు. పోలింగ్ రోజున భారీ స్థాయిలో హింసాకాండ జరిగింది. ఎన్నికల ప్రచారం కొనసాగినంత కాలం హింసాకాండ కూడా కొనసాగింది. ప్రతిపక్షాలపై వేధింపులు, ప్రతిపక్షాల కార్యకర్తల అక్రమ నిర్బంధాలు, దాడులు, దౌర్జన్యాల ఫిర్యాదులు లెక్కకు మిక్కిలి వచ్చాయి. హింసాకాండకు తమకు సంబంధం లేదని పాలకపక్షం చెబుతోంది. దక్షిణాసియాకు చెందిన ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ప్రతినిధులు కూడా హింసాకాండ, వేధింపులు జరిగాయని అంటున్నారు. ఈ ఫిర్యాదులపై తక్షణం విచారణ జరగాలని కోరుతున్నారు.

ప్రధాని షేక్ హసీనా బంగ్లాదేశ్ వ్యవస్థాపకుడు ముజీబుర్రహ్మాన్ కుమార్తె. ఆయనన్‌ను 1975లో హతమార్చారు. ఆమెకు ప్రధాన ప్రత్యర్థి ఖాలిదా జియా. గత మూడు దశాబ్దాలుగా షేక్ హసీనా బంగ్లాదేశ్ రాజకీయాల్లో చురుగ్గా ఉన్నారు. 2009 నుంచి ప్రధానమంత్రిగా ఉన్నారు. 2014లో జరిగిన ఎన్నికలను ప్రతిపక్షాలన్నీ బహిష్కరించాయి. పోటీలేని కేవలం 22 శాతం పోలింగ్ జరిగిన ఎన్నికల్లో షేక్ హసీనా గెలిచినట్లు ప్రకటించుకుని ప్రధానిగా పరిపాలించారు. ఖాలిదా జియా అవినీతి ఆరోపణలతో జైల్లో ఉన్నారు. బంగ్లాదేశ్‌తో ప్రజాస్వామ్యం కుప్పకూలిందనడానికి ఈ రెండు ఎన్నికలు ఉదాహరణలుగా చెప్పవచ్చు. ఈ ఎన్నికల తర్వాత బంగ్లాదేశ్ కేవలం ఒకే పార్టీ ప్రజాస్వామ్యంగా మారింది. అంటే నిరంకుశత్వం. బంగ్లాదేశ్‌లో ఇప్పుడు ప్రతిపక్షమే లేదు. ప్రతిపక్షం లేకుండా ప్రజాస్వామ్యం ఉండకూడదు.

* మధుసూదన్

సమాచారానికి రక్షణలేని నిఘా

'ఏ కంప్యూటర్ నుంచి వచ్చిన, స్వీకరించిన, దాచుకున్న సమాచారాన్ని అయినా అడ్డగించడానికి, పర్యవేక్షించడానికి, సంకేత లిపిని ఛేదించడానికి' పది ప్రభుత్వ సంస్థలకు అధికారం ఇస్తూ కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఇటీవల ఉత్తర్వు జారీ చేసింది. 2000 సంవత్సరం నాటి సమాచార సాంకేతికత (ఐ.టి.) చట్టం, 2009 నాటి నిబంధనల ప్రకారం ఈ ఉత్తర్వులు ఇచ్చారు. వాట్సాప్, టెలిగ్రాంవంటి విషయ ప్రసార మాధ్యమాలపై నిఘా వేసేందుకు 2011 నాటి ఐ.టి. చట్టం నిబంధనలను సవరించాలని కూడా ఆలోచిస్తున్నారు. ఈ వేదికల్లో 'చట్టవ్యతిరేక' సమాచారాన్ని ఎవరు ఉంచారో వారి 'ఆనవాళ్లు' తెలియజేయాలని కోరడానికి నిబంధనలను మార్చాలనుకుంటున్నారు. దీనివల్ల రెండువేపులా సంకేత నిక్షిప్త సందేశాల ప్రయోజనమే దెబ్బతింటుంది. వాట్సాప్ వంటి వ్యవస్థలు సమాచారాన్ని నిలవ చేసే గడువు పెంచడం కూడా ఈ సవరణల ఉద్దేశం. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాలవల్ల ప్రజలకు భయం కలిగింది. వెర్రి ఆవేశానికి లోనవుతున్నారు. దీనికి ప్రభుత్వం తనకు బాగా అలవాటైన ధోరణిలో ఈ చట్టాలు యు.పి.ఎ. హయాంలోనే వచ్చాయని షరా మామూలుగా సమాధానం ఇచ్చింది.

ఈ ఉత్తర్వునే కాదు అసలు ఐ.టి. చట్టాన్నే పునః పరిశీలించవలసిన అవసరం ఉంది. దానితో పాటు మన నిఘా విధానాన్ని కూడా పునస్సమీక్షించాలి. 2017లో పుట్టస్వామి కేసు లో న్యాయస్థానం ఇచ్చిన చరిత్రాత్మకమైన తీర్పును దృష్టిలో ఉంచుకుని ఈ పని చేయాలి. ఇన్నేళ్లుగా ప్రభుత్వం సమాచారంపై నిఘా వేయడం లేదని, అడ్డుకోవడం లేదని కాదు. మన దేశంలో ఏటా 9,000 ఫోన్ సంభాషణలను రహస్యంగా వింటున్నట్టు 2014 నివేదికలో పేర్కొన్నారు. ప్రభుత్వ ఆధీనంలోని సెంటర్ ఫర్ డెవలెప్మెంట్ ఆఫ్ టెలిమాటిక్స్ (సిడాట్) కూడా 2013లో కేంద్ర పర్యవేక్షక వ్యవస్థకు రూపకల్పన చేసింది. ఇది స్వయం ప్రతిపత్తిగల వ్యవస్థ. సిడాట్ వార్షిక నివేదికలో నిఘా పని 'సంపూర్ణమైంది' అని పేర్కొన్నారు.

ప్రజల జీవితాలు డిజిటల్ కార్యకలాపాలతో ముడిపడి పోయిన తర్వాత కంప్యూటర్లు, ఫోన్లు వారి జీవితంలో విడదీయరాని భాగాలైనాయి. ప్రభుత్వమే 'డిజిటల్ భారత్' అని ప్రచారం చేస్తున్నప్పుడు సమాచారాన్ని పరిరక్షించవలసిన బాధ్యత, గోప్యతకు విలువ ఇవ్వవలసిన బాధ్యత కూడా ప్రభుత్వానిదే. వ్యక్తుల గోప్యతను పరిరక్షించడం అవసరం తప్ప చట్టాల మీద చట్టాలు చేయడంకాదు. దేశ భద్రత సాకుతో గోప్యతను దెబ్బ తీయకూడదు. 1885 నాటి భారత టెలిగ్రాఫ్ చట్టం, 1898నాటి భారత పోస్ట్ ఆఫీసుల చట్టం, ఐ.టి. చట్టంలోని 69వ సెక్షన్ మొదలైనవన్నీ ఏదో ఒక రకంగా నిఘా వేయడానికి ఉద్దేశించినవే. ఇవన్నీ వలసవాదుల కాలం నాటివి. వీటి ప్రకారం ఏ సమాచారాన్ని అయినా అడ్డగించవచ్చు, నిఘా వేయవచ్చు, సంకేత నిక్షిప్త సమాచారాన్ని ఛేదించవచ్చు. ఇవన్నీ 'దేశ భద్రత, సార్వభౌమాధికారం, ఇతర దేశాలతో స్నేహ సంబంధాల' పేరుతోనే సాగుతున్నాయి.

సమాచారాన్ని పరిరక్షించే అంశంపై బి.ఎన్. శ్రీకృష్ణ కమిటీ 'దాపరికం ఉన్న నిఘాకు అవకాశం ఉండకూడదు. అది పుట్టస్వామి తీర్పునకు అనుకూలం. నిఘా వేయడానికి అడ్డూ ఆపు, నిఘాకు పరిమితి ఉండాలి' అని స్పష్టం చేసింది. గోప్యత, భద్రత అంశాలను పరస్పరం పోటీగా నిలబెట్టడం కొత్త కాదు. అయితే ఈ చర్చ అసంపూర్ణంగా ఉంది. సమాచారానికి రక్షణ లేనప్పుడు వ్యక్తుల గోప్యతను పరిరక్షించడం కచ్చితంగా వెనకపట్టుపడుతుంది. సమాచార రక్షణకు శ్రీ కృష్ణ కమిటీ రూపొందించిన విధంగా చట్టం ఏదైనా రావచ్చునేమో. అయితే ఈ ప్రక్రియ ఎలా ఉంటుందో మాత్రం ప్రభుత్వం చెప్పడం లేదు. న్యాయ వ్యవస్థ పర్యవేక్షణకు వీలు లేకుండా ఐ.టి. చట్టంలో అస్పష్టత ఉంటే మొత్తం వ్యవహారం దాపరికంగానే మిగిలిపోతుంది. చట్టాలతోనూ, న్యాయవ్యవస్థ పరిశీలనతోనూ నిమిత్తం లేకుండా ప్రభుత్వం ఉత్తర్వుల మీద ఉత్తర్వులు జారీ చేస్తూ ఉంటుంది.

అవసరం కొద్దీ, ఏది ఎంత మోతాదు, సరైన ప్రక్రియేనా కాదా అన్న విషయంతో సంబంధం లేకుండా ప్రభుత్వం ఆచరణలో సకల నియమాలనూ ఉల్లంఘిస్తూ ఏకమొత్తంగా నిఘా వేయడానికి ప్రయత్నిస్తే ప్రజలకు ప్రభుత్వం మీద విశ్వాసం తగ్గుతుంది. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఉత్తర్వులో సరిగ్గా ఇదే ప్రమాదం పొంచి ఉంది. జాతీయ భద్రత పేరుతో భారత ప్రభుత్వం ఇటీవల అనేక ఉత్తర్వులు జారీ చేసింది. ప్రశ్నార్థకమైన అనేక చర్యలు తీసుకుంది. ఆధార్ కార్డు వ్యవహారం, పెద్ద నోట్ల రద్దు మొదలైన అంశాలలో వ్యక్తుల ప్రైవేటు జీవితంలోకి తొంగి చూసే చర్యలు తీసుకుంది. ప్రభుత్వం ప్రజల విషయంలో దాపరికం లేకుండా పని చేసే అవకాశం కనిపించడం లేదు.

విషయ ప్రసారంలో సాంకేతిక మార్పులు వచ్చిన తర్వాత భారత టెలిగ్రాఫ్ చట్టాన్ని ఆమోదించినప్పటి నుంచి పరిస్థితి సమూలంగా మారిపోయింది. మనం మునుపటి కన్నా చాలా మందితో సమాచారం ఇచ్చి పుచ్చుకుంటున్నాం. ఇదివరకు ఎన్నడూ లేనంత మందితో సంబంధాలు పెట్టుకుంటున్నాం. ఫోన్లు, కంప్యూటర్లు, ఇంటర్‌నెట్ పుణ్యమా అని మనం వాటిని సందేశాలు, సమాచారాలు పంపడానికో మాత్రమే వినియోగించుకోవడం లేదు. మన వ్యక్తీకరణకు, మన నిత్యజీవితంతో అవి అవిభాజ్యం అయిపోయాయి. అందువల్ల ఒక వ్యక్తి ఫోన్లను, కంప్యూటర్లను, వాటిలోని సమాచారాన్ని ప్రభుత్వ వ్యవస్థలు గమనించవచ్చు, చూడవచ్చు, నిఘా వేయవచ్చు అంటే ప్రజల జీవితాల్లో జోక్యం చేసుకోవడమే. మనం మాట్లాడతాం, చదువుతాం, పని చేస్తాం, బ్యాంకు పనులు చేస్తాం, మన భావాలు వ్యక్తం చేస్తాం, నిరసన తెలియజేస్తాం, అసమ్మతి వ్యక్తం చేస్తాం. వీటన్నింటికీ ఫోన్లు, కంప్యూటర్లు వినియోగించుకుంటాం.

ప్రస్తుతం చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, ప్రమాదాలు కూడా ఈ డిజిటల్ పరికరాల ఆధారంగానే జరుగుతున్నాయి. అయితే ప్రభుత్వం వీటిని విస్తారంగా అణచి వేయడం, నిఘా వేసి ఉంచడం అంటే ప్రభుత్వం సర్వాంతర్యామి అవతారమెత్తి పెద్దన్న పాత్ర పోషించడమే. భారత నిఘా వ్యవస్థ స్వరూపమే సమగ్రంగా మారాల్సిన అవసరం ఉంది. గోప్యతకు భంగం కలగకూడదు. పుట్ట స్వామి కేసులో న్యాయస్థానం ఇచ్చిన తీర్పు అమలులోకి రావాలి. సమాచార పరిరక్షణకు చట్ట రీత్యా రక్షణ ఉండాలి.

* (ఇ.పి.డబ్ల్యు.సౌజన్యంతో)

సామాజిక విప్లవ కారిణి

మహాత్మ జ్యోతి బా పూలే భార్య సావిత్రి బాయి పూలే పేద ప్రజల, ముఖ్యంగా స్త్రీల విద్యాభివృద్ధికై కృషి చేసిన ఉద్యమకారిణిగా, భారతదేశంలో మొట్టమొదటి ఉపాధ్యాయురాలుగా, స్త్రీ విముక్తి పోరాట నాయకురాలుగా, కవయిత్రిగా, కులం పితృస్వామ్యం అనే శక్తులపై యుద్ధానికి పూనుకున్న సాహసిగా ఒక స్వతంత్ర అస్తిత్వాన్ని నిర్మించుకున్న వ్యక్తి. ఈమె మహారాష్ట్ర సతారా జిల్లాలోని నయాగావ్ అనే గ్రామంలో 1831 జనవరి 3 న జన్మించారు. వీరిది రైతు కుటుం బం. మహారాష్ట్రలో పూలే దంపతులు నివసించిన కాలం నాటికి మత, రాజకీయ, సామాజిక వ్యవస్థలన్నీ బ్రాహ్మణీయ, అగ్రవర్ణ భూస్వామ్య శక్తుల ఆధీనంలో ఉన్నాయి. శక్తిమంతంగా నిర్మితమైన కులవ్యవస్థ పీడిత కులాల మీద పెత్తనం చేస్తూ వాళ్ళ శ్రమనూ, అజ్ఞానాన్ని, మత విశ్వాసాలనూ ఆధారం చేసుకొని దోపిడీకి పాల్పడుతూ ఉంది. అన్ని కులాల, వర్గాల స్త్రీల జీవితాలూ హీనమైన పరిస్థితుల్లోనే ఉన్నాయి. వాళ్ళను కనీసం వ్యక్తులుగానైనా గుర్తించని సమాజం, స్త్రీల ను కుటుంబాలకు చెందిన ఆస్తులుగా, భౌతిక, లైంగిక, ఆర్థిక ప్రయోజనాలను అందించే యంత్రాలుగా పరిగణిస్తుంది. సామాజిక జీవితంలో వాళ్ళకే మాత్రమూ స్థానం లేదు. ఇక శూద్రులకు, అతి శూద్రులకు ఆ సమాజంలో చదువుకునే హక్కు లేదు. శూద్రుడైన జ్యోతి బా పూలే విద్యాభ్యాసం చెయ్యగలగటమనేది ఆనాటికి ఒక విచిత్రమే.



బాపూకు పదమూడేళ్ళ వయసులో సావిత్రీ బాయితో వివాహం జరిగింది. చిన్న వయసు నుండే బాపూలో విద్యను గురించి ముఖ్యంగా స్త్రీలకు విద్యావకాశాలను గురించి విప్లవాత్మకమైన ఆలోచనలుండేవి. ఇంటి బాధ్యతలను కొంత తగ్గించుకొని చదవటమూ, రాయటమూ నేర్చుకోమని సావిత్రీ బాయిని ఆయన ప్రోత్సహించసాగాడు. ఆమెకు మొదటి గురువు ఆయనే. సమాజంలో తీవ్ర వివక్షకు, అన్యాయాలకు గురవుతున్న మహిళలు వాటి నుండి బయట పడాలంటే వారికి చదువొక్కటే మార్గమని భావించి బాలికల కోసం పాఠశాలలను ప్రారంభించాలని బాపూ దంపతులు నిర్ణయించుకున్నారు. ముఖ్యంగా ఆడపిల్లలను చదివించటం కోసం డబ్బు వెచ్చించలేని శూద్ర, అతి శూద్ర కుటుంబాలకు ఉపయోగపడేందుకు పాఠశాలలు స్థాపించాలన్నది వాళ్ల లక్ష్యం. అయితే విద్యా సంబంధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నందుకు మరీ ముఖ్యంగా స్త్రీ విద్యను ప్రోత్సహిస్తున్నందుకు బాపూ దంపతులు తీవ్ర ప్రతిఘటనను ఎదుర్కోవాల్సి వచ్చింది. బ్రాహ్మణీయ సంప్రదాయాలు, ధర్మ శాస్త్రాలూ స్త్రీలు చదువుకోవటాన్ని నిషేధించాయి. స్త్రీలు విద్యావంతులైతే పరాయి వాళ్ళకు ఉత్తరాలు రాసే ప్రమాదం ఏర్పడుతుందనీ, చదువుకున్న స్త్రీ పాప ఫలితంగా ఆమె భర్త తినే అన్నం పురుగులుగా మారిపోతుందనీ, అతను రోగగ్రస్థుడై అకాల మరణం పాలవుతాడనీ ఎన్నెన్నో నమ్మకాలు ప్రచారంలో ఉండేవి. అయితే పూలే దంపతులకు అటువంటి మూఢనమ్మకాలపై తీవ్ర వ్యతిరేకత ఉండేది. మానవులందరిని కుల చట్రాల నుండి, పితృస్వామ్య ఆధిపత్యం నుండీ విముక్తి చెయ్యాలనేది వారి స్వప్నం. దానికిగాను అందరినీ విద్యావంతులను ముఖ్యంగా స్త్రీలను విద్యావంతులుగా చేయాలని నిర్ణయించుకున్నారు. ఇందుకు మహిళా ఉపాధ్యాయుల అవసరం ఉండటంతో ముందుగా పూలే తన భార్య సావిత్రి బాయికి ఉపాధ్యాయినిగా శిక్షణనిచ్చి బాలికా పాఠశాలను ప్రారంభించాలని నిర్ణయించుకున్నాడు.

1848లో పూనేలోని ఒక ఇంట్లో బాలికా పాఠశాల ప్రారంభమైంది. తొమ్మిది మంది విద్యార్థినులు అందులో చేరారు. సావిత్రి బాయి ఆ స్కూల్‌కు ప్రధానోపాధ్యాయిని. అయితే బాలికల కోసం పాఠశాలను నిర్వహిస్తున్నందుకు అగ్రవర్ణాల ఛాందసుల నుండి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొన్నారు ఈ యువ దంపతులు. పాఠశాలకు వెళ్ళే దారి పొడవునా సావిత్రి బాయికి ప్రతిరోజూ వేధింపులు ఎదురయ్యేవి. వీధిలో నడిచి వెళ్తున్న ఆమె మీద జనం రాళ్ళు, మట్టి, బురదా విసిరేవారు. స్త్రీ విద్యా వ్యతిరేకులైన ఛాందస పురుషులు గుంపుగా నిలబడి ఆమెను అసభ్య పదజాలంతో దూషించే వారు. ఆమె పాఠశాలకు వెళ్ళేటప్పుడు పాత చీర ధరించి, మరొక చీరను వెంట తీసుకెళ్లేది. దారిలో ఛాందసులు చల్లిన బురదతో మలినమైన చీరను పాఠశాలకు వెళ్ళి న తర్వాత మార్చుకునేది. తర్వాతి కాలంలో వాళ్ళ విద్యా ప్రచారోద్యమానికి కొంత సహకారం లభించింది. కొందరు శ్రేయోభిలాషులు అవసరమైన పుస్తకాలను సమకూర్చారు. పూలే దంపతులు ఎటువంటి వేతనాన్ని ఆశించకుండా సంస్థ బాధ్యతలు నిర్వహించేవారు. విద్యార్థినులపై సావిత్రీ బాయి ప్రభావం బలంగా ఉండేది. ఆమె దగ్గర చదువుకునే ముక్తాబాయి అనే పదకొండేళ్ళ దళిత బాలిక ఆనాటి సమాజంలో అస్పృశ్యులపై బ్రాహ్మణీయ మత సంస్కృతులు చేసే పెత్తనాన్ని, అవమానాలను విమర్శిస్తూ అద్భుతమైన వ్యాసం రాసిందంటే వారి బోధన పద్ధతి అర్థం చేసుకోవచ్చు. ఆ వ్యాసాన్ని ధ్యానోదయ అనే పత్రిక ప్రచురించినది. స్కూళ్ళలో విద్యార్థుల సంఖ్యను పెంచడానికి మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించారు పూలే దంపతులు. నేటికీ ప్రభుత్వాలు ఈ పథకాన్ని అమలు చేస్తున్నారంటే పూలే దంపతుల ముందు చూపు అర్థం చేసుకోవచ్చు. బాల్య వివాహాల వల్ల వయసులో పెద్దవాళ్ళయిన భర్తలు కొన్నాళ్ళకే మరణించటంతో ఎందరో బాలికలు, యువతులూ వితంతువులవటం సర్వసాధారణమైపోయేది ఆరోజుల్లో. వితంతువులు ఎంత చిన్న వయసువారైనప్పటికీ వాళ్ళ మీద సాంఘిక దురాచారాలు అమలవుతూనే ఉండేవి. ఈ విధంగా నిస్సహాయులైన స్త్రీలను కుటుంబాల్లో పురుషులు తమ అవసరాలకు వాడుకుంటున్నా ఎదురుచెప్పేవాళ్ళులేని పరిస్థితులున్నాయి. నిర్బంధ లైంగిక సంబంధాలతో గర్భవతులయ్యే అమాయక యువతులు సంఘం ముందు నేరస్థులుగా నిలబడేవారు. ఎందరో వితంతువులు విధిలేని పరిస్థితుల్లో భ్రూణ హత్యలకు పాల్పడి మరణిస్తుండేవారు. ఈ ప్రమాదాల నుండి వితంతువులైన తల్లులను రక్షించేందుకు పూలే దంపతులు 1853లో ఒక శరణాలయాన్ని స్థాపించారు. తమ శరణాలయాన్ని గురించి ప్రచారం చెయ్యటంతో బాటుగా స్త్రీల మీద జరుగుతున్న దురాచారాలను తీవ్ర పదజాలంతో విమర్శిస్తూ కరపత్రాలను ముద్రించి పంచేవారు. వారు చేపట్టిన ఈ ప్రచార కార్యక్రమం కారణంగా అనేక మంది స్త్రీలు, పిల్లలూ అకాల మరణాల నుండి బయటపడ్డారు. తమ శరణాలయానికి వచ్చి చేరిన స్త్రీలందరినీ సావిత్రీ బాయి మాతృ హృదయం అక్కున చేర్చుకుంది. ఇలా ఈ శరణాలయానికి వచ్చిన ఒక బ్రా హ్మణ వితంతువుకు పుట్టిన బాలుడినే పూలే దంపతులు దత్తత తీసుకున్నారు. వితంతువులకు శిరోముండనం చేయబోమంటూ క్షురకులు తిరుగుబాటు చేసేట్టుగా వాళ్లను చైతన్యపరచి 1860లో ఒక సమ్మెను నిర్వహింప చేసింది సావిత్రి బాయి. ఇది ఆ రోజుల్లో ఒక గొప్ప సంచలనం.

* సాసాల మల్లికార్జున్

8328210190

సకుటుంబం

అదుపులో ఉంటే ఆనందమే...!

కొత్త ఏడాది వచ్చిన ప్రతి సారి చాలా మంది ఏదో ఒక సరికొత్త నిర్ణయం తీసుకుంటారు. దానిని ఎందరు అమలు చేస్తారు ఎందరు అమలు చేయరు అనే విషయం పక్కన పెడితే, మన ఆరోగ్య దృష్ట్యా అందరూ అలవరుచుకోవాల్సిన కొన్ని మంచి అలవాట్లను తెలుసుకుందాం...

'జీవితం సఫలం' అని మనం అనుకున్నది సాధించిననాడు భావిస్తాం. ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలని ప్రతి ఒక్కరం కోరుకుంటాం. దానికి మనం వేసే ప్రతి అడుగు తరచి చూసుకోవాల్సిన పనిలేదు. మన జీవన విధానంలో కొన్ని నియమాలు పాటిస్తే చాలు. అందుకు పట్టుదల కావాలి. గమ్యానికి చేరాలంటే ఎన్నో అడ్డంకులను అధిగమించాలి. అందుకు ప్రారంభంలో తప్పటడుగులు పడకుండా గాడిలో పెట్టాలి. మానవ జీవితం ఆనందకరం కావాలంటే కొన్ని కూడికలు, తీసివేతలు చేయాలి. తగిలించుకోవాల్సినవి ఉంటాయి. వదిలించుకోవల్సినవీ ఉంటాయి. ప్రతీ ఒక్కరూ వ్యక్తిగతంగా ఎవరికి వారు తమ ఆలోచనలు అంచనాలు నిర్ణయించుకోవాలి. అప్పుడే జీవన గమ్యాన్ని చేరగలరు.

అలాగే ఒక చిన్న ప్రారంభంలోనే వడి వడి అడుగులు పడతాయి. ముందుగా ఆరోగ్యం బాగుండాలంటే ఆహారం తాజాగా తీసుకోవాలి. కేవలం ఆకలి తీర్చుకోవడమేగా అనుకోకూడదు. కూరగాయలు అధికంగా తీసుకోవాలి. ఫ్రిజ్‌లో ఉంచిన నిల్వ పదార్థాలు,కూరగాయలు తినడం వీలయినంతవరకూ తగ్గించాలి. అల్పాహారంతో రోజు ప్రారంభమవ్వాలి. ఆ తర్వాత మధ్యాహ్నం లో భోజనం నిండుగా తీసుకోవచ్చు. రాత్రి వీలయినంత తొందరగా ఆరు ఏడు గంటల మధ్య భోజనం తక్కువగా తీసుకోవాలి. మధ్యలో పాలు, పండ్లు, తీసుకోవాలి. ప్రతీ భోజనానికి కనీసం 4 గంటల వ్యవధి ఉండాలి. ఆహారం తర్వాత ముఖ్యమైనది వ్యాయామం.

నేటి ఆధునిక జీవనంలో వ్యాయామం ప్రతి ఒక్కరికి తప్పనిసరి. పూర్వం శారీరకంగా ఎక్కువగా కష్టపడేవారు. వారి జీవన విధానమే వ్యాయామం. బియ్యం దంచడం, కూరలు స్వయంగా పండించడం, ఆవులు,గేదెల నిర్వహణ, సైకిలింగ్ లేదా నడక, శారీరక శ్రమ, పొలం పని ఇలా ఉండేది.

కాని నేటి ఆధునిక జీవనంలో శారీరక శ్రమ తగ్గిపోవడం వల్ల తరుచూ అనారోగ్య సూచికల కొత్త కొత్త వ్యాధులు కనిపిస్తున్నాయి. రోజూవారి వ్యాయామంలో నడక ముఖ్యమైనది. కనీసం 20 నుంచి 40 నిమిషాలు నడక ప్రతిరోజూ అలవాటు చేసుకోవాలి. అలాగే యువత వారానికి కనీసం కొన్ని గంటలు జిమ్‌కు వెళ్లాలి. నడక, జాగింగ్, తోటపని మెట్లు ఎక్కడం, వ్యాయామంలో భాగమే చిన్న చిన్న దూరాలకు వాహనాలను ఉపయోగించకపోవడం మంచిది. నేటి అపార్టుమెంట్ జీవనంలో లిఫ్ట్‌ని నివారించి



వీలయినంత వరకు మెట్లు ఉపయోగించాలి.

మన రోజువారీ జీవితంలో స్మార్ట్ ఫోన్, కంప్యూటర్లు సాధారణమయ్యాయి. వీలైతే వాటిని తగ్గించాలి. అసలు వాడకూడదని కాదు. అవసరానికి మాత్రమే ఉపయోగించాలి. నిద్ర లేవగానే మొదట ఫోన్‌ను చూడటం నేటి యువతలో సాధారణమైంది. రోజులో కొంత సమయం ముఖ్యంగా విశ్రాంతి సమయంలో ఫోన్, కంప్యూటర్లను దూరంగా ఉంచాలి. వీటివల్ల నిద్రకు కూడా భంగం అవుతుంది. 24 గంటలూ వీటిని 'ఆన్'లో ఉంచి మధ్య మధ్యలో వాటిని ఉపయోగిస్తుంటారు.

ప్రతి మనిషి ఆరోగ్యకరంగా ఉండాలంటే కనీసం 7–8 గంటలు నిద్ర పోవాల్సి ఉంది. ఆ సమయంలో ఎటువంటి అంతరాయం ఉండకూడదు. బెడ్ రూంలో పరిసరాలు ఆహ్లాదకరంగా ఉండాలి. కిటికీ కర్టెన్ల నుంచి వెలుగు బెడ్‌పై పడేలా ఉండకూడదు. అది నిద్రకు భంగమవుతుంది. కుటుంబంతో కలిసి భోజనం చేయడం అత్యంత ముఖ్యమైనది. అప్పుడు కుటుంబ సభ్యులందరూ ఒకే చోట కలిసే సమయం. అప్పుడే ముఖ్యమైన నిర్ణయాలు తీసుకుంటారని అనుభవజ్ఞులు, మానసిక నిపుణులు చెబుతారు. ఆ సమయాన్ని ఫోన్ పట్టుకోవడం, టీవీ చూడడం చేయరాదు. మనం తినే పదార్థాల మీద దృష్టి పెట్టాలి. ఇష్టంగా తింటే అవి శరీరానికి పడతాయని పెద్దలు చెబుతారు. ఆ సమయం ఆహ్లాదంగా ఉండేలా సభ్యులందూ చూడాలి.

ఇటీవల ప్రతి వారు తీపి పదార్థాలు ఎక్కువ తినవద్దని ఉచిత సలహాలు ఇస్తున్నారు. అలాగే మధుమేహ వ్యాధి బాధితులు కూడా అధికంగా ఉంటున్నారు. తీపి అసలు తినవద్దని కాదు. అతిగా తినకూడదు. కొవ్వు క్యాలరీలు అధికంగా ఉన్న తీపి పదార్థాలు తక్కువగా తినడం మేలు. శరీర బరువు మీద కూడా దృష్టి ఉంచాలి. ముఖ్యంగా మహిళల తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రతిరోజు బరువు చూసుకోవడం అలవాటు చేసుకోవాలి. బరువు పెరిగిన తర్వాత అదుర్దా పడి వ్యాయామం పెంచడం, ఆహారాన్ని పూర్తిగా తగ్గించడం కన్నా రోజు చూసుకుంటే వెంటనే జాగ్రత్త తీసుకునే అవకాశం ఉంది. కొంత మంది బరువు చెప్పడం, చూసుకోవడం సిగ్గు పడతారు. బరువు అదుపులో ఉంటే అన్ని బాగుంటాయి. వయసును బట్టి ఎంత బరువు ఉండాలో వైద్యులు నిర్ణయించారు. ఆ చార్టును ఇంటిలో వేలాడ తీయాలి.

నేటి జీవనంలో సోషల్ మీడియా ప్రధానంగా ప్రభావితం చేస్తుంది. ఫేస్‌బుక్, వాట్సాప్, యూట్యూబ్ వంటివి జీవన విధానాన్ని నిర్దేశించే పరిస్థితి కల్పిస్తున్నాయి. ఆ సమయాన్ని తగ్గించాలి. అవసరానికి మాత్రమే ఉపయోగించాలి

తప్ప కాలక్షేపం కోసం వాడరాదు. వాహనాల మీద వెళ్ళేవారు ఇయర్‌ఫోన్స్ పెట్టుకుని మాట్లాడుతూ వెళుతుండడం మనం చూస్తునే ఉన్నాం. ఎన్ని సూచనలు, హెచ్చరికలు చేసినా ఆ అలవాటును తప్పించలేకపోతున్నాం. దీని వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. చిన్న పొరబాటుకు విలువైన జీవితాన్ని యువత కోల్పోతోంది. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో పాటు 'సెల్ఫ్ డిసిప్లెన్' అలవరుచుకోవాలి. కంప్యూటర్లను నేటి సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు రోజుకు 10 నుంచి 14 గంటలపాటు వాడుతున్నారు.

ఉద్యోగ ధర్మంలో తప్పనిసరి అయినా అవసరం అయినప్పుడే తగిన జాగ్రత్తలు తీసుకుని వాడుకోవాలి. కంప్యూటర్ ఉపయోగించేటప్పుడు గంటల తరబడి కూర్చుంటారు. అది కూడా అనారోగ్య హేతువు. ఇంట్లో కూడా కొంత మంది కదలకుండా సోఫాలో కూర్చుని గంటల తరబడి టీవీలు చూస్తుంటారు. గంట, రెండు గంటల కొకసారి నిలబడాలి. లేదా అటు ఇటూ పచార్లు చేయాలి. లేకపోతే భవిష్యత్తులో స్పాండిలైటిస్ అనే వ్యాధి బారినపడతారు. ముఖ్యంగా లాప్‌టాప్, కంప్యూటర్లు వాడే సాఫ్ట్‌వేర్, పత్రికల ఉద్యోగస్తులు ఈ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి.

మన భారతీయ జీవనంలో ధ్యానం ప్రధానమైంది. నేడు ధ్యానం, యోగా, అంతర్జాతీయంగా మనదేశ ప్రతిష్టను పెంచుతున్నాయి.

ప్రతి మనిషి కనీసం 5– 10 నిమిషాల సేపు ధ్యానం చెయ్యాలి. అందుకే కార్పొరేట్ కంపెనీలు తమ ఉద్యోగుల ఆరోగ్యానికి ''మెడిటేషన్ అవర్'' అంటూ సమయం కేటాయిస్తున్నారు. నిపుణులతో శిక్షణ, ఉపన్యాసాలు ఇప్పిస్తున్నారు. ధ్యానం, యోగా వల్ల ఒత్తిడి తగ్గుతుంది. పాజిటివ్ దృక్పథం అలవడుతుంది.

ఆందోళన కలిగించే విషయం మీద మనస్సు లగ్నం అయితే వెంటనే ఆలోచన మార్చుకోవాలి. అప్పుడు ఒత్తిడి తగ్గి మనస్సు కుదుటపడుతుంది.

'పెద్దల మాట చద్దిమూట'' అన్న చందంలో ఉదయాన్నే నడక వల్ల మనం కోల్పోయే విటమిన్లు సూర్యరశ్మి వల్ల లభిస్తాయని చెబుతారు. అలాగే ధ్యానం వల్ల మనిషి ఆలోచనల్లో మార్పు వస్తుంది. ఆవేశం తగ్గిస్తుంది.

తొందరబాటు అలవడదు. యోగా వల్ల శరీరం లోని అవయవాల్లో రక్తప్రసరణ జరిగి ఆరోగ్యం బాగుంటుంది. శారీరక శ్రమ అంటే తోటపని, నడక, కొద్దిపాటి వ్యాయామం కూడా రక్తపోటు, మధుమేహాలను దూరం ఉంచుతుంది. ఆనంద తీరాలకు చేరాలంటే కొద్దిపాటి నియమాలతో కూడిన జీవన విధానం అలవర్చుకోవాలి. అప్పుడే ఆరోగ్యం,ఆనందం జీవితంలో తొంగి చూస్తాయి. మరీ బీ రెడీనా..

స్నేహితులే సభ్యులయితే..!



ఆఫీసుల్లో టీమ్ వర్క్ చేయాల్సి రావడం అనేది తప్పనిసరి. అయితే ఆ బృందంలో అంతగా పరిచయం లేని వాళ్లు ఉండటం కన్నా స్నేహితులు ఉన్నప్పుడు ఫలితాలు బాగుంటాయని పరిశోధకులు పేర్కొంటున్నారు. స్నేహితులు కావడం వల్ల ఎలాంటి అమరికలూ లేకుండా హాయిగా ఆడుతూ పాడుతూ సరదాగా ఉంటారనీ అదే సమయంలో సమన్వయంతో పని చేస్తారనీ, ఫలితంగా మంచి ఉత్పత్తి వస్తుందనీ, అదే అపరిచితులు ఉన్నప్పుడు వాళ్ల మధ్య ఒకలాంటి తెలియని ఇబ్బంది ఉండటంతో దాని ప్రభావం పనితీరుమీదా ఉంటుందని చెబుతున్నారు. ఇందుకోసం వీళ్లు సుమారు నాలుగువేల మందిని దాదాపు వెయ్యి విభాగాలుగా విభజించి మరీ పరిశీలించారట. అంతేకాదు, వీళ్లందరిమీద విడివిడిగా జరిపిన అనేక అధ్యయనాలనూ పరిశీలనలోకి తీసుకున్నారు. అయితే అన్నింటిలోకీ స్నేహితులు ఎక్కువగా ఉన్న బృందాలు చేపట్టిన ప్రాజెక్టుల ఫలితాలు బాగున్నట్లు తేలింది. దీన్ని బట్టి ఆఫీసుల్లో స్నేహితుల్నే టీమ్‌లుగా ఏర్పాటు చేసి పని అప్పగించడం వల్ల మంచి ఫలితాలు వస్తాయన్నమాట.

వ్యాధినిరోధకశక్తిని పెంచేవి



చలికాలంలో జలుబు, దగ్గు వంటివి మామూలే. వాటిని తగ్గించి, శరీరాన్ని వెచ్చగా ఉంచే పదార్థాల గురించి తెలుసుకుందామా...

దాల్చిన చెక్క: ఇది జీవక్రియలను వేగవంతం చేసి శరీరంలోని వేడిని పెంచుతుంది. వీటిని ప్రతిరోజూ టీ తోపాటు లేదా కూరల్లో కొద్దిగా వేసుకోవచ్చు.

అల్లం: వ్యాధినిరోధక శక్తిని పెంచుతుంది. అయితే తక్కువ మోతాదులో తీసుకుంటే మేలు. ఇది జలుబు, దగ్గుని నివారిస్తుంది.

మిరియాలు: వీటిలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలం. వేడి పాలలో మిరియాల పొడి వేసుకుని తాగితే జలుబు త్వరగా తగ్గిపోతుంది.

పాతవాటితో..కొత్తదనం



ఇంట్లో వాడుకొనే పింగాణి కప్పులు, ప్లాస్టిక్ డబ్బాలు పగిలితే పడేస్తుంటాం. ఆ పగిలిపోయిన వాటితో కొన్ని మార్పులు చేస్తే అవే కొత్త వాటిలా ఇంటికే అందాన్ని తీసుకొస్తాయి. సోఫాలు, మంచాలు వాడకుండా ఉంటే వాటిమీద పలుచటి ప్లాస్టిక్ షీట్స్ వేయాలి. దుమ్ము, ధూళీ ఏదైనా ఉంటే ఆ షీట్ మీదనే పడుతుంది. మంచం కావాలంటే షీట్ తీసేయవచ్చు. సోఫా మీద అలాగే ఉన్నా అందంగా ఉంటుంది.



ఎక్కువ విలువైన ప్లాస్టిక్ పూలు, పూల కుండీలు కొనడం ఆపేయండి. చిన్నచిన్న మట్టి కుండీలు తీసుకొని నచ్చిన విధంగా పెయింట్ వేసి, ఇంటి లోపల పెంచుకునే మొక్కలను నాటాలి. ఈ కుండీలను గదుల మూలల్లో పెట్టుకుంటే ఇంటి అందాన్ని రెట్టింపు చేస్తాయి. ప్రతీ గదిలో ఒక చెత్త బుట్ట పెట్టుకోవడం మంచిది. చెత్త, చెదారం, కాగితం ముక్కలు ఎక్కడపడితే అక్కడ పడేయకుండా చెత్త బుట్టలో వేసేలా అలవాటు చేసుకోవాలి. చెత్త బుట్టలకి పెయింటింగ్ వేసుకుంటే ఖరీదైన వస్తువుగా కనబడుతాయి. పగిలిన పింగాణి కప్పులు, ప్లాస్టిక్ డబ్బాలను పారేయకుండా పగుళ్ల చోట పెయింట్ వేసి వాటిని మట్టితో నింపాలి. ఇందులో చిన్నచిన్న మొక్కలు నాటుకుంటే వాటి అందం ముందు ఖరీదైన ఫ్లవర్‌వాజులు కూడా పనికిరావు. ప్రతీ ద్వారానికి కర్టెన్ ఉండేలా చూసుకోండి. లేత రంగులో ఉండి ట్రాన్సపరెంట్‌గా ఉంటే ఇంటికి మరింత అందం వస్తుంది.

అరటితో ముడతలు మాయం

ఇంటా బయటా ఒత్తిడి. దీనికి తోడు కాలుష్యం. దాంతో శరీరం చిన్న వయస్సులోనే వడలిపోవడం, ముడతలు పడటం జరుగుతుంది. అలాంటిది వయసు మీద పడుతుంటే... ఇక, చెప్పేదేముంది... అందుకే ఈ హెర్బల్ మాస్కులు ట్రై చేయండి..



దాల్చిన చెక్కలో వయసు మీద పడనీయని గుణాలెన్నో. ముఖ్యంగా ఇది చర్మంలో సాగే గుణం తగ్గకుండా చేస్తుంది. టీస్పూను దాల్చిన చెక్క పొడిలో టేబుల్‌స్పూను తేనె వేసి బాగా కలిపి ముఖానికి మాస్క్‌లా వేసి గోరువెచ్చని నీటితో కడిగేయాలి.

* అరటిపండు ముడతల్ని అద్భుతంగా మాయం చేస్తుంది. ఒక అరటిపండు గుజ్జులో టేబుల్‌స్పూను చొప్పున ఓట్స్ పొడి, తేనె, మీగడ కొబ్బరి నూనె కలిపి ముఖానికి పట్టించి మర్దన చేసి ఓ అరగంట ఉంచి కడిగేయాలి.

* అతినీలలోహిత కాంతి కారణంగా దెబ్బతిన్న చర్మాన్ని పసుపులోని గుణాలు బాగుచేస్తాయి. అరటీస్పూను పసుపులో టేబుల్‌స్పూను తేనె కలిపి ఓ చుక్క నిమ్మ గాఢతైలాన్ని కూడా కలిపి ముఖానికి పట్టించి, పది నిమిషాల తరవాత కడిగేయాలి.

* వేల సంవత్సరాల నుంచీ ఆయుర్వేదంలో వాడే అల్లంలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఎక్కువ. ఇవి ఒత్తిడి కారణంగా చర్మం దెబ్బతినకుండా చేస్తాయి. రెండు టేబుల్‌స్పూన్ల ఆలివ్‌నూనె లో 4 టేబుల్ స్పూన్ల ముడి పంచదార, టేబుల్‌స్పూను అల్లం తురుము వేసి మెత్తగా నూరాలి. ఈ పేస్టుని ముఖానికి స్క్రబ్ మాదిరిగా రుద్ది, పది నిమిషాల తరవాత గోరువెచ్చని నీటితో కడిగేయాలి.


మన రంగవల్లులు

18 చుక్కలు
6 వరుసలు
6 వచ్చేవరకు




డి.వీణ
హైదరాబాద్

21 చుక్కలు
6 వరుసలు
5వచ్చేవరకు




యం. మణెమ్మ
నాగర్‌కర్నూల్.

21 చుక్కలు
1వచ్చేదాకా
సరిచుక్క



టి. గోవిందమ్మ
సిరిసిల్ల



పి.వి.ఎల్. సుజాత
సికింద్రాబాద్.



అనుమానాస్పదంగా ఇద్దరు యువతుల ఆత్మహత్య



మన తెలంగాణ/భద్రాది కొత్త గూడెం/చర్ల : ఇద్దరు యువతులు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలో బుధవారం చోటు చేసుకుంది. విజయకాలనీకి చెందిన శ్యామల సంగీత (16), లక్ష్మీ కాలనీకి చెందిన మడివి జానకీ (18) బతుకు దెరువుకోసం కూలీ పనులకు వెళ్లేవారు. వీరిరువురూ గత ఐదు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్ళిపోయి ఇంకా తిరిగి ఇంటికి రాకపోవడంతో విషయం తెలుసుకున్న తల్లిందండ్రులు వారి ఆచూకీ కోసం వెతుకులాడగా మొగళ్లపల్లి గోదావరి లంక భూముల సమీపంలో పిట్టల మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయారు. ఈ విషయాన్ని గమనించిన ఇద్దరు యువకులు చర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. ఈ విషయాన్ని యువతుల తల్లి, దండ్రులకు సమాచారం ఇచ్చారు. ఆసుపత్రిలో సంగీత, జానకీల పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రాథమిక చికిత్స అనంతరం వారిద్దరినీ భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో వైద్యులు చేయిదాటిపోయింది. ఇదిలాఉండగా ఈ ఇద్దరు యువతులు ఎందుకు ఆత్మహత్య చేసుకున్నారో అంతుచిక్కడం లేదు. వీరి ఆత్మహత్యపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వీరిద్దరూ వరుసకు వదినా మరదళ్లు అని గ్రామస్థులు తెలిపారు. ఆత్మహత్యకు పాల్పడిన సంగీతకు తండ్రి లేరు తల్లి పార్వతి ఉంది. మరో అమ్మాయి జానకీకి తల్లి దండ్రులు అర్జున్, సోని ఉన్నారు. యువతుల తల్లి, దండ్రులు ఈ ఘటనపై అయోమయంగా ఉన్నారు. ఇంట్లో నుంచి వెళ్లిన తర్వాత అపస్మారక స్థితి లోనే ప్రత్యక్షమయ్యారని వారు రోదిస్తూ తెలిపారు.

మెంతో ప్లస్ మింగి చిన్నారి మృతి

మొదటి పుట్టిన రోజు జరుపుకున్న మర్నాడే విషాదం

మన తెలంగాణ/మెదక్ జిల్లా ప్రతినిధి : మెంతోప్లస్ మింగి ఓ చిన్నారి మృతిచెందిన సంఘటన విషాధాన్ని కలిగించింది. బుధవారం మెదక్ జిల్లా పాపన్నపేట మండల పరిధిలోని కొడపాక గ్రామానికి చెందిన చాకలి దమ్మురాజు, యశోదల కుమార్తె బిందు(ఒక సంవత్సరం) బుధవారం ఇంట్లో ఆడుతూ పాడుతూ మెంతో ప్లస్ బామ్ మింగడంతో హుటాహుటిన మెదక్ ఆసుపత్రికి తరలించగా అక్కడి వైద్యులు హైదరాబాద్‌కు తరలించాలని చెప్పడంతో హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందింది. బిందు మొదటి పుట్టిన రోజు వేడుకలు ఈ నెల 1వ తేదీ మంగళవారం నిర్వహించడం విశేషం. పుట్టన రోజు జరుపుకున్న మరుసటి రోజునే చిన్నారి మృతిచెందడంతో బంధువుల రోధనలకు అదుపులు లేవు. దీంతో కొడపాక గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నారు.

సింగరేణి అధికారిక వెబ్‌సైట్ ఏర్పాటు

'సోషల్ మీడియా వాల్' సైట్ ప్రారంభించిన సంస్థ డైరెక్టర్ చంద్రశేఖర్

మన తెలంగాణ/హైదరాబాద్ : సింగరేణి సంస్థకు సంబంధించిన సామాజిక మాధ్యమాలన్నీ ఒకే చోట కనపడేలా రూపొందించిన 'సోషల్ మీడియా వాల్'ను సంస్థ డైరెక్టర్ చంద్రశేఖర్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 55 వేల మంది ప్రత్యక్షంగా, లక్షలాది మంది పరోక్షంగా ఆధారపడుతున్న ప్రతిష్టాత్మక సంస్థ అయిన సింగరేణికి సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందరికీ తెలియజేయాలన్న ఉద్దేశ్యంతో ప్రజా సంబంధాల శాఖ ద్వారా రూపొందించి నిర్వహిస్తున్న 'సింగరేణి సైరన్ యూట్యూబ్ చానల్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్ లాంటి సామాజిక మాధ్యమాలన్నీ ఒకచోటకు తీసుకువస్తూ వెబ్‌సైట్‌లో కనపడేలా 'సోషల్ మీడియా వాల్' రూపొందించడం జరిగిందన్నారు. దీంతో ప్రపంచవ్యాప్తంగా సింగరేణి వెబ్‌సైట్ ద్వారా సంస్థ నిర్వహిస్తున్న సామాజిక మాధ్యమాలను ఒకచోట చూసే వీలు కలుగుతుందన్నారు. సింగరేణి ప్రజా సంబంధాల శాఖ ఆధ్వర్యంలో సంస్థలో జరుగుతున్న బొగ్గు ఉత్పత్తి, రవాణా, ఎస్‌టిపిపి ద్వారా జరుగుతున్న విద్యుత్ ఉత్పత్తి వివరాలు, సింగరేణీయులతో పాటు పరిసర ప్రాంత వాసుల కోసం తీసుకుంటున్న వివిధ సంక్షేమ కార్యక్రమాల వివరాలు, సింగరేణి సేవా సమితి ద్వారా చేపడుతున్న వివిధ శిక్షణా కార్యక్రమాల వివరాలతో పాటు వివిధ సామాజిక ప్రయోజన అంశాలను ఈ సామాజిక మాధ్యమంలో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డిజిఎం రాం కుమార్, హరికుమార్, సీనియర్ ప్రొగ్రామర్ కిరణ్మయి పాల్గొన్నారు.

బేఫికర్ ఆటో

(మొదటిపేజీ తరువాయి)

సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ వారి ఆధ్వర్యంలో 22 వేల కారు క్యాబ్‌లకు రిజస్ట్రేషన్ చేయడం జరిగింది. సేఫ్ క్యాబ్‌తో ప్రజల నుండి అనూహ్య స్పందన లభించదని, ఆటోలలో మహిళలు, ప్రయాణీకులు చాలా ప్రయాణం చేస్తుంటారని, దీంతో ఆటోలకు రిజస్ట్రేషన్ ప్ర క్రియ మొదలు పెట్టామన్నారు.ఆటోలలో విలువైన వస్తువులు ,నగలు మ రిచిపోవడం జరుగుతుందని, వాటిని దృష్టిలో ఉంచుకోని ప్రతి ఆటో సురక్షితంగా ఉందని తెలుసుకోవడానికి మైక్యాబ్ సేఫ్ మాదిరిగానే మై ఆటో సేఫ్ ఏర్పాటు చేశామన్నారు. ఆటోలో ప్రయాణించే ప్రయాణికులు ఆటోలో ఉండే (క్యూ ఆర్ కోడ్)తో సేఫ్ గాడి.కామ్ వెబ్ సైట్‌తో ఆటో లైన్ ట్రాకింగ్ చేయవచ్చని, ఎవరైన ఆటో డ్రైవర్ మహిళలపట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన,ఆటోలో విలువైన వస్తువలు మరిచిపోయిన ప్రయాణికులు కోడ్ సహాయంతో మెసేజ్ పెడితే అది కంట్రోల్ రూమ్‌కు వస్తుందని తెలిపారు. కంట్రోల్ రూమ్‌కు మెసేజ్ రాగానే వాహనం ఎక్కడి నుంచి ఎక్కడికి పోతుందని పోలీసులు త్వరగా స్పందించి ఆటోను పట్టుకోవడం జరుగుతుందన్నారు. అనంతరం నూతన సంవత్సరం పురస్కరించుకోని కేకు కట్ చేసి పోలీసులకు శుభాకాంక్షలు తెలిపారు. గత ఏడాది ఎలా కమిషనరేట్ పేరు వచ్చిందో కొత్త సంవత్సరం పేరు తేవాలని సిబ్బందికి సూచించారు. గ్రామ పంచాయతీ ఎన్నికలకు అందరు సిద్ధంగా ఉండాలని తెలిపారు. సంక్రాంతి తరువాత గచ్చిబౌలి నుంచి నేరడిమేట్‌లో నూతన భవనానికి వస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో జాయింట్ సిపి సుధీర్ బాబు ,ఎల్బీనగర్ డిసిపి సర్‌ప్రీతి సింగ్ ,డిసిపి మల్కాజిగిరి ఉమ మహేశ్వర్ శర్మ ,డిసిపి యాదాద్రి రాంచంద్రర్ రెడ్డి ,అడిషనల్ డిసిపిలు, ఏసిపిలు తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభంలో సమస్యలు కామన్

(మొదటిపేజీ తరువాయి)

విభజన నిర్ణయాన్ని వాయిదా వేయాలని పిటిషనర్లు కోరారు. హైకోర్టు భవనాలు, జడ్జిల నివాస సముదాయాల నిర్మాణం పూర్తయ్యేవరకు స్వంత హైకోర్టు నిర్వహణ కష్టమని, అందువల్ల వాయిదా వేయాలని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ ఏకె సిక్రీ, జస్టిస్ అబ్దుల్ నజీర్‌లతో కూడిన ధర్మాసనం బుధవారం విచారణకు స్వీకరించింది. పిటిషనర్ లేవనెత్తిన వాదనలతో ధర్మాసనం ఏకీభవించలేదు. ఇప్పటికే రెండు రాష్ట్రాలకు వేర్వేరు హైకోర్టులు ఏర్పాటయ్యాయని, రెండు హైకోర్టులకూ వేర్వేరు ప్రధాన న్యాయమూర్తులు ప్రమాణ స్వీకరాలు కూడా చేశారని ధర్మాసనం పేర్కొనింది. ఇంత జరిగిన తర్వాత ఇప్పుడు తాము ఈ విషయంలో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. హైకోర్టులు పని చేయడం ప్రారంభించే సమయంలో ఇలాంటి సమస్యలు, ఇబ్బందులు సాధారణమేనని వ్యాఖ్యానించింది. ఉమ్మడి హైకోర్టు విభజన అంశం చాలా కాలంగా పెండింగ్‌లో ఉందని, రాష్ట్రపతి ఇటీవలే నోటిఫికేషన్‌ను జారీ చేశారని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఇలాంటి పరిస్థితుల్లో ఈ పిటిషన్‌ను విచారించలేమని స్పష్టం చేసిన ఇద్దరు సభ్యుల ధర్మాసనం కొట్టివేసింది. దీంతో ఆంధ్రప్రదేశ్ న్యాయవాదుల సంఘం ఆ పిటిషన్‌ను ఉపసంహరించుకుంటున్నట్లు స్పష్టం చేసింది.

ఏపీ శ్వేతపత్రాలపై తెలంగాణ సీరియస్

● 9వ, 10వ షెడ్యూలు సంస్థలపై ఏపీ వాదనకు ఖండన ● అధ్యయనం చేయాల్సిందిగా సిఎస్ ఆదేశం

మన తెలంగాణ / న్యూఢిల్లీ, హైదరాబాద్ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన శ్వేతపత్రాల్లో ఒకదాంట్లో 'తెలంగాణ ప్రభుత్వం సహకారం లేకపోవడం వలన' అని చేసిన వ్యాఖ్యలను తెలంగాణ ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. 'ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టం మరియు సంబంధిత హామీలపై శ్వేతపత్రం' అనే డాక్యుమెంట్‌లో విభజన చట్టంలోని తొమ్మిదవ, పదవ షెడ్యూలు సంస్థల విభజన పూర్తికాకపోవడానికి కేంద్ర ప్రభుత్వంతో పాటు తెలంగాణ ప్రభుత్వం కూడా కారణమని ఆ రాష్ట్ర ప్రభుత్వం పేర్కొనింది. తెలంగాణ ప్రభుత్వం సహకరించని కారణంగానే తొమ్మిదవ షెడ్యూలులోని పలు సంస్థల విభజనపై షీలా భిడే కమిటీ సిఫారసు చేసినా అమలు కాలేకపోయిందని పేర్కొనింది. అదే విధంగా పదవ షెడ్యూలులోని సంస్థల విభజనకు కూడా తెలంగాణ నుంచి ఆశించిన సహకారం లేనందునే ఇప్పటికీ స్పష్టత లేదని పేర్కొనింది. అయితే ఈ వ్యాఖ్యల పట్ల తెలంగాణ ప్రభుత్వం సీరియస్‌గా స్పందించాలనుకుంటోంది. ఈ డాక్యుమెంట్‌ను సేకరించిన తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి క్షుణ్ణంగా అధ్యయనం చేసి తగిన తీరులో స్పందించాలని, అవసరమైతే నోడల్ ఏజెన్సీగా ఉన్న కేంద్ర హోం మంత్రిత్వశాఖకు ఫిర్యాదు చేయాలని భావించి నివేదికను తయారుచేయాల్సిందిగా రాష్ట్ర విభజన కమిటీ కన్వీనర్‌గా ఉన్న రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావును ఆదేశించారు.

తొమ్మిదవ షెడ్యూలులోని మొత్తం 89 సంస్థలను విభజన చట్టం ప్రస్తావించిందని, మరో రెండు సంస్థలను కూడా కలుపుతూ తెలంగాణ ప్రభుత్వం నుంచి సమ్మతి తీసుకుని జోడించినట్లు ఆ డాక్యుమెంట్ పేర్కొనింది. ఇందులో 85 సంస్థల ఆస్తుల, అప్పుల విభజనను షీలా భిడే కమిటీ పూర్తి చేసిందని, మరో 60 సంస్థల్లోని ఉద్యోగుల విభజనను కూడా పూర్తిచేస్తూ సిఫారసు చేసిందని పేర్కొనింది. అయితే తెలంగాణ నుంచి, కేంద్ర ప్రభుత్వం నుంచి తగిన సహకారం లేనందువల్ల ఆ ప్రక్రియ ముందుకు కదలలేదని, ఇంకా పెండింగ్‌లోనే ఉందని పేర్కొనింది. అదే విధంగా పదవ షెడ్యూలులోని 142 సంస్థల విషయంలోనూ ప్రతిష్టంభన నెలకొనిందని, సుప్రీంకోర్టులో కేసు కూడా పెండింగ్‌లోనే ఉందని ప్రస్తావించింది. ఈ అంశాలన్నింటినీ సీరియస్‌గా తీసుకున్న తెలంగాణ ప్రభుత్వం తగిన సమాధానం ఇవ్వడానికి, కేంద్ర హోం మంత్రిత్వశాఖకు తాజా స్థితిగతులను, వాస్తవాలను వివరించాలనుకుంటోంది. తొమ్మిదవ షెడ్యూలులోని మొత్తం 89 సంస్థల ఆస్తుల విలువను రూ. 1.50 లక్షల కోట్లుగా, పదవ షెడ్యూలులోని సంస్థల ఆస్తుల విలువను రూ. 38,772 కోట్లుగా నిర్ధారించినట్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆ శ్వేతపత్రంలో పేర్కొనింది. అయితే ఈ సంస్థల విభజన ప్రక్రియ ముందుకు పోలేకపోవడానికి ఉన్న కారణాలు వేరే అని, అయితే ఆంధ్రప్రదేశ్ దానిని వక్రీకరించిందని తెలంగాణ విభజన కమిటీ అభిప్రాయపడింది. తొమ్మిదవ షెడ్యూలులోని సంస్థల విభజనకు 'హెడ్‌క్వార్టర్' అనే నిర్వచనం చాలా కీలకమైనదని, దానిపై రెండు రాష్ట్రాల మధ్య స్పష్టత, ఏకాభిప్రాయం లేనందువల్ల పెండింగ్‌లో ఉందని వివరించింది. కేంద్ర హోం మంత్రిత్వశాఖ 'హెడ్ క్వార్టర్' అనే పదానికి చాలా స్పష్టమైన నిర్వచనం, వివరణ ఇచ్చిందని, కానీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దాన్ని ఆ తీరులో స్వీకరించకుండా మరో నిర్వచనం ఇచ్చిందని, ఆ కొత్త నిర్వచనం ప్రకారమే విభజన జరగాలని పట్టుబడుతోందని, ఇలా చేస్తే అది నిబంధనలకు విరుద్ధమైనదవుతుందని తెలంగాణ కమిటీ వ్యాఖ్యానించింది. ఉదాహరణకు ఆర్‌టిసి (రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ) విషయాన్ని తీసుకుంటే బస్ భవన్ కేంద్రంగా ఉన్నందున దీన్ని మాత్రమే హెడ్‌క్వార్టర్‌గా నిర్వచించాల్సి ఉంటుందని కేంద్ర హోం మంత్రిత్వశాఖ పేర్కొనిందని, కానీ ఆర్‌టిసి కల్యాణ మండపం, బస్ బాడీ యూనిట్, ఆర్‌టిసి ఆసుపత్రి తదితరాలను కూడా హెడ్‌క్వార్టర్‌గా పరిగణించాలని ఆంధ్రప్రదేశ్ వాదిస్తోందని తెలంగాణ కమిటీ వ్యాఖ్యానించింది. ఇలాంటి అనేక భిన్నాభిప్రాయాలు, స్వంత నిర్వచనం కారణంగా ఈ అంశంలో ఏకాభిప్రాయం రాలేదని వివరించింది. ఇలాంటి వక్రీకరణలను శ్వేతపత్రంలో ప్రస్తావించకుండా కేవలం తెలంగాణ, కేంద్ర ప్రభుత్వాల సహకారం లేకపోవడాన్ని ప్రధాన కారణంగా చూపడాన్ని తెలంగాణ ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది.

రెండు కొత్త జిల్లాలకు ప్రాథమిక నోటిఫికేషన్

రెండు మండలాల ఏర్పాటుకు కూడా జారీ

మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్రంలో రెండు కొత్త జిల్లాలను ఏర్పాటు చేస్తూ రెవిన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారీ ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేశారు. డిసెంబరు 31వ తేదీన జారీ చేసినట్లు (జివో నెం. 533) పేర్కొన్నా ఈ విషయాలు బుధవారం రాత్రి అందుబాటులోకి వచ్చాయి. నారాయణపేట, ములుగు జిల్లాలతో పాటు మోస్రా, చందూరు, చిన్న మఠంపల్లిలను మండల కేంద్రాలుగా ఏర్పాటు చేస్తూ రెవిన్యూ శాఖ వేర్వేరు ప్రాథమిక నోటిఫికేషన్లను జారీ చేసింది. ఇంతకాలం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో రెవిన్యూ డివిజన్‌గా ఉన్న ములుగును జిల్లాగా, మహబూబ్‌నగర్ జిల్లాలో భాగంగా ఉన్న నారాయణపేట రెవిన్యూ డివిజన్ పరిధిలో ఉన్న మండలాలతో పాటు మహబూబ్‌నగర్ జిల్లాలోని కొయిలకొండ మండలాన్ని కూడా చేర్చి నారాయణపేట జిల్లాగా ఏర్పాటు చేస్తూ మరో ప్రాథమిక నోటిఫికేషన్ జారీ అయింది. ఇక నిజామాబాద్ జిల్లాలో మోస్రా, చందూరు, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని చిన్నమఠంపల్లిని మండలాలుగా చేస్తూ వేర్వేరు ప్రాథమిక నోటిఫికేషన్లు జారీ అయ్యాయి. గత నెల 17వ తేదీన భూ పరిపాలన చీఫ్ కమిషనర్ భూపాలపల్లి, మహబూభ్‌నగర్ జిల్లాల కలెక్టర్లతో పాటు మొత్తం ఎనిమిది కొత్త మండలాల, రెవిన్యూ డివిజన్ల ఏర్పాటు కోసం ఆయా జిల్లాల కలెక్టర్లకు లేఖలు రాసి ప్రక్రియను ప్రారంభించాలని ఆదేశించారు. దాదాపు రెండు వారాల పాటు జరిపిన కసరత్తు అనంతరం రెండు కొత్త జిల్లాలు, మూడు కొత్త మండలాలకు ప్రాథమిక నోటిఫికేషన్‌లు జారీ అయ్యాయి. ఈ నోటిఫికేషన్‌ను ఆయా గ్రామాలు, మండలాలు, రెవిన్యూ డివిజన్, జిల్లాల్లో ప్రదర్శించి ప్రజలనుంచి 30 రోజుల్లోగా ఇంగ్లీషు, తెలుగు, ఉర్దూ భాషల్లో అభిప్రాయాలను, అభ్యంతరాలను స్వీకరించాల్సిందిగా ఆ నోటిఫికేషన్‌లో రాజేశ్వర్ తివారీ పేర్కొన్నారు.

ములుగు జిల్లా : కొత్త జిల్లాగా ఏర్పాటు కానున్న ములుగులో ములుగు, వెంకటాపూర్, గోవిందరావ్‌పేట, తాడ్వాయి, ఏడూరునాగారం, కన్నాయిగూడెం, మంగపేట్, వెంకటాపురం, వాజేడు మండలాలు ఉంటాయి.

నారాయణపేట జిల్లా : కొత్త జిల్లాగా ఏర్పాటవుతున్న నారాయణపేటలో నారాయణపేట, దామరగిద్ద, ధన్వాడ, మరికల్, కోసిగి, మద్దూరు, ఉట్కూరు, సర్వ, మంగనూర్, క్రిష్ణ, మక్తల్ తదితర మండలాలు ఉంటాయి.





దేశానికి దిక్సూచి మనమే

(మొదటిపేజీ తరువాయి)

కూటమిలోని ప్రగల్భాల భాగస్వామ్య పక్షాలు ఇక లేచే అవకాశమేలేదన్నారు. తెలంగాణలో టిడిపితో పాటు ఇతర పార్టీలు పూర్తిస్థాయిలో కనుమరుగయ్యాయన్నారు. శాసన సభ ఎన్నికల్లో అనేక కారణాలతో ఇతర పార్టీల్లో పనిచేసినవారు టిఆర్‌ఎస్‌లోకి వస్తే స్వాగతించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. స్థానిక నాయకులు ఈ మేరకు వ్యవహరించాలని సూచించారు. తెలంగాణలో మిగిలిన కొద్దిమంది టిటిపి కార్యకర్తలు టిఆర్‌ఎస్‌లోకి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. 103 నియోజకవర్గాల్లో డిపాజిట్లు కోల్పోయిన బిజెపి, ఓటమి పాలైన కాంగ్రెస్ మళ్లీ ప్రజల విశ్వాసం పొందే అవకాశాలే లేవన్నారు.



ఎంఎల్‌ఏ తలసాని స్టెప్పులు

కెసిఆర్ ఏది చేసినా చరిత్రే

చరిత్ర సృష్టించడం కెసిఆర్‌కు తెలుసని కెటిఆర్ వ్యాఖ్యానించారు. తెలంగాణ కోసం చావు నోట్లో తలపెట్టి సాధించి ఆ ఫలితాలను తెలంగాణ ప్రజలకు అందించి చరిత్ర సృష్టించారని గుర్తుచేశారు. ముందస్తు ఎన్నికల్లో విజయం సాధించి దేశ చరిత్రలో చెరగని ముద్ర వేశారని చెప్పారు. గతంలో ఇందిరాగాంధీ, ఎన్‌టిఆర్, చంద్రబాబునాయుడు, వాజ్‌పేయి ముందస్తు ఎన్నికలకు వెళ్లి ఓడిపోయిన విషయాన్ని కెటిఆర్ ఉదహరించారు. తెలంగాణ శాసనసభను ముందస్తుగా రద్దుచేసి గంటల వ్యవధిలో 105 మంది అభ్యర్థుల పేర్లను ప్రకటించి ఎన్నికల్లో గతంలో కంటే అధిక స్థానాలు సాధించి కెసిఆర్ మరోసారి చరిత్ర సృష్టించారన్నారు. తెలంగాణ తొలి శాసనసభ ఎన్నికల కంటే 14 శాతం ఓట్లు అధికంగా సాధించిన చరిత్ర టిఆర్‌ఎస్‌కు దక్కిందన్నారు. రాష్ట్రంలో 75 నియోజకవర్గాల్లో ఓట్ల శాతం పెరిగిందన్నారు. అయితే ఖమ్మంలో టిఆర్‌ఎస్ ను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం చెప్పారు. గ్రేటర్ హైదరాబాద్‌లో 29 నియోజకవర్గాల్లో 25 సీట్లు గెలవడం తెలంగాణ ప్రజలు టిఆర్‌ఎస్ ప్రభుత్వంపై పెంచుకున్న నమ్మకమన్నారు.

ఓటర్లను నమోదు చేయించాలి

జనవరి 25వరకు కొత్త ఓటర్ల నమోదు కార్యక్రమం అమలవుతున్న నేపథ్యంలో పార్టీశ్రేణులు ఉద్యమస్ఫూర్తితో ఓటర్లను నమోదు చేయించాలని కెటిఆర్ పిలుపునిచ్చారు. డివిజన్ల వారిగా పోటీ పడి ఓటర్లను చేర్పించాలని చెప్పారు. ఓటర్ల తొలగింపుతో మెజారిటీ రావల్సిన నాయకులకు మెజారిటీ తగ్గిందన్నారు. ఉదహారణకు సన్నత్ నగర్ నియోజకవర్గంలో శ్రీనివాస్ యాదవ్ 75 వేల మెజారిటీతో గెలవాల్సి ఉండగా కేవలం 35 వేల మెజారిటీతో గెలిచారని చెప్పారు. రాష్ట్రంలో సుమారు 22 లక్షల ఓట్లు గల్లంతు కావడంతోనే మెజారిటీ తగ్గిందన్నారు. ఈ నేపథ్యంలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరిని ఓటరు జాబితాలో చేర్పించే బాధ్యత పార్టీశ్రేణులపై ఉందన్నారు.



నాయకుల చుట్టూ తిరిగితే పదవులు రావు

ప్రజాప్రతినిధులుగా అవకాశాలు రానివారికి వారి పనితీరును కొలమానంగా తీసుకుని నామినేటెడ్ పదవుల్లో నియమించేందుకు సిద్ధంగా ఉన్నామని టిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ప్రకటించారు. లక్షలాధి మంది టిఆర్‌ఎస్ నాయకులు ఉండగా వందల్లో ప్రజాప్రతినిధుల అవకాశాలు ఉన్నాయని చెప్పారు. అయితే ప్రతిభ కల నాయకులకు నామినేటెడ్ పదవులు లభిస్తాయని హామి ఇచ్చారు. అయితే పార్టీ కార్యాలయం చుట్టూ, నాయకుల చుట్టూ తిరిగితే పదవులు రావు పార్టీపటిష్టత కోసం కృషి చేసేవారిని గుర్తించి పదవులు ఇచ్చేందుకు పార్టీ సిద్ధంగా ఉందన్నారు. డివిజన్లవారిగా సమీక్ష సమావేశాలు ఏర్పాటు చేసుకుని గ్రెటర్‌ఎన్నికలు, శాసన సభ ఎన్నికల్లో లభించిన ఓట్లు భవిష్యత్‌లో బలోపేతానికి తీసుకునే చర్యలపై దృష్టి సారించాలని స్థానిక నాయకత్వానికి పిలుపు ఇచ్చారు. త్వరలో పార్టీ శిక్షణాతరగతులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సన్నత్ నగర్ ఎంఎల్‌ఏ తలసాని శ్రీనివాస్ యాదవ్ నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఏ బాల్క సుమన్, ఎంఎల్‌సి శాంబీపూర్ రాజు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆయాచితం శ్రీధర్, కార్పోరేటర్లు నామన శేషుకుమారి,అత్తిలి అరుణ గౌడ్, కోలన్ లక్ష్మీ ,ఆకుల రూప, ఉప్పల తరుణి,హేమలత తదితరులు పాల్గొన్నారు.

ఇఎన్‌టి

(మొదటిపేజీ తరువాయి)

మొత్తం 11 మంది వైద్య సిబ్బం ది ఉన్నారు. వారందరికీ హైదరాబాద్ వెంగళరావ్‌నగర్‌లోని వైద్య ఆరోగ్య కుటుంభ సంక్షేమ శాఖ శిక్షణా సంస్థలో బుధ, గురు వారాల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఈ పైలెట్ ప్రాజక్ట్‌తో క్షేత్ర స్థాయిలో ఎలాం టి సమస్యలు ఎదురవుతాయి, ఎలాంటి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలనే దానిపై అవగాహన వస్తుందని వాటిని పరిగణలోకి తీసుకొని పూర్తిస్థాయిలో శిబిరాలు చేపట్టవచ్చని అధికారులు భావిస్తున్నారు. కంటివెలుగు తరహాలో చెవి ముక్కు గొంతు, దంత పరీక్షలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది. ముఖ్యమంత్రి కెసిఆర్ ఇటీవల ఈఎన్‌టి శిబిరాల నిర్వహణపై ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి వీలైనంత త్వరగా వీటిని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో అందుకు సంబంధించిన కార్యాచరణపై వైద్య ఆరోగ్య శాఖ దృష్టి పెట్టింది. రాష్ట్ర వైద్య శాఖాధికారులతో ఆ శాఖ ముఖ్య కార్యదర్శి శాంతికుమారి బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఐదు జిల్లాల కలెక్టర్లను ఆహ్వానించారు. పైలెట్ ప్రాజెక్టు నిర్వహణ తదితర అంశాలపై మహబూబ్‌నగర్, వనపర్తి, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్ల నుంచి సలహాలు, సూచనలు తీసుకున్నారు. కంటి వెలుగు కింద వచ్చే నెల చివరి నాటికి దాదాపు రెండు కోట్ల మందికి కంటి పరీక్షలు చేసే అవకాశముంది. అదే స్థాయిలో ఈఎన్‌టి, దంత పరీక్షలు చేయాల్సి ఉంటుంది. కంటి వెలుగు ద్వారా కంటి పరీక్షలు నిర్వహించడంలో సాధించిన ఫలితాలనే ఇఎన్‌టి, దంత వైద్య శిబిరాల ద్వారా కూడా సాధించాలని ఆమె స్పష్ట, చేశారు. అందుకే దీనిపై దృష్టి పెట్టింది వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఇప్పటిదాకా ముఖ్యమంత్రి కార్యాలయంలో కీలక అధికారిగా వ్యవహరిస్తున్నారు. అయితే ప్రభుత్వం ఈ పరీక్షలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నందున ఆమె సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలనుకుంటోంది. అందుకే ఆమెను సిఎంఓ కార్యదర్శి బాధ్యతల భారాన్ని తొలగించింది. వైద్యశాఖకు మాత్రమే పరిమితం చేసినట్లు తెలుస్తోంది. సచివాలయంలోని వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఇక నుండి ఉదయం పది గంటలకల్లా కార్యాలయంలో ఉండాల్సిందిగా క్రిందిస్థాయి సిబ్బందికి ఆమె ఓ సర్క్యులర్ జారీ చేసినట్లు సమాచారం.

11 నుంచి సంక్రాంతి సెలవులు

మనతెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు ఈ నెల 11 నుంచి 17 వరకు ఏడు రోజులపాటు సంక్రాంతి సెలవులు ఇవ్వనున్నారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ క్యాలెండర్‌లో పొందుపరిచింది. జనవరి 18న స్కూళ్లు పునఃప్రారంభం కానున్నాయి.

ప్రభాస్‌కు ఎందుకు చెప్పలేదు

మన తెలంగాణ/ హైదరాబాద్ : సినీ హీరో ప్రభాస్‌కు చెందిన భూమిని క్రమబద్ధీకరణ చేయాలన్న దరఖాస్తును అధికారులు తిరస్కరించినప్పుడు ఆ విషయానిన ఆయనకు లిఖితపూర్వకంగా ఎందుకు తెలియజేయలేదని తెలంగాణ సర్కార్‌ను హైకోర్టు ప్రశ్నించింది. దీనికి చెందిన పూర్తి వివరాలన్నీ తమకు అందజేయాలని, ఈ వ్యాజ్యాన్ని రేపు (గురువారం) విచారిస్తామని న్యాయమూర్తులు జస్టిస్ రామసుబ్రమణియన్, జస్టిస్ కేశవరావులతో కూడిన డివిజన్ బెంచ్ అధికారులను ఆదేశించింది. రంగారెడ్డి జిల్లాలోని శేరిలింగంపల్లి మండలం రాయదుర్గంలోని భూమి ప్రభుత్వానిదని చెప్పి నిర్మించుకున్నదాన్ని సీజ్ చేయడం అన్యాయమని పేర్కొంటూ ప్రభాస్ దాఖలు చేసిన వ్యాజ్యాన్ని బెంచ్ విచారించింది.



సందర్శకులతో రాష్ట్రపతి నిలయం కిటకిట

జనవరి ఒకటిన పదివేల మందికి పైగా సందర్శన

మన తెలంగాణ / హైదరాబాద్ : భారత రాష్ట్రపతి శీతకాల విడిది బొల్లారం నిలయం సందర్శకులతో కిటకిటలాడుతుంది. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సూచనల మేరకు ఇటీవల రాష్ట్ర అటవీశాఖ అధికార యంత్రాంగం భారీ ఎత్తున పచ్చదనాన్ని ఏర్పాటు చేసింది. కొత్తగా వేలాది మొక్కలను నాటడంతో పాటు రాక్ గార్డెన్, బట్టర్ ఫ్లై పార్క్, అరుదైన జాతి మొక్కలతో అటవీశాఖ రాష్ట్రపతి నిలయాన్ని సరికొత్తగా తీర్చిదిద్దింది. అటవీశాఖ చేపట్టిన నూతన అభివృద్ధి పనుల పట్ల రాష్ట్రపతి సైతం ఇటీవల నగరంలో చేసిన విడిది సందర్భంగా అధికార యంత్రాంగం పనితీరును మెచ్చుకున్నారు. రాష్ట్రపతి పర్యటన ముగిసిన తర్వాత అనవాయితిగా ప్రజల సందర్శన కోసం నిలయంలోకి సందర్శకులను అనుమతిస్తారు. ఈ నెల ఆరవ తేదీ వరకు ఎవరైనా రాష్ట్రపతి అథితి గృహంతో పాటు అక్కడి పార్కులను ఇతర అందాలను సందర్శించే అవకాశముంది. ఈ నిలయానికి జనవరి ఒకట తేదీన ఒక్క రోజులోనే పదివేల మందికి పైగా సందర్శకులు ఈ విడిది సందర్శనకు వచ్చినట్లు అధికారులు తెలిపారు. గతంలో ఎప్పుడూ ఇంత భారీగా జనం సందర్శనకు రాలేదని, ఇది రికార్డుగా నమోదైందని అటవీశాఖ అధికారులు తెలిపారు. ముఖ్యంగా చిన్న పిల్లలు, పాఠశాల విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన పెరిగేలా అటవీశాఖ చక్కని ప్రయత్నాలు చేసిందని సందర్శకులు అటవీశాఖ అధికారులు, సిబ్బంది పనితీరును అభినందిస్తున్నారు.

ఒఎస్‌డిగా ప్రియాంక వర్గీస్ కొనసాగింపు



మన తెలంగాణ / హైదరాబాద్ : ముఖ్యమంత్రి కార్యాలయంలో అటవీశాఖ ప్రత్యేక అధికారిగా ఉన్న ప్రియాంక వర్గీస్‌ను కొనసాగిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె.జోషి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం సిఎంఓలో ఒఎస్‌డిగా పనిచేస్తున్న ఆమె అదే పోస్టులో తదుపరిఉత్తర్వులు వెలువడేంత వరకు కొనసాగనున్నారు. గత ప్రభుత్వంలో సిఎంఓలో పనిచేసిన పలువురిని అదే హోదాలో కొనసాగిస్తూ ప్రధాన కార్యదర్శి రెండు రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేయగా ఇప్పుడు ప్రియాంకా వర్గీస్ కొనసాగింపుకు కూడా ఉత్తర్వులను జారీ చేశారు. అటవీ, పర్యావరణం తదితర అంశాల్లో ప్రియాంకా వర్గీస్ ఓఎస్‌డిగా కొనసాగుతున్నారు. హరితహారం, ప్రాజెక్టులకు ప్రభుత్వం భూములను సేకరించిన తర్వాత ప్రత్యామ్నాయ అడవుల పెంపకంపై ఆమె దృష్టి సారించి సత్ఫలితాలను సాధించారు. ఈ నేపథ్యంలో ఆమె సేవలను కొనసాగించుకునేలా ప్రభుత్వం అదే బాధ్యతల్లో ఉండేలా ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం.

టారిఫ్ సబ్సిడీకి ప్రభుత్వ నిధుల విడుదల

మన తెలంగాణ/హైదరాబాద్ : టారిఫ్ సబ్సిడీ కింద ప్రభుత్వం రూ.415.35 కోట్లు విద్యుత్ సంస్థలకు ఇవ్వాలని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ మిశ్రా పరిపాలనాపరమైన అనుమతులు ఇచ్చారు. జనవరి 2019కి చెందిన టారిఫ్ సబ్సిడీ బకాయిలను మంజూరు చేసి, విద్యుత్ సంస్థల అకౌంట్లో జమచేయాలన్నారు. ప్రభుత్వం విద్యుత్ వినియోగదారులకు పలు రకాల సబ్సిడీలను ఇస్తుంది. ఇందుకోసం టిఎస్ ఇఆర్‌సి ముందు ప్రభుత్వం తరఫున వచ్చిన సబ్సిడీ చెల్లిస్తామని హామీఇచ్చారు. ఈ హామీనిచ్చిన మొత్తాన్ని 12 నెలల్లో వాయిదాల మేర క్రమం తప్పకుండా చెల్లించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ మేరకే ఇంధన శాఖ ఉత్తర్వులు జారీచేసింది.

'పంచాయతీ'కి పోలీసులు సిద్ధం

అదనపు డిజిపి జితేందర్

మన తెలంగాణ/ హైదరాబాద్ : తెలంగాణలో మూడు విడతలుగా జరుగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికలకు పోలీసులు సర్వసన్నద్ధంగా ఉన్నారని రాష్ట్ర అదనపు డిజిపి జితేందర్ పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే గ్రామ పంచాయతీ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. గ్రామ పంచాయతీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా పోలీసుల, రేంజ్ ఐజిలతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పోలీసులకు ఇప్పటికే ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. పంచాయతీ ఎన్నికలు ఈనెల 21, 25, 30 తేదీల్లో మూడు విడతలుగా జరిగే ఎన్నికలలో ఒక్కో విడత ఎన్నికలలో దాదాపు 27 నుంచి 30 వేల మంది చొప్పున పోలీసులు విధులు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర సరిహద్దుల్లోని కొన్ని సమస్యాత్మక ప్రాంతాలలో సిబ్బంది వినియోగంపై ఆయా ప్రాంతాలలోని పోలీసు అధికారులతో చర్చించామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను మరోసారి గుర్తించి ఎన్నికలలో ఎంత మంది పోలీసులను వినియోగించుకోవాలన్న విషయంపై అక్కడి అధికారులతో మరోసారి చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. అసెంబ్లీ ఎన్నికలలో నమోదు చేసిన బైండోవర్ కేసులు ఆరు నెలల పాటు ఉంటాయని, గ్రామీణ ప్రాంతాలలో ఎన్నికలకు అవాంతరాలు కలిగిస్తారని అనుమానం ఉంటే వారిపై కూడా బైండోవర్ కేసులు నమోదు చేయనున్నట్లు తెలిపారు. పంచాయతీ ఎన్నికల బందోబస్తు విషయంపై ఇప్పటికే 23 జిల్లా పోలీసు అధికారులతో మాట్లాడామని, మిగిలిన జిల్లాల ఎస్‌పిలతో అనతికాలంలో చర్చలు జరుపుతామన్నారు. ఇటీవల ముగిసిన అసెంబ్లీ ఎన్నికలలో రాష్ట్రంలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలలో ఎన్నికల ప్రశాంతంగా నిర్వహించామని, అదే స్ఫూర్తితో పంచాయతీ ఎన్నికలు సైతం ఏలాంటి అవాంతరాలు, రీపోలింగ్ లేకుండా నిర్వహించాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికలలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలైన 113 నియోజక వర్గాలలో పోలింగ్ శాతం కూడా పెరిగిందని, అందుకు పోలీసుల కృషి ఉందని వివరించారు. పంచాయతీ ఎన్నికలలో పోలీసులు ఇతర శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూస్తామని వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 12,732 గ్రామాలలో మూడు విడతలుగా ఎన్నికలు జరుగనున్నాయని, రాష్ట్రంలో ఎన్నికలలో 1,13,190 పోలింగ్ కేంద్రాలలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎడిజిపి జితేందర్ తెలిపారు. ఈ క్రమంలో రాష్ట్ర పోలీసులను మూడు విడతల ఎన్నికలలో వినియోగిస్తామని, ఈ ఎన్నికలలో సింహభాగం రాష్ట్ర పోలీసులే శాంతి భద్రతల పరిరక్షిస్తారని వివరించారు. పంచాయతీ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా రాష్ట్ర పోలీసులకు శిక్షణా శిబిరాలు నిర్వహించి నమూన, ప్రవర్తనా నియమావలి, ఉల్లంఘనలు తదితర అంశాలపై సూచనలు ఇవ్వడం జరిగిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే రాష్ట్రంలో ఫ్లయింగ్ స్క్వాడ్స్‌తో పాటు సంచార బృందాలను రంగంలోకి దింపుతున్నామన్నారు.అసెంబ్లీ ఎన్నికల తరహాలో పంచాయతీ ఎన్నికలను స్వేచ్ఛగా, నిస్పక్షపాతంగా నిర్వహించేందుకు పోలీసు శాఖ సర్వసన్నద్ధమైందని ఎడిజిపి వివరించారు.



ఒంటిమిట్టలో బ్రహ్మోత్సవాలలోపు
అభివృద్ధి పనులు : టిటిడి ఇఒ

మనతెలంగాణ/తిరుమల ప్రతినిధి : టిటిడికి అనుబంధంగా ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఒంటిమిట్టలో రానున్న బ్రహ్మోత్సవాల లోపు అభివృద్ధి పనులను పూర్తి చేయాలని టిటిడి ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ అధికారులను ఆదేశించారు. ఒంటిమిట్ట కోదండ రామాలయాన్ని బుధవారం ఈవో సందర్శించారు. ఆలయ పరిసరాలు, ఉద్యానవన పనులు, పుష్కరిణి, కల్యాణవేదిక ప్రాంతాలను తిరుపతి జెఈవో శ్రీ పోల భాస్కర్‌తో కలిసి ఈవో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఈవో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి గౌ శ్రీ నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు భద్రాచలం తరహాలో ఒంటిమిట్ట రామాలయాన్ని అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఇందుకోసం రూ.100 కోట్లతో మాస్టర్‌ప్లాన్ రూపొందించామని, ఇప్పటికి రూ.17.60 కోట్లతో పలు పనులను పూర్తి చేశామని, మరో రూ.9 కోట్లతో చేపట్టిన పనులు వివిధ దశల్లో ఉన్నాయని వివరించారు. ప్రతి ఏడాదీ శ్రీరాములవారి కల్యాణానికి రూ.3 కోట్లు ఖర్చవుతోందన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని శాశ్వత ప్రాతిపదికన కల్యాణవేదిక, పార్కింగ్, మరుగుదొడ్ల ఏర్పాటు చేస్తామన్నారు. ఆలయ నిర్మాణం దెబ్బతినకుండా పోటు మరమ్మతులు, ఫ్లోరింగ్ పనులను భారత పురావస్తు శాఖ చేపట్టేలా ఒప్పందం కుదుర్చుకున్నామని ఈవో తెలిపారు. ఆలయంలో వైరింగ్, లైటింగ్ పనులను పూర్తి చేస్తామన్నారు. మాడ వీధుల విస్తరణ చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో టిటిడి సివిఎస్‌వో గోపినాథ్‌జెట్టి, కడప ఎస్పీ అభిషేక్ మహంతి, చీఫ్ ఇంజినీర్ చంద్రశేఖర్‌రెడ్డి, డిఎఫ్‌వో ఫణికుమార్ నాయుడు, డిఎస్పి రాఘవేంద్ర, ఇఇ జగన్మోహన్‌రెడ్డి, ఏఈవో రామరాజు, పురావస్తు శాఖ అధికారి శ్రీరాం తదితరులు పాల్గొన్నారు.



మన తెలంగాణ / హైదరాబాద్ : దక్షిణమధ్య రైల్వేజోన్ పరిధిలోని సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో వంద అడుగుల ఎత్తయిన జాతీయ జెండాను ఆవిష్కరించారు. స్టేషన్ ప్రధాన గేటు వద్ద ఈ జెండాను ఆవిష్కరించారు. స్టేషన్ ఆవరణలో జెండాను ఆవిష్కరించిన మొదటి స్టేషన్‌గా సికింద్రాబాద్‌కు గుర్తింపు లభిస్తుందని రైల్వే ఉన్నతాధి కారులు తెలిపారు. ప్రజల్లో జాతీయవాదాన్ని కల్పించడంతో పాటు ఆత్మధైర్యంతో గర్వించదగిన రీతిలో ఈ జెండాను ఆవిష్కరించిందనట్లు తెలిపారు. ఈ జెండాను బుధవారం సినయర్ కెప్టెన్ అశోక్ చారి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీనియర్ టెక్నిషియన్ గోపాల్‌రెడ్డి, సిబిఎన్.ప్రసాద్, స్టేషన్ మేనేజర్ అశోక్‌కుమార్ పాల్గొన్నారు రైల్వేకు చెందిన ముఖ్యమైన ప్రాంతాల్లో జెండాలను ఆవిష్కరించనున్నట్లు తెలిపారు.

ఐఎంఎఫ్‌ఎల్ కార్మికుల సమ్మె



మన తెలంగాణ / హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలోని ఎక్సైజ్‌శాఖ ప్రధాన కార్యాలయం ముందు ఐఎంఎఫ్‌ఎల్ కార్మికులు బుధవారం నుంచి నిరవధిక సమ్మెకు దిగారు. నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట డిపోకు చెందిన హమాలీ కార్మికులు ఈ సమ్మెను చేపట్టారు. ఈ సమ్మెను ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు టి.నరసింహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా డిపోలో పనిచేస్తున్న 11 మంది కార్మికులను ఎలాంటి కారణం గానీ, నోటీసులుగానీ లేకుండా పనినుంచి తొలగించారని తెలిపారు. తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ కార్యాలయంకు విన్నవించడంతో పాటు కలెక్టర్ తో పాటు ఎక్సైజ్ కమిషనర్‌కు వినతిపత్రాలు అందజేసి నా ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. దీంతో ప్రధాన కార్యాలయం ముందు సమ్మెకు దిగినట్లు చెప్పారు. నాలుగు నెలలుగా పనిలోకి తీసుకోకుండా కక్ష్యసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక వ్యతిరేక విధానాల్లో భాగంగానే కార్మికులను విధుల నుంచి తొలగించిందని ఆరోపించారు. కార్మిక హక్కులను కాలరాస్తూ పాలకులు ఇలాంటి చర్యలకు దిగుతున్నారని మండిపడ్డారు. అసంఘటిత రంగంలో హమాలీ కార్మికులను నియమించే అధికారం లేని ప్రభుత్వం వారిని తొలగించడం దారుణ మన్నారు. ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న కార్మికశాఖ కళ్లప్పగించి చూస్తుందని ఆరోపించారు. కార్మిక చట్టాల పరిరక్షణతో పాటు పని భద్రత, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరంగా కాకుండా చూడడం, అసంఘటిత రంగ కార్మికుల కోసం సమగ్రమైన చట్టం కోసం అన్ని ట్రేడ్ యూనియన్లు ఉద్యమాలను చేపడుతున్నాయని తెలిపారు. ఈ దీక్ష శిబిరాన్ని పలువురు ఎఐటియుసి నేతలు సందర్శించారు.

'నిన్ను నమ్మం బాబూ'

- సరికొత్త నినాదానికి వైఎస్‌ఆర్‌సిపి శ్రీకారం
- ప్రతి నియోజకవర్గంలో హోర్డింగ్‌ల ఏర్పాటు
- చిన్నసైజులో వాహనాలకు స్టిక్కర్లు

మన తెలంగాణ/హైదరాబాద్ : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు మోసాలు, కుట్రలు, అన్యాయాల ప్రజల్లోకి తీసుకుపోయేందుకు 'నిన్ను నమ్మం బాబూ' అంటూ హోర్డింగ్‌లు ఏర్పాటు చేసేందుకు ప్రతిపక్ష పార్టీ వైఎస్‌ఆర్‌సిపి ప్రణాళికలను సిద్ధం చేసింది. ఆ పార్టీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్పయాత్ర ముగింపు దశకు వచ్చిన నేపథ్యంలో ఈ యాత్రకు సంఘీభావంగా ఈనెల 7వ తేదీ వరకు చేపట్టాల్సిన ముందస్తు కార్యక్రమాలపై దిశానిర్దేశం చేస్తూ రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలకు పార్టీ కేంద్ర కార్యాలయం సర్కులర్ జారీచేసింది. స్టిక్కర్ల రూపంలోనూ తయారు చేయించి వాహనాలకు అంటించాలని పార్టీ శ్రేణులకు ఆదేశాలిచ్చారు. రాష్ట్రంలోని అన్ని గ్రామాలలో హోర్డింగ్స్, స్టిక్కర్లు ఏర్పాటు చేయాలని పార్టీ నిర్ణయించుకుంది.

సంచలనం కోసమే జగన్‌పై దాడి

విశాఖ సిపి మహేశ్‌చంద్ర లడ్డా

మన తెలంగాణ/హైదరాబాద్ : విశాఖ విమానాశ్రయంలో గత ఏడాది అక్టోబరు 25న ఎపి ప్రతిపక్షనేత జగన్‌పై దాడి కేసులో ఎలాంటి కుట్రకోణం లేదని పోలీసుల దర్యాప్తులో తేలినట్లు విశాఖ నగర పోలీస్ కమిషనర్ మహేశ్‌చంద్ర లడ్డా స్పష్టం చేశారు. తన కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కేసు వివరాలను వెల్లడించారు. నిందితుడు శ్రీనివాస్ వెల్డర్‌గా, కేక్ మాస్టర్, కుక్‌గా పలు చోట్ల పనిచేశాడని సిపి తెలిపారు. అతను సంచలనం కోసమే జగన్‌పై దాడికి పాల్పడ్డాడని వివరించారు. జగన్‌పై దాడిలో మరో కోణం లేదని కేవలం సంచలనం కోసమే శ్రీనివాస్ ఈ దాడికి పాల్పడినట్లు తమ దర్యాప్తులో తేలిందన్నారు. వాస్తవానికి గత ఏడాది అక్టోబర్ 18న దాడి చేయాలని శ్రీనివాస్ పథకం వేసినప్పటికీ అది సాధ్యంకాలేదని తెలిపారు. అప్పటికే శ్రీనివాస్ తనతో సన్నిహితంగా వుండే అమ్మాజీ అనే మహిళకు ఫోన్ చేసి తనను ఈ రోజు టివిలో చూస్తారని, ఓ సంచలనం సృష్టించబోతున్నానని ఫోన్లో తెలిపినట్లు సిపి లడ్డా మీడియాకు వివరించారు. కుట్రదారులను తప్పించే యత్నం జరుగుతోంది–వైకాపా లీగల్ సెల్ అధ్యక్షుడు పొన్నవోలు సుధాకర్‌రెడ్డి ప్రతిపక్షనేత వైఎస్ జగన్‌పై హత్యాయత్నం కేసులో అసలు కుట్రదారులను తప్పించే యత్నం జరుగుతోందని వైఎస్‌ఆర్ కాంగ్రెస్ లీగల్ సెల్ అధ్యక్షుడు పొన్నవోలు సుధాకర్‌రెడ్డి ఆరోపించారు. ఈ ఘటన అసలు సూత్రధారులు, పాత్రధారులెవరో తెలియకుండా ఈ కేసును నిందితుడు శ్రీనివాస్‌కే పరిమితం చేయలనే కుట్ర జరుగుతోందన్నారు. ఈ కేసు వ్యవహారంలో విశాఖ కమిషనర్ మహేష్‌చంద్ర లడ్డా చెప్పిన విషయాలను తాము ఎప్పటి నుంచో చెబుతున్నామని వివరించారు. శ్రీనివాస్ ఒక్కడే కుట్రకు సూత్రధారుడని లడ్డా చెప్పడం వెనుక అతని ఆంతర్యం అర్థం కావడం లేదన్నారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత



మన తెలంగాణ / హైదరాబాద్ : పర్యావరణం, అడవుల రక్షణకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తుందని తెలంగాణ అటవీశాఖ ప్రధాన సంరక్షణ అధికారి ప్రశాంత్‌కుమార్ ఝా తెలిపారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా అడవుల రక్షణకు ఇలాంటి ప్రాధాన్యతనివ్వడం లేదన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అటవీ శాఖ అధికారులు, సిబ్బందిపై పెట్టిన గురుతర బాధ్యతను ఖచ్చితంగా నేరవేర్చాలని సూచించారు. ఇందులో ఎలాంటి సమస్యలు ఎదురైనా అధికారులు వెంటనే తమ దృష్టికి తీసుకు వస్తే వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అవసరమైతే ప్రభుత్వంతో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా బుధవారం అరణ్యభవన్‌లో అటవీశాఖ ఉన్నతాధికారులతో పాటు ఇతర అధికారులు, సిబ్బందితో కలిసి కేక్‌ను కట్ చేసి నూతన సంవత్సర వేడుకలను వారితో కలిసి పంచుకున్నారు. అనంతరం పికె.ఝా మాట్లాడుతూ రాష్ట్రంలో హరితహారంతో పాటు అర్బన్ ఫారెస్టు పార్కులు, ప్రాజెక్టులకు సంబంధించి ప్రత్యామ్నాయ భూము ల్లో మొక్కల పెంపకం, వన్యప్రాణుల సంరక్షణ తదితర అంశాలను నిబద్ధతతో నిర్వర్తించాలని సూచించారు. ఇందులో అధికారులు, సిబ్బంది ఎలాంటి అలక్ష్యాన్ని ప్రదర్శించిన సహించేది లేదన్నారు. ప్రభుత్వ లక్ష్య సాధన దిశగా ముందడుగు వేయాలన్నారు. ఈ ఏడాది కొత్తగా రెండు వేల మంది అటవీశాఖలో చేరుతున్నారని తెలిపారు. దీనికి సంబంధించిన ప్రక్రియ తుది దశకు చేరుకుందన్నారు. వీరి నియామకం అటవీ శాఖ మరింత బలోపేతానికి ఉపయోగపడుతుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమం లో పిసిసిఎఫ్ రఘువీర్, పృధ్విరాజ్, అదనపు అటవీ సంరక్షణ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు సెట్‌ల షెడ్యూల్ విడుదల

మన తెలంగాణ/హైదరాబాద్ : వచ్చే విద్యాసంవత్సరం వివిధ వృత్తివిద్యా కోర్సుల్లో ప్రవే శాలకు నిర్వహించనున్న ఉమ్మడి ప్రవేశ పరీక్షల (సెట్స్) షెడ్యూల్‌ను శుక్రవారం ప్రకటి ంచనున్నారు. ఈ మేరకు ఉన్నత విద్యామండలి ఛైర్మన్ టి.పాపిరెడ్డి శుక్రవారం వర్సిటీల విసిలు, సెట్ కమిటీలతో సమావేశం నిర్వహించి వివిధ ప్రవేశ పరీక్షలు నిర్వహించనున్న వర్సిటీలను, కన్వీనర్లను ఖరారు చేయనున్నారు. అదే రోజు ఎంసెట్, ఇసెట్, ఐసెట్, ఎడ్‌సెట్, లాసెట్, పిజిఇసెట్ తదితర ప్రవేశ పరీక్షల షెడ్యూల్‌ను ప్రకటించనున్నారు.

మారనున్న సెట్ల నిర్వహణ వర్సిటీలు

లాసెట్, ఎడ్‌సెట్, పిజిఇసెట్, ఐసెట్ ప్రవేశ పరీక్షలు నిర్వహించిన కన్వీనర్లు పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో ఈ ప్రవేశ పరీక్షల కన్వీనర్లతోపాటు నిర్వహించే యూనివర్సిటీలు కూడా మారనున్నాయి.

గత ఏడాది లాసెట్, ఎడ్‌సెట్, పిజిఇసెట్ ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహించగా, ఐసెట్‌ను కాకతీయ వర్సిటీ నిర్వహించింది. ఈ సారి కూడా లాసెట్, ఎడ్‌సెట్, పిజిఇసెట్ పరీక్షలను ఒయునే నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. వీటితోపాటు ఐసెట్‌ను కూడా ఉస్మానియా వర్సిటీకే అప్పగించాలని ఉన్నత విద్యామండలి భావిస్తున్నట్లు తెలిసింది. అలాగే ఈ సెట్లకు కొత్త కన్వీనర్లు రానున్నారు. లాసెట్ కన్వీనర్ ద్వారకానాథ్, ఎడ్‌సెట్ కన్వీనర్ మధుమతి, పిజిఇసెట్ కన్వీనర్ సమీనా ఫాతిమా, ఐసెట్ కన్వీనర్ సుబ్రహ్మణ్య శర్మ పదవీ విరమణ చేయనున్నారు. వీరి స్థానంలో నూతన కన్వీనర్లను నియమించనున్నారు.

నాలుగు ప్రవేశ పరీక్షలకు మారనున్న కన్వీనర్లు

ఎంసెట్ కన్వీనర్ మార్పు

2016లో ఎంసెట్ ప్రశ్నపత్రం లీకేజీ తర్వాత నిర్వహించిన ఎంసెట్–2కు కన్వీనర్‌గా నియమితులై ఇప్పటివరకు ఎంసెట్ కన్వీనర్‌గా కొనసాగుతున్న జెఎన్‌టియు రిజిస్ట్రార్ ఎన్.యాదయ్య స్థానంలో కొత్త కన్వీనర్‌ను నియమించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటివరకు ఎంసెట్ ప్రవేశ పరీక్షను జెఎన్‌టియు నిర్వహిస్తూ వస్తుండగా, దానిని ఉస్మానియా యూనివర్సిటీకి అప్పగించాలనే ప్రతిపాదనలపై కూడా ఉన్నత విద్యామండలి చర్చిస్తున్నట్లు తెలిసింది. ఎంసెట్‌కు అధిక సంఖ్యలో విద్యార్థులు హాజరవుతారు. దాంతోపాటు ఈ పరీక్షను గత ఏడాది నుంచి ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్న నేపథ్యంలో సమర్థవంతంగా నిర్వహించగలిగే ప్రొఫెసర్‌నే కన్వీనర్‌గా నియమించాలని భావిస్తున్నారు. ఎంసెట్‌ను గత ఏడాది జరిగిన తేదీలలో నిర్వహించనున్నట్లు తెలిసింది. గత ఏడాది మే 2 నుంచి ఐదు రోజులపాటు నిర్వహించారు. ఎంసెట్‌తో పాటు మిగతా ప్రవేశ పరీక్షలు కూడా ఈ సారి అవే తేదీలలో నిర్వహించాలని ప్రాథమికంగా నిర్వహించనున్నట్లు తెలిసింది.

శ్రేష్ఠ చిట్‌ఫండ్ నిర్వాహకుడు అరెస్ట్

భారీగా తరలి వచ్చిన చిట్‌ఫండ్ బాధితులు





మన తెలంగాణ/వైరా: కోట్ల రూపాయల చిట్టీల పేరుతో డబ్బులు కట్టించుకొని చిట్టీదారులకు ఇవ్వకుండా బోర్డు తిప్పిన శ్రేష్ఠ చిట్‌ఫండ్ నిర్వాహకుడు నాగబత్తిని క్రాంతిని బుధవారం వైరా పోలీసులు స్టేషన్‌కు తీసుకొని వచ్చారు. విషయం తెలుసుకున్న చిట్‌ఫండ్ బాధితులు పెద్ద సంఖ్యలో పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకున్నారు. ఒక్కసారిగా పోలీస్‌స్టేషన్‌కు జనం తరలిరావడంతో ఏం జరిగిందో అని ప్రజలు కూడా భారీగా తరలివచ్చారు. నమ్మకంతో చిట్టీలు కట్టించుకొని తమ బ్రతుకులతో చెలగాట మాడిన చిట్ నిర్వాహకుడు నాగబత్తిని క్రాంతిని, ఆయనకు సహకరించిన అన్న నాగబత్తిని రవిని కూడా అరెస్ట్ చేయడంతో పాటు చిట్‌ఫండ్ బాధితుల మొత్తానికి న్యాయం చేయాలని బాధితులు మొరపెట్టుకున్నారు. వైరా పట్టణానికి చెందిన బ్రైన్‌ట్యూమర్‌తో బాధపడుతున్న జన్నా అరవింద్ అనే యువకుడు తనకు బ్రైన్‌ట్యూమర్ కోసం రెండుసార్లు ఆపరేషన్ చేయాల్సి ఉండగా చిట్టీ కట్టానని, అప్పటికి ఒకసారి ఆపరేషన్ చేయడం జరిగిందని, రెండోసారి ఫైనల్ ఆపరేషన్ డిసెంబర్15న చేయాలని క్రాంతికుమార్‌కు చెబితే నీకు డబ్బులు అందిస్తానని నమ్మబలికి మోసం చేశాడని, తనకు దాచుకున్న చిట్టీ డబ్బులు ఇస్తేనే తప్ప తనకు సర్జరీ చేసుకునే స్తోమత లేదని, ఇవ్వని పక్షంలో తాను చనిపోవడమేనని అరవింద్ చెబుతున్న మాటలు విని అక్కడున్న వారు కంటతడి పెట్టారు. మరో వ్యక్తి తనకు రోడ్డు ప్రమాదంలో కాలు పోయిందని, కాలులో రాడ్లను సర్జరీ ద్వారా తీసివేస్తే తప్ప తాను నడవలేనని, దాని కోసం దాచుకున్న డబ్బులను ఇవ్వకుండా మా బ్రతుకులతో ఆడుకున్నారని తెలిపాడు. ఇలా చెప్పుకుంటూ పోతే ప్రతి పేదవాడి కుటుంబంలో నమ్మకస్థుడిగా నమ్మించి రోజు కూలి చేసుకునే వారి నుంచి వ్యవసాయదారుల వరకు చిట్టీలు కట్టామని, తమకు అన్యాయం చేసి ఉడాయించేందుకు క్రాంతికుమార్‌కు సహకరించిన రవిని వెంటనే అదుపులోకి తీసుకొని తామందరికి న్యాయం చేయాలని ఆందోళన చేశారు. తల్లాడ, వైరా మండలాల్లో అత్యధికంగా బాధితులు తరలివచ్చారు. పోలీసులు క్రాంతికుమార్‌ను విచారణ చేస్తున్నామని, రెండు రోజుల్లో చిట్టీ బాధితులకు సాధ్యమైనంత మేరకు న్యాయం చేసేందుకు కృషి చేస్తామని ఎస్సై నరేష్ తెలపడంతో బాధితులు అక్కడి నుండి వెళ్లిపోయారు.

గిరిజన బాలింతను కబళించిన జ్వరం





మన తెలంగాణ/ఇంద్రవెల్లి: రక్త హీనత, జ్వరంతో కోలుకోలేక బాలింత మృతి చెందిన సంఘటన బుధవారం సాయంత్రం ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని లిమ్‌గూడలో జరిగింది. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం ఆదిలాబాద్ జిల్లా బేల మండలంలోని దుబ్బగూడ కొలాం గిరిజన గ్రామానికి చెందిన మడావి రుఖ్మబాయి(36) 28 రోజుల క్రితం ఆదిలాబాద్ రిమ్స్‌లో ప్రసూతి అయింది. రుక్మాబాయి కొంతకాలంగా రక్తహీనతతో బాధపడుతుంది. ప్రసూతి అయిన అనంతరం జ్వరంతోపాటు ఆనారోగ్యానికి గురికాగా కుటుంబీకులు వారం రోజుల క్రితం మళ్లీ ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి రక్తం ఎక్కించారు. రెండు రోజుల పాటు రిమ్స్‌లో వైద్యం అందించి ఇంటికి పంపించగా రుక్మాబాయిని తమ కుటుంబీకులు రెండు రోజుల క్రితం ఇంద్రవెల్లి మండలంలోని లిమ్‌గూడలో ఉంటున్న తమ బంధువుల వద్దకు తీసుకొచ్చారు. పరిస్థితి విషమించడంతో బుధవారం సాయంత్రం లిమ్‌గూడలోనే ఆమె మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలు రుక్మాబాయికి భర్త భీంరావ్, 28 రోజుల పాప ఉన్నారని తెలిపారు. కాగా బుధవారం రాత్రి రుక్మాబాయి మృతదేహన్ని అంతక్రియల నిమ్మితం బేల మండలంలోని దుబ్బగూడకు తరలించినట్లు తెలిపారు.

తాడోపేడో!

- తేల్చుకునేందుకు సిద్ధమైన విలీన గ్రామాలు
- నేడు హైకోర్టులో తేలనున్న భవితవ్యం



మన తెలంగాణ/కరీంనగర్ రూరల్ : తాడోపేడోకు తేల్చుకునేందుకు విలీన గ్రామాలు సిద్ధమయ్యాయి. బుధవారం చివరి ప్రయత్నంగా ఆ గ్రామాల ప్రజాప్రతినిధులు హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనితో గురువారం గ్రామాల విలీనమా...పంచాయతీలు కొనసాగింపా.. అనేది హైకోర్టు తేల్చనుంది. గతంలో కరీంనగర్ కార్పొరేషన్‌లో కలుపడంపై 13 జులై 2018న హైకోర్టు స్టే విధించింది. గ్రామాల ప్రజాప్రతినిధులు పోరాటం ఫలించింది. కరీంనగర్ కార్పొరేషన్‌లో కరీంనగర్‌కు ఆనుకొని ఉన్న గ్రామాలను విలీనం చేస్తూ పంచాయతీ రాజ్ చట్టం 2018 లో భాగంగా 13 గ్రామాలను కలుపుతూ చట్టంలో రూపొందిస్తున్నట్లు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నప్పటికి తుది దశలో కరీంనగర ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఒత్తిడి మేరకు కొత్తపల్లి మండలంలోని మల్కాపూర్, చింతకుంట, కరీంనగర్ మండలంలోని బొమ్మకల్ గ్రామాలను, మానకొండూర్, తిమ్మాపూర్ గ్రామాలను విలీనం నుండి తప్పించారు. విలీనమయ్యే గ్రామాల్లో ఆందోళన నేపథ్యంలో గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు, మాజి ప్రజాప్రతినిధులు హైదరాబాద్ కేంద్రంగా హైకోర్టు చుట్టూ తిరుగుతూ గ్రామాల ప్రజల ఆశలు సజీవంగా ఉంచేందుకు న్యాయపోరాటం కొనసాగించారు. గత నాలుగు దఫాలకు బెంచ్‌పైకి వచ్చినా హైకోర్టు వాయిదా వేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిలతో ఎదుటి పిటిషన్ న్యా యవాది గ్రామాల విలీనం అర్థం లేకుండా చేశారని వా దించారు. విలీన గ్రామాల ప్రజల కోరిక మేరకు పంచాయతీలు కొనసాగించాలని వాదించారు. కరీంనగర్ జి ల్లా సర్పంచుల ఫోరం గౌరవాధ్యక్షులు నందెల్లి ప్రకాశ్ ఆధ్వర్యంలో సర్పంచులు అల్గునూర్ సర్పంచ్ కిష్టయ్య, వల్లంపహాడ్ సర్పంచ్ మునిరాజ్, పద్మనగర్ సర్పంచ్ శ్రీరాములు హైకోర్టులో న్యాయపోరాటం వేశారు. గ్రా మాల ప్రజల కోరిక మేరకు విలీనం నుండి మిగతా గ్రా మాలపై రేకుర్తి, పద్మనగర్, సీతారాం పూర్, ఆరెపల్లి, తీగల గుట్టపల్లి, వల్లంపహాడ్, సదాశివానగర్, అల్గునూ ర్ గ్రామాలను మాత్రమే విలీనం నుండి ఊరటకల్పించేందుకు తీవ్రంగా కృషి చేశారు. కాగా 13 జులై 2018న వి లీన గ్రామాలపై హైకోర్టు కార్పొరేషన్‌లో కలుపడంపై స్టే విధించడంతో గ్రామాల్లో ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ఆనంతరం ప్రభుత్వం విలీన గ్రామపంచాయతీకు ప్రత్యేక అధికారులను నియమించారు. ప్రత్యేక అధికారులతో గ్రామాల్లో పనులు సక్రమంగా జరుగలేదు. ఇటీవల ప్రభుత్వం గ్రామపంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ ఇచ్చింది. మా గ్రామాలకు ఎన్నికలు జరుపాలని, ఆ ఎన్నికల నోటిఫికేషన్‌లో తమ గ్రామాలు లేకపోవడంతో ఆ నోటిఫికేషన్‌ను సవాల్ చేస్తూ హైకోర్టును బుధవారం కరీంనగర్ జిల్లా సర్పంచుల ఫోరం గౌరవాధ్యక్షులు నందెల్లి ప్రకాశ్ ఆధ్వర్యంలో కిష్టయ్య (అల్గునూర్), మునిరాజ్ (వల్లంపహాడ్), శ్రీరాములు(పద్మనగర్) విలీన పోరాటంలో చివరి ప్రయత్నంగా హైకోర్టులో ఫిటిషన్ వేశారు. మా గ్రామాలకు కాని కార్పొరేషన్‌కు దగ్గరలో ఉన్న గ్రామాలు ఎలా ఎన్నికలు జరుగుతున్నాయని, దూరంగా ఉన్న మా గ్రామాలకు ఎన్నికలు జరుగడం లేదని ఆ గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్పొరేషన్‌లో కలిపితే గ్రామాల్లో పన్నులు పెరుతాయని, ప్రజల అవసరాలు తీరతాయని భావించారు. అభివృద్ధి జరుగదని ఆ గ్రామాల ప్రజల వాపోతున్నారు. కావున మరో ఐదు సంవత్సరాలు గ్రామాలుగానే ఉంచాలని, అప్పుడే అభివృద్ధి పూర్తిస్థాయిలో జరుగుతుందని, ఆ ఆరు గ్రామ పంచాయతీల ప్రజలు కోరుకుంటున్నారు. గ్రామపంచాయతీలుగా కొనసాగింపునకు అనుకూలంగా హైకోర్టు తీర్పు వస్తుందని గ్రామాల ప్రజలు ఆశిస్తున్నారు.

తేలని భద్రాద్రి పంచాయతీ

- పంచాయతీ గెజిట్ నుండి భద్రాచలం, సారపాకల పేర్లు తొలగింపు
- నిలిచిన నిధులు
- ఎటూ తేలని మున్సిపాలిటీ వ్యవహారం



మన తెలంగాణ / భద్రాచలం: రాష్ట్రం మొత్తం పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ఎన్నికలు కమిషన్ సిద్ధం కాగా భద్రాచలం గ్రామ పంచాయతీకి ఎన్నికలు జరిగే పరిస్థితి లేకుండా పోయింది. అటు మున్సిపాలిటీల లిస్టులో లేక..? ఇటు గ్రామ పంచాయతీల లిస్టులోలేకా రెంటికి చెడ్డ రేవడి చందాగా మారింది?. పునర్విభజన సమయంలో భద్రాచలంతోపాటు సారపాకను కూడా మున్సిపాలిటీగా మార్చాలని ప్రతిపాదించినా నేటికీ ఆ తతంగం పూర్తి కాలేదు. పంచాయతీ గెజిట్ నుండి భద్రాచలం, సారపాకల పేర్లను తొలగించడంతో ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయి. ఫలితంగా నిధుల కొరతతో రెండు పంచాయతీలు సతమతమవుతున్నాయి. ఇటు మున్సిపాలిటీ గాక గ్రామ పంచాయతీ నిధులు రాక పాలనాపరమైన ఇబ్బందులతోపాటు అభివృద్ధి పనులు జరగక ప్రజలు కూడా నానా ఇబ్బందులు పడుతున్నారు.

ఉత్తర్వులు రాక

భద్రాచలం, సారపాక మేజర్ గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీలుగా మార్చాలనే ఉత్తర్వులు నేటి వరకు రాకపోవడంతో అభివృద్ధికి ప్రతిబంధకమైంది. అధ్యాత్మిక కేంద్రమైన భద్రాచలంతోపాటు పారిశ్రామిక కేంద్రమైన సారపాకల అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. జనాభా ప్రాతిపదికన ఏటా విడుదల చేసే నిధులు, దాదాపు అన్ని గ్రామ పంచాయతీలకు ఇప్పటికే వచ్చేసాయి. ప్రస్తుతం 54 వేలకు పైగా జనాభా ఉన్న భద్రాచలానికి 14 ఆర్థిక సంఘం నుండి రూ. 1.06 కోట్లు నిధులు రావలసి ఉంది. సారపాకకు రూ.60 లక్షలు రావలసి ఉంది. కోట్లాది రూపాయల నిధులు నిలిచిపోవడంతో అభివృద్ధి పనులు ఎక్కడికక్కడ నిలి పోయాయి.

ప్రజాప్రతినిధులే కావాలి

భద్రాచలం గ్రామపంచాయతీ ఎన్నో సంవత్సరాలు స్పెషల్ ఆఫీసర్ పాలనలో కొనసాగింది. అధికారుల పరిపాలనకంటే ప్రజాప్రతినిధుల పాలన ఉంటే తమ సమస్యలు చెప్పుకోడానికి వీలుంటుందని ప్రజలు భావిస్తున్నారు. ఉన్నతాధికారులతో ధైర్యంగా తమ సమస్యలు చెప్పుకునే పరిస్థితి ఉండదని, అదే ప్రజాప్రతినిధులైతే తమ సమస్యలపై ప్రశ్నించవచ్చని ప్రజలు భావిస్తున్నారు. మున్సిపాలిటీ విషయంపై తక్షణమే ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు. కొత్తగా ఎన్నికైన భద్రాచలం శాసనసభ్యులైనా ఈ విషయంపై చొరవ చూపి, తమ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. భద్రాచలం మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయ్యేవరకు మేజర్ గ్రామపంచాయతీగానే కొనసాగించాలని మహబూబాబాద్ ఎంపి సీతారామనాయక్ ప్రభుత్వ ప్రధాన సలహాదారులు రాజేష్‌వర్మ, మున్సిపల్ సెక్రటరీ అరవింద్‌కుమార్‌లకు వినతిపత్రం అందించారు. ఉద్యోగుల జీతం ఆపి ముక్కోటి ఉత్సవాలను జరుపుకోవలసి వచ్చిందని ఈ లేఖలో పేర్కొన్నారు. గ్రామపంచాయతీగా పరిగణించి నిధులు విడుదల చేయాలని కోరారు.


అన్ని మతాల సారమొక్కటే

హోం శాఖ మంత్రి మహమూద్ అలీ ● ఆజ్మీర్ దర్గాలో చాదర్ సమర్పణ



మన తెలంగాణ/మెదక్/పెద్దశంకరంపేట : అన్ని మతాల సారమొక్కటేనని, ప్రతి ఒక్కరిలో దేవుడుంటాడని రాష్ట్ర హోం శాఖ మంత్రి మహమూద్ అలీ అన్నారు. బుధవారం ఆయన మెదక్ జిల్లాలోని పెద్దశంకరంపేట మండల కేంద్రంలో తబరుక్ ఆజ్మీర్ దర్గాలో చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ దర్గా వ్యవస్థాపకులు రహీం చిస్తి తనకు బాల్య మిత్రుడని, ఆయన ఆహ్వానం మేరకు ఇక్కడకు వచ్చానని తెలిపారు. సర్వమతాల సారమొక్కటేనని, మానవ సేవయే మాదవ సేవ అని చెప్పారు. ఆనంతరం ఆయన దర్గాలోని పలు ప్రాంతాలను సందర్శించారు. నారాయణఖేడ్ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ లౌకిక వాదానికి తమ పార్టీ కట్టుబడి ఉందన్నారు. ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. జాతీయ రహదారి పక్కన ఆజ్మీర్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు కొనసాగిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి రాష్ట్ర గీత పారిశ్రామిక సహకార సంస్థ మాజీ చైర్మన్ విగ్రాం రామాగౌడ్, జాతీయ ఆహార సంస్థ డైరెక్టర్ విగ్రాం శ్రీనివాస్ గౌడ్, మండల పరిషత్ అధ్యక్షులు బాసాడ రాజు, పేట మాజీ సర్పంచ్ జంగం శ్రీనివాస్, మండల టిఆర్ఎస్ అధ్యక్షులు విజయ రామరాజు, నాయకులు పున్నయ్య, నారాయణ, దర్గా నిర్వాహకులు డాక్టర్ రహీం చిస్తి, ఆజ్మీర్, మురళి పంతులు, వెంకట్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీల్లో గురుకుల విద్యార్థి ప్రతిభ




మన తెలంగాణ/నార్కట్‌పల్లి: మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిరావు పూలే తెలంగాణ రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలకు చెందిన బైపిసి మొదటి సంవత్సరం విద్యార్థి డి.తరుణ్ ఇటీవల నేపాల్‌లోని పోఖారో స్టేడియంలో జరిగిన ది అసోసియేషన్ ఫర్ ట్రెడిషన్ యూత్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి వాలీబాల్ క్రీడల్లో భారతదేశం తరుపున పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, ద్వితీయ స్థానంలో జట్టును నిలిపాడు. ఆ విద్యార్థి తరుణ్‌ను కళాశాల ప్రిన్సిపాల్ గోపాల్ కిషన్ పిడి నరేష్ ఘనంగా సత్కరించారు.

జాతీయ స్థాయికి విద్యార్థుల ఎంపిక

మనతెలంగాణ/వెల్దుర్తి: జడ్పిహెచ్‌ఎస్ వెల్దుర్తి పాఠశాలకు చెందిన విద్యార్థులు రుచిత, నందిని, మాధవిలు రాష్ట్ర స్థాయినుంచి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. వీరిలో రుచిత, నందినిలు జాతీయ స్థాయిలో భువనేశ్వర్‌లో, మాధవి చత్తీస్‌ఘడ్‌లో జాతీయ స్థాయిలో 3వ ర్యాంకు సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాంబయ్య తెలిపారు. జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులను బుధవారం మెదక్ జిల్లా కలెక్టర్ ధర్మారెడ్డి సన్మానించి అభినందించారు. ఎంపికైన విద్యార్థులను పిడి ప్రతాప్‌సింగ్, నోడల్ ఆఫీసర్ మధుమోహన్, కరాటే మాస్టర్ నగేష్, ఉపాధ్యాయులు అభినందించారు.

గుండెపోటుతో రైతు మృతి



మనతెలంగాణ/మణుగూరు: గుండెపోటుతో రైతు మృతిచెందాడు. వివరాల్లోకెళ్తే మండల పరిధిలోని రేగులగండి గ్రామానికి చెందిన గిరిజన రైతు సోడె లక్ష్మయ్య(52) గ్రామంలోని తన వ్యవసాయ భూమిలో పనులు చేసుకుంటుండగా ఒక్కసారిగా గుండె పోటు రావడంతో లక్ష్మయ్య అక్కడక్కడే మృతి చెందారు. లక్ష్మయ్యకు ఇద్దరు అబ్బాయిలు ఒక అమ్మాయి ఉన్నారు. నిరుపేద కుటుంబం కావటంతో విషయం తెలుసుకున్న మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఉప్పతల రామారావు లక్ష్మయ్య కుటుంబాన్ని పరమర్శించి దహన సంస్కారాల నిమిత్తం రూ.2 ఆర్థిక సహాయం అందజేశారు. ప్రభుత్వం అన్నివిధాల రైతు కుటుంబాన్నిఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

ప్లాట్ల పేరుతో ఘరానా మోసం

రూ.54లక్షలతో ఉడాయించిన ఘనుడు

మన తెలంగాణ, బచ్చన్నపేట : బచ్చన్నపేట మండల కేంద్రంలో పలువురికి హైదరాబాద్‌లో ప్లాట్లు ఇప్పిస్తామని డబ్బులను తీసుకొని ఉడాయించిన ఘటన ఇది. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఎస్‌ఐ రంజిత్‌రావు తెలిపిన వివరాల ప్రకారం... మండల కేంద్రానికి చెందిన బొమ్మ నర్సింహులుకు మగ్గాలు ఉన్నాయి. ఈ మగ్గాలను నేయడానికి హైదరాబాద్, ఎల్‌బీనగర్ సాయి సప్తగిరి కాలనీకి చెందిన శింగం కిష్టయ్య అనే వ్యక్తి 4 నెలల క్రితం వచ్చాడు. గడిచిన నాలుగు నెలలుగా మగ్గం నేస్తూ గ్రామంలో అందరితో చనువు పెంచుకున్నాడు. హైదరాబాద్‌లో ప్రభుత్వం నిరుపేదలకు ప్లాట్లు ఇస్తుందని, ఆ ప్లాట్ కావాలంటే ముందుగా రూ.20వేలు చెల్లించి బుక్ చేసుకోవాలని తెలిపాడు. తక్కువ ధరకే ప్లాట్ వస్తుండటంతో రూ.20వేల చొప్పున రూ.54లక్షల మేరకు కిష్టయ్యకు అందించారు. ఉన్నట్లుండి కిష్టయ్య వారం రోజులుగా కనిపించడంలేదని, ఎక్కడ వెతికినా ఆచూకీ లేదని, ఆ విషయమై బొమ్మ నర్సింహులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో, అలాగే జనగామ ఎసిపికి కూడా బుధవారం ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రంజిత్‌రావు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ మీటింగ్‌లో ఉద్రిక్తత

మన తెలంగాణ/ ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని గాయాత్రి గార్డెన్‌లో బుధవారం నిర్వహించిన ఆదిలాబాద్ నియోజకవర్గ విస్తృత స్థాయి సమవేశంలో ఉద్రిక్తత నెలకొంది. పార్టీ కోసం పని చేసిన నాయకులను గుర్తించడం లేదని కొందరు కార్యకర్తలు అన్నారు. ఇందులో కార్యకర్తల మధ్య స్వల్ప వాగ్వివాదం నెలకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. జిల్లా అగ్ర నేతలు జోక్యం చేసుకొని కార్యకర్తలను సముదాయించడంతో శాంతియుత వాతవారణంలో సమావేశం కొనసాగింది. ముందుగా మాజీ మంత్రి, సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ త్వరలో పార్టీ జిల్లా సమావేశం ఏర్పాటు చేసి కార్యకర్తలలో నూతనోత్సాహాన్ని నింపుతామని తెలిపారు. ఎన్ని గ్రూపులున్నా అందరూ పార్టీ కోసమే పనిచేశారని తెలిపారు. త్వరలో అందరి సహకారంతో పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేద్దామని తెలిపారు. పార్టీ శ్రేణులకు అండగా ఉంటామని, రాబోయే ఎన్నికల్లో నిలబడే వారికి అందరూ కలిసి ఆర్థిక సహాయం చేద్దామని పిలుపునిచ్చారు. గత ఎన్నికల్లో డబ్బులతో, మద్యం, కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేశారన్నారు. గతంలో చెప్పిన విధంగా భవిష్యత్‌లో తాను ఇక ఏ ఎన్నికల్లో పోటీ చేయను అని పోటీ చేయాలనుకునే వారు ముందుకొస్తే ప్రోత్సహిస్తానని తెలిపారు. ఏఐసిసి సభ్యురాలు, టిపిసిసి ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తామన్నారు. ఇందులో మాజీ ఎంపి రాథోడ్ రమేష్, టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ నరేష్ జాదవ్, ఆదిలాబాద్ నియోజకవర్గ ఇంచార్జీ భార్గవ్‌దేశ్ పాండే, మైనార్టీ జిల్లా చైర్మన్ సాజీద్‌ఖాన్, మండలాలబాధ్యులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వాముల నిరసన

హిందువుల మనోభావాలు దెబ్బతీస్తున్నారని విమర్శ



మన తెలంగాణ/ సంగారెడ్డి టౌన్ : హిందువుల మనోభావాలను కేరళ ముఖ్యమంత్రి దెబ్బతీస్తున్నారని, అయ్యప్ప మాలాధారణ స్వాములు, బిజెపి నాయకులు మండిపడ్డారు. బుధవారం కేరళలో అత్యంత పవిత్రంగా భావించే ఆలయంలోకి 50 సంవత్సరాలలోపు మహిళలు ప్రవేశించడాన్ని వ్యతిరేకిస్తూ సంగారెడ్డి అయ్యప్పస్వాములు, బిజెపి నాయకులు కొత్తబస్టాండ్ వద్ద నిరసన వ్యక్తం చేసి కేరళ ముఖ్యమంత్రి ఫొటోలను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందువులపై ఈ మధ్య దాడి తీవ్రమైందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఆలయానికి ఓ కట్టుబాటు ఉంటుందని, దానిని ప్రశ్నించే అవకాశం ఉండదన్నారు. సుప్రీంకోర్టు మనోభావాలను పట్టించుకోకుండా ఇచ్చిన తీర్పును తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. 40 రోజులపాటు ఎంతో నిష్టగా మాలధారణ చేసి స్వామివారికి దర్శించుకునే హిందువుల మనోభావాలను, ఇతర మతస్తులుగా భావించే వారు మాత్రమే ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడతారన్నారు. ఎలాంటి నియమాలు పాటించకుండా దుస్తులు దరించి అపవిత్రతో గుడిలో స్వామివారిని దర్శించుకోవడం బాధాకరమన్నారు. వీటన్నింటికి కారణం కేరళా ప్రభుత్వం, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రేనని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు రాము స్వామి, మోహన్ స్వామి, వెంకట్‌స్వామి, సంతోష్‌స్వామి, నరేష్‌స్వామి, బిజెపి నాయకులు పవన్, కౌన్సిలర్ సునీల్, ద్వారక రవి తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుకు మరో అవకాశం

ఈనెల 25 వరకు గడువు

మనతెలంగాణ/గూడూరు: అర్హులైన వారు ఓటర్లుగా నమోదుకు ఎన్నికల సంఘం మరోసారి అవకాశం కల్పించింది. కొత్త ఓటర్ల నమోదు కార్యక్రమం ప్రారంభమైనంది. జనవరి 1, 2019 నాటికి 18 ఏళ్లు నిండే వారందరూ కొత్త ఓటర్లుగా పేర్లు నమోదు చేసుకోవచ్చు. ఇప్పటి వరకు ఓటర్ల జాబితాలో పేర్లు లేని వారు కూడా తమ పేర్లు నమోదు చేసుకునే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పించింది. అలాగే ఓటరు జాబితాలో పొరపాట్లను సవరించుకునేందుకు, చిరునామాలు మారిన వారు సైతం సవరించుకునేందుకు అవకాశం ఉంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రజలు ఓటర్ల జాబితాలో పేరు నమోదు చేయించుకోవాలని అధికారులు కోరుతున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఆయా జిల్లాలో చాలామంది ప్రజల ఓట్లు గల్లంతైన విషయం తెలిసిందే. ఓటరు గుర్తింపు కార్డు ఉన్నా జాబితాలో పేరు లేకపోవడంతో చాలామంది ఓటు వేయకుండానే పోలింద్ కేంద్రాల నుంచి వెనుదిరిగారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం ముసాయిదా ప్రకటించి సవరణలు కూడా చేసింది. నూతన ఓటర్ల నమోదుకు ప్రత్యేక డ్రైవ్ కూడా చేపట్టారు. అయినా ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో చాలామంది పేర్లు గల్లంతయ్యాయి. ఈక్రమంలో రానున్న లోకసభ ఎన్నికల నేపథ్యంలో ఓటరు జాబితా సవరణకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. అధికారుల నిర్లక్ష్యమో లేదా ప్రజల అవగాహన రాహిత్యమో భారీగా ఓటర్ల పేర్లు కనిపించడంలేదు. చాలామంది తమకు ఓటరు గుర్తింపు కార్డులు ఉండడంతో తమ పేరు జాబితాలో ఉంటుందనే భరోసాతో ఉన్నారు. దీంతో ఎన్నికల తేదీ సమీపించినా జాబితాలో తమ పేరు ఉందో, లేదో చూసుకోవడంలేదు. అన్‌లైన్‌లో ఓటరుగా నమోదు చేసుకోవడానికి ప్రభుత్వ వెబ్‌సైట్ డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు,సిఈసి తెలంగాణ, ఎన్ఐడి.ఇన్‌ను వినియోగించుకోవాలని అధికారులు కోరుతున్నారు.

బ్యాంకులో గొలుసు చోరీ హడాహుడి

మనతెలంగాణ/మెదక్ టౌన్: మహిళ మెడలోనుంచి సుమారు 1లక్ష 40వేల విలువగల బంగారం గొలుసు చోరీ జరిగిందన్న నేపంతో గంటపాటు మెదక్ స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియా ప్రధాన శాఖలో హడావిడి జరిగింది. బుధవారం కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలం జలాల్‌పూర్ గ్రామానికి చెందిన రాఘవేందర్‌గౌడ్ మౌనిక దంపతులు మెదక్ జిల్లా కొల్చారం మండలంలోని శుభాకార్యానికి వెళ్లి వస్తూ బ్యాంకులో డబ్బు జమా చేయాల్సి ఉండగా మౌనిక మెడలో బంగారు గొలుసు లేకపోవడంతో లబోదిబోమనడంతో బ్యాంకు అధికారులు ఏకంగా ప్రధాన ధ్వారాలను మూసివేసి క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. గంటపాటు జరిగిన సోదాలో ఏమి లభించకపోవడంతో సీక్రెట్ కెమెరాలను క్షుణ్ణంగా తనిఖీ చేయగా బాదితురాలి బంగారు గొలుసు బ్యాంకులో పోలేదని తేలడంతో బ్యాంకు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. బాధితులు రాఘవేందర్‌గౌడ్ మౌనికలు స్థానిక మెదక్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసినట్లు బాధితులు వెల్లడించారు.

మరో మణిదీపం భద్రాద్రి పవర్

- శరవేగంగా నిర్మాణ పనులు
- ఈ నెలాఖరుకల్లా తొలి యూనిట్‌లో ఉత్పత్తికి కసరత్తు
- బొగ్గు రవాణాకు రైల్వే మార్గం నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్
- ఇప్పటికే కెటిపిఎస్ ఏడో దశ ఉత్పత్తి ప్రారంభం
- పూర్తయితే రాష్ట్రంలోనే అధిక విద్యుత్ ఉత్పత్తి ఇక్కడే



మన తెలంగాణ/ఖమ్మం ప్రతినిధి : ఉమ్మడి ఖమ్మం సిగలో మరో కలికితురాయి వచ్చి చేరనుంది. తెలంగాణ స్వరాష్ట్రం సాధించిన తరువాత రెండో వెలుగులు విరజిమ్మనున్నాయి. రాష్ట్ర అవిర్భావం తరువాత అంకురార్పణ జరిగిన తొలి విద్యుతు పవర్ గ్రిడ్ భద్రాద్రి పవర్ ప్లాంట్ మొదటి యూనిట్‌లో ఈనెలాఖరికల్లా ఉత్పత్తి ప్రారంభం కానుంది. మణుగూర్ వద్ద 1080 మెగావాట్ల సామర్థ్యం గల ఈ పవర్ ప్లాంట్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. దాదాపు రూ. 7241.62 కోట్ల వ్యయంతో సబ్ క్రిటికల్ టెక్నాలజీతో నిర్మాణమవుతోంది.

తెలంగాణ రాష్ట్రం సిద్దించిన తరువాత రాష్ట్రంలో విద్యుత్ మిగులు రాష్టంగా మార్చే లక్ష్యంతో 5880 మెగావాట్ల సామర్థ్యంతో జెన్‌కో మూడు కొత్త విద్యుత్ ప్లాంట్ల నిర్మాణానికి పూనుకోగా అందులో భద్రాద్రి పవర్ ప్లాంట్ ఒక్కటి. నల్లగొండ జిలా వాడపల్లి వద్ద యాదాద్రి ఆల్ట్రా మెగా పవర్ ప్లాంటు రెండోది కాగా, పాల్వంచలో కెటిపిఎస్ ఏడో దశ నిర్మాణం మూడోది. అయితే ఇటీవలే కెటిపిఎస్ ఏడో దశ పూర్తయ్యి 800మెగావాట్ల విద్యుత్ ప్రారంభమైన విషయం తెలిసిందే. ఏడోదశ పూర్తి కావడంతో కెటిపిఎస్ నుంచి మొత్తం 2520 మెగావాట్ల విద్యుత్ ఇక్కడ ఉత్పత్తి అవుతుంది. రాష్ట్రంలో థర్మల్ విద్యుత్ కేంద్రాలు కెటిపిఎస్‌తోపాటు రామగుండం, భూపాలపల్లిలో ఉన్నాయి. ఈ మొత్తం కలిపి ఇప్పుడు 3682.5 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. జూరాల, శ్రీశైలం, నాగార్జునసాగర్, పోచంపాడు తదితర జల విద్యుత్ కేంద్రాల ద్వారా మరో 2411.80 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. సౌర విద్యుత్ వల్ల మరో 3416 వేల మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. కానీ ఇప్పుడు రాష్ట్రంలో 10818 మెగావాట్ల గరిష్ట డిమాండ్ ఏర్పడినా ఎలాంటి విద్యుత్ కోతలు లేకుండా నిరంతరం విద్యుత్‌ను సరఫరా చేస్తున్నారు.

రాష్ట్రంలో విద్యుత్ కొరత లేకుండా చూసేందుకు, స్వయం ఉత్పాదక రాష్టంగా మార్చేందకు ముఖ్యమంత్రి కెసిఆర్ ముందుచూపుగా చేపట్టిన కెటిపిఎస్ ఏడోదశ విజయవంతంగా ఉత్పత్తి ప్రారంభించగా ఇక భద్రాద్రి పవర్ ప్లాంట్ కూడా ఉత్పాదనకు సిద్ధమవుతోంది. రాష్ట్ర అవసరాలకు సరిపడే విద్యుత్‌లో అత్యధికంగా అందించే జిల్లాగా భద్రాద్రి కొత్తగూడెం మారబోతుంది. ప్రస్తుతం రాష్టంలో ఎక్కువ విద్యుత్ ఉత్పత్తి అయ్యేది పాల్వంచ కెటిపిఎస్ కాగా ఇప్పుడు భద్రాద్రి పవర్ ప్లాంట్ కూడా తోడు కానుంది.

మణుగూర్–పినపాక రహదారి మార్గంలో నిర్మిస్తున్న భద్రాద్రి పవర్ ప్లాంట్‌లో మొదటి దశగా 270 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని ఈనెల 10న ప్రారంభించాలని ముందుగా నిర్ణయించారు. అయితే కాస్త అలస్యంగా ఈనెలాఖరిలో గానీ, ఫిబ్రవరి మొదటి వారంలోగాని ప్రారంభించేందుకు అక్కడ పనులు యుద్ధప్రాతిపాదికన కొనసాగుతున్నాయి. ఇక్కడ రానున్న పదేళ్ల కాలంలో మొత్తం 1080 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు ఇక్కడ నాలుగు దశల్లో నిర్మాణాన్ని పూర్తి చేయనున్నారు. ఇప్పటికే తొలి దశకు సంబంధించి స్ట్రక్చరల్ కాలం, కూలింగ్ టవర్, చిమ్ని, ఇసిబి బాయిలర్, యాష్‌పాండ్ నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. దాదాపు 1500మంది కార్మికులు, సిబ్బంది ఈ నిర్మాణ పనుల్లో భాగస్వాములయ్యారు. ఈనెలలో అదనంగా మరో ఐదువేల మంది కార్మికులు పాలుపంచుకోనున్నారు. వీరు వస్తే మూడు బాయిలర్స్ పనులు ప్రారంభం అవుతాయి.



ఈ ప్లాంట్‌లో విద్యుత్ ఉత్పదనకు బొగ్గు అవసరం ఉంటుంది. మణుగూర్ పరిసర ప్రాంతాల్లో బొగ్గు నిక్షేపాలు పుష్కలంగా ఉండటం, పక్కనే గోదావరి నది ఉండటం వల్లనే ఈ ప్లాంట్‌ను ఇక్కడ నిర్మించతలపెట్టారు. మణుగూర్ సింగరేణి నుంచి భద్రాద్రి విద్యుత్ ప్లాంట్ వరకు బొగ్గు రవాణ కోసం 16.50 కి.మీ దూరంలో ప్రత్యేకంగా రైల్వే లైన్ నిర్మాణానికి ప్రతిపాదన కూడా పూర్తయింది. దీనికి సంబంధించిన టెండర్ పక్రియ కూడా ముగిసింది. రూ.150 కోట్ల వ్యయంతో రైట్స్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో రైల్వేలైన్ నిర్మాణం రానున్న రెండేళ్లలో పూర్తి కానుంది. ఇప్పటికే పలుమార్లు సర్వేకూడా చేశారు. సింగరేణి కొండాపురం హ్యాండ్లింగ్ ప్లాంట్ నుంచి కూనవరం నుంచి భద్రాద్రి పవర్ ప్లాంట్ వరకు రైల్వే మార్గాన్ని నిర్మించనున్నారు. మణుగూర్ నుంచే కాకుండా ఇతర మార్గాల్లో కూడా బొగ్గు రవాణా చేసేందుకు వీలుగా రైల్వేలైన్‌ను నిర్మించనున్నారు. అప్పటి వరకు లారీలు ఇతర మార్గాల ద్వారా బొగ్గును తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు. ప్లాంట్‌కు రెండు కి.మీ దూరంలో గోదావరి నది ఉండటంతో నీటికి మాత్రం ఎలాంటి ఇబ్బంది లేదు. ఇక్కడ ముడిసరుకు, సహజ వనరులు పుష్కలంగా ఉన్నందునా అన్ని పరిస్థితులు అనుకూలిస్తే రానున్న పదేళ్ల వ్యవధిలో నాలుగువేల మెగావాట్లకు ఈ ప్లాంట్ విస్తరించే అవకాశాలు ఉన్నాయి. ఈ ఏరియాలో గోదారి నీరు పుష్కలంగా ఉండటమే కాకుండా వందేళ్లకు సరిపడే బొగ్గు నిక్షేపాలు కూడా అందుబాటులో ఉన్నాయి. కనుక భద్రాద్రి పవర్ ప్లాంట్ తెలంగాణలోనే ఒక అత్యాధునిక విద్యుత్ ఉత్పత్తి సంస్థగా మారనుంది. రైతులకు 24గంటలపాటు ఉచిత విద్యుత్‌ను అందించడం, ఇతర కారణాలతోపాటు వేసవిలో విద్యుత్ వినియోగం 11,500 మెగావాట్లకు పెరిగే అవకాశం ఉంటుందని గ్రహించిన ముఖ్యమంత్రి కెసిఆర్ రాష్ట్రానికి అవసరమైన విద్యుత్‌ను ఇతర రాష్ట్రాల నుంచి కొనుగోలు చేయాలని ఇటీవల జరిగిన సమీక్ష సమావేశంలో అధికారులకు సూచించారు. కాని ఇప్పటికే కెటిపిఎస్ ఏడో దశ ప్రారంభం కావడంతో మనమే ఇతర రాష్ట్రాలకు విద్యుత్‌ను విక్రయించే స్థాయికి చేరుకోబోతున్నాం. ఇప్పటికే 500 మెగావాట్ల మిగులు విద్యుత్‌ను రాజస్థాన్‌కు అందించి అధిక డిమాండ్ ఉండే రబీ సీజన్ సమయంలో తిరిగి రాజస్థాన్ నుంచి తీసుకొని తెలంగాణ రైతాంగానికి అందిస్తున్నారు. భద్రాద్రి పవర్ ప్లాంట్‌తోపాటు వాడపల్లి వద్ద యాదాద్రి పూర్తయితే మరో 4వేల మెగావాట్ల విద్యుత్ కూడా అందుబాటులోకి రానుంది. ఇదే జరిగితే ఒకనాడు విద్యుత్ లోటు నుంచి ఇప్పుడు మిగులు రాష్ట్రంగా మారబోతుంది.

విశ్వరూపం.. వైభవోపేతం!

- భద్రాద్రి ఆలయంలో కొలువుదీరిన రామయ్య
- వేడుక చూసి తరించిన భక్తజనం

మన తెలంగాణ/భద్రాచలం : శ్రీరాముడు సర్వవ్యాపకుడని శ్రీభక్తరామకీర్తనలో ఉంటుంది. అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు ఎక్కడైతే కొలువై ఉంటాడో అక్కడే వైకుంఠం ఉంటుందని ప్రతీతి. దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాద్రిలో రామయ్యకు కన్నుల పండువగా విశ్వరూప సేవ నిర్వహించారు. బుధవారం సాయంత్రం ఆరు గంటల నుండి తొమ్మిది గంటల వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో దేవస్థానంలోని ఉపాలయాలలో పూజలందుకునే ఉత్సవమూర్తులను శ్రీరామచంద్రమూర్తితోపాటు ఒకే మండపంలో వేంచేసి విశ్వరూప సేవలో కొలువు చేశారు. శ్రీరామనామస్మరణతో.. అర్చకుల వేదమంత్రాలతో.. ఆలయ ప్రాంగణంలోని భక్తులు మంత్రముగ్ధులయ్యారు. చుట్టూ పరివారంతో ఆసీనులైన 'మహారాజు దర్బారులా' భక్తులకు ఆ దృశ్యం తలపించింది. భక్తులు కనులారా కొలువు తీరిన రామయ్యను చూసుకుని మురిసిపోయారు. ఏడాదిలో ఒకసారి జరిగే సర్వదేవతా అలంకార రూపంలో (విశ్వరూప సేవ) దర్శనమిచ్చిన శ్రీరామచంద్రమూర్తిని చూసి భక్తులు పులకించిపోయారు. ముక్కోటి ఉత్సవాలలో భాగంగా 16వ రోజున వచ్చే బహుల ద్వాదశి నాడు ఈ వేడుకను కనుల పండువగా ఆలయంలో నిర్వహించడం సంప్రదాయంగా వస్తోందని ఆలయ వేద పండితులు పేర్కొన్నారు.



విశ్వరూప సేవ విశిష్టత

ఏడాది కాలం చేసే పూజలలో దోషాలు దొర్లితే, వాటి ప్రాయశ్చిత్తం కోసం సీతాలక్ష్మణ సమేత శ్రీరామచంద్రమూర్తితోపాటు 108 మంది దేవతా మూర్తులను కొలువుతీర్చి ఏకకాలంలో పూజలు నిర్వహించడం ఈ విశ్వరూప సేవ విశిష్టత అని పండితులు వివరించారు. ఉత్సవంలో భాగంగా శ్రీ వరాహస్వామి, శ్రీ వెంకటేశ్వరస్వామి, శ్రీ కృష్ణుడు, శ్రీ ఆంజనేయస్వామి తదితర ఉత్సవ మూర్తులతోపాటు ఆళ్వార్ల ఉత్సవ విగ్రహాలను సర్వదేవతా అలంకారంలో తీర్చిదిద్దారు. గరుడ వాహనంపై రాములవారు ఆశీనులు కాగా, సాయంసంధ్య వేళ ఆయన ఇతర ఉత్సవమూర్తులకు ఆరాధన నిర్వహించి ప్రత్యేక ప్రసాదం కదబం నైవేధ్యంగా నివేధించారు. దేవస్థానం విధ్వాంసుల నాదస్వరాల మధ్య ప్రత్యేక కీర్తనలు ఆలపిస్తూ అభిషేక సేవలు, ఆరాధన జరిపించారు. అష్టోత్తర శతనామార్చన, బంగారు పుష్పాలతో అర్చనలు చేశారు. ఈ సందర్భంగా ఆలపించిన భక్తరామదాసు కీర్తనలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కన్నుల పండవగా జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రామయ్య దర్శనంలో తరించారు, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ విధంగా భద్రాచలం దేవస్థానంలో తప్ప మరెక్కడా విశ్వరూప సేవ నిర్వహించకపోవడం విశేషం.

మేకల మందపై చిరుత దాడి



మన తెలంగాణ/యాచారం: యాచారం మండలం పరిధిలోని కొత్తపల్లి శివారులో కాస జంగయ్య అనే స్థానిక రైతు మేకల మందపై చిరుత దాడి చేసి ఒక మేకను కొరికి వేసి మరో మేకను ఎత్తుకెళ్లింది. ఈ ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకొంది. వివరాలోకి వెళితే.. రైతు జంగయ్య తన మేకలను మేపి మందను ఎప్పటిలాగే గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలం వద్ద దొడ్డిలోకి తోలి తడకలతో భద్రం చేసి ఇంటికి వచ్చాడు. ఇదే క్రమంలో చిరుత మధ్యరాత్రి వేళలో మేకల మందపై దాడిచేసి ఒక మేకను చంపివేసి, ఇంకో మేకపోతును ఎత్తుకెళ్లింది. తెల్లవారుజామున దొడ్డికాడికి వచ్చిన రైతు తడకలు చిందరవందరగా పడి వుండడం గమనించి చూడగా సమీపంలో మేక చనిపోయి ఉంది.

మరో మేక మందలో లేకపోయే సరికి ఇది చిరుత పనేనని భావించి సంబంధిత ఫారెస్టు అధికారులకు సమాచారం అందజేశాడు. గతంలో కూడా తన మేకను చిరుత చంపివేసిందని వాపోయాడు. రెండేళ్ల క్రితం కూడా ఈప్రాంతంలో చిరుత సంచరించి మేకలను, లేగదూడలను చంపివేసిందని స్థానికులు పేర్కొన్నారు. తక్షణమే బోను ఏర్పాటు చేసి చిరుతను పట్టివేయాలని, లేదంటే తాము ఇక్కడ తిరిగే పరిస్థితి లేదని ఆందోళన వ్యక్తంజేశారు. అలాగే బాధితునికి నష్టపరిహారం అందేవిధంగా చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం అధికారులు వాటి అడుగులను పరిశీలించారు. గోర్లు దగ్గర దగ్గరగా ఉండడం గమనించామని చిరుత కాదని హైనా అయి ఉంటుందని పేర్కొన్నారు.



అమల్లోకి ఇ-చలాన్

అతిక్రమణకు తప్పదు జరిమానా • ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్స్ రద్దు

మనతెలంగాణ/గద్వాల న్యూటౌన్ : ఇప్పటి వరకు వాహనదారుడుల వారి ఇష్టానుసారంగా వాహనాలు నడిపినప్పటికి ... పోలీసులకు దొరికితే దొంగ అన్నట్లుగా నడిచిపోయింది. కాని ఇకపై అలా ఉండదు. ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా అమలు చేసేందుకు కఠిన చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఈ చలాన్ పద్ధతిని తీసుకొచ్చారు. మంగళవారం నుంచే జిల్లా కేంద్రంతోపాటు అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో అమలు చేశారు. వాహనదారులు అప్రమత్తం కావాల్సిన సమయం అసన్నమైంది. ఇన్నాళ్లు వాహనాలతో చిక్కితేనే జరిమానాలు కట్టాల్సి వచ్చేది. కాని ట్రాఫిక్ నిబంధనలను ఖచ్చితంగా అమలు చేసేందుకు పోలీస్ శాఖ చర్యలు చేప్పట్టింది. హైదరాబాద్ వంటి మహానగరాల్లో అమలులో ఉన్న పద్ధతిని ఇప్పుడు జిల్లాల్లోనూ అమలు చేశారు. ఈ చలాన్ పద్ధతి ప్రకారం ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమాన నుంచి తప్పించుకోలేరు. తరుచూ నిబంధనలను ఉల్లంఘిస్తే వారి లైసెన్స్ రద్దుయ్యే ప్రమాదముంది.

అంతా ఆన్‌లైన్‌లోనే..

ఇప్పటి వరకు ఉదయం వేళనో, సాయంత్రం వేళనో పోలీసులు వాహనాలు తనిఖీ నిర్వహించేవారు. వాహనాలు అపి, సరైన ధ్రువీకరణ పత్రాలు లేని వారికి జరిమానాలు విధించేవారు. ఇకపై జిల్లా వ్యాప్తంగా నిరంతరం నిఘా ఉంటుంది. పోలీస్ సిబ్బంది ఉదయం నుంచి రాత్రి వరకు ట్యాబ్‌లతోపాటు కెమోరాలతో నిఘా పెడతారు. వాహనం నడిపేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే ఫొటోలు తీస్తారు. ట్యాబ్‌లతో వివరాలు నమోదువుతాయి. ఈ చలాన్ ద్వారా జరిమాన పత్రం నేరుగా వాహనదారుల ఇంటికే చేరనుంది. దీంతో బాధిత వాహనదారుడికి ఆన్‌లైన్‌లో జరిమానాను చెల్లించాల్సి ఉంటుంది.

లైసెన్స్ రద్దుకు ఆవకాశం


ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే ఇప్పటి వరకు రూ.100నుంచి రూ.1000 వరకు జరిమానా విధించేవారు. కాని ఈ చలాన్ పద్ధతి ప్రకారం లైసెన్స్ రద్దయ్యే అవకాశం ఉంటుంది. మితిమీరిన వేగంతో వాహనం నడిపినా, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేసినా, మద్యం తాగి వాహనం నడిపినా, భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుంది. వీటితోపాటు రాంగ్ రూట్లో డ్రైవింగ్ చేసినా, రాంగ్ పార్కింగ్ చేసినా, హెల్మెట్ ధరించకుండా వాహనం నడిపినా, పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్లినా, సరుకులను రవాణా చేసే వాహనంలో తరలించినా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లఘించినవారువుతారు. వీరికి పోలీసులు విధించిన చలానాలు నేరుగా ఇంటికి వస్తాయి. సెల్‌ఫోన్‌కూ మెసేజ్ వస్తుంది. తరుచూ ట్రాఫిక్ ఉల్లంఘనకు పాల్పడితే వాహనదారుడి లైసెన్స్ కూడా రద్దయ్యే ఆవకాశాలుంటాయి.

తస్మాత్ జాగ్రత్త

ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి. సాధ్యమైనంత వరకు సొంత వాహనాలను ఇతరులకు ఇవ్వకపోవడం ఉత్తమం. ఒకవేళ తప్పనిసరై మన సొంత వాహనాన్ని ఇతరులకు ఇవ్వాల్సి వస్తే వాహనం నడిపే వారికి సరైన లైసెన్స్ ఉందా, లేదా అని ధ్రువీకరించుకోవాలి. దీంతోపాటు వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ పెట్టుకోవాలని, పరిమితికి మంచి ఎక్కించుకోకూడదని, మితిమీరిన వేగంతో వాహనం నడపవద్దని పోలీసులు సూచిస్తున్నారు. 18 ఏళ్లు వయస్సు నిండని పిల్లలకు ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలను ఇవ్వరాదు. పాతవాహనాలను ఇతరులకు విక్రయిస్తే... వెంటనే రిజిస్ట్రేషన్ మార్పిడి చేయించుకోవాలి. లేకపోతే ఆ వాహనం ఎక్కడైన ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే దానికి సంబంధించిన బాధ్యత వాహనం ఎవరి పేరుపై ఉంటే వారిదే అవుతుంది. ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తే ఎలాంటి సమస్య ఉండదు.


మన తెలంగాణ
10
హైదరాబాద్
గురువారం
3 జనవరి, 2019
www.manatelangana.news

ట్రావెల్



మనోహర క్షేత్రం అలంపురం

చారిత్రక, పౌరాణిక విశేషాలతో, అద్భుతమైన కట్టడాలతో అలరారుతున్న మనోహర క్షేత్రం 'అలంపురం'. తెలంగాణ రాష్ట్రం, జోగులాంబ గద్వాల్ జిల్లాలో ఉన్న ఈ క్షేత్రం కర్నూలు పట్టణానికి 27 కి.మీ దూరంలో తుంగభద్రా నదీ తీరంలో అలరారుతోంది.



అలంపురం సమీపంలో కృష్ణ, తుంగభద్ర నదులు సంగమించడం వల్ల ఈ ప్రాంతాన్ని దక్షిణకాశీగా అభివర్ణిస్తూ ఉంటారు. అలంపురం చుట్టూ నల్లమల అడవులు వ్యాపించి ఉన్నాయి. తుంగభద్ర నది ఎడమ గట్టున అలంపురం ఉంది. అలంపురాన్ని పూర్వం హలంపురంగానూ, హేమలాపురం, అనంపురం, హటాంపురంగానూ వ్యవహరించేవారని క్రీస్తు శకం 1101 సంవత్సరం నాటి శాసనం తెలియజేస్తోంది. ఈ శాసనం పశ్చిమ చాళుక్య రాజు త్రిభువనమల్ల విక్రమాదిత్య 4 కాలం నాటిది. ప్రశాంతమైన వాతావరణంలో అలరారుతున్న ఈ క్షేత్రం అనేక ఆలయాల సమన్వితం. రాజుల పాలనలో ఉన్న ఆయా ఆలయాలన్నీ అలనాటి చరిత్రను కళ్ళకు కట్టినట్లు దర్శింపచేస్తాయి. శాతవాహనులు, ఇక్ష్వాకులు, బాదామి చాళుక్యులు, రాష్ట్రకూటులు, కళ్యాణి చాళుక్యులు, కాకతీయులు, విజయనగరరాజులు, కుతుబ్ షాహీ నవాబులు, అసఫ్జాహీలు వగైరాల పాలనలో వున్న అలంపురం ఒకప్పుడు గొప్ప విద్యాపీఠం.

అలంపురం ప్రాంతం క్రీ.శ. 566 757 వరకు బాదామీ చాళుక్యల పరిపాలనలో వుంది. ఈ సమయంలోనే ఇక్కడ అనేక ఆలయాలు నిర్మితమయ్యాయి. వీటిలో అత్యంత ముఖ్యమైనది జోగులాంబ ఆలయం. ఇది అష్టాదశ పీఠాలలో ఐదవ శక్తి పీఠంగా, తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ఏకైన శక్తి పీఠంగా ఖ్యాతి గాంచింది.

దక్షిణాపథంలో ప్రసిద్ధికెక్కిన ప్రాచీన శైవ క్షేత్రం శ్రీశైలానికి పశ్చిమ ద్వారంగా కూడా అలంపురం పేరుగాంచింది. అలంపురంలో శ్రీ జోగులాంబ దేవాలయమేగాక ఇంకా అనేక దేవాలయాలున్నాయి. వాటిలో ముఖ్యమైనవి నవ బ్రహ్మల ఆలయాలు. వీటిని బాదామీ చాళుక్యులు నిర్మించారు. అయితే ఇవన్నీ ఒకేసారి నిర్మితమయినవి కావు. అయితే 14వ శతాబ్దంలో ముస్లింల దండయాత్రలలో ఈ ఆలయం నేలమట్టమయింది. విజయనగర చక్రవర్తి, రెండవ హరిరహరాయల కొడుకు మొదటి దేవరాయలు ఈ ఆలయాలు ముష్కరుల బారిన పడకుండా రక్షించాడని చారిత్రక ఆధారాల ద్వారా తెలుస్తోంది. ఇది క్రీ.శ. 1390 లో జరిగింది. అయితే 600 సం. ల తర్వాత గతంలో అమ్మవారి ఆలయం వున్న ప్రదేశంలోనే నూతన ఆలయం నిర్మించారు. పాత విగ్రహాన్ని తిరిగి ఇక్కడ ప్రతిష్టించారు.

ప్రశాంతమైన వాతావరణంలో ఆధునిక హంగులతో నిర్మించిన ఆలయమిది. అడుగడుగూ ఆధ్యాత్మికానురక్తిని ప్రోది చేసే ఈ దివ్యాలయ శోభ వర్ణనాతీతం. నూతన ఆలయాన్ని చక్కటి ఆహ్లాదకరమైన ప్రాంతంలో నిర్మించారు. ఆలయాన్ని ఎర్రని ఇసుకరాయితో నిర్మించారు. ఆలయ మండపంలో అష్టాదశ శక్తి పీఠాలను పొందుపరిచారు. ఆలయం చుట్టూ చక్కటి ఉద్యానవనము వుంది. తూర్పున 5 అంతస్తులు , పశ్చిమాన 3 అంతస్తులు గల గాలిగోపురాలున్నాయి. అష్టాదశ శక్తి పీఠాలలో ఐదవ శక్తి పీఠంగా పేర్గాంచిన ఈ క్షేత్రంలో సతీదేవిపై దవడ దంతాలు పడ్డాయంటారు.

జోగులాంబ మహాదేవి, రౌద్ర వీక్షణలోచన, అలంపురం స్థితమాత, సర్వార్థ ఫల సిద్ధిద అని జోగులాంబ దేవిని ప్రార్థిస్తారు. అమ్మవారు ఉగ్రరూపంతో ఉన్నప్పటికీ, ఆలయంలో గల కోనేరు ఈ ప్రాంతంలో వాతావరణాన్ని చల్లబరుస్తూ ఉంటుందని స్థానికుల విశ్వాసం. ఇక్కడ అమ్మవారు ఉగ్రస్వరూపిణి. మొదట అమ్మవారి విగ్రహం బాల బ్రహ్మేశ్వరాలయంలో ఉండేది.

ఈ తల్లి రౌద్ర స్వరూపిణి అయినా భక్తులయందు దయగలది. వారి గృహచ్ఛిద్రాలను తొలగించేది. అమ్మవారి తలపై జుట్టులో బల్లి, తేలు, గుడ్లగూబ, పుట్టెల ఆకారాలు చిన్న సైజులో వుంటాయి. ఇవ్వన్నీ గృహచ్ఛిద్రాలు కలిగించేవి. వీటన్నింటినుంచీ భక్తులకు రక్షణనిచ్చి, సదా వారి గృహాలను కాపాడే దేవతగా, తమ ఇళ్ళ వాస్తు దోషాలను పోగట్టే గృహ చండిగా, దుష్టదృక్కులనుంచీ, దుష్టశక్తులనుంచీ మనని కాపాడే దేవతగా ఈ అమ్మవారిని కొలుస్తారు. వాస్తు దోష నివారణకు కూడా ఈ దేవిని పూజిస్తారు.

ఇతర ఆలయాలు

అలంపురంలో ఉన్న మరో ముఖ్యమైన ఆలయం బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయం. పూర్వం బ్రహ్మ దేవుడు ఇక్కడ తపస్సు చేసి శివ లింగాన్ని ప్రతిష్టించినందు వల్ల ఆ లింగానికి బ్రహ్మేశ్వరుడని పేరు వచ్చింది. ఈ ఆలయం రస సిద్ధులైన శిల్పాచార్యులచేత నిర్మితమైంది. ఇక్కడే రేణుక మాత ఆలయం, నవ బ్రహ్మల ఆలయాలైన బాలబ్రహ్మ, కుమార బ్రహ్మ, అర్కబ్రహ్మ, వీరబ్రహ్మ, విశ్వబ్రహ్మ, గరుడబ్రహ్మ, స్వర్గబ్రహ్మ, తారకబ్రహ్మ, పద్మబ్రహ్మ ఆలయాలున్నాయి. అయితే వీటిలో తారకబ్రహ్మ ఆలయం ధ్వంసమైంది. ఆలయంలోని శివలింగం రక్షింపబడింది. నవబ్రహ్మలయాలలో ప్రతిష్ఠించిన శివలింగాలు ప్రాచీనమైనవి. ఈ ఆలయానికి పశ్చిమదిశలో మహాద్వారం వుంది. నాటి ముస్లింపాలకులు పశ్చిమ ద్వారాన్ని ఆక్రమించి, దర్గా నిర్మించారు. శ్రీ బాల బ్రహ్మేశ్వరాయానికి చుట్టూ కట్టబడిన ప్రాకారాలపై, బండలమీద కొన్ని సంకేతాలున్నాయి. వీటిని తాంత్రిక చిహ్నాలుగా చెబుతారు.

పురావస్తు ప్రదర్శన శాల :

బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయ ప్రవేశద్వారం బయట పురావస్తు సంగ్రహాలయం ఉంది. అలంపూరు పరిసరాలలో దొరికిన విగ్రహాలను, శిలా శాసనాలను ఇందులో భద్రపరిచారు. ఇందులో వందలకొద్దీ అపురూపమైన శిల్పాలున్నాయి. ఈ క్షేత్రాన్ని సందర్శించ వచ్చే పర్యాటకులు వీటిని కూడా దర్శించుకోవచ్చు.

ఉత్సవాలు, పండుగలు:

ఆశ్వయుజ మాసంలో ఈ ఆలయంలో దేవీనవరాత్రులను అత్యంత ఘనంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా జోగులాంబ అమ్మవారికి రథోత్సవాన్ని నిర్వహిస్తారు. అలాగే ప్రతి మంగళవారం, శుక్రవారం రోజులలో అమ్మవారికి విశేష సేవలు నిర్వహిస్తారు. అలాగే, ఉదయం 6 నుంచి 7 గంటల వరకు ప్రత్యేక అర్చనలు , 7 గంటలకు మహామంగళహారతి సేవ జరుగుతాయి.

రవాణ సదుపాయం :

హైదరాబాదు నుంచి సుమారు 200 కి.మీ., లు, మహబూబ్ నగర్ నుంచి 90 కి.మీ. లు, కర్నూలు నుంచి 27 కి.మీ. ల దూరంలో వున్నదీ క్షేత్రం. హైదరాబాదు నుంచి కర్నూలు వెళ్ళే మార్గంలో అలంపురం క్రాస్ రోడ్డు వద్ద ఎడమవైపు తిరిగి , అక్కడనుంచి సుమారు 13 కి.మీ. లు ప్రయాణిస్తే ఈ క్షేత్రాన్ని రుకోవచ్చు.

భోజన, వసతి సదుపాయాలు


అలంపురంలో భోజన వసతి సదుపా లు అంతంత మాత్రంగానే ఉన్నాయి. అందువల్ల ఈ క్షేత్రాన్ని పర్యటించాలనుకునే వారు తగిన ఏర్పాట్లు చేసుకోవాల్సి ఉంటుంది.

ట్రావెల్ కౌన్సిలింగ్

● బెలూం గుహలు ఎక్కడున్నాయి? అక్కడికి ఎలా చేరుకోవాలి?

మనస్విని, వరంగల్

బెలూం గుహలు కర్నూలు జిల్లా కొలిమిగుండ్ల మండలం బెలూం గ్రామ సమీపంలో ఉన్నాయి. ఇవి కర్నూలు నుంచి సుమారు 115 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. బెలూం గుహలు సహజ సిద్ధంగా ఏర్పడిన అతి పొడవైన గుహలు. దాదాపు 3300 మీటర్లు పొడవున్న ఈ గుహలు భారత ఉపఖండంలోనే రెండో పొడవైన గుహలుగా ఖ్యాతిచెందాయి. లక్షలాది సంవత్సరాల క్రితం సహజ సిద్ధంగా ఏర్పడిన ఈ గుహలివి. ఇవి 1884లో వెలుగులోకి వచ్చాయి. 1989లో దీనిని ఆంధ్రప్రదేశ్ పురావస్తు శాఖ తమ అధీనంలోకి తీసుకోగా, 2000లో పర్యాటక శాఖ అధీనంలోకి వెళ్ళాయి. బెలూం గుహలకు మూడు ముఖ ద్వారాలున్నాయి. గుహ లోపలి భాగంలో



పైన, కింద సున్నపురాతి కరగడంతో ఏర్పడిన స్టాలగ్ టైట్, స్టాలగ్ మైట్ లు రకరకాల ఆకారాలతో పర్యాటకులను ఆకర్షిస్తాయి. గుహ లోపల చూడదగిన అనేక ప్రదేశాలున్నాయి. బేతంచర్ల, బనగానపల్లి మీదుగా వీటిని చేరుకోవచ్చు.

● కుర్తాళం జలపాత ఎక్కడుంది? దాని విశేషాలేంటి?


డి. మురళీమనోహర్, గుంటూరు

కుర్తాళం జలపాతం కుర్తాళం పట్టణంలో ఉంది. ఇది తమిళనాడు రాష్ట్రం తిరునల్వేలి పట్టణానికి సుమారు 60 కిలోమీటర్ల దూరంలో ఉంది. కుర్తాళం ఓ అద్భుతమైన సుందర పర్యాటక క్షేత్రం. రోజూ వేలాది మంది దేశ , విదేశీ పర్యాటకులు ఈ క్షేత్రానికి వస్తారు. ఇక్కడున్న కుర్తాళేశ్వర స్వామి వారి ఆలయానికి సమీపంలో కుర్తాళం జలపాతం ఉంది. ఈ జలపాతం కింద స్నానాదికాలు చేస్తే మాన సిక అశాంతి, అలసట దూరమై నూతనోత్సాహం కలుగుతుం ది. టాన్సిల్స్, బిపిలాంటి శారీ రక వ్యాధులతో పాటు మాన సిక రుగ్మతలు గలవారు ఇక్కడ జలపాతంలో స్నానం చేస్తే మానసిక వైకల్యం తొలగిపో తుందంటారు. ఈకుర్తాళం ప్రాంతంలో రెండు వేల రకాల పూలు, వనమూలికలు ఉన్నాయంటారు. అందువల్ల ఆయా వనమూలికల, పూలను తాకుతూ వచ్చిన జలపాత జలాలు శరీర రుగ్మతలను దూరం చేస్తాయంటారు. ఇక్కడున్న మరో ప్రధాన ఆకర్షణ బాడీ మసాజ్ . ఇక్కడకు వచ్చే దేశ, విదేశీ పర్యాటకులు బాడీ మసాజ్ చేయించుకుని, సాంత్వన పొందుతూ ఉంటారు. ఈ కుర్తాళం జలపాత జలాలలో రుగ్మతలను పోగొట్టే లక్షణాలతోపాటు నూతనోత్సాహాన్ని కలిగించే గుణాలు అపారంగా ఉన్నాయంటారు.

● భీముని కొలను ఎక్కడుంది? దానినెలా చేరుకోవాలి?

కె. శ్రియగాయత్రి, హైద్రాబాద్


శ్రీశైలం చుట్టు పక్కలున్న మనోహరమైన పర్యాటక ప్రాంతాలలో భీముని కొలను చెప్పుకోదగ్గది. దీనిని శ్రీశైలంలోని సాక్షి గణపతి ఆలయానికి కొంచెం దూరంలో లోయలో ఉన్న ప్రాంతం. భీముని కొలను చేరుకోవడానికి శతాబ్దాల కిందట రెడ్డి రాజులు మెట్లు కట్టించారు. మెట్ల దారిలో ఒక కిలోమీటరు దూరం నడిచిన తరువాత , దట్టమైన అడవితో విశాలమైన లోయ కనిపిస్తుంది. ఈ దారిలో నడక సాగిస్తే త్రివేణీ, త్రి పర్వత సంగమానికి చేరుకోవచ్చు. వందల అడుగుల లోతున్న లోయల మధ్య తూర్పు నుంచి ఒక సెలయేరు, దక్షిణం నుంచి మరో సెలయేరు వచ్చి చిన్న చిన్న జలపాతాలుగా దర్శనమిస్తాయి. జలపాతాలు ఏర్పరిచే కొలను మనోహరంగా ఉంటుంది. దీనినే భీముని కొలను అని పిలుస్తున్నారు. కొలను ఒడ్డున భీమాంజనేయుల విగ్రహాలు కనిపిస్తాయి. ఇక్కడికి సమీపంలోని పురాతన శివాలయం ఉంది. అయితే భీముని కొలను దట్టమైన నల్లమల అడవిలో ఉంది కనుక ఇక్కడకు వెళ్ళడానికి ఒంటరిగా కాకుండా బృందాలుగా వెళ్ళడం శ్రేయస్కరం.



ట్రావెల్ ఎక్స్‌పర్ట్
దాసరి దుర్గాప్రసాద్
7794096169

ఆధ్యాత్మిక కళాధామం బుద్ధగయ

ప్రపంచం దుఃఖమయం. దుఃఖానికి కోరికలే కారణం. కోరికలను జయించటానికి అష్టాంగమార్గమే సరిఅయిన మార్గం అని చాటి చెప్పిన మహనీయుడు గౌతమ బుద్ధుడు. ఆయన సంచరించిన ప్రదేశాలు మన దేశంలో అనేకం ఉన్నప్పటికీ, వీటిలో బుద్ధుడు జ్ఞాన సిద్ధిని పొందిన ప్రదేశం మాత్రం బుద్ధగ.



బుద్ధునికి జ్ఞానోదయం కల్గిన పుణ్యప్రదేశంగా, దేశంలోనే బుద్ధుని పాదస్పర్శతో పునీతమయిన పుణ్యప్రదేశాలలో ఒకటిగా, ప్రసిద్ధ పర్యాటక క్షేత్రాలలో ఒకటిగా విరాజిల్లుతున్న ఈ దివ్య క్షేత్రం బీహార్ రాష్ట్రం, గయ జిల్లాలో ఉంది. బుద్ధగయ లో ఉన్నబోధి వృక్షం అంటే రావి చెట్టు క్రింద బుద్ధునికి జ్ఞానోదయం కలిగింది . బుద్ధునికి చెందిన మహిమాన్విత క్షేత్రాలలో ఒకటిగా విరాజిల్లుతున్న బుద్ధగయ దివ్య క్షేత్రం అపురూపమైన అందాలకు నెలవుగా అలరారుతోంది.

ఈ క్షేత్రాన్ని చారిత్రికంగా ఉరువేల, సంబోధి, వజ్రాసన లేదా మహాబోధి అని పిలుస్తాం. గౌతమ బుద్ధుడు ఫాల్గు నది ఒడ్డున ఉన్న బోధి చెట్టుకింద ధ్యానం చేయడానికి ఇక్కడికి వచ్చాడని బౌద్ధ పురాణాల కథనం. బుద్ధుడు తన ఆధ్యాత్మిక ఎదుగుదలకు సంబందించి అన్ని ప్రశ్నలకు సమాధానాలు పొందిన ప్రదేశమిది. అలాగే, 13 వ శతాబ్దంలో టర్కిక్ సైన్యాలు ఈ క్షేత్రాన్ని ఆక్రమించేంత వరకు, ఈ ప్రాంతం కొన్ని శతాబ్దాలుగా బౌద్ధ నాగరికతకు కేంద్రంగా ఉంది.

బుద్ధుడు వెళ్ళిన అనేక శతాబ్దాల తరువాత, మౌర్య రాజు అశోకుడు బౌద్ధమతానికి గుర్తుగా పెద్ద సంఖ్యలో ఆరామానాలు, స్తంభాలను నిర్మించాడు. బుద్ధగయలో ఉన్న ముఖ్యమైన పర్యాటక స్థలం ఇక్కడున్న మహాబోధి ఆలయం. దీనిని గౌతమ బుద్ధుడు జ్ఞానాన్ని పొందిన స్థలంగా భావించి పూజిస్తారు.ప్రశాంతమైన వాతావరణం ప్రకృతి అందాల నడుమ అలరారుతున్న మహాబోధి ఆలయాన్ని పూర్తిగా ఇటుకలతో నిర్మించారు. ఆ మందిరం ఎత్తు 170 అడుగులు. ఈ మందిరాన్ని 2300 సంవత్సరాల క్రితం అశోకుడు నిర్మించాడు. మహాబోధి ఆలయం ద్రవిడుల నిర్మాణ శైలిలో ఉంది. ఈ ఆలయ ప్రధాన గోపురాన్ని 19వ శతాబ్దంలో 55 మీటర్ల ఎత్తులో పునర్నిర్మించారు. ప్రధాన గోపురం చుట్టూ, అదే శైలిలో నాలుగు చిన్న గోపురాలు నిర్మించారు. ఈ ఆలయ నాలుగు సరిహద్దులు రెండు మీటర్ల ఎత్తులో దగ్గరగా రాతి రైలింగుతో ఉన్నాయి. అనేక రైలింగ్‌లు సూర్య, లక్ష్మి , ఇంకా అనేక భారతీయ దేవీ దేవతల విగ్రహాలతో ఉంటే, కొన్ని రైలింగ్‌లు తామరపూలతో దర్శనమిస్తాయి.

రోజూ వేలాది మంది పర్యాటకులు దర్శించుకునే ఈ ప్రాంగణంలోని అసలు బోధి వృక్షాన్ని బౌద్ధమతస్థులు నేపాల్‌కు తీసుకువెళ్ళగా, అక్కడ నుంచి ఒక శాఖను తెచ్చి ఇక్కడ నాటారని చెబుతారు. విశాలంగా పరచుకున్న ఈ బోధి వృక్షం చుట్టూ ఫెన్సింగ్ చేసి గేటు నిర్మించారు. ఈ గేటును దాటి లోపలికి వెళితే బుద్ధుడు కూర్చున్న ప్రదేశం ఉంది. బుద్ధునికి జ్ఞానోదయం అయిన తర్వాత ఈ క్షేత్రంలోనే ఏడు వారాలు గడిపాడంటారు. ఇదే ప్రాంగణంలో అనేక స్తూపాలు దర్శనమిస్తాయి. ఆ స్తూపాల మధ్యలో ఒక మనిషి పడుకోవటానికి సరిపడే బెడ్డులు పరిచి ఉన్నాయి. కొందరు భక్తులు అక్కడనే నిద్రపోతారు. అలాగే అక్కడే ధ్యానం చేస్తారు. దీనికి కొంచెం దూరంలోనే బుద్ధుడు తన ప్రధాన శిష్యులకు జ్ఞాన బోధను చేసిన ప్రదేశం ఉంది. ఇక్కడ బుద్ధుడు జ్ఞాన బోధను శిష్యులకు చేస్తున్నట్టుగా ఉన్న మూర్తులు అందంగా దర్శనమిస్తాయి. దీనికి సమీపంలోనే పూరి జగన్నాధుని ఆలయంతో పాటు, టిబెట్, చైనా, జపాన్ దేశస్థులు నిర్మించిన మరో మూడు మందిరాలు కూడా దర్శనమిస్తాయి.

ఉత్సవాలు, పండుగలు:

ఏటా బుద్ధ జయంతిని ఈ ప్రాంగణంలో అత్యంత ఘనంగా నిర్వహిస్తారు. ఆ రోజున లక్షలాది మంది దేశ విదేశీ బౌద్ధ పర్యాటకులు ఈ క్షేత్రాన్నిసందర్శిస్తారు. అలాగే ఏటా నవంబర్ నెలలో మూడు రోజుల పాటు వార్షిక బుద్ధ ఉత్సవాన్నినిర్వహిస్తారు.

రవాణ సదుపాయం :

ఈ దివ్య క్షేత్రానికి చేరుకోవడానికి దేశంలోని అనేక ప్రాంతాల నుంచి రవాణ సదుపాయం ఉంది. ఈ క్షేత్రం వారణాసి నుంచి 255 కిలోమీటర్ల దూరంలో ఉంది. అందువల్ల వారణాసి వరకు రైలులో గాని, విమానంలోగాని, బస్సులో గాని వచ్చి అక్కడ నుంచి ఏదైనా వాహనంలో ఇక్కడకు చేరుకోవచ్చు. అలాగే 'గయ' వరకు వచ్చి అక్కడ నుంచి ఏదైనా వాహనంలో కూడా చేరుకోవచ్చు.

భోజన, వసతి సదుపాయాలు

దేశ విదేశీ పర్యాటకులు విపరీతంగా సందర్శించే ప్రాంతం కావడం వల్ల ఇక్కడ భోజన, వసతి సదుపాయాలకు ఎలాంటి ఇబ్బంది లేదు. ఇక్కడ అనేక హోటళ్ళు,సత్రాలు అందుబాటులో ఉన్నాయి.



పోటీ

ఎస్ లక్ష్మీనారాయణ
డైరెక్టర్, రామయ్య
కాంపిటీటివ్ కోచింగ్ సెంటర్
దిల్‌సుఖ్ నగర్, హైదరాబాద్,
8885555202

శివాజీకి సమకాలికుడు ఎవరు?





కడపటి మొఘల్ రాజులు (1707–1857)

- పంజాబ్ గవర్నర్ మునీమ్‌కాన్ భార్య 'మొఘలానీబేగం' ఢిల్లీలోని ధనవంతుల ఇళ్ళను చూపగా వాటి మొత్తంను దోచుకున్నాడు.
- ఇతడు భారతదేశం నుండి 15కోట్ల రూపాయలు, కోహినూర్ వజ్రంను నెమలి సింహాసనంను, 300 ఏనుగులు, 10,000 గుర్రాలు, 10,000ఒంటెలు, 130మంది కవులను, 200మంది తాపీ మేస్త్రీలను, 100మంది కొజ్జాలను తీసుకెళ్ళారు. దీంతో మొఘల్ రాజ్యం ఆర్థికంగా బలహీనపడింది.
- **అహ్మద్ షా (1748–54) :** మొదటిసారిగా మహారాష్ట్రులకు 'శరణాగతుడైన' మొఘల్ రాజు.
- **2వ హాలం (1759–1806) :** కడపటి మొఘల్‌లలో ఎక్కువ సం॥లు పాలించిన రాజు.
- ఇతని కాలంలో 3వ పానిపట్టు యుద్ధం జరిగింది (1761 జనవరి 14)
- అహ్మద్ షా అబ్దాలీ, మహారాష్ట్రులకి మధ్య జరిగింది.
- **అహ్మద్ షా అబ్దాలీ (1748–69) :** ఇతడు నాదిర్షా సేనాపతులలో ఒకడు.
- 1747లో నాదిర్షా హత్యచేయబడగా నాయకుడిగా ఎన్నికయి. అఫ్గాన్ లందరినీ సంఘటితపరిచి 'అఫ్గానిస్థాన్' అనే పేరును పెట్టాడు.
- 1761 జనవరి 14న 5వ పర్యాయం భారత్‌పై దండెత్తి మూడవ పానిపట్టు యుద్ధంలో సదాశివరావ్‌భావే నాయకత్వంలోని మహారాష్ట్రులను ఓడించాడు. దీంతో భారతదేశంను పరిపాలించే అవకాశంను మహారాష్ట్రులు కోల్పోయారు.
- 2వ షా ఆలం కాలంలోనే బెంగాల్‌లో 1764 అక్టోబర్22న బాక్సార్ యుద్ధం జరిగింది.
- బ్రిటీష్ వారికి బెంగాల్‌లో దివానీ అధికారంను ఇచ్చిన మొఘల్‌రాజు – 2వ షా ఆలం.
- మొఘల్‌లలో చివరివాడు – 2వ బహదూర్‌షా.
- ఇతడు 1862లో బర్మాలోని రంగూన్ జైలులో మరణించడంతో మొఘల్ వంశం అంతమయ్యింది.

మరాఠా విజృంభన / శివాజీ

శివాజీ 1627 – 80

- మరాఠా రాజ్యస్థాపకుడు – శివాజీ.
- శివాజీ 1627 షాజీబొంస్లే, జిజియాబాయిలకుశివనేర్ దుర్గంలో జన్మించాడు.
- శివాజీ తండ్రి షాజీబోంస్లే బీజాపూర్ సుల్తాన్‌ల దగ్గర పూణే జాగిర్దార్‌గా పనిచేసాడు.
- శివాజీ తొలిగురువు తల్లి – జిజియాబాయి.
- సంరక్షకుడు / యుద్ధ గురువు – దాదాజీ కొండదేవ్.
- మత / ఆధ్యాత్మిక గురువు – సమర్థరామదాసు.
- ఇతని గ్రంథం – దసబోధ.
- భక్తతుకారాం శివాజీకి సమకాలికుడు.
- శివాజీకి గల బిరుదులు : ఛత్రపతి, హైంధవదర్మోద్ధారక.
- శివాజీ గుర్రం పేరు – పంచకళ్యాణి.

శివాజీకి ఐదుగురు భార్యలు.

1. సాయిబాయి (నింబాల్కర్).
2. సోయరాబాయి.
3. పుతలాబాయి.
4. సఫర్‌బాయి.
5. కాశీబాయి.

- శివాజీ ఆస్థానంలో 'అష్ట ప్రధానులు' అనే మంత్ర మండలి కలదని రఘునాథ పండితుడు – రాజ్యవ్యవహారాలకోశం అనే గ్రంథంలో పేర్కొన్నాడు.
- అష్టప్రధానులు మొత్తం ఎనిమిది మంది.

1. పీష్వా – ప్రధాని
2. అమాత్య/మజుందార్ – ఆర్థికశాఖ మంత్రి
3. మంత్రి/వాకియానావిస్ – నిఘా, స్వదేశీ వ్యవహారాలు (హోంమంత్రి)
4. సుమంత్ / దాజీర్ – విదేశాంగమంత్రి
5. సచివ్ / సుర్నవిష్ – ఉత్తర ప్రత్యుత్తరాలు
6. సేనాధిపతి / సారినోబత్ – సైన్యాధిపతి
7. పండిత్‌రావు / సదర్ – మతాదిపతి
8. న్యాయాధీశుడు – ప్రధాన న్యాయమూర్తి

- ఈ మంత్రి మండలికి ప్రతినిధి / వైశ్రాయ్ అనే పదవిని రాజారామ్ సృష్టించాడు.
- దీనితో వీరు నవప్రధానులు అయ్యారు.
- తొలి ప్రతినిధి – ప్రహ్లాద్ నిరూజ్.
- శివాజీ రాజ్యంను నాలుడు సుభాలు (రాష్ట్రాలుగా) విభజించి వాటికి సుబేదార్ అనే అధిపతులను నియమించాడు.
- రాజ్యాన్ని కింది భాగాలుగా విభజించి పాలించాడు.

1. సుభా – సుబేదార్
2. పరగణా – పౌజ్‌దార్
3. తరఫ్ – తర్ఫ్‌దార్
4. మౌజా/గ్రామం/గ్రామణి/పటేల్/ముఖ్యకులకర్తి.

- శివాజీ గ్రామాలలో బారాబులుతాదార్ (12 అయ్యగార్లు) విధానం ప్రవేశపెట్టాడు.
- జీతాలకు బదులు భూమి పన్ను వసూలు హక్కు కల్పించడం – సరంజామి.
- భూమిశిస్తు – 2/5 వంతు విధించాడు.
- పొరుగు రాజ్యాలనుండి – చౌత్ 1/4, సర్దేశ్‌ముఖి 1/10 వంతు వసూలు చేశాడు.
- ఎం.జి. రణడే ఈ విధానం – ఫార్మింగ్‌ఔట్‌ను బ్రిటీష్ వారి సైన్యసహకార విధానంతో పోల్చాడు.
- శివాజీ వద్ద 200 యుద్ధ నౌకలను, 80 ఫిరంగులు కలిగి ఉన్నాడు.
- కొలాబా వద్ద నౌకాదళం కలదు.
- తోఫ్‌ఖాన్ – శివాజీ ఫిరంగిదళ పేరు.
- మధ్యయుగంలో నౌకదళ అవశ్యకతను గుర్తించిన మొదటి భారతీయ పాలకుడు శివాజీ అని A.I. శ్రీవాత్సవ పేర్కొన్నాడు.

శివాజీ దండయాత్రలు

- 1646 – శివాజీ తొలిసారిగా తోరణదుర్గంను ఆక్రమించాడు.
- 1656 చంద్రారావు మోరే నుంచి 'జావళి దుర్గం'ను ఆక్రమించాడు. ఇది శివాజీ మొదటి గొప్ప ఆక్రమణ.
- 1659 శివాజీని వదించుటకు బీజాపూర్ సుల్తాన్ అఫ్జల్‌ఖాన్‌ను పంపించాడు. కానీ ఇతడిని ప్రతాప్‌ఘడ్ కోట వద్దనే శివాజీ చంపాడు.
- ఇది చరిత్రలో అఫ్జల్‌ఖాన్ వధగా పేరుగాంచినది.
- 1960 – 63లో ఔరంగజేబ్ తన మేనమామ అయిన షాయిస్తఖాన్‌ను శివాజీ పైకి పంపగా అతన్ని శివాజీ ఓడించాడు.
- ఔరంగజేబు శివాజీని మౌంటెన్‌ర్యాట్‌గా పేర్కొన్నాడు.
- 1664లో శివాజీ సూరత్‌పై దాడిచేసి 1 కోటి రూపాయల లూటీ చేశాడు.
- 1665లో శివాజీని పట్టుకొనుటకు ఔరంగజేబు రాజాజయసింహ్/జైసింగ్‌ను పంపాడు.
- 1665లో రాజాజైసింగ్ శివాజీని ఓడించి పురందర్ సంధిని చేసుకున్నాడు.

పురందర్ సంధి ముఖ్యాంశాలు

1. శివాజీ 35 కోటలలో 23 కోటలను ఔరంగజేబుకు ఇచ్చాడు.
2. కరెన్సీ నష్టపరిహారం చెల్లించుటకు అంగీకరించాడు.
3. ఔరంగజేబ్‌కు సైనిక సహాయం చేయుటకు అంగీకరించాడు.

- 1666లో శివాజీ తన పెద్ద కుమారుడైన శంభాజీలు ఔరంగజేబ్‌ను కలుసుకొనుటకు ఆగ్రా వెళ్లాడు.
- ఔరంగజేబ్ శివాజీకి తక్కువ స్థాయి మున్సబ్‌దార్ హోదా నిచ్చి అవమానించాడు.
- దీంతో ఔరంగజేబ్‌ను దూషించి బంధించబడ్డాడు.
- రోష్‌నారా సహాయంతో ఒక బిచ్చగాడి వేశంలో కోటలో నుండి తప్పించుకున్నాడు. తర్వాత తన కోటలను తిరిగి ఆక్రమించుకోవడం ప్రారంభించాడు.
- 1672లో సూరత్‌ను రెండవసారి కొల్లడొట్టాడు.
- 1674 జూన్ 16న మహారాష్ట్రలోని రాయఘడ్ కోటలో (రాజధాని) గాగాభట సహాయంతో పట్టాభిషేకం చేసుకున్నాడు.
- శివాజీ ఛత్రపతి అనే బిరుదు పొందాడు.
- శివాజీ పట్టాభిషేకానికి హాజరైన ఆంగ్లేయుడు – ఆక్సిన్‌డేన్.
- 1676లో శివాజీ, హసన్‌తానిషా (గోల్కొండరాజు)ల మధ్య 'గోల్కొండ ఒప్పందం' జరిగింది.
- 1677లో గోల్కొండను శివాజీ సందర్శించాడు.
- 1974 – 80 మధ్యకాలం శివాజీ పాలనపై దృష్టి సారించాడు.
- 1680 ఏప్రియల్ 14న శివాజీ మరణించాడు.

1. శాసనం : మస్కి శాసనం
వేయించిన రాజు : అశోకుడు
విషయం : దేవానాంప్రియ అశోక అని సంబోధించిన ఏకైక శాసనం

2. శాసనం : జోగడ శాసనం
వేయించిన రాజు : అశోకుడు
విషయం : అశోకుడి కళింగ యుద్ధం గురించి పేర్కొంటుంది.

3. శాసనం : ఎర్రగుడి / రాజుల మందగిరి శాసనం
వేయించిన రాజు : అశోకుడు
విషయం : ఆంధ్రలో లభ్యమైన అశోకుని శాసనాలు విద్యార్థులలో ధర్మాసక్తిని కలిగించాలని తెలుపుతుంది.

4. శాసనం : నానాఘాట్ శాసనం
వేయించిన రాజు : మొదటి శాతకర్ణి
విషయం : శాతకర్ణి భార్య నాగనిక వేయించింది.

5. శాసనం : హాథిగుంఫా శాసనం
వేయించిన రాజు : భారవేలుడు
విషయం : శుంగులు , శాతవాహనులపై ఖారవేలుని విజయాలు.

6. శాసనం : గుంటుపల్లి శాసనం
వేయించిన రాజు : ఖారవేలుడు
విషయం : ఆంధ్రలో లభించిన ఖారవేలుని శాసనం

7. శాసనం : నాసిక్ శాసనం
వేయించిన రాజు : ఖారవేలుడు
విషయం : ఆంధ్రలో లభించిన ఖారవేలుని శాసనం

8. శాసనం : అమరావతి
వేయించిన రాజు : రెండవ పులుమావి
విషయం : ఆంధ్రలో లభిస్తున్న తొలి శాతవాహన శాసనం

బెన్ను ఉపగ్రహ కక్ష్యలోకి నాసా వ్యోమనౌక ప్రవేశం





ఉపగ్రహం బెన్ను చుట్టూ ఉన్న కక్ష్యలోకి నాసా వ్యోమనౌక ఒసిరిస్ - రెక్స్(ఓఎస్ఐఆర్ఐఎస్- ఆర్ఇఎక్సు) మంగళవారం కొత్త సంవత్సరం నేపథ్యంలో దిగ్విజయంగా ప్రవేశించి రికార్డు సృష్టించింది. అంతరిక్షం లో ఉన్న ఈ చిన్న గ్రహం కక్ష్య లోకి ఇంతవరకుఏ వ్యోమనౌక ప్రవేశించ లేదు. కొత్త సంవత్సరానికి స్వాగతం పలకడానికి అనేక సన్నాహాలు భూమిపై జరుగుతున్న సమయంలో ఈ విజయం సాధించ గలగడం విశేషం. 110 మిలియన్ కిలోమీటర్ల దూరంలో ఈ వ్యోమనౌక తన థ్రస్టర్స్‌ను ఎనిమిది నిముషాల సేపు మండించి ముందుకు దూసుకు వెళ్లినట్టు నాసా తన ప్రకటనలో తెలిపింది. ఆ తరువాత కక్ష్యలో ఈ వ్యోమనౌక ప్రవేశమైంది. కక్ష్య లోకి వ్యోమనౌకను కచ్చితంగా ప్రవేశ పెట్టడంలో తమ బృందం సుదీర్ఘ విజయ యాత్రను కొనసాగిస్తోందని యూనివర్శిటీ ఆఫ్ ఆరిజోనా కు చెందిన ఒసిరిస్ ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ డాంటే లారెట్టా ప్రకటించారు. వ్యోమనౌక ప్రయాణం పూర్తి కావస్తోందని, సైంటిఫిక్ మ్యాపింగ్, నమూనా సైట్ ఎంపిక ఘట్టానికి సంబంధించి దృష్టి కేంద్రీకరిస్తామని చెప్పారు. కొన్నేళ్లుగా తమ బృందం ప్లాను చేస్తున్న విధంగా కక్ష్య లోకి వ్యోమనౌక ప్రవేశం పూర్తి కావడం విస్మయం గొలుపుతోందని తెలిపారు. ఇది మానవ చరిత్రలో ముందడుగుగా అభివర్ణించారు. ఇదివరకెప్పుడూ ఈ విధంగా భూమి నుంచి బయలు దేరిన వ్యోమనౌక ఈ చిన్న ఉపగ్రహం కక్ష్య లోకి ప్రవేశించ లేదని ఇక్కడ వ్యోమనౌక స్థిరంగా ఉండడానికి కావలసిన గురుత్వాకర్షణ శక్తి ఉందని వివరించారు. బెన్ను ఉపగ్రహం గురుత్వాకర్షణ శక్తి చాలా చిన్నది. బెన్ను ఉపరితలంపై కల సౌర ధార్మికత, థెర్మల్ ప్రెజర్, వంటి శక్తులు ప్రభావం వ్యోమనౌక భ్రమణానికి అనుకూలంగా ఉందని, అదే భూమి, అంగారక గ్రహాలకైతే గురుత్వాకర్షణ శక్తి చాలా తీవ్రంగా ఉంటుందని చెప్పారు. ఈ వ్యోమనౌక కేంద్రం నుంచి బెన్నూ చుట్టు 1.75 కిలోమీటర్ల పొడవున తిరుగుతుందని గ్రహానికి ఇంత చేరువగా అధ్యయనం చేయడానికి వచ్చిన వ్యోమనౌక మరేదీ లేదని చెప్పారు. గతంలో గ్రహానికి అత్యంత చేరువలో వ్యోమనౌక పరిభ్రమించడం 2016 మేలో జరిగిందని, ఆనాడు రోసెట్టా వ్యోమనౌక తోకచుక్క 67పి కేంద్రం నుంచి ఏడు కిలోమీటర్లకు మించి చుట్టూ తిరిగిందని పరిశోధకులు వెల్లడించారు. ఒసిరిస్ రెక్స్ వ్యోమనౌక ఫిబ్రవరి మధ్యలో బెన్నూ ఉపగ్రహ కక్ష్య లోకి ప్రవేశించ డానికి షెడ్యూలు నిర్ణయమైంది. ప్రతి కక్ష్యకు 62 గంటల పాటు విశ్రాంతి తీసుకో వలసి ఉంటుంది. ఇప్పుడు వ్యోమనౌక ఉపగ్రహానికి చాలా చేరువలో ఉంది. ఉపగ్రహం తాలూకు భౌతిక వివరాలు తక్కువ సమయంలోనే గ్రహించ వలసి ఉంటుంది. 2020 లో ఈ వ్యోమనౌక తన రోబోటిక్ భుజంతో గ్రహాన్ని తాకి పరిశోధనలకు ఉపక్రమిస్తుంది. కారు ఎయిర్ ఫిల్టర్ వంటి వర్తులాకార సాధనాన్ని ఉపయోగించి వాక్యూమ్‌ను రివర్స్ చేసి స్థిరంగా నిలదొక్కుకుని అక్కడి దుమ్మును సేకరిస్తుంది. ఆ సాధనం ద్వారా గ్రహం ఉపరితలం నుంచి 60 గ్రాముల మట్టిని సేకరించి తిరిగి భూమిపైకి 2023 నాటికి చేరుకుంటుంది.

బెన్నుతో రిస్కు

సౌరవ్యవస్థ ఆరంభం నాటి గ్రహ తునకగా భావించే బెన్ను ఉపగ్రహం కూడా ప్రమాదకరమైనదిగా ఖగోళ శాస్త్రవేత్తలు వర్గీకరించారు. దీనివల్ల కొద్దిగా రిస్కు ఉందని చెబుతున్నారు. 2135 లో భూమిని ఢీ కొంటుందని హెచ్చరిస్తున్నారు. కార్బన్ పుష్కలంగా ఉన్న ఈ ఉపగ్రహాన్ని సౌరవ్యవస్థ లోని ఐదు లక్షల ఉపగ్రహాల్లో ఎంపిక చేశారు. ఎందుకంటే దీని కక్ష్యలు భూమికి అత్యంత చేరువలో ఉండడమే ముఖ్య కారణం. సూర్యుని చుట్టూ భూమి ఎలా అయితే పరిభ్రమిస్తుందో అదే మార్గంలో ఇది కూడా పరిభ్రమిస్తుంది. శాస్త్రీయ పరిశోధనకు అనుకూలమైన పరిమాణం లో ఇది ఉంది. చాలా ప్రాచీనమైన ఉపగ్రహంగా నాసా గుర్తించింది. సౌరవ్యవస్థ నిర్మాణం ఎలా జరిగిందో ఈ ఉపగ్రహ పరిశోధన వల్ల తెలుస్తుందని శాస్త్రవేత్తలు ఆశిస్తున్నారు. అంతే కాకుండా ఖనిజాలు, నీరు వంటి విలువైనవి ఉపగ్రహాల్లో ఎలా ఉంటాయో కనుగొనడానికి ఈ పరిశోధన ఉపయోగపడుతుందని ఆశాభావంతో శాస్త్రవేత్తలు ఉన్నారు.

– సైన్స్ విభాగం


నేల నుంచే సుడిగాలులు లేస్తాయి




వాషింగ్టన్ : సుడిగాలులు వచ్చే ముందు వాతావరణ విభాగం అధికార యంత్రాంగం హెచ్చరికలు జారీ చేయడంలో పొరపాటు పద్ధతిని అనుసరిస్తున్నట్టు అధ్యయనంలో బయటపడింది. సుడిగాలులు, సుడిగాలితో కూడిన తుపాన్లు ఎలా ఏర్పడతాయన్న విషయంలో చారిత్రకంగా అనేక సిద్ధాంతాల వైరుధ్యాలు ఉన్నాయని అమెరికా లోని ఒహియో యూనివర్శిటీ పరిశోధకులు పేర్కొన్నారు. 1970 నుంచి 1990 వరకు జరిపిన అధ్యయనం బట్టి అవి పై నుంచే ఏర్పడతాయని చాలావరకు అంగీకరించడమవుతోంది. అయితే కొత్త అధ్యయనం ప్రకారం సుడిగాలులు భూమిపై నుంచే లేస్తాయని ఆధారాలతో నిరూపిస్తోంది. దీన్ని బట్టి భవిష్యత్తులో హెచ్చరికలు జారీ చేసే విషయంలో ఈ ప్రభావం ఉంటుందని చెబుతున్నారు. ఈ కొత్త సిద్ధాంతాలు మొట్టమొదటి సారి వెలుగు లోకి వచ్చాయి. ఆధునిక రాడార్ వ్యవస్థ దీనికి సంబంధించిన డేటాను వేగంగా సేకరించ గలిగింది. పరిశోధక బృందం సుడిగాలులు (టోర్నడోస్) నేల పై నుంచే వ్యాపిస్తాయని వేగంగా విస్తరిస్తాయని ప్రయోగాత్మకంగా చూపించ గలిగారు. చాలా ఏళ్లుగా వస్తున్న సిద్ధాంతాలకు ఇది పూర్తిగా భిన్నం. మబ్బుల నుంచే సుడిగాలులు వస్తాయని, అవి నేలపైకి దిగుతాయని ఇది వరకటి సిద్ధాంతాలు చెబుతూ వచ్చేవి.

– సైన్స్ విభాగం

పార్కిన్‌సన్ వ్యాధి చికిత్సకు వైర్‌లెస్ సాధనం





పార్కిన్‌సన్స్, అపస్మారక స్థితి (ఎపిలెప్సీ) వంటి వ్యాధుల చికిత్సకు ఉపయోగపడే వైర్‌లెస్ పరికరాన్ని శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ఈ సాధనం మెదడును కరెంటుతో ఉత్తేజ పరుస్తుంది. ఆయా వ్యాధుల చికిత్సలో సమర్థంగా పనిచేస్తుంది. వాండ్ (డబ్ల్యుఎఎన్‌డి) అనే పేరుగల న్యూరో స్టిమ్యులేటర్ మెదడులో పేస్‌మేకర్‌లా పనిచేస్తుంది. బ్రెయిన్ లోని ఎలెక్ట్రికల్ యాక్టివిటీని పర్యవేక్షిస్తుంది. ఏదైనా పొరపాటు జరిగితే ఆ పొరపాటును తెలుసుకుని ఎలెక్ట్రికల్ చైతన్యాన్ని కలిగిస్తుందని అమెరికా లోని బెర్కిలిలో గల యూనివర్శిటీ ఆఫ్ కాలిఫోర్నియాకు చెందిన పరిశోధకులు వెల్లడించారు. నరాల బలహీనతలతో బాధపడుతున్న రోగుల్లో శరీరం వణుకుతుండడాన్ని ఈ సాధనం నివారిస్తుందని, జర్నల్ నేచర్ బయోమెడికల్ ఇంజినీరింగ్ లో అధ్యయనం వివరించింది. ఏదెలాగున్నా నరాల బలహీనతల వల్ల వచ్చే వణుకు, లేదా స్థంభనలు ముందుగా ఈ ఎలెక్ట్రికల్ సాధనాలతో గుర్తించడం చాలా సనూక్ష్మ స్థాయిలో జరుగుతోందని, ఈ ఎలెక్ట్రికల్ ఉత్తేజం ఫ్రీక్వెన్సీ, బలం వాటి నుంచి రక్షించడానికి మరింత సాంకేతికత అవసరమని, ఈ సాధనాలతో చికిత్స చేయడానికి డాక్టర్లు సర్దుబాటు చేసుకోడానికి మరిన్ని సంవత్సరాలు పట్టవచ్చని శాస్త్రవేత్తలు అంటున్నారు.

– సైన్స్ విభాగం

వైరల్ ప్రభావాన్ని నివారించడంలో టొమాటో జన్యు పాత్ర





ఒత్తిడికి దారి తీసే జన్యువులను అర్థం చేసుకోడానికి ప్రయత్నించేటప్పుడు టొమాటో, ఇతర పంటలు చాలా ఉత్పత్తి దాయకంగా కనిపించాయని పరిశోధకులు వెల్లడించారు. భారత దేశ పరిశోధకులు టొమాటో మొక్క హానికరమైన పరాన్నజీవులను కనుగొనడంలో ఉపయోగపడే జన్యువును గుర్తించారు. ఈ జన్యువు వేడి ఒత్తిడిని కూడా పట్టుకోగలుగుతుంది. న్యూఢిల్లీకి చెందిన నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ జినోమ్ రీసెర్చి (ఎన్ఐపిజిఆర్) పరిశోధకులు టొమాటో మొక్క లోని ఏకైక జన్యువు ఎస్ఐడిఇ ఎడి35 వేడి ఒత్తిడిని, వైరస్ ప్రభావాన్ని నియంత్రిస్తుందని గుర్తించారు. ఈమేరకు వివిధ రకాల టొమాటో మొక్కలను ఉత్పత్తి చేయడానికి సంబంధిత జన్యువును ఆయా మొక్కల రకాల్లో ప్రవేశ పెడతామని పరిశోధకులు వివరించారు.

– సైన్స్ విభాగం

> ఖాదర్ ఖాన్ మరణం నన్నెంతగానో బాధించింది. కొత్త ఏడాది మొదటి రోజు అంతగా బాలేదనే చెప్పాలి. నా కెరీర్‌లో సగం చిత్రాలు ఖాదర్ ఖాన్‌తోనే కలిసి నటించాను. మేమిద్దం దాదాపు వంద చిత్రాల్లో నటించాం.
>
> –బాలీవుడ్ నటుడు శక్తికపూర్

సినిమా


ప్రభాస్

క్రేజీ కాంబినేషన్ కోసం చర్చలు

యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ 'బాహుబలి'కి ముందు టాలీవుడ్‌లోనే ఒక స్టార్ హీరో. కానీ 'బాహుబలి' తర్వాత బాలీవుడ్‌లో కూడా క్రేజీ హీరోగా పేరు తెచ్చుకున్నారు. బాలీవుడ్ స్టార్స్ సైతం ప్రభాస్‌తో ఫొటో కోసం, సెల్ఫీ కోసం ఆరాటపడే పరిస్థితి వచ్చేసింది. ఈ నేపథ్యంలో ఈ యూనివర్సల్ హీరోతో మరో భారీ బడ్జెట్ మూవీని తెరకెక్కించేందుకు చర్చలు జరుగుతున్నట్టు తెలిసింది. హిట్ మూవీ 'కెజిఎఫ్' డైరెక్టర్ ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో అగ్ర నిర్మాత దిల్‌రాజు ఓ భారీ చిత్రాన్ని తెరకెక్కించాలనుకుంటున్నారు. ఇందులో ప్రభాస్ కథానాయకుడు అయితే బావుంటుందని దిల్ రాజు భావిస్తున్నారట. ఈ మేరకు సంప్రదింపులు సాగుతున్నాయని తెలిసింది. ప్రభాస్ ప్రస్తుతం ఏకకాలంలో రెండు సినిమాల్లో నటిస్తున్నారు. ఓవైపు 'సాహో' లాంటి భారీ బడ్జెట్ చిత్రంలో నటిస్తూనే మరోవైపు 'జాన్' అనే ప్రేమ కథా చిత్రం కూడా చేస్తూ బిజీగా ఉన్నారు. 'సాహో' చిత్రం ఆగస్టు 15న విడుదల కానుంది. ఈ ఏడాది చివరలో రాధాకృష్ణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'జాన్' కూడా రిలీజవుతుంది. ఆతర్వాత ప్రభాస్‌తో భారీ బడ్జెట్ మూవీ చేయాలని దిల్‌రాజు భావిస్తున్నారు. 'కెజిఎఫ్' గ్రాండ్ సక్సెస్ సాధించిన నేపథ్యంలో దర్శకుడు ప్రశాంత్ నీల్ స్టార్‌హీరో ప్రభాస్‌తో ఇటీవల భేటీ అయ్యారు. ఆ భేటీ వెనుక దిల్‌రాజు ప్రోద్బలం ఉందని... ప్రభాస్‌తో భారీ చిత్రం తెరకెక్కిస్తే బావుంటుందన్న ఆలోచన చేస్తున్నారని ప్రచారం జరుగుతోంది. అయితే ఈ ప్రాజెక్టు ఇంకా ఆరంభ చర్చల్లోనే ఉంది. ఇంకా ప్రభాస్ తరపు నుంచి అధికారికంగా గ్రీన్ సిగ్నల్ రావాల్సి ఉంటుంది. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన కథ వర్కవుట్ కావాలి. 2020లోనే ఈ క్రేజీ కాంబినేషన్‌కు ఆస్కారం ఉంటుందని చెబుతున్నారు. ఇక ప్రభాస్‌కు 'డార్లింగ్' ఇమేజ్ తెచ్చిందే దిల్‌రాజు. ఈ అగ్ర నిర్మాత బ్యానర్‌లోనే ప్రభాస్ మున్నా, డార్లింగ్ చిత్రాల్లో నటించారు. ఇప్పుడు అన్నీ ఓకే అయితే ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా దిల్‌రాజు ఓ భారీ చిత్రాన్ని నిర్మించే అవకాశం ఉంది.


దిల్‌రాజు


చిరంజీవి

వేసవిలోనే కొత్త సినిమా ప్రారంభం

మెగాస్టార్ చిరంజీవి ప్రస్తుతం 'సైరా' సినిమాలో బిజీగా ఉన్నారు. ఆగస్టులో ఈ సినిమాను విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారు. 'సైరా' తర్వాత మెగాస్టార్ ఏ సినిమాలో నటిస్తారు? అనే ఆసక్తి అభిమానులు, ప్రేక్షకుల్లో ఉంది. అయితే 'వినయ విధేయ రామ' ఆడియో ఫంక్షన్ జరిగే వరకు అందరికీ టాప్ డైరెక్టర్ కొరటాల శివతో చిరంజీవి సినిమా ఉంటుందని తెలుసు. కానీ ఆ ఆడియో వేడుకలో దర్శకుడు త్రివిక్రమ్‌తో సినిమా ఉంటుందని చిరంజీవి చెప్పేసరికి కొరటాల శివతో సహా అందరూ షాక్ అయ్యారు. దీంతో కొరటాల సినిమా ఆగిపోయినట్లేనని భావించారు. అయితే ఈ ప్రాజెక్ట్ ఆగిపోలేదని... వేసవి నుంచి చిరంజీవికొరటాల శివ సినిమా సెట్స్‌పైకి వెళ్తుందని తెలిసింది. 'సైరా' సినిమా వేసవి నాటికి పూర్తవుతుంది. ఆతర్వాత పోస్ట్ ప్రొడక్షన్ ఒక్కటే ఉంటుంది. దీంతో సమ్మర్ నుంచి కొరటాల శివతో సినిమా ప్రారంభించాలని భావిస్తున్నారు చిరంజీవి. ఇప్పటికే ఇందుకు సంబంధించిన కథ, కథనాలను కూడా కొరటాల పూర్తిచేశారు. ఇక త్రివిక్రమ్ స్టార్ హీరో అల్లు అర్జున్ కోసం కథను సిద్ధం చేస్తున్నారు. బన్నీతో సినిమా పూర్తిచేసిన తర్వాత త్రివిక్రమ్ మెగాస్టార్ మూవీకి పనిచేస్తారు. ఈలోపుగా కొరటాల శివ కూడా చిరంజీవి సినిమాను పూర్తి చేయాలని అనుకుంటున్నారు.

రజనీకాంత్ నాకు స్ఫూర్తి


అశోక్ వల్లభనేని

సౌతిండియా సూపర్‌స్టార్ రజనీకాంత్ హీరోగా కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో సన్‌పిక్చర్స్ బ్యానర్‌పై రూపొందిన చిత్రం 'పేట్ట'. ఈ చిత్రాన్ని తెలుగులో నిర్మాత అశోక్ వల్లభనేని 'పేట' పేరుతో ఈనెల 10న విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటైన విలేకరుల సమావేశంలో అశోక్ వల్లభనేని మాట్లాడుతూ ''బస్సు కండక్టర్‌గా పనిచేసిన రజనీకాంత్ నేడు సౌతిండియా సూపర్ స్టార్‌గా ఎదిగారు. రేపు కాబోయే ముఖ్యమంత్రి అని కూడా అంటున్నారు. ఆయనే నాకు స్ఫూర్తి. తమిళ ప్రజలకు ఎంతో మేలు చేసిన రజనీకాంత్ తెలుగు ప్రజలకు ఏం చేశారనే ప్రశ్న వస్తుంది. అందుకోసమే ఈనెల 6న జరుగబోయే 'పేట' ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో సేవా ధృకృథంతో కొనసాగుతున్న రెండు, మూడు అనాథ శరణాలయాలకు రజనీకాంత్ చేతుల మీదుగా ఆర్థిక సహాయం చేయబోతున్నాం. ఇక రజనీకాంత్‌కు దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ వీర భక్తుడు. ఈ సినిమాతో దర్శకుడు మంచి హిట్ కొడతారు. ట్రైలర్‌ను చూస్తే రజనీకాంత్ పాతికేళ్లు వెనక్కి వెళ్లిపోయారనిపించింది. అనిరుధ్ మంచి మ్యూజిక్ అందించారు. పాటలకు మంచి స్పందన వస్తోంది. తెలుగులో మణిరత్నం సినిమా 'నవాబ్'ను నేనే తెలుగులో రిలీజ్ చేసి హిట్ కొట్టాను. అదేవిధంగా 'సర్కార్' సినిమాను విడుదల చేసి విజయ్‌కు తెలుగులో మంచి మార్కెట్‌ను సృష్టించాం. అదే నమ్మకంతో సన్‌పిక్చర్స్ సంస్థ నాకు ఈ సినిమా విడుదల హక్కులను ఇచ్చింది. ఇక ఈ ఏడాది తెలుగులో ఓ స్ట్రయిట్ సినిమాను ప్లాన్ చేస్తున్నాం. ప్రస్తుతం కథలు వింటున్నాను. మంచి కథ, హీరో దొరకగానే సినిమాను ప్రకటిస్తాను''అని అన్నారు.

రాజన్నా నిన్నాపగలరా...

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి పేదల ప్రజల సమస్యలను తెలుసుకోవడానికి చేసిన పాదయాత్రలోని ముఖ్య ఘట్టాలను తీసుకొని 'యాత్ర' పేరుతో ఓ చిత్రాన్ని నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. వైఎస్ఆర్ రాజకీయ జీవితంలో పాదయాత్ర కీలక ఘట్టం. ఆ సమయంలో జరిగిన ముఖ్య సంఘటనల సమాహారమే ఈ 'యాత్ర'. మలయాళ సూపర్‌స్టార్ మమ్ముట్టి వైఎస్ఆర్ పాత్రలో జీవిస్తున్నారు. ఇప్పటికే విడుదల చేసిన ఫస్ట్‌లుక్ టీజర్, డైలాగ్ టీజర్లకు మంచి స్పందన వచ్చింది. ప్రస్తుతం ఈ చిత్రంలోని 'రాజన్నా నిన్నాపగలరా...' అంటూ సాగే రెండవ సింగిల్‌తో ఆయన పాదయాత్ర వలన ప్రజల ఆనందాన్ని చూపించారు. 'ఆనందోబ్రహ్మ' వంటి సూపర్ హిట్ చిత్రాన్ని అందించిన మహి వి.రాఘవ్ దర్శకత్వంలో 70 ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఫిబ్రవరి 8న తెలుగుతో పాటు తమిళ్, మళయాలంలో 'యాత్ర' చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాతలు విజయ్ చిల్లా, శశిదేవి రెడ్డి మాట్లాడుతూ ''మడమతిప్పని నాయకుడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాత్రలో మమ్ముట్టి అద్భుతంగా నటిస్తున్నారు. ఈ చిత్రంలో ఆద్యంతం ఎమోషన్‌తో కూడిన పాత్రలు, పాత్ర చిత్రణ కనిపిస్తుంది. ఈ చిత్రంలోని రెండవ పాటను సిరివెన్నెల సీతారామశాస్త్రి రచించారు. కె సంగీతాన్ని అందించారు. తెలుగు, తమిళ్, మళయాల భాషల్లో ఏకకాలంలో ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 8న విడుదల చేస్తున్నాం''అని అన్నారు. మమ్ముట్టి, రావు రమేష్, జగపతిబాబు, సుహాసిని, అనసూయ, పోసాని, సచిన్ కద్కర్, వినోద్ కుమార్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్: సత్యన్ సూర్యన్, మ్యూజిక్: కె (క్రిష్ణ కుమార్), ఎడిటర్: శ్రీకర్ ప్రసాద్.


మమ్ముటి


'ఉన్మాది' బిగ్ సీడీని విడుదల చేస్తున్న రాజ్ కందుకూరి. చిత్రంలో ఎస్.ఆర్.రెడ్డి, శిరీష, డేవిడ్ తదితరులు

హరికృష్ణలాగా కనిపించినట్లయితే సక్సెస్‌అయినట్లే!

ప్రవీణ క్రియేషన్స్ ప్రై.లి. పతాకంపై ఎన్.కరణ్ రెడ్డి సమర్పణలో ఎన్.రామారావు నిర్మిస్తున్న చిత్రం 'ఉన్మాది'. ఎన్.ఆర్.రెడ్డి కీలక పాత్రలో నటిస్తూ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. డేవిడ్ సంగీతాన్ని అందించిన ఈ సినిమా పాటలను హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో రాజ్ కందుకూరి ఆవిష్కరించారు. ట్రైలర్‌ను ఎన్.శంకర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎన్.శంకర్ మాట్లాడుతూ ''ఇలాంటి సినిమాకు స్టోరీ, స్క్రీన్‌ప్లే, డైలాగ్స్, డైరెక్షన్ చేయడానికి నిజంగా చాలా ధైర్యం కావాలి. ఎన్.ఆర్.రెడ్డి ఎంతో ధైర్యం చేసి ఈ సినిమా తీస్తున్నారు. ట్రైలర్ చాలా బాగుంది. సినిమాలో ఎన్.ఆర్.రెడ్డి పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తున్నారు. హీరోయిజం, విలనిజం రెండూ చూపించదగిన క్యారెక్టర్ ఇది''అని అన్నారు. నిర్మాత, దర్శకుడు ఎన్.ఆర్.రెడ్డి మాట్లాడుతూ ''స్వర్గీయ హరికృష్ణకు నేను పెద్ద అభిమానిని. ఆయనే నాకు ఇన్‌స్పిరేషన్. ఈ సినిమాలో ఒక్కసారైనా ఆయనలా కనిపించాలని ప్రయత్నించాను. ఒక్క క్షణం అలా కనిపించినట్లయితే నేను సక్సెస్ అయినట్లే. ఈ సినిమా స్టోరీ చాలా డిఫరెంట్‌గా ఉంటుంది. ప్రేక్షకులకు మంచి థ్రిల్ నిస్తుంది''అని పేర్కొన్నారు. హీరోయిన్ శిరీష మాట్లాడుతూ ''సినిమాలో నాది మంచి క్యారెక్టర్. పాటలు అన్నీ నచ్చాయి. ఎన్.ఆర్.రెడ్డి మంచి దర్శకుడు''అని చెప్పారు. ఈ కార్యక్రమంలో కృష్ణుడు, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎవిఎస్ లేని లోటు తెలుస్తోంది


ఎన్.శంకర్, ఎ.రాఘవేంద్ర ప్రదీప్, మహేష్, ప్రణతి, అఖిల తదితరులు


సీనియర్ కమేడియన్, క్యారెక్టర్ ఆర్టిస్ట్ కీ.శే. ఎవిఎస్ కుమారుడు ఎ.రాఘవేంద్ర ప్రదీప్ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'వైదేహి'. యాక్టివ్ స్టూడియోస్ బ్యానర్‌పై ఎ.జి.ఆర్.కౌశిక్ సమర్పణలో ఎ.జనని ప్రదీప్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇక ఎవిఎస్ పుట్టిన రోజు సందర్భంగా ఈ చిత్రం ట్రైలర్‌ను హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్.శంకర్ మాట్లాడుతూ ''నాకు మంచి మిత్రులైన ఎవిఎస్‌తో నా అనుబంధం ఎంతో ప్రత్యేకం. తెలుగు ఇండస్ట్రీలో ఎవిఎస్ లేని లోటు తెలుస్తోంది. ఇక ఆయన కుమారుడు ఎ.రాఘవేంద్ర ప్రదీప్ హార్రర్ జోనర్‌లో 'వైదేహి' చిత్రాన్ని చేస్తున్నారు. ఈ సినిమా ట్రైలర్ చాలా బావుంది''అని అన్నారు. దర్శకుడు ఎ.రాఘవేంద్ర ప్రదీప్ మాట్లాడుతూ ''నాన్నగారి పుట్టిన రోజు సందర్భంగా థియేట్రికల్ ట్రైలర్ విడుదల చేసినందుకు ఆనందంగా ఉంది. ఈ చిత్రంలో నటించిన నటీనటులు అందరూ ఒక కుటుంబంలా కలిసిపోయి బాగా పనిచేశారు''అని తెలిపారు. ఈ కార్యక్రమంలో హీరోహీరోయిన్లు మహేష్, ప్రణతి, అఖిల తదితరులు పాల్గొన్నారు.

ఇస్ సాల్ కా జామ్... షకీలా కే నామ్


రిచా చద్దా

బాలీవుడ్‌లో మొదలైన బయోపిక్‌ల ట్రెండ్ ఇప్పుడు సౌత్‌లో జోరుగా కొనసాగుతోంది. అయితే ఎన్నో క్రేజీ బయోపిక్‌లు ఇప్పుడు సెట్స్ మీద ఉన్నా కూడా వాటిలో హాట్ బయోపిక్ 'షకీలా' మాత్రమే. ఇంద్రజిత్ లంకేష్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో శృంగార తార షకీలా పాత్రను బాలీవుడ్ బ్యూటీ రిచా చద్దా పోషిస్తోంది. ఇక నవంబర్‌లో రిలీజ్ చేసిన సినిమా ఫస్ట్‌లుక్ అందరినీ ఆకట్టుకుంది. తాజాగా ఈ సినిమా నుండి నూతన సంవత్సరం సందర్భంగా మరో పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో 'ఇస్ సాల్ కా జామ్... షకీలా కే నామ్' అంటూ క్యాప్షన్ ఇచ్చారు. పోస్టర్‌లో ఒక గాజు గ్లాస్‌లో సగానికి ఆల్కహాల్ ఉంది. ఆ గ్లాస్‌లోని ఆల్కహాల్‌లో సగం మునిగి హాట్‌గా పోజ్ ఇచ్చింది రిచా చద్దా. సమ్మర్‌లోనే 'షకీలా' విడుదల అవుతుందని ఈ సందర్భంగా ఫిల్మ్‌మేకర్స్ చెప్పారు.

హిలేరియస్ యాక్షన్ ఎంటర్‌టైనర్


సప్తగిరి

కమేడియన్‌గా రాణించిన సప్తగిరి హీరోగా సప్తగిరి ఎక్స్‌ప్రెస్, సప్తగిరి ఎల్‌ఎల్‌బి చిత్రాలతో మంచి పాపులారిటీ తెచ్చుకున్నారు. ప్రస్తుతం 'సప్తగిరి ఎక్స్‌ప్రెస్'ను తెరకెక్కించిన అరుణ్‌పవార్ దర్శకత్వంలో శివ శివమ్ ఫిలింస్ పతాకంపై నరేంద్ర యెడల, జివిఎన్ రెడ్డి ఓ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి 'వజ్ర కవచధర గోవింద' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు అరుణ్ పవార్ మాట్లాడుతూ ''ఈ కథకు కరెక్ట్ టైటిల్ ఇది. ఇందులో సప్తగిరి పాత్ర పేరు గోవిందు. ఇతనొక ఫన్నీ దొంగ. ఇతనికో లక్ష్యం ఉంటుంది. ఆ లక్ష్య సాధన కోసం అతను ఏం చేశాడన్నదే ఈ సినిమా ప్రధాన కథాంశం. కడుపుబ్బా నవ్వించే అంశాలతో పాటు మంచి యాక్షన్, ఎమోషన్, ఇతర కమర్షియల్ అంశాలు కూడా ఇందులో బాగా కుదిరాయి''అని అన్నారు. నిర్మాతలు నరేంద్ర యెడల, జివిఎన్ రెడ్డి మాట్లాడుతూ ''సప్తగిరి ఎక్స్‌ప్రెస్ వంటి సూపర్ హిట్ మూవీ తర్వాత సప్తగిరి, అరుణ్ పవార్ కాంబినేషన్‌లో సినిమా చేసే అవకాశం మాకు దక్కడం చాలా హ్యాపీగా ఉంది. ఇదొక హిలేరియస్ యాక్షన్ ఎంటర్‌టైనర్. ఇప్పటికే 60 శాతం చిత్రం పూర్తయింది''అని తెలిపారు. వైభవీ జోషి కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో అర్చనా వేద, టెంపర్ వంశీ, అప్పారావు, అవినాష్ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి కెమెరా: ప్రవీణ్ వనమాలి, సంగీతం: విజయ్ బుల్గానిన్, ఎడిటింగ్: కిషోర్ మద్దాలి.

అందాల భామల సందడి

అందాల భామలు ఎప్పటికప్పుడు ఫిల్మ్‌మేకర్స్ దృష్టిలో పడాలని తహతహలాడుతుంటారు. ఫిల్మ్‌మేకర్స్ దృష్టిలో పడితే మంచి అవకాశాలు వస్తాయని వారు భావిస్తారు. అందుకోసం వారు సోషల్ మీడియాలో హాట్ ఫొటోలతో సందడి చేస్తుంటారు. తరచుగా హాట్ ఫొటో షూట్లు, వీడియోలను సోషల్ మీడియాలో రిలీజ్ చేస్తూ హల్‌చల్ చేస్తారు అందాల తారలు. దీంతో సోషల్ మీడియాలో తమ ఫాలోవర్లను కూడా పెంచుకుంటారు. అందాల భామలు అంజలి, ప్రగ్యాజైస్వాల్, లావణ్య త్రిపాఠి, హంసా నందిని తాజాగా తమ కొత్త ఫొటోలను ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. ఈ ఫొటోలు కుర్రకారును మైమరపిస్తున్నాయి. డిజైనర్ డ్రెస్‌లో క్లీవేజ్ షోతో మురిపిస్తోంది అంజలి. ఇక హాట్ బ్యూటీ ప్రగ్యాజైస్వాల్ ఎంతో గ్లామరస్‌గా దర్శనమిస్తూ అలరిస్తోంది. ఐటమ్ బ్యూటీ హంసానందిని చిరునవ్వులు చిందిస్తూ కనిపిస్తే... లావణ్య త్రిపాఠి కొత్త లుక్ యూత్‌ను ఆకట్టుకుంటోంది.








ప్రగ్యాజైస్వాల్



నా జీవితంలో కొత్త అడ్వెంచర్

తన అందచందాలు, గ్లామర్‌తో దక్షిణాది ప్రేక్షకులను ఉర్రూతలూగిస్తున్న బ్రిటీష్ బ్యూటీ అమీజాక్సన్ కొత్త జీవితాన్ని ప్రారంభించింది. నూతన సంవత్సరం ఆరంభం రోజున తన జీవితంలో కొత్త అడ్వెంచర్ ప్రారంభమైందని ప్రకటించింది ఈ బ్యూటీ. తన బాయ్‌ఫ్రెండ్ జార్జ్‌తో ఎంగేజ్‌మెంట్ చేసుకోవడమే తన కొత్త అడ్వెంచర్ అని అమీ తెలిపింది. ఇటీవల రజనీకాంత్‌తో కలిసి నటించిన '2.0' చిత్ర విజయంతో ఎంతో సంతోషంగా ఉన్న ఈ సుందరి తన ఎంగేజ్‌మెంట్ విషయాన్ని స్వయంగా ప్రకటించింది. ప్రస్తుతం అమీ, జార్జ్ ఆఫ్రికా దేశాల్లో విహరిస్తున్నారు. వీళ్ల ఎంగేజ్‌మెంట్ అక్కడే జరిగింది. నూతన సంవత్సరంలో తాము కొత్త జీవితాన్ని ప్రారంభించామని... జార్జ్ తనను ప్రపంచంలోనే అత్యంత ఆనందమైన అమ్మాయిని చేశాడని పేర్కొంది ఈ భామ. జార్జ్ తనను ముద్దు పెట్టుకుంటున్న ఫొటోను అమీ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేస్తూ ఈ విషయాన్ని చెప్పింది. గతంలో కూడా తన బాయ్‌ఫ్రెండ్‌తో కలిసి దిగిన పలు ఫొటోలను అమీజాక్సన్ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేసింది. అయితే తన పెళ్లి ఎప్పుడనే విషయాన్ని ఈ భామ చెప్పలేదు.



ఎంఎస్‌ఎంఇల కోసం ప్యానెల్

సెబీ మాజీ చీఫ్ యుకె సిన్హా ఆధ్వర్యంలో ఏర్పాటు



ముంబై: సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల(ఎంఎస్‌ఎంఇ) ఆర్థిక స్థిరత్వానికి దీర్ఘకాలిక పరిష్కారం ఇచ్చేందుకు గాను సెబీ చైర్మన్ యుకె సిన్హా ఆధ్వర్యంలో నిపుణుల కమిటీని ఆర్‌బిఐ(భారతీయ రిజర్వు బ్యాంక్) ఏర్పాటు చేసింది. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు రూ.25 కోట్ల వరకు రుణాలకు వన్ టైమ్ రీస్ట్రక్చరింగ్ అనుమతి ఇచ్చింది. ఎంఎస్‌ఎంఇలకు అనుమతి ఇచ్చిన తర్వాత మరుసటి రోజు ఆర్‌బిఐ ఈ నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. ఈ రంగానికి సమయానికి తగినంతగా ద్రవ్య లభ్యత వంటి అంశాలను పరిశీలించేందుకు ఎనిమిది మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసినట్టు ఆర్‌బిఐ ఓ ప్రకటనలో పేర్కొంది. నిపుణుల కమిటీ 2019 జూన్ ముగింపు నాటికి నివేదికను సమర్పిస్తుందని ఆర్‌బిఐ వెల్లడించింది.

75 పైసలు పతనమైన రూపాయి విలువ



ముంబై : నాలుగు సెషన్లలో తొలిసారి రూపాయి మారకం విలువ 75 పైసలు నష్టపోయింది. ఆఖరికి అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 70.18 వద్ద ముగిసింది. దేశీయ ఈక్విటీలో భారీ విక్రయాలు, మరో వైపు డాలర్ బలపడడం వంటి రూపాయి విలువ క్షీణించడానికి కారణమయ్యాయి. ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్(ఫారెక్స్)లో రూపాయి 69.60 వద్ద ప్రారంభించి, ఓ దశలో 70.23కు పతనమైంది. ట్రేడింగ్ ముగిసే సమయానికి రూపాయి 75 పైసలు నష్టపోయి 70.18 వద్ద ముగిసింది.

డిసెంబర్‌లో నెమ్మదించిన ఉత్పత్తి పిఎంఐ



న్యూఢిల్లీ: దేశీయ పారిశ్రామిక ఉత్పత్తి డిసెంబర్‌లో నెమ్మదించింది. గత నెలలో ఉత్పత్తి పిఎంఐ(పర్చేసింగ్ మేనేజర్స్ ఇండెక్స్) 53.2 నమోదవగా, అంతకుముందు నవంబర్ నెలలో ఇది 54 పాయింట్లుగా ఉంది. అయినప్పటికీ వృద్ధి పథంలోనే పయనిస్తోంది. ఈ పిఎంఐను సర్వే ఆధారంగా నిర్ధారిస్తారు. ఈ సర్వేలో 400కు పైగా కంపెనీలకు చెందిన పర్చేసింగ్ ఎగ్జిక్యూటివ్‌లు ఉంటారు. ఈ కంపెనీలను ఎనిమిది విభాగాలుగా నిర్ణయించారు. అవి బేసిక్ మెటల్స్, కెమికల్స్, ప్లాస్టిక్స్, ఎలక్ట్రికల్ అండ్ ఆప్టికల్, ఫుడ్ అండ్ డ్రింక్, మెకానికల్ ఇంజినీరింగ్, టెక్స్‌టైల్ అండ్ క్లాతింగ్, టింబర్ అండ్ పేపర్, రవాణా వంటివి ఉంటాయి. ఇండెక్స్ 50 పాయింట్లకు పైన ఉంటే వృద్ధిని, దిగువన ఉంటే క్షీణతను సూచిస్తుంది.

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	69.66
యూరో	79.73
బ్రిటిష్ పౌండ్	88.66
ఆస్ట్రేలియన్ డాలర్	48.84
కెనెడియన్ డాలర్	51.03
సింగపూర్ డాలర్	51.08
స్విస్ ఫ్రాంక్	70.81
చైనీస్ యువాన్	10.13
మలేషియన్ రింగిట్	16.84
న్యూజిలాండ్ డాలర్	46.77
హాంకాంగ్ డాలర్	8.89
జపనీస్ యెన్	0.64
కువైట్ దినార్	229.61
సౌతాఫ్రికన్ రాండ్	4.84

స్టాక్ మార్కెట్

ఈ రోజు మార్కెట్ ముగింపు		మార్పు	%
సెన్సెక్స్	35891.52	-363.05	(-1.00%)
నిఫ్టీ	10792.50	-117.6	(-1.08%)

బులియన్



బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22 క్యారట్	24 క్యారట్	మార్పు(%)
చెన్నై	30390	32502.67	0.6%
ముంబై	30660	32791.44	0.03%
ఢిల్లీ	30850	32994.65	0.16%
కోల్‌కతా	31320	33497.33	0.19%
కేరళ	29400	31443.85	0.34%
బెంగళూరు	29700	31764.71	0.07%
హైదరాబాద్	30390	32502.67	0.6%
గల్ఫ్	135.81	145.25	0.52%

వెండి ధర (రూ./ కిలో)

చెన్నై	₹ 40900.00
ముంబై	₹ 40900.00
ఢిల్లీ	₹ 40900.00
కోల్‌కతా	₹ 40900.00
హైదరాబాద్	₹ 40900.00



విలీనానికి ఓకే

ఏకం కానున్న బిఒబి, విజయా బ్యాంక్, దేనా బ్యాంక్‌లు • కేంద్ర కేబినెట్ ఆమోదం



న్యూఢిల్లీ: విజయా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, దేనా బ్యాంక్‌ల విలీనానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ మూడు ప్రభుత్వ రంగ బ్యాంకులను విలీనం చేసేందుకు బుధవారం ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ అందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 2019 ఏప్రిల్ 1 నుంచి ఈ విలీనం అమల్లోకి రానుంది. ఈమేరకు విజయా బ్యాంక్, దేనా బ్యాంక్ ఉద్యోగులు అంతా బ్యాంక్ ఆఫ్ బరోడాకు బదలీ కానున్నారని కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ ప్రకటించారు. గతేడాది సెప్టెంబర్‌లో ప్రభుత్వం ప్రకటించినట్టుగా విజయా బ్యాంక్, దేనా బ్యాంక్‌లు బ్యాంక్ ఆఫ్ బరోడా(బిఒబి)లో విలీనం కానున్నాయి. గతంలో ఓ పెద్ద బ్యాంకుతో చిన్న బ్యాంకును విలీనం చేసేవారు. అయితే దేశంలో మూడు బ్యాంకులను ఇలా విలీనం చేయడం ఇదే తొలిసారి. ఈ విలీనంతో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బిఐ) తర్వాత ఇది రెండో అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంక్ కానుంది.

షేర్ స్వాప్ రేషియో ఖరారు

విజయా బ్యాంక్, దేనా బ్యాంక్ విలీనం కోసం బిఒబి కూడా షేర్ స్వాప్ రేషియోను ఖరారు చేసింది. దీని ప్రకారం, విలీనంలో భాగంగా విజయా బ్యాంక్ వాటాదారులు ప్రతి వెయ్యి షేర్లకు గాను 402 ఈక్విటీ షేర్లను పొందనున్నారు. అలాగే దేనా బ్యాంక్ వాటాదారులు ప్రతి వెయ్యి షేర్లకు గాను 110 ఈక్విటీ షేర్లను పొందుతారు.

ఇది రెండో విలీనం

గతంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో దాని అనుబంధ బ్యాంకులను ప్రభుత్వం విలీనం చేసింది. రెండో దశలో ఇప్పుడు బ్యాంక్ ఆఫ్ బరోడాలో దేనా బ్యాంక్, విజయాబ్యాంక్‌లను విలీనం చేయడానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఎస్‌బిఐ విలీనం సక్సెస్ కావడంతో రెండో దశ మీద అందరి దృష్టి నెలకొంది. ఇక మూడో దశలో పలు ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల విలీనానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. బ్యాంకింగ్ రంగంలో విపరీతమైన పోటీ వాతావరణం నెలకొంది. అంతర్జాతీయ బ్యాంకుల నుంచి పోటీ తట్టుకునేందుకు ఈ విలీనం ఉపయోగపడనుందని ప్రభుత్వం భావిస్తోంది. బ్యాంకింగ్ రంగంలో ఎదురవుతున్న సవాళ్లను దృష్టిలో పెట్టుకుని ఈ మూడు బ్యాంకులను విలీనం చేయాలని గత ఏడాది సెప్టెంబర్‌లో భావించారు. అప్పటి నుంచి దీనికి సంబంధించిన కసరత్తు జరుగుతోంది. అయితే ఈ మూడు బ్యాంకుల విలీనంతో మరింత మెరుగైన బ్యాంకింగ్ వ్యవస్థ అందుబాటులోకి వస్తుందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి.

బిఒబిలో రూ.10 లక్షల కోట్ల బిజినెస్

ఈ మూడు బ్యాంక్ బ్యాంక్ ఆఫ్ బరోడా వ్యాపారం రూ.10,29,811 కోట్లుగా ఉంది. ఆ తర్వాత విజయా బ్యాంక్ రూ.2,79,674 కోట్లు, దేనా బ్యాంక్ రూ.1,72,937 కోట్లు వ్యాపారం చేస్తున్నాయి. ఈ మూడు బ్యాంకులు విలీనం అయితే మొత్తం వ్యాపార విలువ రూ.14,82,422 కోట్లకు చేరుతుంది. బ్యాంక్ ఆఫ్ బరోడాలో 56,361 మంది సిబ్బంది, విజయా బ్యాంక్‌లో 15,874, దేనా బ్యాంక్‌లో 13,440 మంది ఉద్యోగులు ఉన్నారు. విలీనం పూర్తయితే 85,675 మంది ఉద్యోగులు అవుతారు. ఈ విలీనానికి వ్యతిరేకంగా గతేడాది డిసెంబర్ 26న బ్యాంక్ ఉద్యోగులు సమ్మె నిర్వహించిన విషయం తెలిసిందే.



విలీనం కారణంగా ఎవరినీ తొలగించరు

మూడు ప్రభుత్వరంగ బ్యాంకుల విలీనంతో ఉద్యోగుల సేవల పరిస్థితులపై ఎలాంటి ప్రభావం ఉండదని కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ అన్నారు. విలీనం వల్ల ఎవరి తొలగింపు ఉండబోదని కూడా ఆయన స్పష్టం చేశారు. బ్యాంక్ ఆఫ్ బరోడాను అంతర్జాతీయంగా పోటీపడే బ్యాంక్‌గా రూపొందించాలనే ఆలోచనతోనే ఈ విలీనం చేపట్టామని ఆయన వివరించారు. 2019 ఏప్రిల్ 1 నుంచి ఈ మూడు బ్యాంక్‌ల విలీనం అమల్లోకి రానుంది. ఈమేరకు విజయా బ్యాంక్, దేనా బ్యాంక్ ఉద్యోగులు అంతా బ్యాంక్ ఆఫ్ బరోడాకు బదలీ కానున్నారు.



బాండ్ల ద్వారా బిఒబి రూ.1,285 కోట్లు సమీకరణ

బాసెల్–3 బాండ్ల జారీ ద్వారా రూ.1,285 కోట్లు సమీకరించేందుకు బోర్డు ఆమోదం తెలిపిందని బుధవారం బ్యాంక్ ఆఫ్ బరోడా ప్రకటించింది. రెండు వేర్వేరు నిర్ణయాల్లో ఒకటి.. రెండో దశ క్యాపిటల్ బాండ్లు రూ.285 కోట్లు, బేస్ ఇష్యూ రూ.100 కోట్ల వరకు ఉంటుంది. రూ.185 కోట్ల వరకు ఓవర్ సబ్‌స్క్రైబ్ కోసం గ్రీన్ షూ ఆప్షన్. అలాగే రూ.1000 కోట్ల బాసెల్ 3 క్యాపిటల్ రెగ్యులేషన్స్, బేస్ ఇష్యూ రూ.250 కోట్లు. రూ.750 కోట్లు ఓవర్‌సబ్‌స్క్రైబ్ కోసం గ్రీన్ షూ ఆప్షన్.

బ్యాంకులకు రుణాల చెల్లింపులో ఆలస్యం

జెట్ ఎయిర్‌వేస్ క్రెడిట్ రేటింగ్‌ను తగ్గించిన ఇక్రా



న్యూఢిల్లీ: రుణ భారంతో సతమతమవుతున్న ప్రైవేటు విమానయాన సంస్థ జెట్ ఎయిర్‌వేస్ బ్యాంకులకు వడ్డీ చెల్లింపులు చేయడంలో ఆలస్యం చేసింది. నగదు కొరత సమస్య వల్ల స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బిఐ) ఆధ్వర్యంలోని రుణదాతల కన్సార్టియంకు వడ్డీ చెల్లింపు ఆలస్యమైందని జెట్ ఎయిర్‌వేస్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు తెలియజేసింది. తొలిసారి జెట్ ఎయిర్‌వేస్ రుణాల వడ్డీ చెల్లింపులో డిఫాల్ట్ అయింది. అదే సమయంలో జెట్ ఎయిర్‌వేస్ క్రెడిట్ రేటింగ్‌ను 'సి' నుంచి 'డి'కి ఐసిఆర్‌ఎ తగ్గించింది. అయితే స్టాక్‌మార్కెట్లో ఈ కంపెనీ షేరు విలువ 7 శాతం నష్టపోయింది. ఆఖరికి రూ.261.45 వద్ద షేరు విలువ స్థిరపడింది. రెండో త్రైమాసికంలో జెట్ సంస్థ భారీ నష్టాలను నమోదు చేసి ఇన్వెస్టర్లను నిరాశపర్చింది. కాగా ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన జెట్ ఎయిర్‌వేస్‌ను గట్టెక్కించేందుకు అబు ధాబికి చెందిన ఎతిహాద్ ఎయిర్‌వేస్, ఎస్‌బిఐ బ్యాంకులు చర్చలు నిర్వహించినట్టు ఇటీవల వార్తలు వెలువడ్డాయి. జెట్ ఎయిర్‌వేస్‌లో ఎతిహాద్ ఎయిర్‌లైన్స్ రెండో అతిపెద్ద ఇన్వెస్టర్‌గా ఉంది. జెట్‌లో 24 శాతం వాటాను కలిగి ఉన్న ఎతిహాద్ ముంబైలో ఎస్‌బిఐ అధికారులతో చర్చలు నిర్వహించినట్టు సమాచారం. జెట్ ఎయిర్‌వేస్ భవిష్యత్తు ప్రణాళిక, రుణాల నుంచి గట్టెక్కించడం వంటి అంశాలపై చర్చలు సాగినట్లు సంస్థకు చెందిన ప్రతినిధులు వెల్లడించారు. భవిష్యత్తు ప్రణాళికకు జెట్ ఎయిర్‌వేస్ అంగీకరిస్తే సంస్థలో మరింత పెట్టుబడి పెట్టేందుకు ఎతిహాద్ ఆసక్తిగా ఉందని తెలుస్తోంది. ప్రస్తుతం నష్టాల్లో కూరుకుపోయిన జెట్ ఎయిర్‌వేస్.. ఉన్నతాధికారులు, పైలట్లు సహా సిబ్బందికి కొన్ని నెలలుగా జీతాలు చెల్లించలేని పరిస్థితి ఏర్పడింది. ఖర్చులు తగ్గించుకొనేందుకు లాభం తక్కువగా ఉన్న మార్గాల్లో విమాన సర్వీసులను నిలిపివేశారు. కాగా ప్రస్తుతం భారత్‌లో సేవలందిస్తున్న 26 విమాన కంపెనీల్లో 8 కంపెనీలే 98 శాతానికి పైగా మార్కెట్ వాటా కలిగి ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ రంగ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్ ప్రెస్, జెట్ ఎయిర్ వేస్, ఇండిగో, గో ఎయిర్, స్పైస్ జెట్, ఎయిర్ ఆసియా ఇండియా, విస్తారా వంటి సంస్థలే ప్రధానంగా ఉన్నాయి.

టాప్ గెయినర్స్ (+)

కంపెనీ పేరు	గరిష్టం	కనిష్టం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	లాభం%
సన్ ఫార్మా	441.20	429.25	440.05	433.55	6.50	1.50
టిసిఎస్	1,934.45	1,900.00	1,923.30	1,902.80	20.50	1.08
ఏసియన్ పేయింట్స్	1,386.85	1,361.60	1,383.30	1,371.55	11.75	0.86
భారతీ ఇన్‌ఫ్రాటెల్	266.00	258.70	264.25	262.25	2.00	0.76
ఇన్ఫోసిస్	674.00	662.05	669.05	665.05	4.00	0.60
టైటాన్ కంపెనీ	937.00	923.30	932.15	928.00	4.15	0.45
యుపిఎల్	758.45	744.00	756.50	753.50	3.00	0.40
ఐసిఐసిఐ బ్యాంక్	367.90	360.30	364.60	363.75	0.85	0.23
యస్ బ్యాంక్	187.00	182.50	184.65	184.25	0.40	0.22



జిఎస్‌టి వసూళ్లు

డిసెంబరు నెలలో జిఎస్‌టి (వస్తు, సేవల పన్ను) వసూళ్లు తగ్గడం మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. నవంబరు నెలలో జిఎస్‌టి వసూళ్లు రూ.97,637 కోట్లు, అయితే డిసెంబరు నెలలో కేవలం రూ.94,726కోట్లు మాత్రమే వచ్చాయి. ఇది ఇన్వెస్టర్లను ప్రభావితం చేసింది.

భారీ నష్టాలు

363 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్

ముంబై: దేశీయ స్టాక్‌మార్కెట్లు బుధవారం భారీగా పతనమయ్యాయి. ఆసియా మార్కెట్ల బలహీన సంకేతాలు, విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపింది. అమ్మకాల ఒత్తిడితో ప్రారంభం నుంచే సూచీలు నేలచూపులు చూశాయి. ఆఖరికి ఈ నష్టాలు మరింతగా పెరిగాయి. దీంతో సెన్సెక్స్ 360 పాయింట్లకు పైగా కోల్పోయి 36వేల దిగువకు పడిపోగా, నిఫ్టీ 10,800 పాయింట్ల స్థాయిని కోల్పోయింది. అయితే మార్కెట్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 363 పాయింట్లు (1 శాతం) నష్టపోయి 35,891 పాయింట్ల వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ 117 పాయింట్లు (1.08 శాతం) నష్టపోయి 10,792 పాయింట్ల వద్ద స్థిరపడింది. అమెరికా చైనా మధ్య వాణిజ్య వివాదాలు ప్రపంచ ఆర్థిక మందగమనానికి దారితీయనున్నాయనే అంచనాలు ప్రపంచ మార్కెట్లను కృంగదీస్తున్నాయి. ప్రధానంగా 2019లో కార్పొరేట్ ఫలితాలు నిరాశపరచనున్నాయనే అంచనాలు అమెరికా మార్కెట్లలో బేర్ ట్రెండ్‌కు దారితీస్తున్నాయి. దీంతో దేశీయగానూ ఒక్కసారిగా అమ్మకాలు వెల్లువెత్తాయి. ప్రధానంగా ఎం అండ్ ఎం, వేదాంత, టాటాస్టీల్, జెఎస్‌డబ్ల్యు స్టీల్, ఐషర్ మోటర్స్ షేర్లు 4 నుంచి 9 శాతం మేరకు నష్టపోయాయి. మరోవైపు ఇన్ఫోసిస్, ఏసియన్ పేయింట్స్, టిసిఎస్, ఇన్ఫ్రాటెల్, సన్‌ఫార్మా షేర్లు లాభపడ్డాయి.

స్థూల గణాంకాల ప్రభావం

కంపెనీలకు ఆర్డర్లు తగ్గడంతో డిసెంబర్ నెలకు గాను నిక్కీ ఇండియా సర్వీసెస్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పిఎంఐ) 53.2 దిగివచ్చింది. కాగా నవంబర్‌లో పిఎంఐ ఇండెక్స్ 11నెలల గరిష్ట స్థాయి 54.0కి చేరింది. పారిశ్రామికోత్పత్తిలో భాగమైన 8 ప్రధాన రంగాల వృద్ధి నవంబర్‌లో 16నెలల కనిష్టస్థాయి 3.5శాతానికి పరిమితం కావడం మార్కెట్ ప్రతికూల ప్రభావాన్ని చూపింది. ఇండెక్స్ 50 పాయింట్లకు పైన ఉంటే వృద్ధిని, దిగువన ఉంటే క్షీణతను సూచిస్తుంది.

రూపాయి క్షీణత

డాలర్ మారకంలో రూపాయి ర్యాలీకి బుధవారం బ్రేక్ పడింది. వరుసగా నాలుగో రోజుల లాభపడిన రూపాయి విలువ 75 పైసలు నష్టపోయి 70.18 వద్ద ముగిసింది. ఈక్విటీ మార్కెట్లు కూడా పతనమవుతూ వచ్చాయి. కాగా అంతర్జాతీయ ఆర్థిక మందగమనంతో డిసెంబర్‌లో చైనా ఉత్పాదక రంగం నెమ్మదించినట్లు గణాంకాలు వెల్లడయ్యాయి. రెండేళ్ల తరువాత చైనా ఉత్పాదక రంగం మందగించడంతో ప్రపంచమార్కెట్లలో బేరిష్ వాతావరణం నెలకొంది. దీనికి తగ్గట్లుగానే దేశీయ మార్కెట్లు కూడా డీలాపడ్డాయి.

టాప్ లూజర్స్ (-)

కంపెనీ పేరు	గరిష్టం	కనిష్టం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	నష్టం%
ఎయిచర్ మోటర్స్	22,340.00	20,950.25	21,162.30	23,195.10	2,032.80	8.76
జెఎస్‌డబ్ల్యూ స్టీల్	297.95	286.60	288.70	303.95	15.25	5.02
వేదాంతా	200.00	192.50	193.15	202.10	8.95	4.43
టాటా స్టీల్	506.80	492.00	493.65	515.75	22.10	4.29
ఎం అండ్ ఎం	772.80	735.10	741.70	773.35	31.65	4.09
హిందల్కో	219.15	213.65	214.55	222.75	8.20	3.68
గెయిల్	361.90	347.55	350.30	362.15	11.85	3.27
టాటా మోటర్స్	171.75	168.00	168.55	173.45	4.90	2.83
మారుతీ సుజుకీ	7,460.00	7,244.00	7,267.85	7,476.80	208.95	2.79
హీరో మోటోకార్ప్	3,117.30	3,023.80	3,046.55	3,127.60	81.05	2.59

అయ్యప్ప ఆలయంలో ఆమె ప్రవేశం

కేరళ పోలీసుల రక్షణతో అడుగుపెట్టిన ఇద్దరు మహిళలు ● సంప్రోక్షణ తరువాత తెరుచుకున్న గుడి



భద్రత మధ్య ఆలయ ప్రవేశం చేస్తున్న మహిళలు



స్వీట్లు పంచుకుంటున్న మహిళలు



మహిళల దర్శనం అనంతరం సంప్రోక్షణ చేస్తున్న పూజారులు

శబరిమల / తిరువనంతపురం : కట్టుదిట్టమైన సాంప్రదాయాలు పాటించే శబరిమల అయ్యప్ప దేవాలయంలోకి బుధవారం ఇద్దరు మహిళలు ప్రవేశించారు.50 ఏళ్ల లోపున ఈ రుతుస్రావపు మహిళలు ఆలయ గర్భగుడిలోకి ప్రవేశించి, అయ్యప్ప దర్శనం చేసుకుని సంచలనం సృష్టించారు. శబరిమలలో తమదైన చరిత్రను సృష్టించారు. అన్ని వయస్సుల మహిళలు ఆలయ దర్శనానికి వెళ్లవచ్చునని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన తరువాత మహిళల ప్రవేశం జరగడం ఇదే తొలిసారి. తెల్లవారుజామున 44 ఏండ్ల కనకదుర్గా, 42 సంవత్సరాల బిందూ ముఖాలకు ముసుగులతో, తెల్లవారుజాము మసక చీకట్ల మధ్య గుడిలోకి అడుగిడారు. భారీ స్థాయి పోలీసు భద్రత మధ్య వారు నేరుగా గుడిలోకి వెళ్లినట్లు వెల్లడైంది.

నిషేధిత వయస్సు మహిళలు ఆలయంలోకి ప్రవేశించారనే వార్త దావానలంగా వ్యాపించడంతో, శబరిమల గిరుల ప్రాంతంలో ఉన్న వేలాది మంది సాంప్రదాయక భక్తులు ఆవేశంతో రగిలిపొయ్యారు. మహిళలు గుడిలోకి ప్రవేశించినట్లు నిర్థారణ అయిన తక్షణమే ఆలయాన్ని కొద్ది సేపు మూసివేశారు. సంబంధిత సంప్రోక్షణ కార్యక్రమాన్ని మంత్రాల మధ్య నిర్వహించిన తరువాత తిరిగి దర్శనానికి తెరిచారు. అత్యంత ఇరుకైన గర్భగుడిలోకి ఈ మహిళలు ప్రవేశించడంతో శతాబ్దాల నుంచి కొనసాగుతోన్న ఆచార వ్యవహారాలను ఉల్లంఘించినట్లు అయింది. మూడు నెలల క్రితం సుప్రీంకోర్టు అయ్యప్ప దైవ దర్శనానికి అన్ని వయస్కుల మహిళలకు అనుమతి కల్పిస్తూ చారిత్రక తీర్పు వెలువరించింది. అయితే సనాతన పద్ధతులను పాటించే భక్తులు, ప్రత్యేకించి ఆర్ఎస్ఎస్ అనుబంధ హిందూ సంస్థల తీవ్ర నిరసనలు, అభ్యంతరాలతో ఆలయంలోపలికి మహిళల ప్రవేశం జరగలేదు. అయ్యప్ప అజరామర బ్రహ్మచర్యపు దేవుడని, ఎట్టి పరిస్థితుల్లోనూ రుతుస్రావపు మహిళలు స్వామి దర్శనానికి అర్హులు కారని ఈ దేవాలయ ఆచార వ్యవహారాలలో కట్టడి ఉంది. అయితే ముఖాలకు నల్లటి ముసుగులు ధరించి ఉన్న ఇద్దరు నడి వయస్సు మహిళలు తెల్లవారుజామున 3.36 గంటలకు ఆలయంలోకి ప్రవేశించారు. ఒక్కరోజు క్రితమే కేరళ రాష్ట్రవ్యాప్తంగా జాతీయ రహదారుల వెంబడి లింగ సమానత్వం, మహిళకు న్యాయం కోసం సుదీర్ఘమైన 620 కిలోమీటర్ల మానవ కుడ్యం నిర్మించారు. ఉత్తరాదిన ఉండే కసరగడ్ నుంచి దక్షిణ కొనలో ఉండే తిరువనంతపురం వరకూ జనం చేతులు కలుపుతూ నిర్మించిన ఈ హ్యూమన్ వాల్‌ను రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో లింగ సమానత్వపు నినాదంతో నిర్మించారు. ఇది సంచలనంగా మారింది. దీని మరుసటి రోజే ఇద్దరు మహిళలు ఆలయ ప్రవేశం చేయడంతో ఈ పరిణామం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. పలు చోట్ల నిరసనలు చెలరేగాయి. హిందూత్వ సంస్థలు హైవేలను దిగ్బంధించాయి. దుకాణాలను, మార్కెట్లను మూసివేయించారు. ఇప్పుడు ఆలయంలోకి వెళ్లిన బిందు, దుర్గలు గత నెల 18వ తేదీన దర్శనానికి విఫల యత్నం చేశారు. భక్తులు అడ్డుకోవడంతో వీరు వెనుదిరిగారు.

నేడు బంద్‌కు పిలుపు

రాష్ట్రంలోని వామపక్ష ప్రభుత్వ ఆధ్వర్యంలోనే సంప్రదాయాన్ని మంటగలిపారని హిందూత్వ సంస్థలు ధ్వజమెత్తాయి. దీనికి నిరసనగా గురువారం కేరళ రాష్ట్ర వ్యాప్త బంద్‌కు పిలుపు నిచ్చాయి. వివిధ హిందూ మత సంస్థలతో ఏర్పాటు అయిన సమైక్య సంస్థ శబరిమల కర్మ సమితి బంద్ పిలుపు ఇచ్చాయి. సుప్రీంకోర్టు తీర్పును నిరసిస్తూ ఈ సమితి వారు అంతరాష్ట్రీయ హిందూ పరిషత్ (ఎహెచ్‌పి)తో కలిసి ఆందోళనలకు దిగుతున్నారు. రుతుస్రావపు వయో పరిమితి మహిళలు ఎట్టి పరిస్థితుల్లోనూ అయ్యప్పను దర్శించుకోకుండా డేగ కళ్ల నిఘాతో ఉన్నారు. పలు సార్లు మహిళల ప్రవేశ యత్నాలను హింసాత్మక రీతిలోనే అడ్డుకున్నారు.

భద్రత నడుమ మహిళలకు ప్రవేశం : సిఎం

టీవీ న్యూస్ ఛానల్స్ తొలుత మహిళలు ఆలయ ప్రదేశం జరిపినట్లు దృశ్యాలతో పాటు వార్తలు ప్రసారం చేస్తూ వచ్చిన దశలో దీనికి వ్యతిరేకంగా నిరసనలు తీవ్రతరం అయ్యాయి. అయితే మహిళల ఆలయ ప్రవేశం పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఆనందంగా కన్పిస్తూ స్పందించారు. ఇద్దరు మహిళలు ఆలయంలో పూజలు చేశారని, వారు పోలీసులు భద్రత నడుమ లోపలికి వెళ్లారని సిఎం నిర్థారించారు. ఇప్పటివరకూ కొన్ని అడ్డంకులతో మహిళలు ఆలయంలోకి వెళ్లలేకపొయ్యారు. సుప్రీంకోర్టు అనుకూల తీర్పు వచ్చినా ఇది సాధ్యం కాలేదు.అయితే ఇప్పుడు మబ్బులు తొలిగాయి. ఇప్పుడు ఆ మహిళలు ఎటువంటి ఇబ్బందులకు గురి కాకుండా లోపలికి వెళ్లడం జరిగింది. ఈ విషయాన్ని తాను నిర్థారిస్తున్నానని విజయన్ తిరువనంతపురంలో చెప్పారు. ఇంతకు ముందు కూడా మహిళలు గుడివద్దకు రావడానికి యత్నించారని, అయితే సరైన భద్రత లేకపోవడంతో వారి యత్నం విఫలం అయిందని, ఇప్పుడు అన్ని చర్యలు తీసుకోవడంతో వారు అనుకున్న విధంగా దర్శనానికి వెళ్లారని సిఎం తెలిపారు.

ఒకరు లెక్చరర్... మరొకరు ఉద్యోగిని

ఆలయంలోకి వెళ్లుతామని ముందుగా పోలీసులకు తెలిపి, వారి నుంచి భద్రతా హామీ తీసుకువి వచ్చిన మహిళలలో బిందు కాలేజీ లెక్చరర్, సిపిఐ (ఎంఎల్) కార్యకర్త. కొజికోడ్ జిల్లాలోని కొయిలండీ వాసి. ఇక కనకదుర్గ పౌర సరఫరాల శాఖలో ఉద్యోగిని, మల్లాపురంలోని అంగడిపురం వాసి. వీరి సంచలన చర్య తరువాత ముందు జాగ్రత్త చర్యగా వారి ఇండ్ల వద్ద భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. దర్శనం సమయంలో కానీ మెట్ల అధిరోహణ ఘట్టంలో కానీ తమకు తోటి అయ్యప్ప భక్తుల నుంచి ఎటువంటి ఇబ్బందులు ఎదురుకాలేదని వీరు తెలిపారు. దర్శనం చేసుకున్న వీరిద్దరిని పోలీసు బృందం పంబా వరకూ తీసుకువచ్చి, ఒక రహస్య ప్రాంతానికి తరలించినట్లు వెల్లడైంది. వీరిద్దరు అత్యంత నాటకీయంగా, రహస్యంగా ఆలయ ప్రవేశం చేసినట్లు వెల్లడైంది. పంబా వరకూ అంబులెన్స్‌లో వచ్చి, అక్కడ వేచి ఉన్న రెండు డజన్ల మంది పోలీసుల బృందంతో కలిసి, వేకువ చీకట్ల మధ్య గుడిలోకి వెళ్లినట్లు వెల్లడైంది.

లింగ సమానత్వం సాధన దిశలో ఇది తొలి అడుగు

అయ్యప్పను దర్శించుకున్న తొలి మహిళ బిందు మనోగతం

శబరిమల: శబరిమలలోని అయ్యప్పస్వామి ఆలయంలో "లింగ సమానత్వం" పాటించే ప్రక్రియలో ఇది తొలి అడుగు అని సుప్రీంకోర్టు తీర్పు అనంతరం ఆ ఆలయాన్ని సందర్శించిన తొలి 50 సంవత్సరాల లోపు ఇద్దరు మహిళలలో ఒకరైన బిందు అమ్మిని అభివర్ణించారు. మంగళవారం ఉదయం తాను, కనకదుర్గ పంబ చేరుకున్నామని, ఆలయాన్ని సందర్శించడానికి సహాయం కోసం పోలీసులను ఆశ్రయించామని ఆమె మీడియాకు తెలిపారు. పోలీసులు తమ అభ్యర్థనను మన్నించిన తర్వాత తాము మంగళవారం రోజంతా పంబలోనే గడిపామని ఆమె చెప్పారు. రాత్రి 1.30 ప్రాంతంలో కొండ ఎక్కడం ప్రారంభించామని, బుధవారంనాడు తెల్లవారుజామున 3.30 గంటలకు అయ్యప్ప స్వామి దర్శనం పూర్తి చేసుకున్నామని, ఇతర పురుష భక్తులతో కలసి ఆ తర్వాత కొండ దిగామని ఆమె చెప్పారు. పంబ చేరుకున్న తర్వాత పోలీసులు వారిద్దరినీ ఒక రహస్య ప్రదేశంలో ఉంచారు. తమ ప్రాణాలకు ముప్పు పొంచి ఉన్నందున తాము ఎక్కడ ఉన్నామో చెప్పలేమని ఒక మీడియా సంస్థతో ఫోన్‌లో మాట్లాడుతూ ఆమె చెప్పారు. పోలీసులు తమకు ఎంతో సహకరించారని, తోటి పురుష భక్తుల నుంచి తమకు ఎటువంటి నిరసనలు ఎదురుకాలేదని బిందు చెప్పారు. అయ్యప్ప భక్తులు దీక్ష సందర్భంగా తీసుకెళ్లే ఇరుముడి తాము ధరించనందున ఆలయం వద్ద పరమ పవిత్రమైన 18 మెట్లను తాము ఎక్కలేదని ఆమె వివరించారు. "నాకు చాలా ఆనందంగా ఉంది. శబరిమల ఆలయంలో లింగ సమానత్వాన్ని సాధించడం కోసం ఇది తొలి అడుగు. మమల్ని చూసి చాలా మంది మహిళలు స్ఫూర్తి పొంది, శబరిమలను దర్శిస్తారని ఆశిస్తున్నాను" అని బిందు చెప్పారు.

కేరళ వ్యాప్తంగా పెల్లుబికిన నిరసనలు



తిరువనంతపురం: శబరిమలలోని అయ్యప్ప స్వామి ఆలయంలోకి బుధవారం తెల్లవారుజామున 50 సంవత్సరాల లోపు వయసుగల ఇద్దరు మహిళలు ప్రవేశించి దర్శనం చేసుకున్నారన్న వార్తలు వెలువడిన కొద్ది గంటల్లోనే కేరళ రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు భగ్గుమన్నాయి. శబరిమల కర్మ సమితి గురువారం రాష్ట్రవ్యాప్త సమ్మెను ప్రకటించగా బిజెపి రాష్ట్ర వ్యాప్త నిరసనలకు పిలుపునిచ్చింది. మహిళల ఆలయ ప్రవేశానికి సంబంధించిన వార్తలు వ్యాప్తి చెందిన కొద్ది గంటల్లోనే బిజెపి కార్యకర్తలు అనేక చోట్ల రోడ్లను అడ్డగించి నిరసనలకు దిగారు. బలవంతంగా దుకాణాలు మూయించారు. తిరువనంతపురంలోని రాష్ట్ర సచివాలయం వెలుపల గుమికూడిన నిరసనకారులు ముఖ్యమంత్రి పినరయి విజయన్ వాహనాన్ని అడ్డుకోవడానికి ప్రయత్నించారు. సచివాలయ సముదాయంలోకి చొరబడేందుకు వారు ప్రయత్నించారు. వీరిలో కొందరు ముఖ్యమంత్రి కార్యాలయం వద్దకు చేరుకున్నారు. నిరసనకారులు కొన్ని న్యూస్ చానళ్ల రిపోర్టర్లపై దాడులు చేశారు. చెంగన్నూర్, మువట్టుపుళ, చంగనస్సేరి పట్టణాలలో వాహనాలు ఎక్కడికక్కడ నిలచిపోయాయి. కోజికోడ్‌లో జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి ఊరేగింపుగా వెళ్లిన యువమోర్చ కార్యకర్తలు రోడ్డుపై టైర్లు తగలబెట్టి ట్రాఫిక్‌కు స్తంభింపచేశారు. ఇలా ఉండగా, బిజెపి కార్యకర్తలు తమ పార్టీ బోర్డులు, బ్యానర్లను ధ్వంసం చేశారని సిపిఎం ఆరోపించింది. కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రతిపక్ష నాయకుడు రమేష్ చెన్నితల గురువారం రాష్ట్ర వ్యాప్త నిరసనలకు పిలుపునిచ్చారు.

దుర్దినం, చీకటి రోజు : బిజెపి
సిఎం తలబిరుసుతనం : కాంగ్రెస్

కొట్టాయం : కేరళకు ఇది బ్లాక్ డే అని బిజెపి పేర్కొంది. దీనిని రాష్ట్ర వ్యాప్త బంద్‌తో తాము ప్రతిఘటిస్తామని బిజెపి, హిందూ మత సంస్థల ప్రతినిధులు ప్రకటించారు. రాష్ట్ర కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె సుధాకరన్ ఈ ఘటనను ఖండించారు. తలబిరుసు సిఎం వైఖరికి ఇది తార్కాణం అని కాంగ్రెస్ సీనియర్ నేత రమేష్ చెన్నితల మండిపడ్డారు. మహిళల ఆలయ దర్శనం సిఎం విజయన్ పన్నిన కుట్రలో భాగం అని, లక్షలాది మంది భక్తుల మత ఆచార వ్యవహారాలను దెబ్బతీసినందుకు ఆయన భారీ మూల్యం చెల్లించుకోవల్సి ఉంటుందన్నారు. దేవాలయ పరిసరాలు, ప్రవేశ ప్రాంతం అయిన పంబాలో నిరసన ప్రదర్శనలు చెలరేగాయి. రాష్ట్రంలో పలు చోట్ల అయ్యప్ప స్వామి చిత్తరువులను ప్రదర్శిస్తూ, మంత్రాలు చదువుతూ వీధులలో అయ్యప్ప భక్తులు ప్రదర్శనలకు దిగారు. రాష్ట్ర దేవాదాయ మంత్రి కడకంపల్లి సురేంద్రన్‌కు గురువాయూర్‌లో, ఆరోగ్య మంత్రి కెకె షైలజాకు కన్నూర్‌లో బిజెపి కార్యకర్తలు నల్లజెండాలు చూపారు. తిరువనంతపురంలో సచివాలయం వద్ద గుమికూడిన వారిని పోలీసులు చెదరగొట్టారు.

కొత్త ఏడాది శుభారంభం



పుణే : ఎట్టకేలకు మహిళలకు దర్శన అవకాశం కల్గింది. ఇది తమ ఉద్యమానికి విజయం అని భూమాత దళం అధినేత్రి తృప్తి దేశాయ్ స్పందించారు. బుధవారం ఆలయంలోకి ప్రవేశించిన ఇద్దరు మహిళల ధైర్యాన్ని తాము అభినందిస్తున్నామని పుణే నుంచి వార్తాసంస్థకు తెలిపారు. ఇది సమానతకు దక్కిన విజయం అన్నారు. కొన్ని సంప్రదాయక ఆలయాలలోకి మహిళల ప్రవేశం కోసం ఉద్యమించి, విజయం సాధించిన తృప్తి ఇటీవలే శబరిమల ఆలయంలోకి వెళ్లడానికి కూడా యత్నించి విఫలులయ్యారు. ఇప్పుడు తోటి మహిళలకు విజయం దక్కడం ఈ కొత్త సంవత్సరంలో శుభారంభంగా తాను భావిస్తున్నట్లు తెలిపారు.

ప్రతి మహిళకూ హక్కుంది



హైదరాబాద్ : శబరిమలలో అయ్యప్ప స్వామి ఆలయానికి వెళ్లి ఆయనను పూజించే హక్కు ప్రతి మహిళకూ ఉందని సిపిఎం సీనియర్ నాయకురాలు బృందాకారత్ బుధవారం తెలిపారు. కేరళలో ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం సుప్రీంకోర్టు తీర్పును అమలుచేస్తోందని పార్టీ పొలిట్ బ్యూరో సభ్యురాలు తెలిపారు. బుధవారం తెల్లవారుజామున 40 ఏళ్లు పైబడిన ఇద్దరు మహిళలు కనకదుర్గ, బిందు అయ్యప్ప ఆలయంలోకి ప్రవేశించి ప్రార్థనలు చేశారు.

2020లో రష్యా నుంచి మొదటి ఎస్-400

న్యూఢిల్లీ: ఉపరితలం నుంచి ఆకాశంలోకి ప్రయోగించే ఎస్ 400 క్షిపణి వ్యవస్థల్లో మొదటిది 2020 అక్టోబర్ నాటికి రష్యా నుంచి మనకు వైమానిక దళానికి అందుతుంది. ఆ దేశం మనకు సమకూర్చే మొత్తం అయిద్ స్క్వాడ్రన్‌లు 2023 ఏప్రిల్‌కు అందుతాయి. ప్రమాదకర ప్రాంతాల్లో, ప్రమాదకర పరిస్థితుల్లోశత్రువుతో తలపడాల్సి వచ్చినప్పుడు కావలసిన అద్భుతమైన పోరాట పటిమ ఈ అత్యాధునిక స్క్వాడ్రన్‌లకు ఉందని రక్షణశాఖ సహాయ మంత్రి సుభాష్ భమ్రే బుధవారం లోక్‌సభకు తెలిపారు. 5.43 బిలియన్ డాలర్ల (రూ. 40,000 కోట్లు) విలువచేసే ఎస్ 400 సిస్టమ్స్ కాంట్రాక్ట్‌పై గత ఏడాది అక్టోబర్ 5న భారతదేశం ..రష్యా సంతకాలు చేశాయి. రష్యా నుంచి ఆయుధాలు, ఇరాన్ చమురు ఏ దేశమూ కొనకుండా అడ్డుకునేందుకు అమెరికా కాట్సా (కౌంటరింగ్ అమెరికాస్ యాడ్వర్సరీస్ థ్రూ శాంక్షన్స్ యాక్ట్) ద్వారా ఆర్థిక ఆంక్షలు విధించింది. అయితే, ఆయుధాల్ని సమకూర్చుకోవడంపై ఆంక్షల ప్రభావం పడే అవకాశం ఉందని కూడా భారత ప్రభుత్వానికి తెలుసని భమ్రే చెప్పారు. బెదిరింపుల ప్రభావం, నిర్వహణ, సాంకేతికపరమైన కోణాలను పరిశీలించి భద్రతా రంగంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధమై సార్వభౌమత్వానికి భంగం కలగకుండా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకొంటుందని ఆయన అన్నారు. శత్రువు వ్యూహాత్మకంగా ప్రయోగించే బాం బర్లు, జెట్లు, గూఢచారి విమానాలు, క్షిపణులు, డ్రోన్లను 380 కిలోమీటర్ల దూరం నుంచే పసిగట్టి నాశనం చేయగల కెపాసిటీ ఎస్–400 స్క్వాడ్రన్‌లకుంది.

పారికర్ బెడ్‌రూం లోగుట్టుపై ఏం చెపుతారు?

ప్రధాని మోడీకి రాహుల్ సవాల్



న్యూఢిల్లీ : గోవా సిఎం మనోహర్ పారికర్ బెడ్‌రూంలో ఉన్న రాఫెల్ డీల్ రహస్యాల సంగతి చెపుతారా? అని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రధాని మోడీని నిలదీశారు. ప్రస్తుతం ఒక ఆడియో క్లిప్పింగ్ వెలుగులోకి వచ్చిందని , ఇందులో రాఫెల్ డీల్ లోగుట్టు ఉందని రాహుల్ తెలిపారు. తన బెడ్ రూంలో దాచిపెట్టుకున్న ఆడియో క్లిప్పింగ్ సాయంతో ప్రధానిని గోవా సిఎం అదేపనిగా బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడని రాహుల్ ఆరోపించారు. రాఫెల్ పత్రాలు తన వద్ద ఉన్నాయని పారికర్ చెప్పినట్లు కేబినెట్ మంత్రి చెప్పడం స్పష్టంగా ఉందన్నారు. రాఫెల్ డీల్ కుదిరినప్పుడు పారికర్ రక్షణ మంత్రిగా ఉన్నారని, ఆయనకు దీని వెనుక లోగుట్టు తెలుసునని, దీనిని నిర్థారించే రహస్యం పారికర్ వద్ద ఉందని చెప్పేందుకు ఆడియో వెలుగులోకి వచ్చిందన్నారు. రాఫెల్‌కు సంబంధించిన అన్ని అధికారిక పత్రాలు తన వద్ద ఉన్నాయని పారికర్ కేబినెట్ భేటీలోనే చెప్పినట్లు వెల్లడైందని రాహుల్ తెలిపారు. ఇప్పుడు వెలుగులోకి వచ్చిన ఆడియోతో పారికర్ తమ కేబినెట్‌లో చెప్పినట్లుగా గోవా మంత్రి విశ్వజిత్ రాణే చెప్పిన మాటలు స్పష్టంగా ఉన్నాయని అన్నారు. మరి ఈ బెడ్‌రూం సంగతి గురించి మోడీ ఏం చెపుతారో తెలుసుకోవాలని ఉందన్నారు. ఆడియో నూటికినూరుపాళ్లు నిజమైనదని, ఇటువంటి ఆడియోలు మరిన్ని రావచ్చునని రాహుల్ సూచనప్రాయంగా తెలిపారు. డీల్‌పై పారికర్ వాదనలోని నిజానిజాలను ఇప్పుడు తేల్చాల్సి ఉందని, ముందుగా ప్రధానినే దీనిపై జవాబు ఇచ్చుకుంటే మర్యాదగా ఉంటుందని తేల్చిచెప్పారు. లోక్‌సభలో రాఫెల్‌పై చర్చలో మాట్లాడి వచ్చిన తరువాత రాహుల్ పార్లమెంట్ ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. రాఫెల్‌పై తనతో ప్రధాని మోడీ ముఖాముఖీగా చర్చకు వస్తారా? అని ఆయన సవాలు విసిరారు. '' పారికర్ జీ సిఎం పదవికి ఇప్పుడు ఢోకా లేదు. రాఫెల్ డీల్ పత్రాలు అన్నీ తన వద్ద ఉన్నాయని సిఎం చెప్పారు. కేబినెట్ భేటీ సందర్భంగానే ఈ విషయం చెప్పారు. పైగా రాఫెల్ ఫైల్ తన బెడ్ రూంలో భద్రంగా ఉందన్నారు' అని గోవా మంత్రి విశ్వజిత్ చెప్పడం స్పష్టాతిస్పష్టంగా ఉందని రాహుల్ తేల్చిచెప్పారు.

పాక్‌కు చైనా అత్యాధునిక యుద్ధనౌకలు

నాలుగింటి కోసం పాక్ ఆర్డర్
నిర్మాణంలో మొదటి పోరాట నౌక



బీజింగ్ : తన ఆప్త మిత్రుడు పాకిస్థాన్ కోసం చైనా అత్యంతాధునిక యుద్ధనౌకను రూపొందిస్తోంది. రెండు దేశాలమధ్య భారీ ద్వైపాక్షిక ఆయుధ ఒప్పందం ప్రకారం చైనా పాక్‌కు నాలుగు యుద్ధ నౌకల్ని అందించాలి. అందులో భాగంగా మొదటి నౌకను నిర్మిస్తోంది. హిందూ మహాసముద్రంలో అధికార సమతుల్యత కోసం చైనా, పాకిస్థాన్ ఈ ఆయుధ ఒప్పందం చేసుకున్నాయని చైనా ప్రభుత్వ మీడియా తెలిపింది. ఆధునికమైన డిటెక్షన్, ఆయుధ వ్యవస్థలతో కూడిన ఈ యుద్ధ నౌకల్లో యంత్రాలు సముద్ర ఉపరితలంపై నౌకాదాడులు, సముద్ర గర్భం, ఆకాశంలో జరిగే దాడుల్ని ప్రతిఘటించే సామర్థ్యం కలవి...అని చైనా ప్రభుత్వ షిప్ బిల్డింగ్ కార్పొరేషన్ (సిఎస్ఎస్‌సి) పేర్కొంది. పాకిస్థాన్ కోసం నిర్మించబోయే ఈ యుద్ధ నౌక...చైనా ఇప్పుడు వినియోగిస్తున్న అత్యంత ఆధునిక క్షిపణి వ్యవస్థ తరహాలో నిర్మిస్తారు.

ఇది ఏ తరహా యుద్ధ నౌక అనే విషయం సిఎస్ఎస్‌సి పేర్కొనలేదు. కానీ, షాంఘైలోని హుడాంగ్ జోంఘువా షిప్‌యార్డ్‌లో దీన్ని నిర్మిస్తున్నారని తెలిపింది. పాకిస్థాన్‌కు అన్నివిధాలా మద్దతు ఇస్తు న్న చైనా భారీగా ఆయుధాలను సరఫరా చేస్తూ పాక్ ఆయుధ వ్యవస్థ పటిష్టం చేస్తోంది. అంతేకాక, రెండు దేశాలూ కలిసి జెఎఫ్‌తండర్ అని సింగిల్ ఇంజన్ మల్టీ రోల్ యుద్ధ విమానాన్ని కూడా నిర్మిస్తున్నాయి. ఇప్పుడు చైనా అందించే యుద్ధనౌక టైప్ 054ఎపి తరగతికి చెందింది. పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (పీఎల్‌ఏ) నౌకాదళం ఉపయోగిస్తున్న టైప్ 054ఎ ఆధారంగా ఈ యుద్ధ నౌకను నిర్మిస్తున్నారని పాకిస్థాన్ నేవీని పేర్కొంటూ చైనా ప్రభుత్వ మీడియా తెలిపింది. ఇలాంటి నాలుగు యుద్ధ నౌకల్ని నిర్మించి ఇవ్వాల్సిందిగా చైనాకు ఆర్డర్ ఇచ్చామని పాకిస్థానీ నేవీ ఇంతకు ముందు తెలిపింది.

24 మంది అన్నాడిఎంకె ఎంపిలపై వేటు

- లోక్‌సభలో తీవ్రస్థాయిలో కావేరీ హోరు
- ఇద్దరు టిడిపి సభ్యుల సస్పెన్షన్
- ఎగువ సభలో డిఎంకె సభ్యులపై చర్య



న్యూఢిల్లీ : పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో చివరి వారం చేదుగా మారింది. కావేరీ అంశంపై రగిలిపోతూ వస్తున్న 24 మంది అన్నాడిఎంకె సభ్యులను , ప్రత్యేక హోదా కోసం నినదిస్తున్న టిడిపి సభ్యులను ఇద్దరిని సభ నుంచి సస్పెండ్ చేశారు. ఈ రెండు పార్టీలకు చెందిన మొత్తం 26 మందిపై ఈ వేటు పడింది. వీరిని ఐదు రోజుల పాటు సస్పెండ్ చేస్తున్నట్లు స్పీకర్ సుమిత్రా మహాజన్ ప్రకటించారు. ఇక కావేరీ అంశంపైనే రాజ్యసభలో ఇదే రోజున అన్నాడిఎంకెతో పాటు డిఎంకె సభ్యులను బుధవారం ఒక్కరోజుకు సభ నుంచి వెళ్లిపోవల్సిందిగా సభాధ్యక్షులు ఆదేశించారు. కావేరీ నదిపై మెకెదతు ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్రం అనుమతిని ఇవ్వడం వివాదాస్పదం అయింది. చాలా రోజులుగా ఉభయసభలలో తమిళనాడుకు చెందిన ఈ రెండు పార్టీల ఎంపీలు వేర్వేరుగా తమ నిరసనలను వెల్‌లోకి దూసుకురావడం ద్వారా వ్యక్తం చేస్తూ వస్తున్నారు. లోక్‌సభలో బుధవారం కూడా ఇదే విధంగా నిరసన వ్యక్తం కావడంతో స్పీకర్ తీవ్ర చర్య తీసుకున్నారు. అన్నాడిఎంకె సభ్యులపై సస్పెన్షన్ వేటు వేశారు. ఓ వైపు సభలలో కావేరీ అంశంపై గందరగోళం చెలరేగుతూ ఉండగా అన్నాడిఎంకె సభ్యులు కావేరీ అంశంపై, టిడిపి సభ్యులు ప్రత్యేక హోదా డిమాండ్‌పై నిరసనలకు దిగారు. సభకు తీవ్ర అంతరాయం కల్గిస్తూ అంతకు మించి దారుణ అరాచకానికి దిగుతున్నారని పేర్కొంటూ స్పీకర్ ఈ సభ్యులపై ఐదు రోజుల సస్పెన్షన్ వేటు వేస్తున్నట్లు ప్రకటించారు. సభ ప్రారంభం కాగానే తమతమ డిమాండ్లతో సంబంధిత సభ్యులు స్పీకర్ వేదిక వద్దకు చేరుకుని నినాదాలకు దిగారు. అంతేకాకుండా కొందరు సభ్యులు తమ చేతుల్లోని పత్రాలను చింపివేస్తూ ముక్కలను స్పీకర్ కుర్చీ వైపు విసిరారు. దీనితో స్పీకర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సభా మర్యాదలను పాటించాలంటూ చాలా సేపటి వరకూహితవు పలికారు. వారు వెళ్లి సీట్లలో కూర్చోవాలని లేకపోతే వారిని పేరు పెట్టి పిలిచి ఎవరెవరు రచ్చకు దిగారో వెల్లడించాల్సి వస్తుందని హెచ్చరించారు. అయినప్పటికీ సభ్యులు శాంతించలేదు. దీనితో ఒక్కో సభ్యుడి పేరును చదువుతూ వారిని 373, 374 సభా నిబంధనల పరిధిలో సస్పెండ్ చేస్తున్నట్లు తెలిపారు. వారిని వరుసగా ఐదు సెషన్‌లకు సభకు హాజరు కాకుండా ఆదేశిస్తున్నట్లు పేర్కొంటూ బుధవారానికి సభను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. దీని తరువాత సస్పెండయిన అన్నా డిఎంకె సభ్యులు పార్లమెంట్ ఆవరణలోనే ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలకు దిగుతూ ప్రదర్శన సాగించారు. తమకు స్పీకర్ చర్య పట్ల ఎటువంటి దురుద్దేశం లేదని, అయితే ఎన్‌డిఎ ప్రభుత్వం ప్రదర్శిస్తోన్న తమిళనాడు వ్యతిరేక ధోరణిపై ఆగ్రహం ఉందని డిప్యూటీ స్పీకర్ ఎం తంబిదురై విలేకరులకు తెలిపారు.

పార్లమెంట్‌ను కించపరుస్తున్నారు
రాజ్యసభ ఛైర్మన్ ఆగ్రహం ..ఒక్కరోజు వేటు

కావేరీ అంశంపై సభా కార్యకలాపాలకు అడ్డుతగులుతున్న డిఎంకె, అన్నాడిఎంకె సభ్యులపై సభాధ్యక్షులు ఎం వెంకయ్యానాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీలు కనీస సభా మర్యాదలు పాటించకుండా వ్యవహరిస్తున్నారని పేర్కొంటూ వారిని ఒక్కరోజుకు సభనుంచి బయటకు పంపిస్తున్నట్లు ప్రకటించారు. పార్లమెంటరీ వ్యవస్థ పట్ల వారు సిగ్గుచేటుగా వ్యవహరిస్తున్నారని పేర్కొంటూ సభ నుంచి పంపిస్తున్న సభ్యుల పేర్లను చదివి విన్పించారు. డ్యాంపై కేంద్రం అనుమతికి నిరసనగా సభ్యులు నినాదాలకు దిగిన సమయంలో ఛైర్మన్ ఈ చర్యకు దిగారు.

సిరీస్‌పై భారత్ కన్ను

ఒత్తిడిలో ఆస్ట్రేలియా

నేటి నుంచి చివరి టెస్టు



సిడ్నీ: ఆస్ట్రేలియా గడ్డపై తొలి టెస్టు సిరీస్ గెలవాలనే పట్టుదలతో టీమిండియా చివరి టెస్టుకు సిద్ధమైంది. భారత్–ఆస్ట్రేలియా జట్ల మధ్య ఆఖరి టెస్టు గురువారం నుంచి సిడ్నీలో జరగనుంది. మెల్‌బోర్న్‌లో జరిగిన మూడో టెస్టులో ఘన విజయం సాధించిన భారత్ ఈ మ్యాచ్‌కు ఆత్మవిశ్వాసంతో సిద్ధమైంది. చివరి టెస్టులోనూ గెలిచి ఆస్ట్రేలియా గడ్డపై తొలిసారి సిరీస్‌ను సొంతం చేసుకోవాలని కోహ్లి సేన తహతహలాడుతోంది. మరోవైపు మెల్‌బోర్న్‌లో ఎదురైన ఓటమికి ఈసారి బదులు తీర్చుకుని సిరీస్‌ను సమం చేయాలనే లక్ష్యంతో ఆతిథ్య జట్టు ఉంది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సమతూకంగా కనిపిస్తున్న భారత్‌ను ఓడించడం మాత్రం ఆస్ట్రేలియాకు అంత తేలిక కాదనే చెప్పాలి. బౌలర్లు బాగానే రాణిస్తున్న బ్యాటింగ్ వైఫల్యం కంగారూలను వెంటాడుతోంది. మరోవైపు ఇప్పటికే సిరీస్‌లో 2–1 ఆధిక్యంలో ఉన్న టీమిండియా గెలుపే లక్ష్యంగా పోరుకు సిద్ధమైంది. ఈ ఏడాదిలో జరుగుతున్న తొలి టెస్టు కావడంతో ఇరు జట్లకు కీలకంగా మారింది. ఇందులో గెలిచి కొత్త సంవత్సరానికి శ్రీకారం చుట్టాలనే పట్టుదలతో రెండు ఉన్నాయి. దీంతో పోరు ఆసక్తికరంగా సాగడం ఖాయం.

ఓపెనర్లే కీలకం

భారత్‌కు సిరీస్‌లో ఓపెనర్ల సమస్య వెంటాడుతోంది. ఇప్పటి వరకు జరిగిన మూడు టెస్టుల్లో కూడా అనుకున్న స్థాయిలో శుభారంభం లభించలేదు. పృథ్వీషా గాయపడడం, మురళీ విజయ్, లోకేశ్ రాహుల్‌లు పేలవమైన ఫామ్‌తో సతమతమవడం భారత్‌కు సమస్యగా మారింది. అయితే మెల్‌బోర్న్ మ్యాచ్‌లో ఓపెనర్‌గా దిగిన యువ ఆటగాడు మయాంక్ అగర్వాల్ రెండు ఇన్నింగ్స్‌లలోనూ మెరుగ్గా ఆడాడు. ఇది భారత్‌కు ఊరటనిచ్చే అంశమే. అయితే మరో ఓపెనర్ హనుమ విహారి రెండు ఇన్నింగ్స్‌లలోనూ విఫలం కావడం జట్టు ఇబ్బందులను రెట్టింపు చేసింది. కాగా, చివరి టెస్టు కోసం ప్రకటించిన 13 మంది ఆటగాళ్ల జాబితాలో రాహుల్‌కు చోటు కల్పించారు. దీంతో ఈ మ్యాచ్‌లో విహారి బదులు రాహుల్ ఓపెనర్‌గా దిగే అవకాశం ఉంది. ఇదే జరిగితే విహారి మిడిలార్డర్‌లో బరిలోకి దిగుతాడు. కాగా, మెల్‌బోర్న్‌లో అద్భుతంగా ఆడిన మయాంక్ ఈసారి కూడా మెరుగైన బ్యాటింగ్‌ను కనబరచాలనే పట్టుదలతో ఉన్నాడు. అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని జట్టులో స్థానాన్ని పదిలం చేసుకోవాలని భావిస్తున్నాడు. రాహుల్, విహారిలు కూడా సత్తా చాటాలనే పట్టుదలతో కనిపిస్తున్నారు.

జోరుమీదున్నారు

ఇక, సీనియర్ ఆటగాళ్లు చటేశ్వర్ పుజారా, అజింక్య రహానె, కెప్టెన్ విరాట్ కోహ్లి నిలకడైన ఆటతో జట్టు విజయాల్లో కీలకపాత్ర పోషిస్తున్నారు. ఇప్పటి వరకు జరిగిన మూడు టెస్టుల్లోనూ వీరు సత్తా చాటారు. మెల్‌బోర్న్‌లో పుజారా శతకంతో కదం తొక్కాడు. కోహ్లి, రహానెలు కూడా కీలక ఇన్నింగ్స్‌లతో జట్టుకు అండగా నిలుస్తున్నారు. ఈ మ్యాచ్‌లో కూడా జట్టు వీరిపై భారీ ఆశలు పెట్టుకుంది. పుజారా ఇప్పటికే రెండు శతకాలు సాధించి తానేంటో నిరూపించాడు. ఈ మ్యాచ్‌లో కూడా భారీ ఇన్నింగ్స్‌పై కన్నేశాడు. ఆస్ట్రేలియా బౌలర్లను దీటుగా ఎదుర్కొంటున్న పుజారాపై ఈసారి కూడా జట్టు యాజమాన్యం నమ్మకంతో ఉంది. అయితే తొలి ఇన్నింగ్స్‌లో బాగానే ఆడిన పుజారా రెండో ఇన్నింగ్స్‌లో విఫలం కావడం కాస్త ఆందోళనకు గురి చేస్తోంది. ఇక, కెప్టెన్ విరాట్ కూడా మెల్‌బోర్న్‌లో మెరుగైన బ్యాటింగ్‌ను కనబరిచాడు. కీలక సమయంలో బ్యాట్‌కు పని చెప్పాడు. రహానె కూడా జోరును కొనసాగిస్తున్నాడు. కీలక సమయంలో జట్టును ఆదుకుంటున్నాడు. సిడ్నీలో ఈ త్రయం జట్టుకు చాలా కీలకంగా మారింది. చారిత్రక సిరీస్‌ను ఆశిస్తున్న భారత్‌కు ప్రస్తుతం వీరు రాణించడం చాలా కీలకంగా మారింది. ముగ్గురిలో ఏ ఇద్దరు భారీ స్కోరు సాధించిన టీమిండియాకు గెలుపు కష్టమేమి కాదు.

రోహిత్ దూరం

ఫిట్‌నెస్ లేమితో బాధపడుతున్న స్టార్ ఆటగాడు రోహిత్ శర్మ చివరి టెస్టుకు దూరమయ్యాడు. అతని స్థానాన్ని విహారి భర్తీ చేయనున్నాడు. రాహుల్ ఓపెనర్‌గా దిగడం దాదాపు ఖాయమైంది. మెల్‌బోర్న్‌లో బాగానే ఆడిన రోహిత్ గాయంతో సతమతమవుతున్నాడు. దీంతో అతన్ని తుది టెస్టుకు ఎంపిక చేయలేదు. ఇక, స్టార్ బౌలర్ రవిచంద్రన్ అశ్విన్ కూడా చివరి మ్యాచ్‌లో ఆడడం డౌట్‌గా మారింది. పూర్తిగా కోలుకోక పోవడంతో అతన్ని తుది ఎంపిక చేస్తారా లేదా అన్నది ఇంకా సందిగ్ధంగానే ఉంది. ఇదే జరిగితే రవీంద్ర జడేజా తుది జట్టులోకి వస్తాడు. ఇప్పటికే మెల్‌బోర్న్ టెస్టులో జడేజా సత్తా చాటాడు. దీంతో అతనికి చివరి టెస్టులో స్థానం ఖాయంగా కనిపిస్తోంది.

మెరుగు పడాలి

ఇక, టీమింయాను లోయర్ ఆర్డర్ వైఫల్యం వెంటాడుతోంది. గతంలో దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్ సిరీస్‌లలో కూడా లోయర్ సమస్య వెంటాడిన విషయం తెలిసిందే. తాజాగా ఆస్ట్రేలియా సిరీస్‌లో కూడా లోయర్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్ ఘోరంగా విఫలమవుతున్నారు. ఆస్ట్రేలియా చివరి వరుస బ్యాట్స్‌మెన్ అసాధారణ పోరాట పటిమను కనబరుస్తున్న నేపథ్యంలో భారత ఆటగాళ్లు చెత్త ఆటతో నిరాశ పరుస్తున్నారు. ఆస్ట్రేలియా జట్టులో కమిన్స్, లియాన్, హాజిల్‌వుడ్, స్టార్క్ తదితరులు చివర్లో బాగా ఆడుతున్నారు. మిడిలార్డర్, టాప్ ఆర్డర్ విఫలమవుతున్నా లోయర్ ఆర్డర్ ఆటగాళ్లు భారత బౌలర్లకు సమస్యలు సృష్టిస్తున్నారు. దీనికి భిన్నంగా భారత్ పరిస్థితి ఉంది. జడేజా, షమి, ఇషాంత్, బుమ్రా తదితరులు కనీసం రెండంకెలా స్కోరును కూడా అందుకోలేక పోతున్నారు. సిరీస్ మొత్తంలో కూడా లోయర్ ఆర్డర్ జట్టుకు అండగా నిలువలేక పోయింది. దీని ప్రభావం జట్టుపై బాగానే పడు



తోంది. కనీసం ఆఖరి మ్యాచ్‌లోనైనా చివరి వరుస బ్యాట్స్‌మెన్ తమ బ్యాట్‌కు పని చెప్పాల్సిన అవసరం ఉంది.

ఎదురేలేదు

బౌలింగ్‌లో భారత్‌కు ఎదురు లేకుండా పోయింది. ఇప్పటికే మూడు టెస్టుల్లో భారత బౌలర్లు సత్తా చాటారు. జస్‌ప్రిత్ బుమ్రా, ఇషాంత్, షమిలతో కూడా ఫాస్ట్ బౌలర్ల త్రయం ఆస్ట్రేలియా బ్యాట్స్‌మెన్‌కు చుక్కలు చూపిస్తోంది. మెల్‌బోర్న్‌లో బుమ్రా ఏకంగా 9 వికెట్లు తీసి ఆస్ట్రేలియా పతనాన్ని శాసించాడు. ఈసారి కూడా బుమ్రాపై జట్టు భారీ ఆశలు పెట్టుకుంది. ఇషాంత్, షమిలు కూడా కీలక సమయంలో వికెట్లు తీస్తూ తమవంతు సహకారం అందిస్తున్నారు. ఈ మ్యాచ్‌లో కూడా చెలరేగేందుకు భారత బౌలర్లు సిద్ధంగా ఉన్నారు.

చావోరేవో

మరోవైపు ఆతిథ్య ఆస్ట్రేలియా జట్టుకు చివరి టెస్టు చావోరేవోగా మారింది. సిరీస్‌ను సమం చేయాలంటే ఆస్ట్రేలియా ఈ మ్యాచ్‌లో తప్పక గెలవాల్సిందే. ఒత్తిడిని తట్టుకుని మ్యాచ్‌లో గెలవడం కంగారూలకు అనుకున్నంత తేలిక కాదనే చెప్పాలి. బ్యాటింగ్ వైఫల్యం ఆసీస్‌ను వెంటాడుతోంది. ఓపెనర్లు అరోన్ ఫించ్, హారిస్‌లు ఘోరంగా విఫలమవుతున్నారు. ఫించ్‌ను తప్పించాలనే డిమాండ్ ఇప్పటికే జోరందుకుంది. మూడు మ్యాచుల్లో కూడా ఫించ్ విఫలమయ్యాడు. హారిస్‌లో కూడా నిలకడగా లోపించింది. ఇక, షాన్ మార్ష్, ఉస్మాన్ ఖ్వాజాలు రాణిస్తున్నా ఫలితం లేకుండా పోతోంది. కీలక సమయంలో వీరు కూడా జట్టుకు అండగా నిలువలేక పోతున్నారు. ట్రావిస్ హెడ్, కెప్టెన్ టిమ్ పైన్‌లు కూడా నిరాశ పరుస్తున్నారు. ఆల్‌రౌండర్ మిచెల్ మార్ష్ మూడో టెస్టులో విఫలమయ్యాడు. ఒక్క కమిన్స్ మాత్రమే నిలకడగా రాణిస్తున్నాడు. బ్యాట్‌తో, బంతితో జట్టుకు అండగా నిలుస్తున్నాడు. ఈసారి కూడా జట్టు కమిన్స్‌పై భారీ ఆశలు పెట్టుకుంది.



సచిన్ గురువు రమాకాంత్ అచ్రేకర్ కన్నుమూత





ముంబయి: ద్రోణాచార్య అవార్డు గ్రహీత, ప్రముఖ క్రికెట్ కోచ్, పద్మశ్రీ రమాకాంత్ అచ్రేకర్ (87) బుధవారం కన్నుమూశారు. క్రికెట్ దిగ్గజం, మాస్టర్ బ్యాట్స్‌మన్ సచిన్ టెండూల్కర్‌కు క్రికెట్‌లో ఓనమాలు నేర్పించిన ఘనత కోచ్ రమాకాంత్‌కు మాత్రమే దక్కుతోంది. తనను ప్రపంచంలోనే అత్యుత్తమ క్రికెటర్‌గా తీర్చిదిద్దిన చిన్ననాటి కోచ్ రమాకాంత్ అంచే సచిన్‌కు ప్రాణం. తాను ఈ స్థాయికి చేరుకున్నానంటే దానికి అచ్రేకర్ ఇచ్చిన శిక్షణే కారణమని సచిన్ ఎన్నో సార్లు పేర్కొన్నాడు. సచిన్‌తోపాటు వినోద్ కాంబ్లీ, ప్రవీణ్ ఆమ్రె, సమీర్ దిఘే, బల్విందర్ సింగ్ సంధు, అజిత్ అగర్కార్ వంటి ఎంతో మంది ప్రతిభావంతులైన క్రికెటర్లను భారత్‌కు అందించిన ఘనత అచ్రేకర్‌కు మాత్రమే దక్కుతోంది. వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న రమాకాంత్ బుధవారం రాత్రి తుది శ్వాస విడిచారు. అచ్రేకర్ 1932లో జన్మించారు. 1943లో క్రికెట్ ఆడడం ప్రారంభించారు. అయితే ఆయన కెరీర్ అనుకున్నంత సాఫీగా సాగలేదు. ఎన్నో కష్టాలను ఎదుర్కోవాల్సి వచ్చింది. 1945లో న్యూ హిందు స్పోర్ట్స్ క్లబ్ తరపున బరిలోకి దిగారు. ఆ తర్వాత యంగ్ మహారాష్ట్ర ఎలెవన్, గుల్ మోహర్ మిల్స్, ముంబయి పోర్ట్స్ జట్లకు ప్రాతినిథ్యం వహించారు. కాగా, 1963–64లో మొయినుద్దౌలా క్రికెట్ టోర్నీలో భాగంగా ఆలిండియా స్టేట్ బ్యాంక్ జట్టు తరపున హైదరాబాద్‌పై ఓ ఫస్ట్ క్లాస్ మ్యాచ్ ఆడారు. రమాకాంత్‌ను సచిన్, కాంబ్లీలు ముద్దుగా అచ్రేకర్ సర్ అని పిలిచేవారు. కాగా, ముంబయిలోని శివాజీ పార్క్ వద్ద కామత్ స్మారక క్రికెట్ క్లబ్‌ను అచ్రేకర్ ప్రారంభించారు. ఈ క్లబ్ వేదికగా ఎంతో మంది క్రికెటర్లకు శిక్షణ ఇచ్చారు. ఇందులో నుంచే సచిన్, కాంబ్లీ, దిఘె, ఆమ్రె, అగర్కార్ వంటి క్రికెటర్లు వెలుగులోకి వచ్చారు. ఇందులో సచిన్ కోచ్‌గా రమాకాంత్ ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపును పొందారు. ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా ప్రభుత్వాలు కూడా ద్రోణాచార్య, పద్మశ్రీ అవార్డులతో సత్కరించింది.

ప్రముఖుల సంతాపం

కోచ్ రమాకాంత్ అచ్రేకర్‌పై పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. క్రికెటర్లు సచిన్, కాంబ్లీ, ఆమ్రె, మహ్మద్ కైఫ్, అగార్కలతో సహా పలువురు అచ్రేకర్ మృతిపై తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆయన మృతి భారత క్రికెట్ రంగానికి తీరని లోటని పేర్కొన్నారు. భారత క్రికెట్ బోర్డు (బిసిసిఐ)తో సహా పలు రాష్ట్రాలకు చెందిన క్రికెట్ సంఘాలు అచ్రేకర్ మృతిపై సంతాపం వ్యక్తం చేశాయి. ప్రముఖ బాలీవుడ్ స్టార్ అమేర్ ఖాన్ కూడా ట్విటర్ వేదికగా సంతాపం ప్రకటించారు.



గెలుపే లక్ష్యం: విరాట్ కోహ్లి



సిడ్నీ: ఆస్ట్రేలియాతో జరిగే చివరి టెస్టులో గెలుపే లక్ష్యంగా పెట్టుకున్నట్టు టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లి స్పష్టం చేశాడు. చరిత్రలో నిలిచి పోవడం తనకు ముఖ్యం కాదని, వర్తమానంపైనే తాను దృష్టి పెడతానని పేర్కొన్నాడు. గురువారం ప్రారంభమయ్యే నాలుగో టెస్టును పురస్కరించుకుని కోహ్లి మీడియా సమావేశంలో మాట్లాడాడు. ఆస్ట్రేలియా గడ్డపై తొలిసారి సిరీస్ గెలిస్తే అది చిరకాలం గుర్తుండి పోతుందన్నాడు. సిడ్నీ మైదానం అంటే తనకు ఎంతో ఇష్టమన్నాడు. టెస్టు క్రికెట్‌లో కెప్టెన్సీకి శ్రీకారం చుట్టింది ఇక్కడి నుంచేనని తెలిపాడు. అప్పట్లో టెస్టుల్లో టీమిండియా చాలా బలహీనంగా ఉండేదన్నాడు. జట్టు పరివర్తన సిడ్నీ మ్యాచ్ నుంచే ప్రారంభమైందన్నాడు. తాను ధోని నుంచి టెస్టు కెప్టెన్సీ స్వీకరించినప్పుడూ భారత్ టెస్టు ర్యాంకింగ్స్‌లో ఏడో స్థానంలో ఉందన్నాడు. ప్రస్తుతం భారత జట్టు టెస్టుల్లో చాలా కాలంగా నెంబర్‌వన్‌గా కొనసాగుతున్న విషయాన్ని కోహ్లి గుర్తు చేశాడు. సమష్టి కృషి వల్లే ఇది సాధ్యమైందన్నాడు. అందరి సహకారం లేనప్పుడూ ఏ జట్టు కూడా విజయం సాధించలేదన్నాడు. ప్రస్తుతం తాము సిరీస్‌లో ఆధిక్యంలో ఉన్నామంటే కలిసి కట్టుగా ఆడిన ఫలితమేనన్నాడు. ఆస్ట్రేలియా గడ్డపై సిరీస్ అంటే ఏ జట్టుకైనా చాలా క్లిష్టమన్నాడు. ఆసీస్‌ను వారి సొంత గడ్డపై ఓడించడం అంటే మాములు విషయం కాదన్నాడు. గతంలో ఇంగ్లండ్, విండీస్ జట్లు మాత్రమే ఆస్ట్రేలియాను వారి సొంత గడ్డపై ఓడించాయన్నాడు. అయితే ప్రస్తుతం టీమిండియాకు కూడా ఆసీస్ గడ్డపై టెస్టు సిరీస్ గెలిచే అవకాశం ఏర్పడిందన్నాడు. దీన్ని సద్వినియోగం చేసుకోలేక పోతే ఇంతకంటే బాధకరమైన విషయం మరొకటి ఉండదన్నాడు. తన దృష్టంతా సిడ్నీలో జట్టును గెలిపించడంపైనే కేంద్రీకరించానని కోహ్లి స్పష్టం చేశాడు. జట్టు సహచరులంత సిడ్నీలో జట్టు గెలవాలని కోరుకుంటున్నారన్నాడు. ఆసీస్‌ను ఓడించడం అంత తేలిక కాదనే విషయం తమకు తెలుసన్నాడు. అయితే మెల్‌బోర్న్‌లో విజయం తమ ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేసిందన్నాడు. సిడ్నీలోనూ సమష్టిగా పోరాడి చారిత్రక విజయం సాధిస్తామనే నమ్మకాన్ని కోహ్లి వ్యక్తం చేశాడు.

విజయం సాధిస్తాం: టిమ్ పైన్

సిడ్నీ: భారత్‌తో జరిగే చివరి టెస్టులో తప్పక విజయం సాధిస్తామనే నమ్మకాన్ని ఆస్ట్రేలియా కెప్టెన్ టిమ్ పైన్ వ్యక్తం చేశాడు. సిరీస్‌ను సమం చేయాలంటే ఈ మ్యాచ్‌లో తప్పక విజయం సాధించాల్సిందేనన్నాడు. దీంతో తమపై తీవ్ర ఒత్తిడి నెలకొన్న మాట వాస్తవమేనన్నాడు. అయితే భారత్‌ను ఓడించే సత్తా తమకుందన్నాడు. ఈ విషయం రెండో టెస్టులో తేలిపోయిందన్నాడు. కచ్చితంగా గెలవాల్సిన మ్యాచ్‌లో సర్వం ఒడ్డేందుకు సిద్ధంగా ఉన్నామన్నాడు. జట్టు సభ్యులంత సత్తా చాటేందుకు తహతహలాడుతున్నారన్నాడు. అయితే బ్యాటింగ్ వైఫల్యం తమను వెంటాడుతుందన్నాడు. బ్యాటింగ్ లోపాన్ని సరిదిద్దుకుంటూనే గెలుపు అవకాశాలు ఉంటాయన్నాడు. దీని కోసం సర్వం ఒడ్డక తప్పదన్నాడు. టాప్ ఆర్డర్, మిడిలార్డర్ ఆశించిన స్థాయిలో ఆడడం లేదన్నాడు. ఇది కూడా జట్టును కలవర పరిచే అంశ



మన్నాడు. కాగా, సిరీస్‌లో భారత బౌలర్లు అసాధారణ రీతిలో రాణిస్తున్నారన్నాడు. గతంలో ఎప్పుడూ కూడా టీమిండియా బౌలర్లు ఈ స్థాయి ప్రదర్శన చేయలేదన్నాడు. ప్రస్తుతం భారత్ ఆధిక్యంలో ఉందంటే దానికి బౌలర్ల ప్రతిభే కారణమ్మాడు. కాగా చివరి టెస్టులో గెలుపే లక్ష్యంగా బరిలోకి దిగుతున్నామని, ఇందులో సక్సెస్ అవుతామనే నమ్మకం ఉందని పైన్ స్పష్టం చేశాడు.

ఒలింపిక్స్‌పై దృష్టి

సానియా మీర్జా

మన తెలంగాణ/హైదరాబాద్: రానున్న ఒలింపిక్స్‌లో పతకం గెలవడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు భారత టెన్నిస్ స్టార్ సానియా మీర్జా స్పష్టం చేసింది. ఒలింపిక్స్ క్రీడల కోసం త్వరలోనే సాధన ప్రారంభిస్తానని తెలిపింది. ఇక, ఇజాన్ రాకతో తన జీవితం మారి పోయిందని చెప్పింది. అతన్ని విడిచి పెట్టి ఉండలేక పోతున్నానని వివరించింది. అయితే క్రీడాకారిణి అయిన తనకు ఇజాన్ నుంచి దూరంగా ఉండాల్సిన అవసరం ఉంటుందనే విషయాన్ని గుర్తు చేసింది. తల్లిగా, భార్యగా తన బాధ్యతలను సక్రమంగా నిర్వహించేందుకు ప్రయత్నిస్తానని స్పష్టం చేసింది. ఇక, ఫిబ్రవరి నుంచి సాధన ప్రారంభిస్తానని తెలిపింది. టోక్యోలో జరిగే ఒలింపిక్స్‌లో బరిలోకి దిగేందుకు సిద్ధమవుతానని పేర్కొంది. దీని కోసం త్వరలోనే ప్రయత్నాలు ప్రారంభిస్తానని సానియా తెలిపింది.



సెంట్రల్ రష్యాలో నూతన సంవత్సరం సందర్భంగావిషాదం చోటు చేసుకుంది. మాగ్నిటోగోరోస్క్ నగరంలోని హై రైజ్ అపార్ట్‌మెంట్‌లో గ్యాస్ లీకై సంభవించిన పేలుడు ఘటనలో 14 మంది మృతదేహాలను గుర్తించినట్టు బుధవారం అధికారులు తెలిపారు. శిథిలాల నుంచి మృత దేహాలను వెలికి తీసేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నట్లు తెలిపారు.

విశాల

ఆగ్రా నుంచే మోడీ ఎన్నికల శంఖారావం



ఆగ్రా: మరి కొద్ది నెలల్లో రానున్న లోక్‌సభ ఎన్నికల కోసం ఎన్‌డిఎ తరపున ప్రచారాన్ని ప్రధాని నరేంద్ర మోడీ ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఆగ్రా నుంచి జనవరి 9న ప్రారంభించనున్నారు. ప్రధాని మోడీ పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఈ నెల 4న ఆగ్రాను సందర్శిస్తారని బిజెపి ఎంపి రాం శంకర్ కతేరియా చెప్పారు. 2014 లోక్‌సభ ఎన్నికల ప్రచారాన్ని కూడా మోడీ ఆగ్రా నుంచే ప్రారంభించడం విశేషం. 2013 నవంబర్‌లో ఆయన ఇక్కడి కోఠీ మీనా బజార్ మైదానంలో విజయ శంఖనాద్ ర్యాలీని ఉద్దేశించి ప్రసంగించారు. యుపి అసెంబ్లీ ఎన్నికల ప్రచారాన్ని కూడా ఆగ్రా నుంచే మోడీ ప్రారంభించారు. 2016 నవంబర్‌లో ఆగ్రాలో ఆయన పరివర్తన్ ర్యాలీలో పాల్గొన్నారు. బిజెపికి ఆగ్రా బాగా కలసి వచ్చిందని అందుకే ఇక్కడ తొమ్మిది అసెంబ్లీ స్థానాలు, రెండు లోక్‌సభ స్థానాలను బిజెపి గెలుచుకుందని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

123 కోట్ల మందికి ఆధార్ కార్డులు జారీ

కేంద్రమంత్రి అహిర్



న్యూఢిల్లీ: దేశంలో దాదాపు 123 కోట్ల మంది ప్రజలకు ఆధార్ కార్డులు జారీ చేసినట్లు కేంద్ర మంత్రి హన్స్‌రాజ్ అహిర్ తెలిపారు. బుధవారం రాజ్యసభలో సభ్యుడు అడిగిన ప్రశ్నకు ఆయన లిఖితపూర్వకంగా సమాధానమిస్తూ నవంబర్ 30, 2018 నాటికి 122.90 కోట్ల ఆధార్ కార్డులను యుఐడిఎఐ జారీ చేసిందని తెలిపారు. ఐదేళ్ల లోపు చిన్నారులకు 6.71 కోట్ల ఆధార్ కార్డులు, 5 నుంచి 18 ఏళ్ల మధ్య ఉన్నవారికి 29.02 కోట్ల కార్డులు ఇచ్చినట్లు అహిర్ తెలిపారు. 2011 లెక్కల ప్రకారం దేశ జనాభా 121,08,54,977 ఉన్నట్లు తెలిపారు. అంతకు ముందున్న ఏడాదిలో 2,08,98,228 పిల్లలు జన్మించినట్లు అహిర్ తెలిపారు. శాంపుల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్(ఎస్‌ఆర్‌ఎస్) తాజా గణాంకాల ప్రకారం 2016లో జననాల రేటు 20.4 కాగా, మరణాల రేటు 6.4 శాతంగా ఉన్నట్లు మంత్రి తెలిపారు.

ఐదుగురు ఆర్మీ అధికారులపై సిబిఐ కేసు

న్యూఢిల్లీ: అవినీతి ఆరోపణలతో కల్నల్ సహా ఐదుగురు సైనిక అధికారులపై సిబిఐ కేసు నమోదు చేసినట్లు బుధవారం అధికారులు తెలిపారు. అసోం, అరుణాచల్‌ప్రదేశ్‌లో భద్రతా బలగాలకు రేషన్ సరఫరాలో కాంట్రాక్టర్ నుంచి అధికారులకు రూ. 18 లక్షల విలువైన లంచాలు అందినట్లు ఆరోపణలు ఉన్నాయి. కల్నల్ రామన్ దహదా, లెఫ్టినెంట్ కల్నల్ మహేంద్ర కుమార్, సుబేదార్ దేవేందర్ కుమార్, హవిల్దార్ అభయ్ సింగ్, సుబేదార్ సహురన్ సాహులపై అవినీతి కేసు, సరఫరాదారు కెకె యాంగ్ ఫోపై నేరపూరిత కుట్ర కింద సిబిఐ కేసులు నమోదు చేసింది. గతంలో 556 ఆర్మీ సప్లై కార్ప్స్ దహదా కమాండింగ్ ఆఫీసర్ కాగా, మహేంద్ర కుమార్ కుమార్ ప్లాటూన్ కమాండర్‌గా వ్యవహరించారు. తాజా, డ్రై రేషన్ సేకరణలో వారిపై అవినీతి ఆరోపణలు వచ్చాయి. భద్రతా బలగాలకు రేషన్ సరాఫరాకు ఇటీవల సిబిఐ నమోదు చేసిన రెండో అవినీతి కేసు కావడం గమనార్హం.

రాముడిని 'తూలనాడిన' భగవాన్‌పై కేసు


బెంగళూరు: శ్రీరాముడిని, మహాత్మాగాంధీని తన పుస్తకంలో అవమానించారన్న ఆరోపణలపై కన్నడ రచయిత, విద్యావేత్త కెఎస్ భగవాన్‌పై కర్నాటక పోలీసులు కేసు నమోదు చేశారు. ఐపిసి సెక్షన్‌లోని 295ఎ(ఒక మతాన్ని లేదా మత విశ్వాసాలను ఉద్దేశపూర్వకంగా అవమానించి మత మనోభావాలను దెబ్బతీయడం) కింద భగవాన్‌పై కేసు నమోదు చేసినట్లు ఒక పోలీసు అధికారి తెలిపారు. భగవాన్ తన కన్నడ పుస్తకం "రామ మందిర ఏకే బేడ(రామ మందిరం ఎందుకు అవసరం లేదు)లో శ్రీరాముడు దేవుడు కాదని, అందరు మనుషులలాగే ఆయనకూ కొన్ని బలహీనతలు ఉండేవని పేర్కొన్నారు. కాగా, భగవాన్ రాతలపై మండిపడిన హిందూ సంస్థలు ఆయనకు వ్యతిరేకంగా గత శుక్రవారం నిరసన ప్రదర్శన నిర్వహించి శ్రీరాముడిని కించపరిచేవిధంగా భగవాన్ తన పుస్తకంలో చిత్రీకరించారని ఆరోపించాయి.

శివుడికి పూజలు చేసిన ముస్లిం మంత్రి

జైపూర్: రాజస్థాన్ ప్రభుత్వానికి చెందిన ఒక ముస్లిం మంత్రి జైసల్మేర్ జిల్లా పోఖ్రాన్‌లో గల ఒక శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రముఖ ముస్లిం మత పెద్ద గాజీ ఫకీర్ కుమారుడైన సలే మొహమ్మద్ గెహ్లాట్ క్యాబినెట్‌లో మొట్టమొదటిసారి మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత ఆదివారం పోఖ్రాన్ చేరుకుని శివాలయంలో ప్రత్యేక పూజలు చేయడం స్థానికులను విస్మయానికి గురిచేసింది. ఈ విషయాన్ని ఆలయ పూజారి మధు చాంగని ధృవీకరిస్తూ మొహమ్మద్ ఈ ఆలయాన్ని సందర్శించడం ఇది మొదటిసారి కాదని చెప్పారు. ఎన్నికల ప్రచార సమయంలో కూడా ఆయన వచ్చారని, ఆయనకు ఈ గుడికి ఏదో అనుబంధం ఉన్నదని పూజారి చెప్పారు. హిందూ సాంప్రదాయాల ప్రకారం మొహమ్మద్ శివలింగానికి పాలు, తేనెతో అభిషేకం నిర్వహించారని ఆయన చెప్పారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పోఖ్రాన్ స్థానంపై కాంగ్రెస్, బిజెపి ప్రత్యేక దృష్టి పెట్టి రెండు మతాల ప్రాతిపదికన ఓట్లను సమీకరించడానికి కృషి చేశాయి. పశ్చిమ రాజస్థాన్‌లో మంచి పలుకుబడిగల గాజీ ఫకీర్ కుమారుడు సలే మొహమ్మద్‌ను కాంగ్రెస్ బరిలోకి దించగా, బిజెపి తన అభ్యర్థిగా బార్మర్ జిల్లాలోని తరతర మఠాధిపతి, హిందూ ఆధ్మాత్మిక గురువు స్వామి ప్రతాప్‌పురిని నిలబెట్టింది.

మాతోనే కలిసి ఉండండి, లేకపోతే....

తైవాన్‌కు చైనా అధినేత హెచ్చరిక



బీజింగ్ : చైనాతో శాంతియుత పునరేకీకరణ దారిలోకి వస్తే మంచిదని తైవాన్‌కు చైనా అధ్యక్షులు జి జిన్‌పింగ్ పిలుపు నిచ్చారు. తమ దారికి రాకపోతే సైనిక చర్య తప్పదని పరోక్షంగా హెచ్చరించారు. తైవాన్‌తో దేశీయతా సందేశపు 40వ వార్షికోత్సవ సభలో చైనా అధ్యక్షులు బుధవారం ప్రసంగించారు. దేశంగా స్వాతంత్ర్యాన్ని తిరస్కరించి, చైనాతో శాంతియుత సహజీవనానికి ముందుకు రావాలని స్పష్టం చేశారు. ఒక దేశం రెండు వ్యవస్థల ప్రాతిపదికన తైవానీయులు స్పందించాల్సి ఉందన్నారు. తైపీ ఇప్పటికీ తమ స్వాతంత్ర్యం వాదనను పట్టుకుని పాకులాడితే అవసరం అయితే తాము సైనిక చర్యల మార్గాన్ని ఎంచుకోవల్సి వస్తుందన్నారు. పునరేకీకరణ దిశలో తమ ముందు ఉన్న ఎటువంటి మార్గాలను అయినా వదులుకునేది లేదన్నారు. హాంగ్‌కాంగ్ తరహాలో తైవాన్ కూడా తమతో ఏకీకరణకు ముందుకు రావాలని, అక్కడున్నట్లే ఏక దేశం, ద్వి విధానాలకు పోవడం మంచిదని, దీని వల్ల తైవాన్ అస్థిత్వానికి , కీలకమైన హక్కులకు, ఆచార వ్యవహారాలకు ఎటువంటి భంగం కలుగకుండా ఉంటుందన్నారు. తాము సాధ్యమైనంత వరకూ తీవ్ర స్థాయి చర్యలకు వెళ్లబోమని, చైనీయులు తోటి చైనీయులతో తలపడటం జరగదని జిన్‌పింగ్ స్పష్టం చేశారు. తైవాన్‌లోని చైనా సానుకూల జాతీయతా భావాలవారికి అనుగుణంగానే తమ పిలుపు ఉందని దీనిని గుర్తించాలని కోరారు. అయితే తమ అభ్యర్థనకు అనుగుణంగా స్పందించకపోతే ఎటువంటి పరిణామాలు ఉంటాయనేది చెప్పలేమన్నారు. తైవాన్‌తో పునరేకీకరణ అంశానికి సంబంధించిన అధ్యక్షుడి ప్రసంగం చైనా అంతటా టీవీలలో ప్రత్యక్ష్య ప్రసారం అయింది. తైవాన్‌కు స్వాతంత్ర్యం అనేది అతి కొద్ది మంది వాదన అని, దీనికి విదేశీ శక్తుల మద్దతు ఉందని తనకు తెలుసునని అమెరికాపై జిన్‌పింగ్ పరోక్ష విమర్శలకు దిగారు. వేర్పాటువాదులకు వెలుపలి శక్తులు మద్దతు ఇస్తున్నాయని తనకు తెలుసునని, ఈ క్రమంలో తమ వైఖరి ఏ విధంగా ఉంటుందనేది గ్రహించాల్సి ఉంటుందన్నారు.

రాఫెల్‌పై రాహుల్ వర్సెస్ జైట్లీ

మోడీకి పార్లమెంట్‌కు వచ్చే దమ్ములేదు ● లోక్‌సభలో గోవా మంత్రి ఆడియో క్లిప్ ప్రదర్శనకు ప్రయత్నం...స్పీకర్ నో
● జెపిసి వేస్తే ప్రజలకు నిజాలు తెలుస్తాయి : రాహుల్ ● అదంతా బూటకపు సంభాషణ
● కుంభకోణాల కుట్రదారులే మావైపు వేలెత్తుతున్నారు: తిప్పికొట్టిన కేంద్రమంత్రి అరుణ్ జైట్లీ





న్యూఢిల్లీ: రాఫెల్ ఒప్పందంపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ బుధవారం లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రాఫెల్ ఒప్పందంపై అనేక ప్రశ్నలను సంధించిన రాహుల్ ప్రధాని నరేంద్ర మోడీ తన ప్రశ్నలకు సమాధానాలివ్వాలని సవాలు విసిరారు. రాఫెల్ ఒప్పందంపై గోవా మంత్రి విశ్వజిత్ రాణే వ్యాఖ్యలు చేసినట్లుగా చెబుతున్న ఆడియో లోక్‌సభలో వినిపించడానికి రాహుల్ ప్రయత్నించగా స్పీకర్ సుమిత్రా మహాజన్ అడ్డుకున్నారు. ఆ సంభాషణల విశ్వసనీయతను ధృవీకరించడానికి రాహుల్ నిరాకరించడంతో రాహుల్ పదేపదే అబద్ధాలు చెబుతున్నారని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఆరోపించారు. రాఫెల్ ఒప్పందంపై చర్చను ప్రారంభించిన రాహుల్ తన విమర్శనాస్త్రాలను ప్రధాని నరేంద్ర మోడీపై ఎక్కుపెట్టారు. రాఫెల్‌పై తమ ప్రశ్నలను ఎదుర్కొనేందుకు పార్లమెంట్‌కు వచ్చే ధైర్యం ప్రధాని మోడీకి లేదని, అందుకే తన గదిలో దాక్కున్నారని రాహుల్ ఆరోపించారు. ఇక రక్షణమంత్రి ఎఐఎడిఎంకె ఎంపిల మాటున ఉన్నారని దుయ్యబట్టారు. తనపైన వ్యక్తిగత ఆరోపణలు ఏవీ లేవంటూ ప్రధాని మోడీ మంగళవారం ఒక వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూను ప్రస్తావిస్తూ ఇందులో వాస్తవం లేదని, యావద్దేశం ప్రధాని మోడీని నేరుగా ఒకే ప్రశ్న వేస్తోందని రాహుల్ అన్నారు. "ముందుగా ఏర్పాటు చేసుకున్న ఒక ఇంటర్వ్యూలో ఆయన(మోడీ) 90 నిమిషాలు మాట్లాడారు. కాని రాఫెల్ వివాదంపై ఒక్క ప్రశ్నకు ఆయన సమాధానం ఇవ్వలేదు. రాఫెల్ యుద్ధ విమానాన్ని గతంలో రూ.526కోట్లకు కొనుగోలు చేయాలన్న నిర్ణయాన్ని పక్కనబెట్టి రూ.1600 కోట్ల కొత్త ధరకు కొనాలన్న నిర్ణయంపై రక్షణ మంత్రిత్వ శాఖ అధికారులు అభ్యంతరం చెప్పడం నిజం కాదా? మోడీ తన 'ప్రియమైన మిత్రుడు', 'విఫల వ్యాపారి' అనిల్ అంబానీకి లబ్ధి చేకూర్చడానికే రాఫెల్ విమానం ధర పెంచేశారు" అంటూ రాహుల్ ఆరోపించారు. ఈ సందర్భంగా రాఫెల్ వివాదంపై గోవా మంత్రి ఒకరు మాట్లాడినట్లుగా చెబుతున్న ఒక ఆడియో వినిపించడానికి రాహుల్ స్పీకర్ అనుమతి కోరారు. ఈ విశ్వసనీయతను ప్రమాణీకరిస్తారా అని జైట్లీ నిలదీయగా తాను ఆ పని చేయలేనని రాహుల్ బదులిచ్చారు. దీంతో.. ఆడియో సంభాషణ బూటకమైనదని తెలుసుకాబట్టే రాహుల్ ధృవీకరించడానికి భయపడుతున్నారని జైట్లీ విమర్శించారు. రాహుల్ పదేపదే అబద్ధాలు చెబుతున్నారని ఆయన ఆరోపించారు. గతంలో రక్షణ కుంభకోణాల కుట్రదారులే ఇప్పుడు మోడీ ప్రభుత్వం వైపు వేలెత్తి చూపుతున్నారని చెబుతూ అగస్టా వెస్ట్‌లాండ్, నేషనల్ హెరాల్డ్ కేసు, ఒట్టావియో ఖత్రోచి అంశాలను ప్రస్తావించారు. సుప్రీంకోర్టు రాఫెల్‌పై నిజానిజాలు చెప్పిన వారి చెవికి ఎక్కడం లేదన్నారు. వాళ్లు చేసిన ఆరోపణలన్నింటిని సుప్రీంకోర్టు పక్కకు పెట్టినా ఇలా వ్యవహరించడం పట్ల తాము తీవ్రంగా గర్విస్తున్నామని జైట్లీ పేర్కొన్నారు.

జైట్లీపై పేపర్ విమానం విసిరిన మహిళా ఎంపి

లోక్‌సభలో రాఫెల్ డీల్‌పై చర్చ జరుగుతున్న సమయంలో కాంగ్రెస్ మహిళా ఎంపి సుస్మితా దేవ్ అనుచితంగా వ్యవహరించారు. ఈ అంశంపై రాహుల్ మాట్లాడిన తర్వాత ఆర్థిక మంత్రి జైట్లీ కౌంటర్ ఇస్తుండగా పేపర్ విమానాలు తయారు చేసి ఆయనవైపు విసిరారు. కొందరు ఎంపిలు ఆమెను ప్రోత్సహించారు. కాగితాలతో పేపర్ విమానాలు తయారు చేసి ఆమెకు అందించారు. వాటిని అందుకున్న సుస్మితాదేవ్, జైట్లీకి గురిపెట్టి మరీ విసిరారు. అందులో ఓ పేపర్ విమానం విసరగానే గమనించిన కాంగ్రెస్ నేత సోనియా గాంధీ, సుస్మితను వారించారు. అలా చేయకూడదని భుజం తట్టి చెప్పారు.

పారికర్ బెడ్‌రూమ్‌లో రాఫెల్ ఫైళ్లు!

ఆడియో క్లిప్ విడుదల చేసిన కాంగ్రెస్ ● నిస్పృహలో కాంగ్రెస్ : పారికర్



న్యూఢిల్లీ: ఫ్రాన్స్‌తో కుదుర్చుకున్న రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు ఒప్పందం తాలూకు ఫైళ్లను తన బెడ్‌రూమ్‌లో దాచి గోవా ముఖ్యమంత్రి మనోహర్ పారికర్ మోడీ ప్రభుత్వాన్ని బ్లాక్‌మెయిల్ చేస్తున్నారంటూ గోవా మంత్రి విశ్వజిత్ రాణె వ్యాఖ్యానించినట్లుగా చెబుతున్న ఒక ఆడియో క్లిప్పింగ్‌ను కాంగ్రెస్ బుధవారం విడుదల చేసింది.

కాంగ్రెస్ అధికార ప్రతినిధి రణదీప్ సూర్జేవాలా బుధవారం నాడిక్కడ మీడియాతో మాట్లాడుతూ గోవా సిఎం పారికర్ బెడ్‌రూములో రాఫెల్ ఒప్పందానికి చెందిన అన్ని ఫైళ్లు ఉన్నాయని, వాటిని అడ్డం పెట్టుకుని ఆయన కేంద్రంలోని మోడీ ప్రభుత్వాన్ని బ్లాక్ మెయిల్ చేస్తున్నారని ఆరోపించారు. "క్యాబినెట్ సమావేశం జరుగుతుండగా మనోహర్ పారికర్ ఒక ఆసక్తికర ప్రకటన చేశారు. తన బెడ్‌రూములో రాఫెల్ ఒప్పందానికి సంబంధించిన ఫైళ్లన్నీ ఉన్నాయని ఆయన చెప్పారు... దీన్ని బట్టి ఆయన కేంద్రాన్ని బ్లాక్ మెయిల్ చేస్తున్నట్లుగా భావించాలి" అంటూ విశ్వజిత్ రాణె వ్యాఖ్యానించినట్లుగా చెబుతున్న ఒక ఆడియో క్లిప్పింగ్‌ని సూర్జేవాలా చూపించారు. "పారికర్ బెడ్‌రూములో ఫైళ్లను దాచి పెట్టినట్లు ఈ ఆడియో ద్వారా తేలింది. ఆ ఫైళ్లను ఎందుకు దాచిపెట్టారు? రాఫెల్ కుంభకోణంపై ఈ వాస్తవాలు బయటపెట్టింది సాక్షాత్తు బిజెపి ఎమ్మెల్యేనే," అని సూర్జేవాలా వ్యాఖ్యానించారు.

రాఫెల్‌పై క్యాబినెట్‌లో మాట్లాడలేదు: పారికర్
రాఫెల్ యుద్ధ విమానాల ఒప్పందం గురించి క్యాబినెట్ సమావేశంలో ఎటువంటి చర్చ జరగలేదని గోవా ముఖ్యమంత్రి, మాజీ రక్షణ శాఖ మంత్రి మనోహర్ పారికర్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన ఆడియో క్లిప్పింగ్‌పై ఆయన ట్వీట్ ద్వారా స్పందించారు.

రాఫెల్ ఒప్పందపై దర్యాప్తునకు ఆదేశించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించడంతో వాస్తవాలకు మసిపూసేందుకు ఆ పార్టీ నిస్పృహతో ప్రయత్నిస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. ఈ వివాదంపై మంత్రి విశ్వజిత్ రాణే కూడా స్పందించారు. కాంగ్రెస్ విడుదల చేసిన ఆడియో క్లిప్ కుట్రపూరితంగా రూపొందించి విడుదల చేశారని ఆరోపించారు. రాఫెల్ వివాదాన్ని మరింత రాజేసి ప్రజలను తప్పుదోవ పట్టించాలని కాంగ్రెస్ చూస్తోందని మండిపడ్డారు.



సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్



న్యూఢిల్లీ: రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలుకు సంబంధించి ఫ్రాన్స్‌తో భారత ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందంపై దర్యాప్తు జరపాలన్న తమ పిటిషన్‌ను కొట్టివేయడాన్ని సవాలు చేస్తూ కేంద్ర మాజీ మంత్రులు యశ్వంత్ సిన్హా, అరుణ్ శౌరీ, న్యాయవాది ప్రశాంత్ భూషణ్ బుధవారం సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేశారు. డిసెంబర్ 14న సుప్రీంకోర్టు వెలువరిన తీర్పు "న్యాయపరమైన, వాస్తవ విరుద్ధమైన లోపాలతో" ఉన్నదని, ఒక సీల్డ్ కవర్‌లో సంతకం చేయకుండా ప్రభుత్వం ఇచ్చిన అవాస్తవాలతో కూడిన పత్రాన్ని ఆధారం చేసుకుని సుప్రీంకోర్టు తీర్పు చెప్పిందని ప్రశాంత్ భూషణ్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు.

లోక్‌సభలో ఆధార్ బిల్లు

ప్రతిపక్షాల అభ్యంతరాలు



న్యూఢిల్లీ : ఆధార్ ఐచ్ఛిక అనుసంధానానికి చట్టబద్ధత కల్పించే ఆధార్ సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. మొబైల్ నెంబర్లు, బ్యాంకు ఖాతాలకు ఆధార్ తప్పనిసరి కాదనే సుప్రీంకోర్టు కీలక తీర్పు తరువాత ఇప్పుడు ప్రభుత్వం ఈ బిల్లును తీసుకువచ్చింది. ఐచ్ఛికం అంటూనే ఆధార్ అనుసంధానానికి చట్టబద్ధత కల్పించే యత్నానికి దిగడం పట్ల ప్రతిపక్షాలు నిరసన వ్యక్తం చేశాయి. ఇది గోప్యత హక్కును ఉల్లంఘించినట్లు అవుతుందని తెలిపాయి. అయితే ప్రతిపాదిత బిల్లులో వివాదాస్పద అంశాలు ఏమీ లేవని, ఇది కేవలం సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగానే ఉందని న్యాయశాఖ మంత్రి రవి శంకర్ ప్రసాద్ హామీ ఇచ్చారు. ప్రైవసీకి ముప్పుగా పరిణమిస్తుందనే భయాలు వద్దని తేల్చి చెప్పారు. ఆధార్ అనుసంధానికి సంబంధించి అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు, డాటా రక్షణ బిల్లును కూడా పార్లమెంట్‌లో త్వరలో తీసుకురానున్నట్లు మంత్రి వివరించారు. ఆధార్ అనుసంధానం ఐచ్ఛికం, ఇది తప్పనిసరి కాదని గుర్తుంచుకోవాలని, సుప్రీంకోర్టు తీర్పులోని అన్ని అంశాలను సవ్యంగా పరిశీలించుకుని తీసుకువస్తున్న బిల్లు అని స్పష్టం చేశారు. సవరణలతో వ్యక్తుల గోప్యత అతిక్రమణ ఉండదని అన్నారు. ప్రైవసీ పరిరక్షణకు ఇరతత్రా పలు రక్షణ చర్యలు ఉండనే ఉంటాయని , వీటి విషయంలో రాజీ లేదన్నారు. ఆధార్‌తో ప్రత్యక్ష్య లబ్ధి పంపిణీల ప్రక్రియ (డిబిటి)తో రూ 90000 కోట్ల ఆదా జరిగిన విషయాన్ని మరవవద్దని ప్రతిపక్షాలకు తెలిపారు. ఆధార్ అత్యంత విశిష్టమైనది ప్రపంచబ్యాంక్, ఐఎంఎఫ్‌లు కితాబు ఇచ్చాయన్నారు. బిల్లుకు కాంగ్రెస్ ఎంపి శశి థరూర్, టిఎంసి ఎంపి సౌగతా రాయ్, ఆర్‌ఎస్‌పికి చెందిన ఎన్‌కె ప్రేమాచంద్రన్ అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఆధార్‌పై సుప్రీంకోర్టు తీర్పును కాదనేరీతిలో ఈ బిల్లును తీసుకువస్తున్నారని ప్రతిపక్షాలు విమర్శించాయి.

ఎఫ్‌ఐసివి ప్రాజెక్ట్‌కు బాలారిష్టాలు

● ముందుకు సాగని సైనిక ప్రాజెక్ట్
● ఆర్మీ...డిఫెన్స్ మినిస్ట్రీ మధ్య విభేదాలు?
● వేగంగా సైనిక పాటవాన్ని పెంచుకుంటున్న చైనా



న్యూఢిల్లీ: శక్తివంతమైన పోరాట పటిమకల ఫ్యూచర్ ఇన్‌ఫెంట్రీ కంబాట్ వెహికిల్స్ (ఎఫ్‌ఐసివి) ప్రాజెక్ట్ పరిస్థితి వాటాదారుల భిన్నాభిప్రాయాల కారణంగా సందిగ్ధంలో పడింది.ఇండియన్ ఆర్మీకోసం 60 వేల కోట్ల రూపాయల వ్యయంతో 2,600 ఎఫ్‌ఐసి వాహనాలను సమకూర్చుకోవాలని పదేళ్ల కిందటే అనుకున్నారు. కానీ అమలుపై ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ఈ ప్రాజెక్ట్ భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని అధికార వర్గాలు చెప్పాయి. ప్రతిష్టాత్మకమైన మరో ప్రాజెక్ట్ పరిస్థితి కూడా ఇలాగే తయారైంది. దేశీయంగా ఆధునిక యుద్ధ విమానాల్ని తయారుచేసేందుకు సంకల్పించిన ...ఫ్యూచర్ రెడీ కంబాట్ వెహికిల్ ప్రాజెక్ట్ కూడా విధానపరమైన ఆలస్యాలవల్ల ముందడుగు వేయడంలేదు. ఎఫ్‌సివి ప్రాజెక్ట్ ను ముందుకు నడిపించేందుకు ఏం చేయాలో చర్చించేందుకు రక్షణ మంత్రిత్వశాఖ , సైన్యానికి చెందిన అత్యున్నతస్థాయి అధికారులతో గత నెలలో జరగాల్సిన సమావేశం, ప్రాజెక్ట్‌పై నెలకొన్న విభేదాల వల్ల వాయిదా పడిందని ఆ వర్గాలు తెలిపాయి. 2009 అక్టోబర్‌లో ఎఫ్‌ఐసివి మొదట ప్రతిపాదన వచ్చింది. కొన్ని నెలల తర్వాత ప్రాథమిక ప్రక్రియ మొదలైంది. దేశీయంగా కంబాట్ వెహికిల్స్‌ను తయారుచేసే ప్రైవేట్ కంపెనీల్ని ఎంపికచేసే తతంగం 2012 లో జరగాలి. కానీ ఆ పని జరగలేదు. దాంతో 2014లో ఆ పనిని మళ్లీ ప్రారంభించాల్సి వచ్చింది. పదాతి దళాన్ని యుద్ధరంగానికి చేర్చేందుకు ఇన్‌ఫెంట్రీ కంబాట్ వెహికిల్స్‌ను వాడతారు. వాటిలో యాంటి ట్యాంక్ మిస్సైల్స్, హెవీ గన్‌లు ఉంటాయి. రష్యాలో తయారైన బిఎంపి ఇన్‌ఫెంట్రీ కంబాట్ వెహికిల్స్‌ను తొలగించి వాటి బదులు ఎఫ్‌ఐసివి లను ప్రవేశపెట్టాలనేది ఆర్మీ ఆలోచన.'ముందు అనుకున్న ప్రకారం అయితే 2025నాటికి మన సైన్యంలో ఎఫ్‌ఐసివిలను కలిగి ఉండాలి. ప్రస్తుత పరిస్థితుల్ని చూస్తుంటే 2050 కంటే ముందు మన సైన్యానికి అందేలా కనిపించడంలేదు' అని ఈ ప్రాజెక్ట్‌లో పనిచేస్తున్న ఒక సైనికాధికారి చెప్పారు. ఒకవైపు చైనా, పాకిస్థాన్‌లు మన సరిహద్దుల వెంట చాలా వేగంగా తమ సైనిక పాటవాన్ని పెంచుకుంటుంటే మన ప్రాజెక్ట్ మాత్రం అంతులేని ఆలస్యంతో ముందడుగు వేయడం లేదు. ఇండియా సరిహద్దుల్లోఉన్న టిబెట్ స్వతంత్ర భూభాగంలో చైనా గత రెండేళ్లుగా తన సాయుధ బలగాలను ఏడెనిమిదిరెట్లు పెంచుకుంది. పాకిస్థాన్ తమ విమానాల్ని ఆధునీకరించుకుంటోంది ...అని సైనిక వర్గాలు తెలిపాయి. ఎఫ్‌ఐసివి ప్రాజెక్ట్ అమలుపై సైనిక ప్రధాన కార్యాలయానికి, రక్షణ మంత్రిత్వ శాఖకు మధ్య తీవ్రమైన విభేదాలు తలెత్తినట్టు తెలుస్తోంది.

జమ్మూ–శ్రీనగర్ జాతీయ రహదారి మూసివేత

శ్రీనగర్: కశ్మీర్‌లో నూతన సంవత్సరం రోజైన బుధవారం తొలి హిమపాతం కురిసినట్లు వాతావరణ శాఖ తెలిపింది. 300 కిలో మీటర్ల పొడవైన జమ్మూ–శ్రీనగర్ జాతీయ రహదారి, జమ్మూలోని పూంచ్, దక్షిణ కశ్మీర్‌లోని షోపియన్‌ను అనుసంధానిచ్చే మొఘల్ రోడ్‌ను మూసివేసినట్లు అధికారులు తెలిపారు. కశ్మీర్‌లో అనేక ప్రదేశాలలో మంచు కురిసింది. ముఖ్యంగా గుల్మాం, పహల్గాం పర్యాటక కేంద్రాలు, శ్రీనగర్‌లో తెల్లవారు జామున మంచు కురిసినట్లు తెలిపారు. జవహర్ సొరంగం, ఇతర ప్రదేశాలలో మంచు పడుతుండడంతో ముందు జాగ్రత చర్యగా కశ్మీర్‌లో ఉన్న వాహనాలన్నింటినీ నగ్రోటా , ఉద్ధంపూర్ వద్ద నిలిపి వేసినట్లు అధికారులు వివరించారు. వివిధ ప్రదేశాల్లో చిక్కుకు పోయిన 300లకు పైగా వాహనాలను బయటకు తెచ్చేందుకు అధికారులు ఏజెన్సీల ద్వారా హిమపతాన్ని తొలగిస్తున్నారు. గుల్మార్గ్ మినహా ఇతర ప్రాంతాల్లో కొద్ది రోజులగా ఉష్ణోగ్రతలు పెరిగి ఇబ్బంది పడుతున్న కశ్మీర్ వాసులకు హిమపాతం ఉపశమనం కలిగింది.



Printed and Published by **Tumu Mohan Rao** on behalf of Moveon Media Private Limited, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037 Medchel-Malkajgiri District, TELANGANA and Published from H.No.1-1-60/7A, 4th floor Beacon towers, street no.13, Jawaharnagar, near RTC X Roads Hyderabad-500020 Telangana state, Editor : **Anjaiah Polisetty**, RNI No. TELTEL/2012/42234. Email Id. editor@manatelangana.org. Phone No.040-27655666